# ఐ

నవల

- వెల్చేరు చంద్రశేఖర్



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 70

కౌముది మాసపత్రికలో

జనవరి 2013 సంచికనుంచి డిసెంబర్ 2013 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# 1

**"అక్కా వెళ్ళిపోతున్నావా?"** అన్న ప్రశ్నకి కళ్ళల్లో నీళ్ళు చిందాయి.

నేను వెళ్ళిపోతున్నానన్న ఆశ్చర్యం చిన్నా మొహంలో క్లియర్‌గా కనిపిస్తోంది. ఎందుకు వెళ్ళిపోతున్నానో చూచాయిగా వాడికి తెలుసు.

అవుననలేదు కాదనలేదు, ఏదో సర్దిచెప్పడానికి మనసొప్పలేదు. అనేక ప్రశ్నలు? అవన్నీ గోదావరి ఎక్స్‌ప్రెస్ కూతకి ఉలిక్కిపడ్డాయి. అప్పుడు జ్ఞాపకం వచ్చింది ఉత్తరం. నాన్నకి రాసిన ఉత్తరం తీసి, "చిన్నా ఇంటికి వెళ్ళగానే ఉత్తరం నాన్నగారికియ్యి" అంటూ చిన్నా చేతుల్లో పెట్టా.

అప్పటికే గోదావరి ఎక్స్‌ప్రెస్ పెద్దగా కూసింది. చిన్నా క్రిందకి దిగాడు. గోదావరి ఎక్స్‌ప్రెస్ భారంగా కదిలింది. చెయ్యి ఊపుదాం అనుకున్నా. చిన్నా నేను వెళ్ళిపోతున్నానన్న నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. అర్థం చేసుకున్నా. చెయ్యి ఊపా. చిన్నా చెయ్యి ఊపలేదు.

రైలు పట్టాల మీద మెలితిరిగింది. స్టేషను కనుమరుగయ్యింది.

ఏదో వెలితి.. చిన్నా మరుగయ్యాడు, మళ్ళీ ఎప్పుడో వీడిని చూడ్డం. నాకూ చిన్నాకి మధ్య క్లోజ్‌నెస్‌ని కోసి విడదీసాను. అందుకే కన్ను చెమర్చింది. కంపార్టుమెంటులోకి వెళ్ళి దుప్పటి తీసి బెర్త్ మీద పరిచి, ఎక్కి పడుకున్నా. దెయ్యాల మర్రికి ఊడల్లా ఆలోచనలు ఒంటరిదాన్ని అయిపోయా. నేను నా అన్న దానికి ఒంటరితనం పర్యాయపదం ఏమో? ఇందులో నా భాధ్యత ఎంత? జీవితం ఏమవబోతోంది? తల్లి, తండ్రి, అండలేకుండా జీవితాన్ని సాగించగలదా?

తండ్రి చెప్పిన జీవితంలో ఫిట్ అవదు. జీవితం చాలా ఇరుకుగా ఉండచ్చు. ఐ హేవ్ ఛాయిస్. అందుకే ఆ ప్రపోజల్ని తిరస్కరించింది. ఆ తిరస్కారంలో ఉన్న నిజాయితీ వీళ్ళెందుకు గుర్తించరు? జీవితంలో నిజాయితీకి మించి ఇంకా ఏమైనా కావాలా? ప్రిటెన్షన్స్ వల్ల ఒరిగేదేమిటి? కాంప్రమైజ్ అవసరమా? లేక అది ఎంత వరకూ ఉండాలి? ఇవన్నీ ప్రశ్నలు.

భవిష్యత్తు ఏమిటి? తను తీసుకున్న నిర్ణయం తనకు తృప్తినిస్తుందా? తండ్రి తన ఉత్తరం చదివి ఏమనుకుంటాడు? పక్కింటి ఆంటీ వచ్చి 'జాహ్నవి ఏదండీ?' అని అడిగితే తండ్రిగాని, తల్లిగాని, వైజాగ్‌లో ఉద్యోగం వచ్చింది వెళ్ళింది అంటారా.. ఒంటరిగా ధైర్యంతో అంత దూరం వెళ్ళినందుకు పక్కింటి ఆంటీ మెచ్చుకుంటుంటే, పెదిమలకి చిరునవ్వు అతికించుకుని 'ఊ' కొడతారా?

అన్ని ఆలోచనలూ ఒక దగ్గర ఆగిపోతున్నాయి. అందరి జీవితాల్లా తన జీవితం హాయిగా ఎందుకు లేదు? అనే ప్రశ్నకి సమాధానం దొరకటం లేదు. మనసు గాయాల్ని కెలుక్కుంటోంది? తనని తాను గాయం చేసుకుంటోందా? అది జంతు స్వభావం. జంతు స్వభావం అంటే ఇన్‌స్టింక్టా? అంత స్ట్రాంగ్ ఇన్‌స్టింక్ట్ ఎందుకు? మొదట 'ఐ' తర్వాతే అన్నీ ఇది ఓ రకంగా తిరుగుబాటా? ఎందుకీ తిరుగుబాటు? తిరుగుబాటు ఎవరిమీద? దేనికి? ఎవరికోసం? ఒకరికోసం కాదు మరి? ఎందుకో ఈ తపన. తపనతో అలసట. ఈ తపన దేనికి? ఈ ప్రయాణం కొంత ఊరట నిస్తుందా! ఆలోచన్ల ఊబినుండి నిద్రలోకి జారుకున్నా.

●●●

అవుటర్‌లో సిగ్నల్ ఆర్మ్ మెల్లగా పైకి లేచింది. సిగ్నల్ కోసం అవుటర్‌లో ఆగిపోయిన, గోదావరి ఎక్స్‌ప్రెస్ పెద్దగా కూసి విశాఖపట్నం స్టేషను వేపు బయలుదేరింది.

స్టేషన్ దగ్గరవుతున్నకొద్దీ ప్రయాణికుల్లో ఉత్సాహం ఎక్కువ అయింది. అందరూ సీట్లలోంచి లేచి సామాన్లు సర్దుకుంటున్నారు. తమ గమ్యాలు చేరుకున్నామన్న ఆనందంతో కొందరు, కొత్త ఉద్యోగంలో చేరడానికి వచ్చిన యువతీ యువకులు, పుట్టింటికి వచ్చామన్న ఆనందాన్ని ముద్దులుగా మార్చి తమ పిల్లలపై చూపిస్తున్న ఆడపడుచులు, విషాద వార్త చేయించిన ప్రయాణం వల్ల విచారంతో నలిగిన

దీనవదనాలు ప్రతి ప్రయాణికుడి ప్రయాణం వెనుక ఒక అవసరం. ఒక ఆనందం. ఒక ఆరాటం. ఉన్నాయి. ప్రయాణికుల కదలికలు మళ్ళీ ఆలోచనలు లేపుతున్నాయి. దగ్గరవుతున్న స్టేషన్ కిటికీలోంచి కనిపిస్తోంది.

విశాఖపట్నం రైల్వే స్టేషన్ కన్ఫ్యూజ్‌గా ఉంది. స్టేషను చేరుకుంటున్న రైలు, క్రాసింగ్‌పై మెలి తిరుగుతూ పాకుతున్న కొండ చిలువలా ఉంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్ విశాఖ స్టేషన్‌లోకి వచ్చి, చిన్న కుదుపుతో ఆగింది. గమ్యం చేరుకుంది. గుండెలో చిన్న వొణుకు.

లంబకోణంలాంటి మలుపు. జీవితానికి గమ్యం ఏమిటి? ఇల్లు వదిలి రావటం తప్పా! జీవితంలో ఎగుడు దిగుళ్ళకి కారణం ఎవరు? స్వేచ్ఛ కోసం ఒకర్ని దేవురించే పరిస్థితి నుండి బయటపడ్డదా? లేక ఇవన్నీ నీటి బుడగల్లా పగిలి జీవితాన్ని, శూన్యం చేస్తాయా? జీవించడం దుర్భర మనేటట్టు చేస్తాయా? నా జీవితానికి అడుగడుగునా మధ్యవర్తిత్వం వహించే పురుషుడు అవసరమా? అలాగే అనిపిస్తోంది. ఏదో అనిశ్చితత, ఆవేదన. తండ్రి దగ్గర ఉన్నన్నాళ్ళూ అనిశ్చితత, ఆవేదన లేవా?

మణి స్టేషనుకు వస్తుందా? రాకపోతే ఏం చేయాలి? వెనక్కి వెళ్ళిపోవాలా? తన మొండితనాన్ని క్షమించమని తండ్రిని అడగాలా? ఇంతకీ తను మొండిదా? గొలుసు కట్టులాంటి ఆలోచనలు. అదుపులో పెట్టి, ఖాళీ అయిన పెట్టెలోంచి దిగి, సూట్‌కేసు కిందకి దించి, చుట్టూ చూసా.

మణి ఎక్కడా కనబడలేదు. రైలు దిగిన మనుషులు ఎవరో తరుముకు వస్తున్నట్టుగా మాయమయ్యారు. ప్లాట్‌ఫారం మీద జనం పలచబడ్డారు. మనసులో ఆలోచనలూ, ప్రశ్నలూ, మళ్ళీ ప్రవేశించాయి. ఎటు వెళ్ళాలి? ఏం చెయ్యాలి? ఈ రోజు వరకూ కాలం సంవత్సరాలు, నెలలూ, రోజులు, క్షణాలు తన అనుమతి తన ఇష్టం లేకుండా పరిగెత్తుకు వెళ్ళిపోయాయా అనిపిస్తోంది. పోగొట్టుకున్న సంవత్సరాలూ, నెలలూ, రోజులు, క్షణాలు వెనక్కి తిరిగి వచ్చేస్తే బావుండును కాని వాటితో బాటు, ఆ అవమానాలు, వేదన, అన్నీ కట్టగట్టుకుని, వెనక్కి వచ్చేస్తాయి.

మణి స్టేషనుకు రావడం, రాకపోవడం అనే విషయంపై తన భవిష్యత్తూ, ఈ ప్రయాణం ఆధారపడి లేవు. మణి తన జీవితంలో "ఒయాసిస్" మాత్రమే.

తాత్కాలికంగా ఒంటరి తనంలోకి దూసుకు వచ్చిన తనకు మణి కనీస ఊరట కూడా కలిగించలేదు. గతంలో మణి ఎవరో, ఆమె ప్రస్తుత అవసరం ఎంత వరకో కూడా తెలుసు. గత జీవితంలోని, అనుభవాలు పీడకలల్లా వెన్నాడుతుంటే మణి, కాలేజీ, జీవితం, మనసంతా ఆక్రమించి, జరిగిన సంఘటనల చిత్రాలు ఒక్కొక్కటిగా మనోయవనిక మీద ప్రత్యక్షం కాసాగాయి.

●●●

కోలాహలం విశ్వవిద్యాలయానికి ఒక ఆకర్షణ.

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎలక్షన్, కులాలకి, సిద్ధాంతాల ముసుగు తొడిగి, ముమ్మరంగా ప్రచారం చేసి, యూనివర్శిటీ గోడల్ని రేప్ చేస్తే ఎలక్షన్ రోజునాటికి వేడివాడి...

ప్రెసిడెంటుగా నిలబడ్డ అభ్యర్థులందరూ ఒకే వేదిక మీద ఒకే విషయం మాట్లాడాలి ఒకరు మాట్లాడినది ఒకరికి తెలియదు. విషయం ఏమిటి? అన్నది చర్చకి, ఐదునిమిషాలముందు మాత్రమే, అభ్యర్థికి తెలుస్తుంది.

అభ్యర్థుల్లో ఎవరు బాగా మాట్లాడతారు? ఎవరి అభిప్రాయాలు, విద్యార్థుల్లో, ఆసక్తిని రేపే ఆకట్టుకుంటాయి. చవకబారు విమర్శలు, చచ్చు వాగ్దానాలు, ఆ ఆవరణలో చెల్లవు. అభ్యర్థి చేసిన చర్చ వెలిబుచ్చిన అభిప్రాయాలు, నవ్యంగా ఉండాలి. వాటికై ఎదురు చూసే విద్యార్థి వర్గం, ఒకటి ఉంటుంది. వారు ఏ అభ్యర్థికి ఓటు వేయాలో, ఆ రోజు నిర్ణయించుకుంటారు.

అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థులు రామ్మోహన్, క్షీరసాగర్. రామ్మోహన్‌కి విద్యార్థుల్లో బలం ఉంది అంటే అది కులబలగం మాత్రమే. అతని కులం వాళ్ళు చేసే హంగామా అంతా ఇంతాకాదు. సాగర్‌కి నేనే బలం. నేనంటే లేడీస్ హాస్టలు. అందం ఆలోచన నా విశేషాలు. వాడు ఇంకా అంటాడు 'లేడీస్‌లో మకుటం లేని మహారాణివి.' అని. ఎందుకో వప్పుకోబుద్ధి వేసింది. క్షీరసాగర్ వల్ల తను పాపులర్ అయిందా లేక నా వల్ల క్షీరసాగర్ లాభం పొందాడా? అన్న ప్రశ్న వచ్చి వాడ్నడుగుతే 'నా వల్లే నీకు పేరొచ్చింది' అంటాడు. వెంటనే నవ్వేస్తాడు. 'ఇద్దరం కలిసుందాం అదో పేరు' అంటాడు. నిజమే ఆ గ్లామరే వేరు.

ఎవరో వెనకనుండి అరిచారు. వాళ్ళెవరూ యూనివర్సిటీ వాళ్ళు కారు. పైనుండి వ్యక్తుల్ని ప్రచారానికి తీసుకురావడం, ఒకరి మనుషుల్ని ఒకరు పరోక్షంగా బెదిరించడం, కొండొకచో చేతి సరసం చేయడంలో ఎవరికెవరూ తీసికట్టు కాదు. రాజకీయ మిండగాళ్ళతో ఇద్దరికీ సంబంధ, బాంధవ్యాలు ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. ఈ విషయం వచ్చేసరికి సాగర్ మౌనమే సగం సమాధానం యూనివర్శిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్, విద్యార్థులు, విద్యార్థినులతో నిండిపోయింది.

స్టేజికి ఎదురుగా సిమెంటు చప్టా మీద విద్యార్థులు గుంపులుగా కూర్చున్నారు. ఆయనకి కొంచెం దూరంలో రామ్మోహన్, క్షీరసాగర్ కూర్చున్నారు. ఇద్దరి మొహాల్లో టెన్షన్ కనిపిస్తోంది.

తొమ్మిది గంటల యాభైనిమిషాలయింది. ఇద్దర్నీ దగ్గరకి రమ్మన్నట్టు సైగ చేసారు ప్రిన్సిపల్‌గారు ఇద్దరూ లేచి వెళ్ళారు. ప్రిన్సిపల్ గారు రెండు చీటీల్ని ఇద్దరికీ చూపించి, వాటిని ఎదురుగా ఉన్న టేబుల్‌పై వేసారు. ఆ మడిచి ఉన్న చీట్ల వల్ల ముందుగా ఎవరు మాట్లాడాలో తెలిసిపోతుంది. రామ్మోహన్, క్షీరసాగర్ చేరి ఒక చీటీ తీసుకున్నారు. రామ్మోహన్ చీటీలో ఒకటి అంకె ఉంది. అంటే ప్రథమంగా మాట్లాడవలసింది రామ్మోహన్.

ప్రిన్సిపల్ గారు ప్రెసిడెన్షియల్ డిబేటు టాపిక్ రాసి ఉన్న కాగితాన్ని రామ్మోహనికి అందచేసారు. నేను, సాగర్ మిత్రులు, రామ్మోహన్ మిత్రబృందం స్టేజి దిగి కిందకి వచ్చేసాం. మిగతా స్టూడెంట్సులో కలిసిపోయాం.

పదిగంటలయింది. ఒక లెక్చరర్ రామ్మోహన్ని మేకప్ రూములోంచి స్టేజిమీదకి తీసుకువచ్చాడు. వాళ్ళ వెనుకగా మేకప్ రూము తలుపు మూసుకుంది.

రామ్మోహన్ వేదిక మీదికి రాగానే కోలాహలంగా ఉన్న విద్యార్థిలోకం, నిశ్శబ్దం అయిపోయింది. రామ్మోహన్ సపోర్టర్స్ చిన్నగా చప్పట్లు కొట్టారు.

వేదిక మీద బ్లాక్ బోర్డు పెట్టి, దానిపై ఆ రోజు అభ్యర్థులకి ఇచ్చిన టాపిక్ రాసారు. విషయం చూడగానే, విద్యార్థుల్లో ఉత్సాహం చచ్చిపోయింది. హేళన చేస్తూ ఈలలు వేసారు. లెక్చరర్ టైము చూసుకుని రామ్మోహన్‌ని మాట్లాడమన్నట్టు సైగ చేసాడు. రామ్మోహన్ మైకు దగ్గరకి వచ్చి "మహాత్ముడు - యాభై ఏళ్ళ స్వరాజ్యం" అని ఆగాడు. వేదిక ముందు ఆవరణ అతని గంభీరమైన కంఠధ్వనితో నిండిపోయింది. విద్యార్థుల్లో నిశ్శబ్దం చోటు చేసుకుంది. అదే ఆ రోజు టాపిక్.

"డియర్ ఫ్రెండ్స్" - అంటూ ప్రసంగాన్ని మొదలు పెట్టాడు. 'ఇది చాలా పాత సబ్జెక్ట్ అహింస సత్యాగ్రహాల గురించి మాట్లాడను, వాటిని మనం సినీమాల్లోనూ, పార్లమెంటూ అసెంబ్లీల్లోనూ, చూస్తున్నాం. పై రెండు అస్త్రాలు ఉపయోగించి బ్రిటీషు వారిని సాగనంపిన మనం, 'అడపా తడపా అంతఃకలహం, అయితే బిల్‌కుల్ అహింసాత్మకం' అని శ్రీశ్రీ శలవిచ్చినట్టు, ముందు ఆంధ్ర పోరాటం తర్వాత తెలంగాణ ఆరాటం, ప్రస్తుతం ఢిల్లీ నుండి హైదరాబాద్ వరకూ డబ్బు చేసుకునే ఆర్భాటంగాళ్ళతో ఇదే ప్రగతి అని ఇదే గమ్యం అని అనుకుంటూ, అహింసాత్మకంగా సహిస్తున్నాం.

ఎందుకంటే ఇంతకన్నా మనం వహించే బాధ్యత ఇంకోటి ఎక్కడా కనబడదు. ఆనాడు మొత్తం దేశానికి ఒకేఒక మహాత్ముడు. మరి నేడు ఎంత ఖరీదైనా పెట్టి విదేశీకారు కొంటున్న మహాత్ముడు ఒకడు. ఏ విలువనైనా పణంగా పెట్టి, డబ్బుకోసం ఎగబడే మధ్య



కౌముది

తరగతి మహాత్ముడు ఇంకొకడు. దేశనాయకుల తప్పుడు, ఆర్థిక సూత్రాలకి నలిగి పెరిగిన ధరల వ్యవస్థని మౌనంగా అంగీకరిస్తూ, మూలిగినా, మురిసే కాలం కోసం ఎదురుచూసే కార్మిక మహాత్ముడు ఇంకొకడు. దేశం మహాత్ముల కార్ఖానంగా మారుతోంది. ' ట్రింగ్...ట్రింగ్, అంటూ గంటమోగింది.

రామ్మోహన్‌కి ఇచ్చిన ఐదునిమిషాలు అయిపోయాయి. రామ్మోహన్ ఆఖరి మాటలు ఆ ఆవరణలో మారుమ్రోగుతున్నాయి. విద్యార్థులు చప్పట్లు రామ్మోహన్ వేదిక దిగి వెళ్ళిపోయాడు. అతని వెనుక అతని మిత్రబృందం వెళ్ళిపోయారు. మేకప్ రూము తలుపు తీసుకుని, వీడు మెల్లగా వేదిక మీదికి వచ్చాడు. వీడ్ని విద్యార్థులు ఆహ్వానించారు. విషయం పాతది. రామ్మోహన్ ఇప్పటికే మాట్లాడాడు. ఏం మాట్లాడితే విద్యార్థుల్ని ఆకట్టుకుంటాడు.

ఈ ఆలోచనల్లో ఉండగానే మధ్య ట్రింగ్..ట్రింగ్ మంటూ బెల్లు మ్రోగింది.

మైకు నుండి "పెనుచీకటి మూకలతో పోరాడి అహింసానంద ప్రాంగణంలో, పాటమరించి, బ్రతుకనెంచిన ఓ డియర్ జీవీ! నా పంచవర్ష ప్రణాళికలన్నీ రోమాంటిక్ పోయిట్రీలు, కాంష్టిట్యూషను జైగాంటిక్ జామెంట్రీ నో సొల్యూషను లేదా మెనీ(మనీ) సొల్యూషన్స్, నా పేరే స్వరాజ్యం, నాకు యాభైఏళ్ళు, కానీ బేబీగానే ఉన్నాను. నా బోసినవ్వు మహాత్ముడిదే అలాగే మీరంతా మహాత్ముడ్ని మరవకుండా చేసేందుకే, మీ నడ్డిమీద గుడ్డకొలత పెంచదలచుకోలేదు.

కనీసం మీ జానెడు పొట్టను నిండనివ్వలేదు. యాభైఏళ్ళ ప్రభుత్వ రభస! నా దేశానికి, నాకూ, నా మేధకూ మింగుడు పడని పథకాలకూ, నా భావజలధికీ సామాన్యుని ముభావజడత్వానికి కలిసిన రగడాంతపు సంధిషరతుల పట్టిక. అనేక వేల సంవత్సరాల ముసలిదైనా పడుచుగుండెతో ఆశ పెడుతోంది. అపస్వరం పాడినా ఆనంద సుమమాలికేమో? అనే ఆశకు గురి అవుతోంది. ఇంకేం చెప్పను. యాభై ఏళ్ళ మహాత్ముల స్వరాజ్యం గురించి, " ముగించి, వేదిక దిగాడు. అయిదునిమిషాలు ముగిసాయి.

సాగర్ దగ్గరకి వెళ్ళేసరికి మిత్రబృందమంతా క్షీరసాగర్ చుట్టూ చేరారు. 'ఓయ్ పోయిటిక్‌గా ఉంది. విమర్శముందే ప్రిపేరయావా? ' అని కొందరూ 'అయితే మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధపడమంటావు' అని కొందరూ నవ్వుతూ కామెంటు చేసారు.

'బావుంది' మా మిత్రబృందం బాగా రిసీవ్ చేసుకున్నారు అని మిత్రబృందంతో ఓటు వెయ్యడానికి వెళ్ళిపోతూ వెనక్కి తిరిగి చూసా.

బాధ్యత మిత్రులకి అప్పచెప్పి హాస్టలు రూముకి వెళ్ళిపోతూ కనిపించాడు సాగర్. హాస్టలు నిర్మానుష్యంగా ఉంటుంది. ఎవరూ ఉండరు. బుల్ బుల్ వాయించుకుంటాడు "చల్ అకేలా.. చల్ అకేలా" అన్న పాటంటే వాడికి ఇష్టం మనసు తేలిక పడుతుంది. మనం ఎన్ని పోకడలు పోయినా ఒంటరి తనమే మన జంట అని వాడి ఉద్దేశం.

సాయంత్రం అయిదు గంటలకి, కౌంటింగ్ రూము నుండి, ఓటింగ్ వివరాలు రాసిన బోర్డు తీసుకొచ్చి వరండాలో పెట్టాడు ప్యూను.

క్షీరసాగర్ సామన్య మెజారిటీతో యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్, ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు. నేనే గెలిచినంత హంగామా చేసారు స్నేహబృందం.

●●●

ఎలక్షన్లు ముగిసి, విశ్వవిద్యాలయంలో శాంతి నెలకొని, విద్యార్థులు, బుద్ధిగా చదువులో మునిగితేలుతున్నారు అనుకోడం పొరపాటు. ఆ పొరపాటుకి కారణం, విద్యార్థులకి విశ్వవిద్యాలయం నిర్ధారించిన సిలబస్‌లో కన్‌ఫ్యూషన్, పాఠాలు, చెప్పడానికి ఖాళీ లేని ప్రొఫెసర్లూను. విద్యార్థుల కాలక్షేపానికి చక్కని ఏకాంతాన్ని కలగచేసే ప్లేగ్రౌండు, లైబ్రరీ మొదలైనవి. అయితే వీటన్నింటినీ చైతన్యవంతంగా ఉంచేందుకు ప్రతి ఎకడమిక్ ఇయర్‌కి కొంతమంది పుట్టుకొస్తారు.

ఆనాడు రంగనాథం తనతో తన మనసులో మాట చెప్పకపోయుంటే యూనివర్సిటీ సాఫీగా సాగుండేదేమో.

నాకు తెలిసున్నంత వరకూ రంగనాథం యమ్.యస్.సిలో డిగ్రీ పుచ్చుకున్నాడు. నాకన్నా ఓ సంవత్సరం సీనియర్ కూడా డిగ్రీ పుచ్చుకున్న ఆనందం పుచ్చుకున్నంత సేపు నిలిచినట్టులేదు. యూనివర్సిటీ నాలుగు గోడలూ దాటితే దానికి, విలువలేదని, దాన్ని చూసి కనీసం ఉద్యోగం ఇచ్చేవారు ఎవరూ లేరని తెలిసి, పురాణాల్లో భస్మాసురుడ్ని ఆదర్శంగా తీసుకుని, ఆ డిగ్రీ సాయంతో, రిసెర్చి చేసుకుంటాను. అనుమతి ఇప్పించవలసిందిగా కోరుతూ యూనివర్సిటీ వాళ్ళకి అప్లికేషన్ పెట్టాడు. ఆ విషయం తేలేవరకూ హాస్టలులో బసకొనసాగించాడు.

కల్పన చెప్పినట్టు రంగనాథం సీదాసాదా విద్యార్థి. ప్రీవియస్ చదువుతున్నన్నాళ్ళు, కొత్తవాతావరణం, చదువుల గాబరా, ఎక్కడ పడితే, అక్కడ దొరికిన గడ్డి ఏదీ తినవద్దని అమ్మ చెప్పిన ఆరోగ్యపాఠాలూ అతనికి ప్రీవియస్లో రసాస్వాదనకి అడ్డంగా నిలిచాయ్. ఇంక ఫైనల్‌లో పెర్సెంటేజి తెచ్చుకోవాలనే ప్రెషరూ, పుస్తకాల బరువూ, సహజంగా రంగనాథాన్ని ఇంట్రావర్టుగా ఉంచేసాయి. అనుకుంటా.

ఇప్పుడు, చెయ్యడానికి ఏ పనీలేకపోయేసరికి, రంగనాథానికి తను చదివిన యూనివర్శిటీ వింతలు విశేషాలు, తెలుసుకోదలుచుకున్నాడు. ప్లేగ్రౌండులో ఆటలు అర్థంకాక, క్లబ్బులో పత్రికలూ, వాటిలో రాజకీయాలూ అరాయించుకోలేక కేంటిన్‌లో ప్రవేశించాడు. యూనివర్శిటీ కేంటిన్ రోలింగ్ థియేటరులా, మంచి సరదాగా ఉండి పైసా ఖర్చు లేకుండా రోజంతా కాలక్షేపం చెయ్యచ్చు.

రెండేళ్ళు యూనివర్శిటీలో ఉండి కేంటిన్ మహత్యం, తనకు తెలియనందుకు తనలో తను సిగ్గుపడివుంటాడు. రోజూ కేంటిన్‌లో మూల కుర్చీలో కూర్చుని, విద్యార్థులు వేసుకునే ఏ సర్టిఫికెట్ జోకులు, విద్యార్థులు విద్యార్థినుల మధ్య జరిగే చిన్న చిన్న 'లౌ' సీనులు చూసి ఆనందించాడు. జీవితం అంటే ఏమిటో సగం అర్థం చేసుకున్నాడు.

రంగనాథానికి చాలా రోజులకిగానీ నా ఉనికి తెలియలేదు. నన్ను చూసాక రంగనాథం కళ్ళల్లో వెలుగునిండింది. సాగర్ చెప్పినట్టు నా నవ్వు మనసుకు హాయిని, రెండు జెళ్ళూ మనసులో చిలిపితనాన్ని పుట్టిస్తాయి. అడ్రెసు మర్చిపోయి, భూమ్మీదకి వచ్చిన దేవకన్యలా కనిపించి ఉంటా రంగనాథానికి. నన్ను చూసినప్పుడల్లా రంగనాథం హృదయం, స్పీడు పెరిగి, తడబాటు పడుతున్నాడు.

రంగనాథంలో మార్పు వచ్చింది. షర్టు టక్ చేసి, ఇంటిమేట్ సెంట్ స్ప్రే చేసుకుని స్మార్ట్‌గా తయారయి, కేంటిన్‌లో నా రాకకోసం ఎదురుచూడడం వల్ల తన ప్రయత్నంలో సఫలీకృతుడయ్యాడు. నే గుర్తించలేదు కానీ నాతో కేంటిన్ కొచ్చే స్నేహితులిద్దరు ముగ్గురు రంగనాథాన్ని ఓరచూపు చూసారు. అంటే యూనివర్శిటీ కేంటిన్ స్టాండర్డ్ కుర్రాడిగా గుర్తించారన్నమాట! నాతో ముచ్చటించారు కూడా. 'నిన్ను తెగ ఆరాధిస్తున్నాడే. చూడవే' అంటూ వేధించారు.

మౌనంగా కొన్నాళ్ళారాధించి, ఇంక మాట్లాడితేగానీ ఉండలేని పరిస్థితికి వచ్చాడు అనుకుంటా. ఎదురుపడితే నోటంట మాట రావడంలేదు. ఇంక ఎదురుబడి 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పడం అసాధ్యం. ఏం చేయాలి?' అని ఆలోచించుకుని రంగనాథం ఒకరోజు నేను రోజూ కూర్చునే టేబులు దగ్గర కూర్చున్నాడు.

ఎందుకంటే నాకు ఒక అలవాటుంది. సూర్యుడు తూర్పుదిక్కున ఉదయించినా ఉదయించకపోయినా లేక ఛాయాపతిగతి తప్పినా తప్పకపోయినా నేను లంచవర్లో కేంటిన్లో చివరి టేబులు దగ్గర కూర్చుని మిత్రబృందంతో కలిసి టిఫిన్ తింటా. నే వచ్చేసరికి, అక్కడ ఎవరేనా టిఫిన్ తింటుంటే వారు వెళ్ళిపోయేదాకా ఆగుతా కానీ, ఇంకో టేబులు దగ్గరకు వెళ్ళి కూర్చోను.

దాన్ని నా 'ఐ'గా గుర్తించా కానీ అదే 'ఐ'ని విద్యార్థిలోకం గుర్తించాలని అనుకోడం పొరపాటేమో. నా అలవాటు విద్యార్థిలోకానికి తెలియక ముందు, నే ఎక్కువసేపు నిరీక్షించవలసి వచ్చేది. కానీ నే ఫైనల్‌కి వచ్చాక, సీనియర్ని అయాక నా గురించి సర్వ విద్యార్థి లోకానికి తెలిసాక, ఎక్కువ నిరీక్షించకుండా 'సారీ' అనో.. "ఎక్స్‌క్యూజ్‌మి"తోనో టేబుల్ ఖాళీ అయిపోయేది.

●●●

ఆ రోజు పదకొండు గంటలకి టేబుల్ దగ్గర కొచ్చేసరికి, రంగనాథం కూర్చున్నాడు నన్ను చూసినా రంగనాథం లేవలేదు "ఎక్స్‌క్యూజ్‌మీ" అన్నదానికి సమాధానం రావడం కష్టమయింది.

రంగనాథం టేబుల్ దగ్గరనుంచి లేస్తూ అతి కష్టం మీద 'యు ఆర్ యాన్ ఏంజల్' అన్నాడు. ఆ తర్వాత నోటంట మాట రాలేదు. గొంతుక తడారిపోయినట్టుంది. ఇలాంటి అనుభవాలు నాకు చాలా ఉన్నాయి. ఈ మధ్య సాగర్‌తో దోస్తీ చేసిన దగ్గరనుంచి తగ్గాయి. నవ్వుతూ 'థాంక్ యు ఫర్ ది కామెంట్' అన్నా.

అంత మంది అమ్మాయిల మధ్య సంభాషణ ఎలా పొడిగించాలో తెలియక, తడబాటుని కప్పిపుచ్చుకుంటూ కేంటిన్ నుండి బైటికి పోయాడు రంగనాథం.

'వీడెవ్వోవాడే! ' అంటూ హాస్యాలాడుకోడం అతనికి వినబడకపోదు.

మరుసటి రోజు టేబులు దగ్గరకి వచ్చేసరికి మళ్ళీ రంగనాథం కనిపించాడు. ఆశ్చర్యపోయా. అయినా 'ఎక్స్‌క్యూజ్‌మి' అన్నా.

రంగనాథం కుర్చీలోంచి లేచి, కానీ వెళ్ళిపోలేదు. ధైర్యంగా నిలబడి "మీరు ఏమీ అనుకోనంటే మీతో పర్సనల్‌గా మాట్లాడాలి" అన్నాడు.

"పర్సనల్ గానా?" అని ఆశ్చర్యపోయా..

అతని ఎదురుగా కుర్చీలో కూర్చున్నా. నాతో వచ్చిన స్నేహితులు, కల్పనా నవ్వుకుంటూ ఇంకో టేబులు దగ్గరకి వెళ్ళిపోయారు.

"నా పేరు రంగనాథం" అన్నాడు దిగజారిపోతున్న ధైర్యాన్ని కూడదీసుకుని.

"గ్లాడ్ టు మీట్ యు" అన్నా. కానీ నా పేరు చెప్పలేదు.

"నేను యం.యస్.సి పాసయ్యాను." తడబాటు.. మిమ్మల్ని మేరేజ్‌చేసుకుంటాను. మీకు ఇష్టమైతే" అన్నాడు రంగనాథం ప్రపంచంలో ఉన్న ప్రేమ భారం తనే మోస్తున్నట్టు. ఆశ్చర్యపోయా. ఎందుకంటే నా గురించి తెలియని వాళ్ళు యూనివర్శిటీలో ఎవరూ లేరు అని. నా ఉద్దేశం రంగనాథం అమాయకంగా ప్రపోజ్ చేసాడంటే నమ్మబుద్ధి కాలేదు. నిముషంలో తేరుకున్నా. "నేనింతవరకూ, మేరేజ్ గురించి ఆలోచించలేదు. ఆ విషయంలో నిర్ణయం తీసుకోగానే, స్వయంవరం ప్రకటిస్తాను. వద్దురుగాని, ఎందుకంటే నాకు నచ్చిన వాడితో సహా చాలామంది ఉన్నట్టున్నారు 'క్యూ 'లో" అన్నా వస్తున్న నవ్వును ఆపుకోడానికి ప్రయత్నిస్తూ. నా చిలిపితనాన్ని హేళనగా అర్థం చేసుకున్నాడు రంగనాథం.

నన్ను దీర్ఘంగా చూసి కుర్చీలోంచి లేచి బుర్రొంచుకుని కేంటిన్ నుండి వెళ్ళిపోయాడు. వెనకాల మిత్రబృందం చేసిన పకపకలు వినబడకపోవు.

నేను ఎవరో? రంగనాథానికి తెలిసేసరికి కథ చాలా దూరం పోయింది. అక్కడే తప్పు జరిగిపోయింది అనిపించింది. సాగర్ అంతలా రియాక్ట్ అవకుండా ఉండవలసింది.

●●●

**రంగనాథన్ని సాగర్ కొట్టాడని అయిదోరోజు వరకూ తెలియలేదు.** తెలిసాక సాగర్‌తో పోట్లాట వేసుకున్నా. "నువ్వేం నాకు పోలీసింగ్ చెయ్యక్కర్లేదు" అంటూ.

తను రంగనాథాన్ని కొట్టలేదు అంటూ సంజాయిషీ చెప్పుకొచ్చాడు. అతనేం చెప్పినా అది నన్ను చికాకు పెట్టిందని అర్థం చేసుకున్నాడు. అసలేం జరిగిందో చెప్పుకొచ్చాడు.

●●●

సాగర్ బుద్ది జీవుల కోవలోకి చెందినవాడు. దానికి తోడు చిన్న ఆరోగెన్స్ ఉంది. వీడు బుద్ధిజీవిగా కొందరికి నచ్చితే బుద్దున్న అరోగెంట్‌గా నాకు నచ్చాడు, ఆ నేచరే అతడ్ని విద్యార్థి నాయకుడ్ని చేసింది కూడా. కానీ ఈ విషయంలో ఆ విశేషం నాకు నచ్చలేదు సరికదా బాధ పెట్టింది. ఏం చెపితే సాగర్‌కి అర్థం అవుతుంది. నా ఆలోచన్ని పట్టించుకోకుండా సంజాయిషీ చెప్పుకుపోతున్నాడు. రంగనాథం. తనకి ప్రేమ తెలియచేసిన రెండు రోజులకి క్షీరసాగర్ రంగనాథం రూముకి వెళ్ళాడట.

"రంగనాథం ఎవరు?" అని క్షీరసాగర్ ప్రశ్న.

"నేనే" రంగనాథం.

"నా పేరు సాగర్" అంటూ పరిచయం చేసుకుని, ఎదురుగా ఉన్న కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. వాడితో వెళ్ళిన మరి ఇద్దరు స్టూడెంట్స్ వెళ్ళి మంచం మీద కూర్చున్నారు.

"గ్లాడ్ టు మీట్ యూ" అన్న పదాల్ని అతి కష్టం మీద రంగనాథం గొణిగాడు. అప్పటికే అతనికి సాగర్ ఎవరో తెలిసిపోయింది. "ఐ యామ్ నాట్ గ్లాడ్" అన్నాడు సాగర్ వెక్కిరింపుగా.

రంగనాథం రూము మధ్యగా నిలబడ్డాడు. సాగర్ వెక్కిరింపు ఎందుకో అతనికి తెలుసు, కానీ పరిస్థితి చెయ్యిదాటిపోయింది. నాతో మారేజ్ ప్రపోజ్ చెయ్యక ముందు తెలుసుకోవలసింది. కానీ అలా జరగలేదు. అందుకే మౌనంగా ఉన్నాడుట.

రంగనాథం ఏం మాట్లాడకపోయేసరికి, సాగరే సంభాషణ పెంచాడు.

'జాహ్నవితో మారేజ్ ప్రపోజ్ చేసావట?' ఆపాటికి నేను వీడి స్వంతం అయిపోయాను. వీడి ఆస్తిని ఇంకా కసిగా చెప్పాలంటే వీడబ్బగారి సొమ్మని! ఇలాంటివే చికాకు పెడ్తాయి రేదర్ బాధ పెడ్తాయి? నాలో 'ఐ'ని బలంగా తట్టిలేపుతాయి.

'ఊ..ఊ..' అంటూ నసిగాడు రంగనాథం.

'నీకీ ఆలోచన ఎలా వచ్చింది?' సాగర్ ప్రశ్న.

'నా ఖర్మ వల్ల వచ్చింది' అందాం అనుకుని ఉంటాడు. కానీ మౌనమే బెస్ట్ సమాధనం అని ఊరుకునుంటాడు.

సాగర్ ఆలోచన వేరు. ఈ విషయంలో రాజకీయం ఏదైనా ఉందా? ఉంటే అదేమిటి? ఆ ఆలోచనే సాగర్ అసహనానికి కారణం. మౌనం అర్థాంగీకారం అని, అది అనేకమైన అనుమానాలని రేపుతుంది. ఎదుటివారి సహనాన్ని చంపుతుంది. అని తెలుసుకోలేకపోయాడు రంగనాథం.

సాగర్‌లో సహనం చచ్చిపోయింది. 'నీకు స్వతహాగా ఈ ఆలోచన వచ్చిందంటే నమ్మకం కలగడంలేదు. రామ్మోహన్ ప్రయత్నం చెయ్యమన్నాడా? లేక సద్ కులగురువు భానోజీరావు పెళ్ళి పెద్దగా ఉంటానన్నాడా?' అన్నాడు.

రంగనాథం రామ్మోహన్ కులం వాడని సాగర్‌కి తెలుసు. రామ్మోహన్ నన్ను ఏడిపించడానికి రంగనాధంని ఉపయోగించుకున్నాడని అనుకుని ఉంటాడు. సాగర్ మాట్లాడిన మాటల్లో సగం కూడా రంగనాధనికి అర్థం కాలేదు అని సాగర్ గుర్తించాడు. ఆ మాత్రం తెలివితేటలు సాగర్‌కున్నాయి.

'మీరు చెప్పిన పేర్లు కలవాళ్ళెవరూ నాకు తెలీదు. అయినా ఒకళ్ళు అడగమని చెపితే అడిగేంత మూర్ఖుడ్ని కాదు. మీరు ఇలా రూములో జొరబడి నన్ను నిలదీయడం ఏం బాగులేదు' అన్నాడట రంగనాథం.

రంగనాథం సమాధానానికి సాగర్ చికాకుగా మొహం పెట్టి ఏ అండా లేకుండా ఇంత ధైర్యంగా సమాధానం చెప్పడం కుదర్దు అనుకున్నాడు. అందుకే చిన్నడోసు ఇద్దామనుకున్నాడట. కానీ అది ఎంతదూరం పోతుందో? ఏ పరిస్థితులకి దారితీస్తుందో ఇద్దరిలో ఎవరూ ఊహించలేకపోయాం. ఒకలా చెప్పాలంటే సాగర్ చెప్పిన సమాచారం నాకూ కుతూహలం కలిగించింది.

"రంగనాథం నువ్వు మూర్ఖుడివో! తెలివైనవాడివో చర్చ చెయ్యటానికి నేను రాలేదు. ఇలాంటి పిచ్చి వెధవపని, ఇంకెప్పుడూ చెయ్యకు. లేదా ఏదేనా పని చేసినప్పుడు దాని పూర్వాపరాలు పూర్తిగా తెలుసుకో," అని లేచి రూములోంచి బైటకి వెళ్ళి పోయాడు.

వెనగ్గా అతని ఫ్రెండ్స్ కూడా కదిలారు. సాగర్ అలా శాసించడం రంగనాథానికి నచ్చలేదు. "లేనిపోని సలహాలు చెప్పడానికి మీరెవ్వరు. ఆ మాత్రం జ్ఞానం నాకూ ఉంది. నేను జాహ్నవికి మారేజ్ ప్రపోజ్ చెయ్యడంలో, తప్పేమిటో నాకు ఇప్పటికీ అర్ధం కాలేదు. మీరు ఇలా వచ్చి మీ సీనియర్‌తో, వ్యవహరించడం, బాగులేదు. ఇటీజ్ టూమచ్!' అన్నాడు.

సాగర్ బైటికి వెళ్ళిపోయినా, అతనితో వచ్చిన ఫ్రెండ్ ఇంకా రూములోనే ఉన్నాడు.

రంగనాథం సమాధానం పూర్తిగా విన్నాడు. అతనికి కోపం వచ్చి పిడికిలి బిగించి రంగనాథం పొట్టలో కొట్టాడు. రంగనాథానికి పేగులు తోడేసినట్టయింది. పొట్టపట్టుకుని ముందుకి వంగాడు బాధగా. అప్పుడు అదే పిడికిలితో రంగనాథాన్ని హుక్ కొట్టాడు. రంగనాథం గెడ్డం బద్దలయిపోయింది. అతను రెండు మంచాల మధ్య పడిపోయాడు. అతని కళ్ళజోడు కిటికీ గుండా ఎగిరి బైటపడిపోయింది. 'నౌ ఇటీజ్ త్రీమచ్! వన్ మోర్ మచ్ ఈజ్ ఎ డెడ్" అని నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు సాగర్ ఫ్రెండ్.

సాగర్‌కి రంగనాథాన్ని కొట్టడం ఇష్టంలేకపోయినా చెయ్యలేకపోయానంటాడు. సాగర్ ఎన్ని చెప్పినా రంగనాథాన్ని సాగర్ కొట్టాడు, అదీ నా కాంటెక్స్ట్‌లో అది నాకిష్టం లేదు. యూనివర్సిటీలో టాకింగ్ సబ్జెక్ట్ అయికూర్చుంది.

నాకు రంగనాథం అంటే భయంలేదు, అతని రూమ్మేటు పార్ధసారధి రామ్మోహన్‌కి దోస్త్. పైగా సారధి, రంగనాథం ఒకే ఊరు, ఒకే కులం. రంగనాథం ఫైనల్‌లో ఉండగా సారధి యూనివర్శిటీలో జాయిన్ అయ్యాడు. ఇద్దరూ ప్రయాణాల్లోనూ, యూనివర్శిటీలోనూ కలుసుకోడం తప్ప పెద్ద పరిచయం లేదు. రంగనాథం యమ్. యస్. సి పాసయి రెసెర్చికి అప్లై చేయడానికి వచ్చి సారధికి తాత్కాలిక అతిధిగా అతని రూములో ఉంటున్నాడు.

'రంగనాథం ఎంత అన్నోనో సారధి అంత పాపులర్, సారధి యూనివర్శిటీలో జాయిన్ అయిన రెండో రోజున తన కులానికి చెందిన ప్రొఫెసర్లు లిస్ట్ తయారు చేసాడు. ఆ లిస్టుని రెండు భాగాలుగా చేసి, మొదటి భాగంలో తన డిపార్టుమెంటుకి చెందిన ప్రొఫెసర్లని చేర్చాడు. రెండో భాగంలో ప్రొఫెసర్లని ఇంటికి వెళ్ళి, పలకరించి, తన ఇంటిపేరుతో సహా పరిచయం చేసుకున్నాడు. ఇంక మొదటి భాగం ప్రొఫెసర్లని, పళ్ళబుట్టతోనో, ప్లాస్టిక్ సంచీ నిండా బిస్కెట్లతోనో, సత్కరించి, మరీ పరిచయం చేసుకున్నాడు. అందుకే వాడే సమస్య' అని సాగర్ చెపుతోంటే,

"ముందాలోచించుకోలేదా?" అని చికాకుపడ్డా.

సాగర్ తేలికగా కొట్టిపారేసాడు. "ఏం పర్వాలేదు" అన్నాడు. అదే అంచనా సరిగ్గానే ఉంటుంది. ఆచరణలో మాత్రం అహంకారం.

కానీ సాగర్ అనుకున్నట్టు జరగలేదు.

రంగనాథం దగ్గరకి రామ్మోహన్ వెళ్ళాడు. మణి చెప్పింది, మణికి బోయ్స్ హాస్టల్‌లో సమాచారం తెలుస్తుంది. మణి చెప్పినదాన్ని బట్టి,

రెండు వారాలుగా రోజా పదకొండయే సరికి కేంటిన్‌కి వెళ్ళి, రెండు గంటలు, కేంటిన్‌లో గడిపే రంగనాథం, రెండు రోజులుగా హాస్టల్ మెస్‌లో భోంచేస్తున్నాడు.. గెడ్డం గీసుకోలేదు, పరధ్యానంగా ఉంటున్నాడు. అన్నిటికీ మించి "నేనింటికి వెళ్ళిపోతానోయ్ సారధీ" అన్నాడు.

'అరె ఇదేమిటి ఇంత సడన్‌గా వెళ్ళిపోతానంటున్నారు. రెండు రోజుల క్రితం పి.జి. డిప్లమోకి ట్రై చేస్తానన్నారు.' సారధి ఆరా..

'లేదు ఈ రోజు సాయంత్రం వెళ్ళిపోతాను.' రంగనాథం సమాధానం.

సారధికి అనుమానం రాగానే, రంగనాధాన్ని పరిశీలనగా చూసాడు. రంగనాధంపై పెదవి ఉబ్బి ఉంది. అతని టవలుకి అంటిన ఎర్రటి మరకలు కనిపించాయి. దీన్ని సారధి కొంచెంగా సీరియస్‌గా తీసుకుని, పక్క రూముల్లోనూ, హాస్టలు స్వీపర్ల దగ్గరా వాకబు చేసాడు. వాళ్ళు క్షీరసాగర్ అతని రూముకి వచ్చినట్టు చెప్పారు. రంగనాధం రెగ్యులర్ స్టూడెంటు కాదు. అతనితో సాగర్‌కి ఏం పని ఉంటుందా? అని ఆలోచించి క్లాసు ఎగ్గొట్టి మూడు గంటలకి రూము చేరుకున్నాడు. అప్పటికే అన్నీ సర్దేసి ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాడు రంగనాధం.

ఇంక తర్జన భర్జలు పడవలసిన అవసరంలేదు అనిపించి, సూటిగా "రంగనాధంగారూ మిమ్మల్ని ఒక విషయం అడుగుతా నిజం చెప్తారా?" అన్నాడు. సారధి ఊహించినట్టుగా, రంగనాధం తడబడ్డాడు. రంగనాధానికి ఎవరు ఎలాపోయినా పర్వాలేదు. తను ప్రేమలో విఫలమైనట్టు అందరికీ తెలియడం ఇష్టంలేదు.

'ఏమిటి' అని అడిగాడు నీరసంగా.

"క్షీరసాగర్ మన రూముకి ఎందుకు వచ్చాడు? మిమ్మల్ని ఎందుకు కొట్టాడు. అసలు జరిగిందేమిటి?" సారధి ప్రశ్న.

రంగనాధం ఆశ్చర్యపోయాడు. సాగర్ రూముకి వచ్చినట్టు, తనని కొట్టినట్టు సారధికి ఎలా తెలుసా? అని అనుకునుంటాడు.

'అబ్బే అదేం లేదే' అని తప్పించుకోబోయాడు. కానీ సారధి పట్టుబట్టడంతో జరిగిన విషయం వివరంగా చెప్పి, 'ఈ భానోజీరావు ఎవరోయ్' అని అడిగాడు అమాయకంగా.

ఇటువంటి విషయాలు జరగడం అంటే సాగర్ రంగనాధాన్ని తన్నడంలో పెద్ద విశేషం, ఏమీ కనబడలేదు. సారధికి, అవన్నీ యూనివర్శిటీల చైతన్యానికి, ప్రగతికి, మచ్చుతునకలు, యూనివర్శిటీ ఏడాదికి రెండు పరిక్షలైనా జరగవేమో కానీ, ఇలాంటివి ఓ అరడజను సంఘటనలేనా జరుగుతుంటాయి. ఇవన్నీ సామాన్య విషయాలు ఇక్కడ జరిగిన ప్రత్యేక విషయం ఏమిటంటే క్షీరసాగర్ నోటంట వచ్చిన భానోజీరావు, రామ్మోహన్ పేర్లు, సారధి బలవంతం చేసి, రంగనాధం ప్రయాణాన్ని మర్నాటికి వాయిదా వేయించాడు.

●●●

"వీడు క్లాసుకేనా అంత ఉత్సాహంతో వెళ్ళాడో లేదో తెలీదు గాని, సారధి రూముకి మాత్రం ఉరకలు పరుగులుతో వెళ్ళుంటాడు" అంది మణి.

"ఎవరు?" అన్న నా ప్రశ్నకి

"రామ్మోహన్"

"...." నేనేం అడగదల్చుకోలేదు. తనే చెపుతుంది, నాకు తెలుసు.

"రామ్మోహన్‌ని రంగనాధానికి పరిచయం చేసాడు సారధి. ఆ తర్వాత వీడి స్పీచ్.

'రంగనాధంగారూ మీ నాన్నగారు మాకు తెలుసు, సారధి చెప్పేవరకూ మీరు ఫలానా అని తెలుసుకోక పోవడం మాదే పొరపాటు. నిన్న జరిగిన విషయం చెప్పాడు సారధి. క్షీరసాగర్ రిఫర్ చేసిన రామ్మోహన్‌ని నేనే, మా ఇద్దరి గురించీ తెలియాలి అంటే మీకు చాలా విషయాలు తెలియాలి" అన్నాడట, వీడో పెద్ద డ్రామాబాజీ" అంటూ నవ్వింది మణి,

'రంగనాధం' అని మృదువుగా పిలిచాడట. రంగనాధం 'ఏమిటా?' అని చూసాడు. 'రామ్మోహన్‌న్ని నేను క్షీరసాగర్ గురించి ఏదో చెడుగా చెప్పి, నిన్ను అడ్డం పెట్టుకుని దెబ్బలాటకి వెళతాననుకోకు. అయినా నాకూ సాగర్‌కి శతృత్వం ఏం లేదు. అయితే ఈ తేడా అంతా ఎక్కడుంది? అని నీ అనుమానం, నా ఉద్దేశం అసలు తేడానే లేదు.

ఈ ప్రపంచం తీరే అంత. మొత్తం ప్రపంచంలో రెండు కులాలు ఉన్నాయి. ఒకటి పెట్టుబడిదార్ల కులం, రెండు కష్టబడిదార్ల కులం, ఏ కులం వాడు ఎవడ్ని ఎక్స్ ప్లాయిట్ చేస్తాడో అని రోజుకో బాంబు, నిముషానికో మిసైల్ తయారు చేసుకుంటున్నారు. ప్రపంచం తీరు ఇట్లా ఉంటే,

ఇంక ఇండియా ఉత్తరకులం, దక్షిణ కులం, అనే జాఢ్యంతో గింజుకుంటోంది, అలాంటి ఇండియాలో మన విశ్వవిద్యాలయం ఒకటి. ఇంక ఇక్కడ కులాలు లేకపోతే, ఇంటర్ నేషనల్ సిష్టమ్ ఆఫ్ యూనిట్స్‌కే మచ్చ. అందుకని ఇక్కడా అనేక కులాలు ఉన్నాయి. కానీ యూనివర్శిటీలో గుర్తింపు పొందిన కులాలు రెండే!. అందులో ఒకటి మనది. కానీ ఈ ఎలక్షనులో మనం కులం కాస్త దెబ్బతింది. క్షీరసాగర్ కులపు వాళ్ళు గెలిచారు. గెలిచిన వెధవలు గెలిచినట్టు ఉండరు.

అఫ్‌కోర్సు గెలవని వెధవలు గెలవనట్టూ ఉండరు. మనం ఏవేనా గొడవలు లేపుతాం, అని వాళ్ళ అనుమానం, నిజానికి ఈ యూనివర్శిటి వి.సి. దగ్గర నుండి ఆయన దగ్గర బంట్రోతు వరకూ, మనకులం వాళ్ళే అంటే మెజారిటీ మనదే ఇలాంటి విశ్వవిద్యాలయంలో సాగర్ ప్రెసిడెంట్‌గా గెలవడం మనకి అవమానం. కానీ ఏం చేస్తాం? ఆ జాహ్నవి అండ చూసుకుని ఆడవోట్లతో గెలిచేసాడు. అప్పటి నుండి పొగరు. మగర్ ఉస్ సే కిసీ చింతాకీ బాత్ నహీహై. లేకపోతే నీకూ, నాకూ, ఉన్న పరియం ఏమిటి? నీకు జాహ్నవి మీద ప్రేమ కలగడం. ఆమెతో నువ్వు మేరేజ్ ప్రొపోజ్ చేయడం. ఇది ఒకరు చెపితే జరిగే పనేనా? కానీ సాగర్ అలా ఆలోచించడు. నువ్వు సారధి రూములో ఉన్నావు. సారధి నాకు ఆప్తుడు. అందుచేత వెనుక నుండి నేనే. ఈ నాటకం ఆడించానని అనుకుంటాడు.

సాగర్ నీతో అనాగరికంగా, ప్రవర్తించిన మాట నిజం. అందుకని నువ్వూ అనాగరికంగా ప్రవర్తించమని కాదు నా ఉద్దేశం, కనీసం మనం నాగరికంగా నైనా ప్రవర్తించకూడదని నా అభిప్రాయం. అలా జరగాలంటే నువ్వు యూనివర్శిటీ వదలి వెళ్ళకూడదు. నువ్వు వెళ్ళనని మాటిచ్చే వరకూ నేను ఇక్కడనుండి కదలను,"

రామ్మోహన్ చెప్పాడంటూ మణి చెప్పిన విషయాలు కొంచెం బెరుకు కలిగించినా "కల్పించి చెప్పకే" అన్నా. అందరూ బైటకి పవిత్రుల్లా కనిపించినా లోపల కులం విషయంలో కొంత వీక్‌నెస్ ఉంటుంది. మణిని కూడా కొందరు కం.కం. అంటారు.

"హాస్టల్లో ఈ ఉపన్యాసం మీద రిసెర్చి జరుగుతూంటేను. ది ఏ లెవన్ కాజెస్ ఆఫ్ డిజనరేషన్ ఆఫ్ యూనివర్సిటీలో ఈ స్పీచ్ వో కాజు. సర్లే ఇంకా ఉంది విను."

అంత దీర్ఘోపన్యాసంలోనూ, రంగనాధానికి అర్ధం అయింది కొంత, కానిది కొంత, కాని తనని ఇక్కడ ఉంచేసి రామ్మోహన్ గొడవ పెట్టుకుంటాడేమో అని అనుమానించాడు. అది అతనికి ఇష్టంలేదు.

'అబ్బే ఎందుకండీ లేని పోని గొడవలు, నేను వెళ్ళిపోతాను.' అన్నాడట.

సారధి కలుగచేసుకుని 'చూడండి రంగనాథం గారు, సాగర్ వచ్చి మిమ్మల్ని కొడితే. అది మీ పర్సనల్ విషయం మేం కలుగచేసుకోకూడదు. కానీ రామ్మోహన్, భానోజీరావుల పేరు ఎత్తాడు. అది కొంచెం ఆలోచించవలసిన విషయం అయినా మేం ఉన్నపాటున వెళ్ళి, వాళ్ళతో దెబ్బలాట వేసుకునే అనాగరికులం కాదు భానోజీరావుగారితో మాట్లాడి, సాగర్‌తో మాట్లాడితే, జరిగిన దానికి అతను తప్పక బాధపడచ్చు. అందులో మీరు సీనియర్ గుడానూ,' అంటూ నచ్చచెప్ప చూసాడు.

'నాకు దెబ్బలాట అంటే ఇష్టం లేదోయ్ సారధీ' అన్నాడు రంగనాధం ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసిన చోటే ఉన్నాను అన్నట్టు.

'అబ్బే దెబ్బలాట పెట్టుకోము. అదిగో నేను కొట్టాను. దెబ్బతో పారిపోయాడు, అదంతా వాళ్ళ కుట్రే, అని సాగర్ విర్రవీగకుండా ఉండాలంటే, మీరు కొన్నాళ్ళు ఉండి, మీ పని పూర్తిచేసుకుని మరీ వెళ్ళండి" అంటూ అనునయంగా చెప్పాడు సారధి.

రంగనాధానికి ఏం చేయాలో తోచలేదు. ఇన్నాళ్ళూ ఆతిధ్యం ఇచ్చిన సారధి మాట కొట్టెయ్యడం కష్టమనిపించి మొహమాటంగా 'సరే' అన్నాడు.

రామ్మోహన్ ఆనందంతో చిరునవ్వు నవ్వుతూ లేచి, "థాంక్స్" రంగనాధంగారూ, మామాట మన్నించినందుకు, సారధీ రేపు ఆదివారం భానోజీరావుగారింట్లో భజనకి, రంగనాధంగార్ని తీసుకురా" అని సారధికి చెప్పి వెళ్ళిపోయాడు.

"ఆ ఆదివారం నుండి భజనకి వస్తున్నాడు రంగనాధం" అంటూ ముగించింది మణి.

మణి చెప్పిన ఆఖరి విషయం కొంచెం ఆలోచించ తగ్గది. అంటే సమస్య చిగుర్లు పెడుతోంది. ఎందుకంటే ప్రతి ఆదివారం భానోజీరావుగారింట్లో భజన జరుగుతుంది. విద్యార్ధులూ, ప్రొఫెసర్లూ అందరూ వెళ్తారు, ఆ విషయం కల్పన చెప్పింది. కల్పన, మణి భజనకి వెళ్తారు. భక్తితో కాకపోయినా ఇదంతా భజన కల్చర్ అంటుంది కల్పన భుజాలెగరేస్తూ.

●●●

భజనకి వచ్చిన అతిధుల్ని పేరు పేరున పలుకరిస్తూ, సత్కరిస్తూ హడావిడిగా తిరుగుతాడు రామ్మోహన్ భానోజీరావు ఇంట్లో. యోగబాల. కాష్మీ ప్లాష్టిక్ బొమ్మలా మిలమిలా మెరుస్తూ, శరీరం చందనం, కస్తూరి, మిధికల్ ఫేంటసీలాంటి అమృతంలో రంగరించి నలుగు పెట్టినట్టుగా ప్రకాశవంతంగా ఉంటుంది అంటారు.

రంగనాధాన్ని ఆప్యాయంగా పలుకరించి లోపలికి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. ఆ వాతావరణంలో పవిత్రత, చలవరాతితో కట్టిన బిర్లా టెంపుల్లా కాష్లీగా, పోలిషింగ్‌గా నిగనిగలాడుతూ ఉంటుంది. సారధి చూపించిన భానోజీరావు, యోగబాలకి కుడిప్రక్కగా గోధుమ వన్నె సిల్క్ బట్టల్లో కేడ్ బెర్రీస్ ఫైవ్ స్టార్ చాక్లెట్‌కి చుట్టిన రేపర్‌లా తళతళలాడుతున్నాడు.

భజన ముగిసాక, చాలామంది ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. అంతవరకూ యోగ ముద్రలో ఉన్న యోగబాల కళ్ళు తెరుస్తుంది. యోగబాల కళ్ళు డైయోడ్‌ల్లా చిన్నవిగా ఉన్నా ప్రకాశవంతంగా ఉన్నాయి, పెదవుల మీద చిరునవ్వు అలంకరించినట్లుగా ఉంది.

యోగబాలకి రంగనాధాన్ని చూపించి ఏదో చెప్పారు భానోజీరావు దగ్గరగా రమ్మని సైగచేసింది యోగబాల. తడబడుతూ లేచి దగ్గరగా వెళ్ళాడు రంగనాధం. రామ్మోహన్ పరిగెత్తుకుంటూ వచ్చి, వ్యాపార వ్యవహారాలతో సహా, రంగనాధాన్ని యోగబాలకి పరిచయం చేసాడు. యోగబాల చిరునవ్వుతో పక్కనున్న పళ్ళెంలోంచి విభూది తీసి, రంగనాధం నుదుట అద్దింది.. రంగనాధం రెండు చేతులూ ఎత్తి యోగబాలకి నమస్కరించాడు. భానోజీరావు చిరునవ్వుతో ఆశీర్వదించారు.

ఇవన్నీ రంగనాధానికి కొత్త, రెండేళ్ళుగా యూనివర్శిటీలో ఉన్నా తెలియవు. సారధి వచ్చి ఏడాది దాటలేదు? వీళ్ళందరికీ ముఖ్యమైన వ్యక్తి అయిపోయాడు అనుకుని ఆశ్చర్యపోయాడు.

యోగబాల వేగంగా కదులుతున్న త్రాచులా ఉంటుందట. కల్పన చెప్పిన యోగబాల పూర్వాపరాలు జ్ఞాపకం వచ్చాయి. పుకార్లో నిజాలో తెలీదుగాని భానోజీరావు మూడేళ్ళక్రితం, కాన్ఫరెన్స్ ఎటెండ్ అవడానికి ఢిల్లీ వెళ్ళారు. అక్కడి నుండి హృషీకేష్ వెళ్ళారు. హృషీకేష్ ఆశ్రమాల్లో ఆధ్యాత్మికత వెతుకుతుండగా, ఆత్మీయురాలిలా యోగబాల దర్శన మిచ్చింది. ఆమెకి ఆశ్రమంలో పెట్టిన పేరు యోగబాల. ఆమె భర్త ఆర్మీ ఆఫీసరు.. ఈమె వార్ విడో! ముందూ వెనుకా ఎవరూ లేక, ఆమె ఆశ్రమంలో పనిచేస్తోంది. ఆమె భానోజీరావు ఆహ్వానం మీద, బదరీ వెళ్ళింది. అక్కడ భానోజీరావుగారు అనారోగ్యం పాలయ్యారు. యోగబాల అతనికి సేవలు చేసింది.

ఆ సమయంలో ఆ హిమాలయాల్లో కలిసి కట్టుగా రెండు పవిత్ర ఆత్మలకి ఆధ్యాత్మికతత్వం బోధపడింది. ఆయన యోగబాలకి సేవలు చేసి, రుణం తీర్చుకుందామని యోగబాలని ఒప్పించి ఇంటికి తీసుకొచ్చారు. యోగబాలకి భానోజీరావు భార్య, కోడలు కొడుకు స్వాగతం చెప్పారు.

ఆవిడ కొన్నాళ్ళుండి వెళ్ళిపోతుందనుకున్నారు. కానీ కొన్నాళ్ళకి ఇంటిలో ప్రతి విషయం యోగబాల అనుమతి లేందే చేయలేని స్థితికి భానోజీరావు, అది భరించలేని స్థితికి, ఇంట్లో వాళ్ళు చేరుకున్నారు. ఇంట్లో వాళ్ళు అనుకున్నట్టు కొన్నాళ్ళకి యోగబాల వెళ్ళలేదు కానీ, క్రమానుసారంగా భానోజీరావు భార్య పుట్టింటికి, కొడుకు అద్దెంటికి చేరుకున్నారు.

తత్వరూపంలో చెప్పాలంటే ఈ అధమ మానవుల నిష్క్రమణతో భానోజీరావుగారు ఇంటిని గుడిగా మార్చారు. ప్రతి ఆదివారం భజన ఏర్పాటు చేసి వారు తరిస్తున్నారు. భక్తులని తరింపచేస్తున్నారు. ముఖ్యంగా యోగబాల సలహాలేందే భానోజీరావుగారు ఏ పనీ చెయ్యరు. ఆమె ఆత్మ, వారు ప్రొఫెసరుగా మిగిలిపోవడం కొందరికి నచ్చింది. కొందరికి నచ్చలేదు.

కల్పన చెప్పిన యోగబాలకథ విచిత్రంగా అనిపించింది. కల్పన భజనకి వెళ్తుంది కాబట్టి కొట్టి పడెయ్యడానికి లేదు.

సాగర్ చేత దెబ్బలు తిన్న తర్వాత హాస్టలు నుండి వెళ్ళిపోతాడనుకున్న రంగనాధం వెళ్ళిపోలేదు. భజనకి తరచూ వెళ్తున్నాడు రంగనాధం రిసెర్చికి ఎష్టి చేసినట్లు రామ్మోహన్ యోగబాలకి, రంగనాధం ఎదురుగా చెప్పాడు. యోగబాల చిరునవ్వుతో భానోజీరావు గారిని చూసింది. ఆయన కళ్ళజోడు తీసి తుడుచుకుంటూ "అరె దాందేముంది చదువుకుంటానన్న వాడ్ని ప్రోత్సహించకపోతే ఎలా?" అన్నారు.

అందుకే రంగనాధం వెళ్ళలేదని చెప్పింది కల్పన.

●●●

ఆ రోజు సాయంకాలం నా జీవితంలో మరవలేని రోజని జీవితాన్నే మార్చేస్తుందని తెలుసుకోలేకపోయా. తెలుసుకుని చేసేదేం లేదు. భానోజీరావు యోగబాల కబుర్లు తెలుస్తాయని కల్పనతో కేంటిన్‌కి వెళ్ళా. కేంటిన్‌లో ఎక్కువమంది లేరు.

మూలగా కూర్చుని కాఫీ ఆర్డరిచ్చా కాఫీ వెంటనే రాలేదు. కల్పన యోగబాల, భజన అంటూ ఏవేవో సంగతులు చెబుతోంది. పెద్దగా ఇంట్రెష్టింగ్ గా అనిపించలేదు. ఆఖరికి వాళ్ళ లాబీ ఫ్రెండ్స్ గురించి చెప్పింది ఈ క్రిష్ణా డిస్ట్రిక్ట్ ఆడపిల్లల గురించి చెప్పింది. వాళ్ళ ఆరొగెన్స్ గురించి చెబుతోంది, తనూ వాళ్ళకేష్టే అయినా వాళ్ళు ప్రత్యేకంగా ఉంటారు అంటోంది. అది నాకూ తెలుసు. నా ఆలోచనల్లో నేనుండగా రామ్మోహన్ పార్థసారధి వాళ్ళ వెనగ్గా రంగనాధం మరి నలుగురు ఫ్రెండ్స్ కేంటినులోకి వచ్చారు.

నే కూర్చున్న టేబులుకి ఎదురుగా కూర్చున్నారు నన్ను చూడగానే రంగనాధం లేచి వెళ్ళబోయాడు. కానీ రామ్మోహన్ బలవంతంగా రంగనాధాన్ని కూర్చోబెట్టేసాడు.

అప్పుడే కల్పన డౌటు పడింది. అప్పుడు జాగ్రత్తపడివుంటే బావుండేది కానీ వోవర్ కాన్ఫిడెన్స్ వల్ల టేబుల్ దగ్గరనుంచి కదలలేదు. ఏం చేస్తారు కాస్త పాటలు పాడుకుంటారు జోకులేసుకుమారు కేరింతలు కొడ్తారు. నే స్పందించకుండా ఉంటే సరి అనుకున్నా.. కానీ మిత్రబృందానికి అది వినబడిపోయింది.

రామ్మోహన్ ఈ అవకాశం పోనివ్వకూడదు అనుకున్నాడేమో. కుర్చీలోంచి లేచి నా దగ్గరకి వచ్చి "ఎవరు ఈడియట్స్ డోన్ట్ లూజ్ యువర్ టంగ్! క్షమార్పణ చెప్పుకోకపోతే వ్యవహారం చాలా దూరం పోతుంది" అని బెదిరించాడు.

ఇన్నాళ్ళూ, అభిమన్యుడిలాంటి క్షీరసాగర్ అండదండలున్న నేను, మొదటిసారిగా యూనివర్శిటీ కాంపౌండులో భయపడ్డా. కానీ క్షమార్పణ చెప్పాలనిపించలేదు. లోపల బెదురుగా ఉన్న కాఫీ సిప్ చేస్తూ కూర్చున్నా.

రామ్మోహన్ ధైర్యం చేసి నన్ను ఎదిరించేసరికి, అతని మిత్రబృందం అంతా నా చుట్టూ చేరారు.

"ఏం క్షమార్పణ చెప్పవా?" అని అడిగాడు రామ్మోహను అసహనంగా.

లోపల బెరుగ్గా ఉన్న "చెప్పవలసిన అవసరం లేదు" అన్నా తిరస్కారంగా.

నా తిరస్కారం సహించలేకపోయాడు, రామ్మోహన్, చేతిలో వేడిగా ఉన్న ఎంగిలి కాఫీని నా భుజాల మీచి వొంపేబోయాడు. రామ్మోహన్ చేయబోయే పని చూచాయిగా గ్రహించా. చురుగ్గా కాఫీ కప్పుని చేత్తో పక్కకి తీసేయబోయా. కానీ నన్నే గమనిస్తున్న రామ్మోహన్ కాఫీ కప్పు మరింత దగ్గరగా తెచ్చాడు. దాంతో నా చేతికున్న రాజస్తానీ బాలాచూడీ కప్పుకి తగిలి బద్దలైపోయింది. వేడి వేడి కాఫీ ఒంటిమీద పడ్డంతో అసంకల్పితంగా పైకి లేచా.

రామ్మోహన్ చేతిలో ఉన్న విరిగిన కాఫీ కప్పుమొన నా భుజనికి దిగువగా చర్మాన్ని చీరుకుంటూ వెళ్ళి రొమ్ములో దిగబడింది. ఆ కప్పులో ఉన్న మిగిలిన కాఫీ రొమ్ముల నుండి జాకెట్టులోనికి కారిపోయింది.. ఆ అరక్షణంలో ఏం జరిగిందో? అంచనా వెయ్యలేకపోయాను. వేడి కాఫీకి చర్మం కాలి భరించరాని మంట పెట్టింది తీతువు పిట్టలా అరిచి, లేచి పైట తీసి వక్షం పట్టుకు ఏడ్చేసా!

కానీ మిత్రబృందంలో చలనం రాలేదు. "ఓహ్ వేడిగా ఉందా?" అంటూ ఇంకొకడు ఆ టేబులు మీదున్న ఎంగిలి గ్లాసులో నీళ్ళు, వక్షం మీంచి పోసేసాడు. అది చూసి ఇంకొకడు 'అవి చాలవురా' అంటూ ఇంకో గ్లాసు నీళ్ళు నెత్తిమీంచి పోసేసాడు. అది చూసి బెంబేలెత్తిపోయి వెళ్ళిపోడానికి అడుగు ముందుకి వేసా. కానీ రామ్మోహన్ అడ్డగించాడు. 'ఎక్కడికి పోయేది, క్షమార్పణ చెప్పు, ' అంటు తోసేసాడు. దీన్ని ఊహించక పట్టుతిప్పి పడిపోయా. పడేటప్పుడు టేబులు అంచుమీద పడి, కుర్చీకి టేబులుకి మధ్యగా పడిపోయా.

ఈ పరిస్థితి నుండి తప్పించుకోడం ఎలా? ఏ జరుగుతోంది. మనసులో ఏదో తెలియని భయం, ఈ పరిస్థితికి ఎవరు కారణం తనేనా? సింపుల్‌గా సారీ చెపితే సరిపోయేదా? మనసంతా బెదిరిపోయింది. అప్పటికే జరుగుతున్నది గమనిస్తున్న కల్పన తప్పుకుని వెళ్ళిపోయింది. మిత్రబృందం మాత్రం నన్ను చుట్టేవున్నారు. నేను క్రిందనుండి లేవడానికి కూడా ప్రయత్నించలేదు. వక్షం చిట్లి, చర్మం కాలి, మండుతున్నాయి. భయం హద్దులు దాటింది. నిస్సహాయతకి ఏడుపొచ్చేసింది, నేలమీదే ఉండిపోయా, సారీ చెప్పకూడదని కాదు ఎందుకు చెప్పాలనే పంతం కాదు. మనసు మొద్దు బారిపోయింది అంతే!

●●●

**సాగర్ కేంటిన్‌లోకి వచ్చాడు.** చూసిన మిత్రబృందంలో వాడు రామ్మోహన్‌కి సైగ చేసాడు. సాగర్ కేంటిన్‌లోకి రాగానే వీళ్ళవేపు వచ్చాడు. అతని నడక, అతని మొహంలో గంభీరత, అతని పక్కల నడిచే ఫ్రెండ్స్‌ని బట్టి, ఇక్కడి విషయం అతనికి తెలిసే ఉంటుంది. రామ్మోహన్ బింకంగా అక్కడినుంచి కదలలేదు.

కానీ సాగర్ వెర్రి తెగింపు, సంగతి అతనికి తెలుసు. తను తప్పుకోడానికి వీలుగాలేదు. అయినా ఎక్కడికి తప్పుకుంటుంది. ఈ సాగర్లు... కల్పనలు... సేదతీర్చలేని అవమానం పాలయింది. తాత్కాలిక సాయంకూడా లేకుండా కల్పన అలా ఎందుకు వెళ్ళిపోయింది? కల్పన, మణి ఎవ్వరూ లేరు. కల్పన ఎందుకు అలా వెళ్ళిపోయింది. కల్పనకి ధైర్యం ఎక్కువే అయినా వదిలేసి వెళ్ళిపోయింది? సాగర్ రాకతో తనని మర్చిపోయారు మిత్రబృందం వారిద్దరి శత్రుత్వానికి తను బలైపోయింది. శత్రుత్వం వాళ్ళది. అవమానం నాది.

సాగర్ అంటే రామ్మోహన్‌కి చిన్న జడుపు వుంది. "సారీ సాగర్ ఇలా జరుగుతుందని అనుకోలేదు. జాహ్నవి నోరు పారేసుకుంది" అంటూ ఏదో చెప్తున్నాడు సాగర్‌ని ఒడుపుగా దెబ్బతీయాలే తప్ప, ఎదురుపడి దెబ్బతీయడం మంచిది కాదని అతని తెల్సు. అదీకాక కేంటిన్‌లో దెబ్బలాడుకుంటే అది యూనివర్శిటీ అథారిటీ దగ్గరకి వెళ్ళిపోతుంది. ఇవన్నీ ఆలోచించి రామ్మోహన్ సాగర్ ముందుకు వచ్చి నిలబడ్డాడు.

"ఇక్కడ కేంటిన్‌లో ఏ గొడవ జరిగినా యూనివర్శిటీ అథారిటీకి తెలిసిపోతుంది. మనతో పాటు ఇక్కడే ఉన్న జాహ్నవిని కూడా గొడవలోకి ఈడ్చినవారం అవుతాం. అలా ప్లే గ్రౌండులోకి వెళ్ళి మాట్లాడుకుందాం. జరిగింది చెప్తాను." అన్నాడు. అందరూ ముగి ఉండడం వల్ల వీళ్ళేం అల్లరి పెట్టారో తెలియలేదు సాగర్‌కి.

కానీ రామ్మోహన్‌ని వదిలేయడం కూడా ఇష్టం లేదు అందుకే పక్కనున్న ఫ్రెండ్స్‌తో జాహ్నవిని చూడమని చెప్పి, రామ్మోహన్ వెనకే ప్లేగ్రౌండులోకి వెళ్ళారు సాగర్ అతని ఫ్రెండ్స్.

కల్పన, మణి మరి నలుగురు ఫ్రెండ్స్ మిత్రబృందాన్ని తప్పించి నా దగ్గరకి వచ్చారు నన్ను లేపి నిలబెట్టారు. ఏది ముఖ్యం తనా! ప్రత్యర్థా! ప్రత్యర్థే ముఖ్యం. సాగర్ మొగతనానికి మాత్రం మచ్చ రాకూడదు మేల్ ఇగో అంటుంది కల్పన. అందుకే సాయం కోసం వచ్చిన సాగర్ ఫ్రెండ్స్‌ని మీరూ వాడి వెనకాలే పొండి అంటూ విసుక్కుంది. వాళ్ళు వెళ్ళిపోయాక ఇప్పుడు వాళ్ళిద్దరూ వాళ్ళది కాని విషయం కోసం కొట్టుకు చస్తారు అంది కసిగా. అది నిజమే సాగర్‌లో రాక్షసుడున్నాడు తనకి తెలుసు.

ఆలోచనల్ని భంగపరుస్తూ "హాస్టలుకా? ఇంటికా?" అంది కల్పన. ఆలోచించా ఈ అవమానంతో హాస్టలుకి వెళ్ళదల్చుకోలేదు. "ఇంటికే" అన్నా కానీ ఇంటికి వెళ్ళినా పరిస్థితి భిన్నంగా ఏం లేదు.

అమ్మ రుసరుసలు "ఆడదానికి ఈ ఆగడం పనికి రాదు. ఇల్లంటూ ఉండగా హాస్టలెందుకు?" అంటూ నాన్న నన్ను గారాం చేసారని నాన్నని తప్పు పట్టింది. వీటికి తోడు గుండెల దగ్గర మంట. జాకెట్టు వేసుకుంటే మంట. చర్మం కాలుతున్న మంట. జాకెట్టు వెయ్యకుండా వదిలి పైట నిండా కప్పుకోవలసి వచ్చింది.

అన్నయ్యగానీ, నాన్నగానీ నా దరిదాపులకి రాలేదు. చూడ్లేదు. చూసే చోటు కాదది. చిన్నా రెండు రోజులు నన్ను డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళడం డ్రెస్సింగ్ చేయించడం వాడే చేసాడు. వాడితోనే కాస్త ఫ్రీగా ఉన్నా.

రెండురోజుల తర్వాత మణి, కల్పన వచ్చారు. జరిగిన విషయం చెప్పారు. జరిగిన కొట్లాట తెలిసాక, సాగర్ మీద జాలేసింది.

●●●

సాగర్ రౌడీకాదు. అత్యాచారాన్ని భరించలేడు. అతనిలో తెలివి, సాహసం, అనే ఎలిమెంట్సు రెండూ ఉన్నాయి. ఒకసారి వాటి అవసరం వచ్చింది. అప్పుడు వాటిని ప్రదర్శించాడు. విద్యార్థి నాయకుడు అయిపోయాడు.

విద్యార్థులకి సహజ ఆభరణం అల్లరి, అదీచేసి, లేనిపోని సమస్యలు తెచ్చుకుంటారు. సమస్య పరిష్కరించేందుకు నాయకత్వం అవసరం, ఆ నాయకత్వం విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించి వాళ్ళని నాయకులుగా తయారుచేస్తుంది. ఎప్పటిలానే సినిమాహాల్లో అల్లరి చేసారని, విద్యార్థుల్ని సినిమా యాజమాన్యం స్టాఫూ కొట్టారు. తన్నులు తిన్న విద్యార్థులు హాస్టలు చేరుకున్నారు. హాస్టల్లో ఈ విషయం తెలిసి విధార్థులకి కోపం వచ్చేసరికి మెస్ టైం అయిపోయిద్ని. మెస్ కంప్లీట్ చేసి రెండు వందల మంది విద్యార్థులు, దెబ్బలాటకి కావలసిన సరంజామాతో సినిమాహాలు చేరుకున్నారు.

వీళ్ళు అక్కడికి చేరుకునే సరికి, రాత్రి పది అయింది. సెకండ్ షో సినిమా మొదలయింది. హాలు బయట గేట్లు మూసి వున్నాయి. అది ఎవరూ గుర్తించలేదు. అందరూ హాల్లో ప్రవేశించారు, యాజమాన్యం కోసం వాళ్ళుండే ఆఫీసు వేపు దూసుకు పోయారు. ఆ సమయంలో ఎవరో హాలు గేట్లు మూసేసారు. హాలు ఆవరణలో కరెంట్ పోయింది.

విద్యార్థులకి ఏం జరుగుతోందో అర్థం అయేసరికి, రెండో మూడో సోడాబుడ్లు పేలాయి. విద్యార్థులు దాడిచేస్తారని ముందే ఊహించిన యాజమాన్యం లోకల్ రౌడీలను నియమించి, విద్యార్థులపై తిరుగుదాడి చేయించిందని విద్యార్థులు గ్రహించేసరికి, రౌడీల వీరవిహారం సగం అయిపోయింది. విద్యార్థులు వాళ్ళలో వాళ్ళే తొక్కిసలాడుకున్నారు. ఆ విద్యార్థుల్లో సాగర్ ఉన్నాడు, జరిగిందేమిటో సాగర్‌కి అర్థం అయిపోయింది. దెబ్బలు తింటున్న విద్యార్థుల్ని కాపాడాలి అంటే ఏం చెయ్యాలి? అన్నది వాడి ఆలోచన.

కేబిన్‌లోకి వెళ్ళి సినిమా ఆపేస్తే, ప్రేక్షకులకి ఇక్కడ గొడవ వినబడుతుంది అప్పుడు సినిమా చూస్తున్న జనం తలుపులు తీసుకుని బైటకి వస్తారు. హాలువాడు ఏర్పరచిన రౌడీల పట్టూ తగ్గుతుంది. వచ్చిన ఆలోచన్ని మెరుపులా అమలు చేసాడు. సాగర్ కేబిన్

వేపు పరుగుతీసాడు. అతను కేబిన్ మెట్లు ఎక్కుతుండగా, కేబిన్ కాపలా కాస్తున్న రౌడీలు సాగర్‌ని అటకాయించారు. రౌడీల చేతుల్లో సైకిల్ చెయిన్స్ ఉన్నాయి.

సాగర్ వాళ్ళని తప్పించుకోడానికి హాలువేపు దూకి, కేంటిన్ వేపు పరిగెట్టాడు. రౌడీలు గాభరాపడ్డారు. సాగర్ పార్కింగ్ స్పేసు వేపు గెంతి ఉంటే పర్వాలేదు, హాలు వేపు దూకాడు. కేబిన్ కాపలా కాస్తున్న రౌడీల్లో ఇద్దరు, మెట్లు దిగి సాగర్ వెనగ్గా పరిగెట్టారు. సాగర్ అనుకున్నట్టుగా అక్కడ పవర్ రూము కనబడలేదు. రౌడీల అడుగుల చప్పుడు విని, సాగర్ కేంటిన్ పక్కనే ఉన్న మేనేజరు రూములో దూరాడు. అప్పుడు చూసారు రౌడీలు సాగర్‌ని.

సాగర్ మేనేజర్ రూము తలుపులు వేసే టైము లేదని గ్రహించి, రూములోపల చీకట్లోకి మాయమైపోయాడు. రౌడీలు మేనేజర్ రూములోకి వచ్చి తలుపులు లోపల నుండి గడియపెట్టారు. రూములో చీకటీ గాఢాంధకారంగా ఉంది. రెండు నిముషాల తర్వాత సాగర్‌కి చీకటి అలవాటయింది. ఒక రౌడీ తలుపు దగ్గర నిలబడ్డాడు. ఇంకొకడు గదిలో వెతుకుతున్నాడు. వెతుకుతున్న రౌడీ మేనేజర్ టేబులు దగ్గరకి వెళ్ళి టేబులు క్రింద చూడటానికి వంగాడు. అతని బుర్రమీదుగా ఇనుప తీగల చెత్తబుట్ట దిగిపోయింది. అందులోంచి బయటకి వచ్చిన ఇనుపతీగలు ఆ రౌడీ మెడలో దిగబడ్డాయి.

వాడు అరిచిన వెర్రి అరుపుకి గది దద్దరిల్లిపోయింది. సాగర్ టేబులు క్రిందవున్నాడని తెలియగానే రెండో రౌడీ తలుపు పక్కనే ఉన్న స్విచ్ వేసాడు. గదంతా వెలుగుతో నిండిపోయింది. లైటు రాగానే మేనేజర్ టేబుల్‌కి కనెక్ట్ చేయబడి ఉన్న రెండు వైర్లు కనబడ్డాయి. ఆ వైరు లాంగ్ బెల్‌ది అని తెలుస్తోంది. ఆ బెల్ బటన్ నొక్కాడు సాగర్, పెద్దగా బయట లాంగ్ బెల్ మోగింది.

మేనేజర్ రూము పక్కగా, బేస్ మెంటులో పవరు రూము ఉంది అది పవర్ రూము అన్న విషయం దాని తలుపుపై రాసి ఉంది. తలుపు మీద డేంజర్ గుర్తుగా ఎముకలూ పుర్రె ఉన్నాయి. అతను అటు వేపు అడుగు వేయగానే, రౌడీ వచ్చి చెయిన్‌తో కొట్టాడు. అది తట్టుకుని పవర్ రూము వేపు పరిగెత్తుకెళ్ళి, మెట్లు దిగి మెయిన్ స్విచ్ నాబ్ క్రిందకి లాగేసాడు. ఒక ఫేజ్ పోవడంతో సినిమా ఆగిపోయింది. మేనేజరు రూములో లైటు ఆరిపోయింది. అప్పటికే వెనగ్గా వచ్చిన రౌడీ చెయిన్‌తో కొట్టాడు. అది తట్టుకుని పవర్ రూము వేపు పరుగెత్తుకెళ్ళి, మెట్లు దిగి మెయిన్ స్విచ్ నాబ్ క్రిందకి లాగేసాడు. అప్పటికే వెనగ్గా వచ్చిన రౌడీ చెయిన్‌తో ఇంకో దెబ్బవేసాడు. రౌడీ తేరుకుని చెయిన్ ఎత్తేలోగా అతన్ని ఒక్క తోపు తోసి మేనేజర్ రూములోకి పరిగెత్తుకు వచ్చేసాడు సాగర్. కానీ వెనకాలే రౌడీ కూడా పరిగెత్తుకొచ్చి చీకట్లో సాగర్ ఉన్న వేపు చూసి బలంగా చైన్‌తో కొట్టాడు. ఆ చీకట్లో రౌడీ కొట్టిన దెబ్బ సాగర్ తలమీద బలంగా తగిలింది. స్పృహ తప్పిపడిపోయాడు సాగర్.

ఆడుతున్న సినిమా ఆగిపోయేసరికి, జనంకి, బయట గోల వినిపించింది. గేట్లు తీసుకుని బయటకి వచ్చారు. రౌడీలకి జనం ఎవరో విద్యార్థులు ఎవరో తెలియలేదు.

విద్యార్థులు మెయిన్ గేటు తీసుకుని పారిపోయారు. అలా వెళ్ళిన వాళ్ళు పోలీసుల్ని తీసుకొచ్చారు. పోలీసులు ఫోను కోసం మేనేజరు రూములోకి వెళ్ళేసరికి అక్కడ ఒక రౌడీ, సాగర్ స్పృహ తప్పిపోయి కనిపించారు. ఆనాటి నుండి సాగర్ ఆ హాస్టల్లో, యూనివర్శిటీలో హీరో అయిపోయాడు. అలాంటి సాగర్‌తో తలపడ్డాడు రామ్మోహన్.

●●●

ఆ సమయంలో ప్లేగ్రౌండు నిర్మానుష్యంగా ఉంటుంది. దూరంగా హాస్టలు దీపాలు మిణుకు మిణుకు మంటూ కొంచెంగా కాంతిని ప్లేగ్రౌండులోకి ప్రసరిస్తున్నాయి. ప్లేగ్రౌండులోకి వెళ్ళి "ఊ చెప్పు" అన్నాడు సాగర్. రామ్మోహన్ అప్పటికే ఏం చెప్పాలా? అని ఆలోచించిపెట్టుకున్నాడు.

"సాగర్ నీకూ రంగనాథానికి మధ్య ఏం జరిగిందో మాకు తెలీదు. కానీ రంగనాథాన్ని నీ ఫ్రెండ్ కొట్టడం వలన రంగనాథం జాహ్నవి మీద కచ్చపెట్టుకున్నాడు. ఈ రోజు రంగనాథానికి కేంటిన్లో జాహ్నవి కనపడింది. జాహ్నవి రంగనాథాన్ని చూసి వెక్కిరింపుగా నవ్వింది. అప్పుడే మేం అక్కడికి వెళ్ళాం. రంగనాథం జాహ్నవి గురించి మాకు చెప్పాడు. దానికి మా ఫ్రెండ్స్లో ఒకడు సరదాగా, "జాహ్నవి ప్రెసిడెంటుగారి తాలూకారోయ్" అన్నాడు. అదే మా తప్పు, జాహ్నవి మమ్మల్నందర్నీ "ఈడియట్స్" అని తిట్టింది. అప్పుడు నేను కలగచేసుకుని "అలా జనరలైజ్ చేయద్దని, గొడవ అవుతుం. కేంటిన్ నుండీ వెళ్ళిపొమ్మని చెప్పాను. జాహ్నవి వినలేదు. లేకపోతే క్షమార్పణ చెప్పుకోమని, ఇంక ఎవరూ ఆమె గురించి ఏ విషయం ఎత్తరు. అని చెప్పాను. జాహ్నవి "నువ్వెవరు నన్ను క్షమార్పణ చెప్పమనడానికి" అంది.

ఆ క్షణంలో నాకు కోపం వచ్చి ఆమెను క్షమార్పణ చెప్పుకోమని నిలదీసాను. ఈలోగా నువ్వు వచ్చావు అన్నాడు.

రామ్మోహన్ చెప్పింది నిజం అని రామ్మోహను మిత్రబృందం, అబద్ధమని సాగర్ మిత్రబృందం వాదించుకున్నారు. ఆ గందరగోళంలో నాకు తోడుగా ఉండిన సాగర్ ఫ్రెండు వెళ్ళడం, సాగర్ని పక్కకి తీసుకెళ్ళి ఏదో చెప్పడం ఎవరూ పట్టించుకోలేదు. పదినిముషాల తర్వాత సాగర్ వచ్చి రామ్మోహన్ ఫిల్ట్ పట్టుకుని దవడ మీద కొట్టేసరికి, అందరూ విస్తుపోయారు.

సాగర్ కోపంగా "నువ్వు చెప్పినదంతా అబద్ధం. ఎవడి చెవిలో పువ్వు పెడదామనుకుంటున్నావు?" అన్నాడు.

దాంతో రామ్మోహన్, సాగర్కి నిజం తెలిసిపోయింది, ఇంక తర్కవితర్కాలతో పనిలేదని అర్థం అయిపోయింది. సాగర్ని వెనక్కి తోసి తన ఫిల్ట్ విడిపించుకుని, సాగర్తో కలబడ్డాడు. దాంతో సాగర్ ఫ్రెండ్స్, రామ్మోహన్ మిత్రబృందం ముందే తయారుగా ఉండడం వలన, సంఖ్యలో కూడా ఎక్కువగా ఉండడం వలన అందరూ సాగర్ మీదపడి, తీవ్రంగా కొట్టారు. సాగర్ స్పృహ తప్పి పడిపోయాడు. సాగర్ ఫ్రెండ్స్ నుండి ఏ విధమైన ప్రతిక్రియలేకపోయేసరికి రామ్మోహన్ మిత్రబృందం కేరింతలు కొడుతూ ప్లే గ్రౌండునుండి నిష్క్రమించారు.

●●●

అవమానం మొగాడికి జరిగినా, ఆడదానికి జరిగినా ఒకటే అనలేం. రెండింటికీ తేడా ఉంది. ఆ తేడా కుటుంబంలో ప్రతిధ్వనిస్తుంది. కుటుంబ సభ్యుల్లో ప్రతిబింబిస్తుంది. నా విషయంలో అదే జరిగింది. తగిలిన గాయానికి మందు రాసినప్పుడల్లా నేను ఎంత గిలగిల్లాడేదాన్నో, నన్ను చూసినప్పుడల్లా నాన్న మనసు అంత విలవిల్లాడేది. ఇంట్లో ఉన్న ఇద్దరు ఆడపిల్లల్లో నేనంటేనే నాన్నకి ఇష్టం. అక్క రజని, స్వేచ్ఛ ఉన్నా తీసుకునేది కాదు. కట్టుబాటు ఏర్పరచుకుని మసలుకునేది. తల్లి మెప్పుపొందేది.

నేను అలాకాదు, అందం, దానికి తగ్గట్టుగా స్వతంత్రాలోచన, అందర్నీ ఆకర్షించే బాడీ లాంగ్వేజీ ఇవన్నీ నన్ను రజనీ కన్నా ఓ మెట్టు పైనుంచేవి. అందుకే తండ్రి ప్రోత్సహించేవాడు. ఆ ప్రోత్సాహాన్ని మిస్ అయ్యేదాన్ని కాదు.

కాలేజీలో చేరి ఇంట్లో చదువు అవడం లేదని హాస్టల్లో చేరినా, క్షీరసాగర్ని తీసుకొచ్చి పరిచయం చేసినా ఆయన అండదండలతోనే. క్షీరసాగర్ ప్రెసిడెంట్గా గెలిచాడని చెపితే, అదంతా తన కూతురి కంట్రిబ్యూషనే అని తెలుసుకుని నాన్న మురిసిపోయారు కూడా.

అలాంటి కూతురికి అనుకోని అవమానం జరగడం, దాన్నెలా జీర్ణించుకోవాలో అర్థం కాలేదు కూడా. అదే కొడుకైతే శాంతవచనాలతో పరిస్థితి సర్దుకుంటుంది. ఇంటివాతావరణంలో పెద్ద తేడా కనిపించదు. అది కూతురి విషయంలో అలాకాదు.

అవమానం జరిగిన రోజు ఇల్లు చేరుకున్నా, రెండో రోజు చిన్నా వెళ్ళి హాస్టలు ఖాళీ చేసి అన్ని వస్తువులూ తీసుకొచ్చాడు.

కాలేజీ మానేసా. చదువాగిపోయింది. తల్లి చివాట్లు. నా స్వేచ్ఛని ఆవిడ నిలదీసి తప్పుగా ఎత్తి చూపడాన్ని ఎవరూ ప్రతిఘటించలేదు. నాన్న అమ్మని సమర్థిస్తూ తప్పుచేసానని పశ్చాత్తాపపడుతున్నారా? అన్నట్టు మొహం చాటేసారు.

ఎంతయినా ఆడది ఆడదే ఏవో కనిపించని శృంఖలాలున్నాయి.. రోజులు మారాయి, కానీ విలువలు మారలేదు. అన్న అనుమానం జరిగిన అవమానంతో కాక, కుటుంబ సభ్యుల ప్రవర్తనతో ధ్రువపడింది.

ఈ సంఘటనకి ముందు నాకు నాన్నలో స్నేహితుడు కనిపించేవాడు. ఇప్పుడు స్పష్టంగా మొగాడు కనిపిస్తున్నాడు. మొగ తండ్రి కనిపిస్తున్నాడు. స్త్రీ అవడమే ఈ అనుమానాలకి మూలం. మరొకటి లేదు. ఆడదానికి స్వేచ్ఛ ఇవ్వడం తను చేసిన మొదటి తప్పు. అన్నట్టుగా ఉంది నాన్న ప్రవర్తన.

అప్పుడే నాకనిపించింది. ఎవరో దానం చేసిన స్వేచ్ఛని నే అనుభవించానా? ఇన్నాళ్ళూ నేననుభవించింది స్వేచ్ఛా? జరిగిన అవమానంతో కల్లోలంగా ఉన్న మనసు తండ్రి, తల్లి చెప్పుకునే లోకం తీరు కబుర్లు కోపాన్ని తెప్పించేవి కానీ ఈ కోపం ఎలా తీరుతుంది. ఏం చేసి కోపాన్ని చల్లార్చగలదు. ఆ కోపాన్ని బయటపెట్టగల అధికారం, స్వేచ్ఛా కోల్పోయినట్టనిపించింది. నన్నెవరో కుందించేసినట్టు ఫీలయా. ఒకటే అర్ధం చేసుకున్నా. జీవితం వెనుకటిలా ఉండదు. మరెలా ఉంటుంది. సాగర్ ఏమనుకుంటున్నాడు. సాగర్ వస్తే తండ్రి, తల్లి సహించరు. నా చదువాపేస్తానని తండ్రి నిర్మొహమాటంగా చెప్పాడు. ఇంకో నాలుగు నెలల్లో డిగ్రీ చేతికొచ్చును. కానీ ఇప్పుడది కష్టం.

ఈ కష్టాలన్నింటికీ సమాధానం సాగర్ ఒక్కడే సాగర్ చదువు పూర్తయితే ఏం చేస్తాడో చూడాలి. దూరంగా ఎక్కడో సాగర్ ఆశాదీపంలా కనిపించాడు. వాడే నాకున్న ఛాయిస్. కానీ సాలెగూడులో శలభంలా చిక్కుకుంటాడని ఊహించలేకపోయా. ఆ సాలీడు జానకీబాయి.

●●●

జానకీబాయి ఎకనమిక్స్ లెక్చరర్. పేరుకి తగ్గట్టు మొగుడంటే ప్రేమ, భక్తి ఉన్నాయి. వాటితో పాటు మొగుడ్ని తనమాట జవదాటకుండా చూసుకోగల దిట్టతనం కూడా ఉంది. అఫ్‌కోర్స్ దిట్టతనం నిరూపించుకోడానికి బంగారు లేడిని తెమ్మని, ఎప్పుడూ అడగలేదు. ఎందుకంటే ఆవిడే ఒక బంగారు లేడి. ఆవిడకి పట్టణంలో ఉన్న అనేక విద్యాసంస్థల్లో, సాంస్కృతిక సంస్థల్లో, ఏదో ఒక పోర్టుఫోలియో ఉంది.

జానకీబాయి లెక్చరుకన్నా జానకీబాయే బెటరు. అందుకే ఆమెని "జానీ" అని "జాంపండు" అని ముద్దుగా పేరు పెట్టి పిలుచుకుంటారు. అమెరికా ప్రెసిడెంట్‌కేనా చేతకాని పని ఉంటుందేమో కానీ, ఆమెకి చేతకాని పని అంటూ లేదు. జానకీబాయికి ఇష్టంలేని పోర్టుఫోలియో ఒకటి ఉంది. అది భానోజీరావుగారి కోడలు అవడం.

ఆమే సాగర్ గదిముందు ప్రత్యక్షం అయింది. సాగర్ ఆశ్చర్యపోయాడు. జానకీబాయి సాగర్‌ని ఆప్యాయంగా పలకరించింది. సాగర్ ఫ్రెండ్స్ చెప్పిన కథంతా వింది. సానుభూతి కొంచెం ఒలకపోసింది. లేచి వెళ్ళబోతూ "రామ్మోహన్ సంస్కారం ఇందులో ఉంది. తెరిచి చూడు. ఒంట్లో నెమ్మదించాక, జాహ్నవిని తీసుకుని మా ఇంటికిరా" అని ఒక కవరు అందించింది.

జానకీబాయి వెళ్ళిపోగానే మిత్రులు కవరు విప్పి చూసారు. అందులో ఫోటోలు ఉన్నాయి. ఆ ఫోటోల్లో జాహ్నవి బొమ్మ గీసి ఆమె వక్షంపై పెద్ద మచ్చ వేసి "పుష్టులేడీ పాలకాఫీ" అని రాసుంది. అలాంటివే రంగనాథం జాహ్నవిపైనా, క్షీరసాగర్, జాహ్నవిపైనా రాసిన స్లోగన్లతో అసభ్యంగా గోడపైన రాసిన రాతలు ఉన్నాయి.

క్షీరసాగర్ ఫోటోలన్నీ చూసి, "నిజమేనా" అని అడిగారు. "నిజమే" అని ఒప్పుకున్నారు స్నేహితులు. దెబ్బలాటయిన దగ్గరనుంచి బయటికి పోలేదు సాగర్. స్నేహితులు రోజూ ఈ రాతలు చూస్తున్నా, సాగర్‌తో చెపితే మళ్ళీ దెబ్బలాట అవడమే కానీ, జాహ్నవికి జరిగిన అవమానాన్ని సరిదిద్దలేం కదా అని సాగర్‌తో చెప్పలేదు.

"జాహ్నవి కాలేజీకి వస్తోందా?" అని అడిగాడు సాగర్.

"లేదు ఈ ఏడాది చదువు ఆపేస్తుందేమో?" అన్న అనుమానాన్ని వ్యక్తం చేసాడొక మిత్రుడు.

"నీకెలా తెలుసు? " సాగర్ ప్రశ్నకి.

"మణి జాహ్నవి ఇంటికి వెళ్ళింది. ఆమె చెప్పింది." అన్నాడా మిత్రుడు.

నేను చదువు ఆపేస్తున్నానని దానికి కారణం రామ్మోహన్ దుష్ప్రచారం అని వాళ్ళు అనుకున్నారు, ప్రతీకారవాంఛతో కుతకుతలాడిపోయారు.

●●●

సాగర్ పూర్తిగా కోలుకునే సరికి పదిరోజులుపైగా పట్టింది. పూర్తిగా కోలుకున్నాక సాగర్ ఫ్రెండ్స్‌తో జానకీబాయిని కలుసుకున్నాడు. అదేవాడు చేసిన తప్పు.

జానకీబాయి, నా విషయం అడిగింది. నేను ఈ ఏడాది పరీక్షలు రాయకపోవచ్చని చెప్పాడు. ఇంతవరకూ వాడూ నన్ను కలుసుకోలేదు. కల్పన, మణి చేర్చే సమాచారం ఇద్దరి మధ్య కమ్యూనికేషన్.

సాగర్ నా గురించి మాట్లాడుతున్నంతసేపు మౌనంగా ఉండి సాంతంగా వింది. జానకీబాయికి తెలుసు. నా పేరు సాగర్ మీద ఎంత ప్రభావం చూపుతుందో? సాగర్ మాటల్లో ఆమెకి నచ్చే అంశం ఒక్కటీలేదు. సాగర్ ఎంతసేపు రామ్మోహన్‌నే తన శత్రువుగా చూస్తున్నాడు. అంతకు మించి ఆలోచించడంలేదు. జానకీబాయికి కావలసింది అదికాదు, అది పసికట్టింది కల్పన. సాగర్‌తో చెప్పి హెచ్చరించినా లాభం లేకపోయింది.

ఆమెకి రామ్మోహన్ కార్యకలాపాల్లో ఎటువంటి ఇంట్రస్టు లేదు రామ్మోహన్ అంకెల్లో జీరోలాంటివాడు. అందుకే సాగర్‌ని తనకి కావలసిన దారిలోకి మళ్ళించాలని అనుకుంది. దానికి నాందీ ప్రస్తావన ఆరోజే చేసింది.

"చూడు సాగర్! రామ్మోహన్ జాహ్నవిని చాలా తెలివిగా ప్రీప్లాన్డ్‌గా అవమానం చేసాడు. నా ఉద్దేశంలో ఇంత తెలివితేటలు రామ్మోహన్‌కి ఉన్నాయి అని అనుకోను. ఈ రకం ఆలోచనలకన్నింటికీ మూల స్థానం భానోజీరావు ఇల్లు. ఆ ఇంటిలో భజన పేరుతో జరిగే సమావేశాలు, విద్యార్థుల్లో ఉన్న చిన్న చిన్న తేడాలను వికృత రూపంలో విశ్లేషించి చెప్పే గురుకులం భానోజీరావు ఇల్లు. ఈ విద్యార్థులు, రామ్మోహన్ అక్కడ జరిగే ప్లానింగ్‌ని అమలు జరపగల, పనిముట్టు మాత్రమే!"

జానకీబాయి చుక్కాని పట్టుకున్నది మొదలు, ప్రతీకారం ఎలా చేయాలా? అన్న విషయమై సాగర్ రూములోనో జానకీబాయి ఇంటిలోనో సమావేశాలు, మంత్రాంగం జరుగుతున్నాయి. కల్పన చెబుతున్న విషయాలు నాలో గుబులు పుట్టించాయి.

కానీ సాగర్ ఆలోచనల ప్రకారం ఇటువంటి గొడవచేస్తే, జానకీబాయి లాభపడేది ఎక్కువ. అయినా ప్రొఫెసర్ విషయంలో జోక్యం చేసుకోవడం మంచిదికాదు. అనిపించింది.

ఆ అనుమానాన్ని ఒక రోజు బయటపెట్టాడు సాగర్ "ప్రొఫెసర్‌గారిని గొడవల్లోకి ఈడ్వడం బావుండదేమో" అన్నాడు.

"ప్రొఫెసరుగారిని గొడవల్లోకి ఈడ్వమని ఎవరన్నారు. యూనివర్శిటీ విషయాల్లో జోక్యం చేసుకుంటూ యూనివర్శిటీ విద్యార్థుల ఐక్యమత్యాన్ని చెడగొడుతున్న, యోగబాల మీద కదా మన గురి. అక్కడ జరుగుతున్న భజన నాటకం చెడగొట్టు. యోగబాలని యూనివర్శిటీ విషయాల్లో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించు. సమావేశాలు ఆగిపోతాయి. ఆ దెబ్బతో రామ్మోహన్ని మొదలంటా నరికేసినట్టే" అంది.

జానకీబాయి చెప్పిన విషయాలు సాగర్ బుర్రకి ఎక్కేసరికి, యూనివర్శిటీకి, సంక్రాంతి శలవులు సమీపించాయి. "శలవులు అయిపోయేవరకూ ఆగు" అంటూ సలహా ఇచ్చింది జానకీబాయి సాగర్‌కి.

●●●

శలవలు పూర్తయ్యాయి. విద్యార్థులు, విద్యార్థినులు కాలేజీలకు చేరుకున్నారు.

ఈసారి గోడలు కూడా స్టూడెంట్స్‌ని పలకరించాయి. రెడ్ ఆక్సైడు, రాబిన్ బ్లూతో రాసిన రాతలు విద్యార్థులని నిలబడి చదివింపచేసాయి.

"ప్రొఫెసర్లూ మీరు ముసలివాళ్ళైపోతున్నారు. మీ భావాలు కూడా ముసలివైపోతున్నాయి. "ఈ ప్రపంచం "మాయ" అనుకునే బాబాల శిష్యులకి ఇంకా ఈ ప్రొఫెసరు ఉద్యోగం" ఎందుకో

"సెక్స్ యోగం"

గోడల్ని అలంకరించిన అక్షరాలన్నీ అర్థం చేసుకునే సరికి రామ్మోహన్‌కి చాలాకాలం పట్టింది. అప్పటికే పరిస్థితి చెయ్యిదాటిపోయింది.

ఎవరో స్టూడెంట్‌కి పి.హెచ్.డి ఇవ్వడానికి ఒక ప్రొఫెసరు యోగబాల నిర్మిస్తున్న ఆశ్రమానికి విరాళంగా పదివేలు డొనేషను ఇవ్వాలనే షరతు పెట్టాడు అనే విషయం గుసగుసగా, మొదలై బుసబుసగా పొంగింది.

రెండు వందల మంది విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో అవినీతిని నిర్మూలించాలి, అంటూ వైస్ ఛాన్సలర్ ఆఫీసు ముందు ధర్నాచేసారు. తర్వాత ఊరేగింపు జరిగింది. యూనివర్శిటీలో అవినీతిని ఖండిస్తూ విద్యార్థులు క్లాసులకి హాజరు కావడం మానేసారు.

ఆ సమయంలో రంగనాథంకి యూనివర్శిటీలో టీచింగ్ అసిస్టెంటుగా అపాయింట్ అయ్యాడు. అది క్షీరసాగర్ గ్రూపులో విద్యార్థులకి రోషాన్ని, మొత్తం విద్యార్థిలోకంలో అగ్నికి వాయువుని తోడుచేసినట్టయింది. దానితో సాగర్ చేద్దామనుకుంటున్న పని తేలిక అయింది. "ఇదే మంచి అదను" అంటూ జానకీబాయి పచ్చజెండా ఊపేసింది.

●●●

**ఆ రోజు సాయంత్రం**

భానోజీరావుగారింట్లో భజన కార్యక్రమం నిరాటంకంగా జరిగిపోతోంది. భజనలో ఇరవైమందిదాకా విద్యార్థులు, తదితరులు, ఇద్దరు ముగ్గురు ప్రొఫెసర్లు ఉన్నారు. ఆ సమయంలో భానోజీరావు ఇంటి ముందు దాదాపు రెండు వందలకి పైగా, విద్యార్థులు గుమికూడారు. వారందరికీ క్షీరసాగర్ నాయకత్వం వహిస్తున్నాడు.

యోగబాలది మోసమని, ఆమె కపట యోగిని అని, ప్రొఫెసర్లని, వంచించి, యూనివర్శిటి విషయాల్లో అనవసరంగా జోక్యం చేసుకుంటోందనే, ఆరోపణతో కూడిన స్లోగన్లతో, డౌన్ డౌన్ నినాదాలతో వాతావరణం వేడెక్కింది.

లోపల భజన ఆగిపోయింది. భానోజీరావుగారు బైటకి వచ్చి తలుపు వేసెయ్యబోయారు. ఆయనకి అవకాశం ఇవ్వకుండా రెండు తలుపులకీ మధ్య అడ్డుగా నిలబడ్డాడు, సాగర్. "క్షమించండి మాష్టారూ, మేము మిమ్మల్ని అవమానించడానికో, లేక గొడవ చెయ్యడానికో ఇక్కడికి రాలేదు. యూనివర్శిటి వ్యవహారాల్లో, జోక్యం చేసుకుంటున్న యోగబాలని, హెచ్చరించడానికి మాత్రమే వచ్చాం" అన్నాడు.

భానోజీరావు సాగర్‌కి ఏదో సరిచెప్పబోయారు. కానీ సాగర్ వినిపించుకోలేదు. రామ్మోహన్ దురుసుగా ఏదో అనబోయాడు. కానీ విద్యార్థులు అతన్ని బయటకి లాగారు. ఆ తర్వాత అతన్ని ఆ చుట్టుపక్కల కనబడకుండా చేసారు.

"మాష్టారూ మీరు ఏం చెప్పినా విద్యార్థులు వినేటట్టులేరు. యోగబాలని రమ్మనండి మేం ముఖాముఖి విషయం తేల్చుకుంటాం" అన్నాడు సాగర్.

భానోజీరావు నిస్సహాయంగా లోపలికి వెళ్ళిపోయారు. ఆయన లోపలికి వెళ్ళిపోయిన కొద్దిసేపటికి, యోగబాల బైటకి వచ్చింది. అంతా నిశ్శబ్దంగా ఉంది.

సాగర్ మరికొద్ది అవినీతి నిర్మూలన ఉద్యమ కర్తలు, యోగబాలని ప్రశ్నలు వేస్తున్నారు. యోగబాల కొన్నింటికి సమాధానం చెపుతోంది. కొన్నింటికి సమాధానం చెప్పలేకపోతోంది. తను యూనివర్శిటి విషయాల్లో జోక్యం చేసుకోటం లేదన్న, యోగబాల హామీని, విద్యార్థులు నమ్మలేదు. నమ్మరు కూడా! అలా నమ్మేసి వెళ్ళిపోవడానికి వాళ్ళక్కడికి రాలేదు.
విద్యార్థులు మనిషి భాషలోనే కాక, కుక్క, పిల్లి, కాకి, భాషల్లో కూడా మాట్లాడానికి ప్రయత్నిస్తున్నారు. అవేవీ యోగబాలకి రావని, అసహనం పడిపోతున్నారు. ఉద్యమ నాయకులు విద్యార్థుల్ని సహనం కోల్పోవద్దని హెచ్చరిస్తున్నారు. అది విద్యార్థులు అపార్థం చేసుకున్నారు. ఇంకా సహనంగా ఉంటే పోలీసులు వచ్చేస్తారని, అందుకే అసహనంగా తోసుకుంటున్నారు. ఆ సమయంలోనే ఒక టమాటాపండు వచ్చి సూటిగా యోగబాలకి తగిలి చితికి క్రిందపడిపోయింది. యోగబాల సహనం కోల్పోయి "బాస్టర్డ్స్ " అంది.

ఎవడో ఒకడు చేసిన తప్పుకి, అందర్నీ తిట్టడం ఏం బావులేదు, అని బాధపడ్డారు విద్యార్థులు. ఆ బాధలో ఎలాగూ దీవించింది కదా, అని తలో టమాటాపండు, కోడిగుడ్డు, అరటి తొక్కా, యోగబాలకి సమర్పించుకున్నారు. అన్ని ప్రక్కలనుండి ప్రొజెక్టైల్స్‌లా వస్తున్న తొక్కల్ని, టమాటాపండ్లని కోడిగుడ్లని సహిస్తూ అచేతనంగా, అవాక్కయి నిలబడిపోయింది యోగబాల.

ఆమె పరిస్థితి చూసి, రామ్మోహన్, సారథి ఆదిగా గల భక్తులు, మళ్ళీ ఆమెకి మద్దతుగా వచ్చారు. కాని ఉద్యమకారులు వారిని దూరంగా నెట్టేసారు. అక్కడ చిన్నగందరగోళం ఏర్పడింది. ఆ సమయంలో ఎవరో విసిరిన రాయి, వీధిలో బల్బుకి తగిలి, అది బద్దలై ఆ ప్రదేశం అంతా చీకటి అయిపోయింది. దాంతో ఎవరు ఎవరో తెలియక గొడవ, గందరగోళం ఎక్కువైంది. ఆ చీకట్లో యోగబాల అరుపులు ఎక్కువ దూరం వినబడలేదు.

కొద్దిసేపు తర్వాత "పదండి పదండి" అన్న ఉద్యమకారులు అదలింపు వినబడి "సత్యమేవ జయతే" నినాదాలతో ఉద్యమకారులు నిష్క్రమించారు.

వారు నిష్క్రమించిన తర్వాత రామ్మోహన్, సారథి అరుగుమీద ఉన్న యోగబాలని తీసుకుని లోపలకి వెళ్ళారు. వెలుగులోకి వచ్చిన యోగబాల ముఖం చూసి నిశ్చేష్టులైపోయారు. భానోజీరావు, రామ్మోహన్ తదితరులు.

యోగబాల జుత్తు మొదలంట కత్తిరించబడివుంది. ఆమె ముఖం నిండా, తెల్లగా, నల్లగా పిండితోనూ, బొగ్గుతోనూ, బొట్లున్నాయి. ఆమె వదులుగా వేసుకున్న వస్త్రాలు కత్తెరతో కత్తిరించేసారు. భానోజీరావు అవమానం తనకే జరిగినట్టు ఫీలయ్యారు.

అప్పుడు పోలీసులు వచ్చారు. ప్రాణ నష్టం, ఆస్థినష్టం జరగలేదు కాబట్టి విద్యార్థుల మీద కేసుపెట్టినా అది మరింత గొడవకు దారి తీస్తుందే తప్ప. ప్రయోజనం ఉండదు. అని భానోజీరావుకి నచ్చచెప్పి, వెళ్ళిపోయారు.

మానహాని గురించి పెద్దగా పట్టించుకోనక్కరలేదు అనుకున్నారు. ఎందుకంటే మానం ఎవరికి పోయింది? యోగబాలకా? భానోజీరావుకా? నిర్ధారించుకోలేకపోయారు పోలీసులు.

●●●

ఈ వార్త తెలిసిన జానకీబాయి పగ చల్లారింది. సాగర్‌కి ఏదో సాధించానన్న తృప్తి మిగిలిపోయింది.

ఈ వార్తని నాతో చెప్పాడు. సాగర్ చెప్పకపోయినా మణి, కల్పనా ఎప్పటికప్పుడు నాకు చేరవేస్తున్నారు. సాగర్ చుట్టూ అల్లుకుపోయిన సాలీడు ఎవరో కూడా తెలిసిపోయింది. కానీ ఆ రోజు చాలా ఆనందంగా ఉన్నాడు.

"ఎందుకు ఆ ఆనందం?"

"ఇందులో టిట్ ఆడదే టాట్ ఆడదే."

"నాకైతే ఆనందంగా లేదు"

"అదేమిటి అలా అన్నావ్? వాళ్ళు నిన్నెంత అవమానం చేసారో గుర్తుకు తెచ్చుకో"

"నా అవమానం సరే నువ్వేం సాధించావు. వాళ్ళు నన్ను అవమానం చేస్తే నువ్వు వాళ్ళకి కావల్సిన సన్నిహితమైన మరో ఆడదాన్ని అవమానించవు. దానివల్ల నా కొరిగిందేమిటి? నీ కొరిగిందేమిటి? ఎక్కడో తప్పు జరిగింది సాగర్ ఎందుకిలా చేసావ్? ఎవర్ని సంతోషపెట్టడానికి? నాకైతే సంతోషంగా లేదు. నువ్వంటే చికాకనిపిస్తోంది" అంటూ సాగర్ని దులిపేసా.

సాగర్ నిరుత్తరుడైపోయాడు. అతని దగ్గర సమాధానం లేదు.

సమ్ వేర్ సమ్‌థింగ్ మిస్డ్. ఎక్కడో ఏదో మిస్సయింది. ఏమిటి? యోగబాలని అవమానం చెయ్యడం భానోజీరావుని రామ్మోహన్ని అవమానం చేసినట్టుకాదు. రెండూ వేరు. నాలో 'ఐ' సాగర్ని క్షమించలేకపోయింది.

●●●

సాగర్ చేసిన అల్లరి, రామ్మోహన్ అతని మిత్రులకు తీరని అవమానంగా పరిగణించారు. పి.హెచ్.డి విద్యార్థి పదివేలు యోగబాల ఆశ్రమానికి డొనేట్ చేసాడన్న విషయం బయటికి ఎలా వచ్చిందా అని రామ్మోహన్ ఆరా తీశాడు. తమ విద్యార్థుల్లోనే కొందరు జానకీబాయి దగ్గరకి వెళ్తారని, వాళ్ళద్వారా జానకీబాయి తెలుసుకుని ఉంటుంది. అల్లరి జరగక ముందు, సాగర్ జానకీబాయి ఇంటికి రాకపోకలు, సాగించాడని విన్నాడు. జానకీబాయి తెలివిగా మామగారి మీద పగసాధించింది. దానికోసం సాగర్‌ని ఒడుపుగా వాడుకుంది ఈ విషయం భానోజీరావుకి చెప్పి, ఆయన అభిప్రాయం తెలుసుకుందామనుకున్నాడు.

యోగబాలకి అవమానం జరిగిన నాటినుండీ, భానోజీరావు కాలేజీకి శెలవు పెట్టారు. ఎక్కడికీ కదలడం లేదు. యోగబాల తన పూర్వాశ్రమానికి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయిన పదిరోజులకి భానోజీరావు భార్య పుట్టింటినుండి వచ్చింది. ఆమె వచ్చిన రెండోరోజునే జానకీబాయి పతిదేవుడితో సహా వచ్చి అత్తగారిని, మామగారిని పలకరించి వెళ్ళింది.

ఆ పరిస్థితిలో రామ్మోహన్ భానోజీరావుగారింటికి వెళ్ళాడు. జానకీబాయికి, సాగర్‌కీ, మధ్య జరిగిన మంత్రాంగం గురించి చెప్పాడు. అంతా తాపీగా విన్న భానోజీరావు రామ్మోహన్ వేపు కోపంగా చూసి "గెటవుట్" అని గసిరేసారు.

ఈయనకి ఏమైంది? ఎందుకింత కోపం? ఇన్నాళ్ళూ ఈయన వెంట తిరిగినందుకు, ఇదా ప్రతిఫలం తను లేనిపోని మాటలు మోసే దళారి అనుకున్నాడా? లేక తన కుటుంబం గురించి చెడు చెపితే వినడా? లేక తను సాగర్‌ని ఏం చేయలేక తప్పుని తన కోడలు మీద తోస్తున్నాననుకున్నాడా? ఈయనకి ఎవరు ఏమైపోయినా పర్వాలేదు. తన కుటుంబాన్ని వేలెత్తి చూపకూడదు. అసలు దీని కంతటికీ సాగర్ కారణం. జాహ్నవి ఎలాగూ చదువు మానేసింది. వీడ్ని కూడా యూనివర్శిటి వదిలి పారిపోయే ఏర్పాటు చేయాలి. వీడికి రామ్మోహన్ సత్తా ఏమిటో చూపించాలి. భానోజీరావు తిరస్కారంతో కోపం అంతా సాగర్ మీద కేంద్రీకరించాడు రామ్మోహన్. ఆ ప్రయత్నంగానే హోష్టలు కెళ్ళి పెట్టె సర్దుకుని స్వంత ఊరుకి వెళ్ళిపోయాడు.

వీడేదో కసి పెట్టుకున్నాడు. "సైతాన్ గాడు జాగ్రత్తగా ఉండు" అంటూ సాగర్ని హెచ్చరించింది కల్పన. కానీ ఇంతలా తెగిస్తాడు అనుకోలేదు.

●●●

"దబదబ" తలుపు చప్పుడుకి మెలుకువ వచ్చింది సాగర్‌కి. గదిలో బెడ్‌లైటు వెలగటం లేదు. కరెంటు పోయింది. టైమెంతైందో తెలియటంలేదు. రాత్రి చాలాసేపటి వరకూ రూములో స్నేహితులతో గడపడం, వాళ్ళు వెళ్ళిపోయాక బుల్ బుల్ వాయించడం వల్ల చాలా ఆలస్యంగా పడుకునుంటాడు, తెలివి వచ్చి కళ్ళు తెరిచేసరికి కళ్ళు భగ్గున మండుతాయి. తడుముకుంటూ వెళ్ళి తలుపు తెరిచాడు. బయట వరండాలో లైటు లేదు. చీకటిగా ఉంది. వరండాలో నిలబడ్డ మనిషి చాలా ఎత్తుగా ఉన్నాడు. సాగర్ తలుపు తీయగానే "మీరేనా సాగర్?" అని అడిగాడు. గొంతు బొంగురుపోయి కొత్తగా ఉంది. అంటే తోటి విద్యార్థి కాదా? అన్న అనుమానం వచ్చి, విద్యార్థి కాకపోతే

ఇంకెవరు? ఇంత అర్ధరాత్రి ఇతనికి తన అవసరం ఏమొచ్చింది? ఇలా ఆలోచిస్తూ కళ్ళు నులుపుకుని ఆ వచ్చినతన్ని గుర్తుపట్టడానికి రెండడుగులు ముందుకేసాడు.

"యస్.. నేనే సాగర్‌ని" అన్నాడు.

అప్పుడు సాగర్ తలమీద భళ్ళున బద్దలైన శబ్దం వినిపించింది. ఏవో నీళ్ళలా తలమీంచి కారాయి. ఆ వచ్చినతను సాగర్‌ని బలంగా గదిలోకి తోసి గది తలుపు గడియవేసి పారిపోయాడు. అతని అడుగుల శబ్దం దూరం, అవుతున్న కొద్దీ, సాగర్ మొహం మండుతోంది. ఏమిటా మంట? అని తలమీద చెయ్యిపెట్టిన సాగర్ చేతులోకి జుత్తు వచ్చేసింది, చేతినిండా వెంట్రుకలే, అప్పటికే మొహం, కళ్ళు పెదవులు భగ భగ, ఏదో కొలిమిలో పెట్టినట్టు మండుతున్నాయి. మంటని భరించలేక వెర్రికేకలు వేసాడు.

తలుపుని దబాదబా బాదాడు. నిమిషనిమిషానికి మంట ఎక్కువ అవుతోంది. మొత్తంగా తలమీంచి మెడవరకూ మండుతోంది. మొత్తం కళ్ళని, చెవుల్ని ఏదో భయంకరమైన విషప్పురుగు కొరుక్కుతింటున్నట్టుగా ఉంది. తలుపు బాదిబాది, స్పృహ తప్పిపడిపోయాడు సాగర్.

తలుపు బాదుతున్న చప్పుడుకి విద్యార్థులు లేచారు. కానీ చీకటి కరెంటు లేక పోవడంతో తలుపులు తీసుకు బైటికి వచ్చినా, ఎవరి గదిలోంచి ఈ కేకలు వస్తున్నాయో? అర్థం కాలేదు. ఒకరిద్దరి దగ్గర టార్చిలైట్లు ఉన్నాయి. అవి వచ్చాక, కేకలు వచ్చిన గదివేపు వచ్చారు అందరూ ఎవరు అంటే ఎవరు అనే కన్‌ఫ్యూషన్‌లో ఉన్నారు. కొంచెం సేపటికి కొందరు విద్యార్థులకి, సాగర్ తలుపులు తెరుచుకోలేదు అన్న విషయం తట్టింది.

సాగర్ తలుపుల్ని కొట్టారు. లోపలనుండి ఏ అలికిడీ లేదు. మళ్ళీ కొట్టారు. అయినా లోపల ఏ అలికిడీ అవలేదు. అప్పుడు చూసారు. తలుపు బైట గడియవేసి ఉండడం తలుపు గడియ తీసి లోపలికి వెళ్ళారు. సాగర్ నేలమీద పడివున్నాడు. అతని దగ్గరకి వెళ్ళిన విద్యార్థులకి కాలిన వాసన. టార్చిలైటులో అతన్ని చూసిన విద్యార్థులు భయపడిపోయారు. నెత్తిమీద జుత్తు పాయలుపాయలుగా కిందకి రాలిపోయింది. పెదిమలు కనురెప్పలు నల్లగా కమిలిపోయయి. మొహం పై నుండి ఆవిరి పొగ కలిసినట్టుగా, దట్టమైన స్మోగ్‌లా వస్తోంది.

ఇద్దరు ముగ్గురు విద్యార్థులకి విషయం తెలిసిపోయింది. "ఎవరో కాన్‌సన్‌ట్రేటేడ్ ఏసిడ్ నెత్తిమీంచి పోసేసారు." అన్నారు.

అప్పటికి తెలతెలవారుతోంది.

●●●

క్షీరసాగర్ మీద ఏసిడ్ పోసేసారన్న విషయం, మర్నాడు యూనివర్శిటీలో గుప్పుమంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సాగర్ బంధువులు హాస్పిటల్‌ని చుట్టుముట్టేసారు. హాస్పిటల్‌లో సామాన్యమైన పని జరగడం కూడా కష్టం అయింది. పోలీసులు వచ్చారు. వార్తలుగా రాసుకుని వెళ్ళిపోయారు.

"ఎనభై శాతం బర్న్స్" కాబట్టి బతికే అవకాశం లేదన్నారు డాక్టర్లు. సాగర్ కోమాలోకి వెళ్ళిపోయాడు. చావు బతుకుల మధ్య ఊగుతున్నాడు.

●●●

"ఈ రోజు" పత్రిక ఆదివారం ఎడిషన్‌లో యూనివర్శిటిలో యదార్థగాథ.

అందులో ఏది యదార్థం, ఏది కల్పితం? నాకు తెలుసు. ఈ శ్రీహరి గురించి తెలుసు.

శ్రీహరి "ఈరోజు" పత్రికా విలేఖరి, అందరితో బాటు హాస్పిటలుకి వెళ్ళి సాగర్ మీద జరిగిన దాడి వివరాలు సేకరించాడు

"ఈ రోజు" పత్రిక్కి ఒక సంప్రదాయం ఉంది. వార్తని ఎడ్వర్ టైజ్ చేయడం, వార్తని మిగతా పత్రికలు రిపోర్ట్ చేస్తాయి కానీ ఈ పత్రిక ఎడ్వర్‌టైజ్ చేసి ఆకర్షిస్తుంది. ప్రజలని ఆకట్టుకుంటుంది. ఆ విధంగా ప్రయోగం చేసి, 'ఆరేసుకున్నావా? పారేసుకున్నావా?'

అంటూ ప్రజల మనసు దోచుకున్న ఒక నటుడ్ని, అతని వార్తల్ని ఎడ్వర్‌టైజ్ చేసి, పొలిటికల్ కన్స్యూమరిజమ్ అభివృద్ధి చేసి, అతన్ని ఆంధ్ర సింహాసనం మీద కూర్చోబెట్టేసింది.

ఆనాటి నుండి పత్రిక్కి తనమీద కాన్ఫిడెన్సూ, పాఠకుడికి మిథికల్ సెన్సూ పెంపొందాయి. అఫ్‌కోర్స్ ఎవరు వచ్చినా ఈ డెమోక్రసీలో పన్నులేసి డెమన్స్‌గా పేరు పొందిన వాళ్ళేకానీ, ప్రజలకి ఒరిగిందేమీలేదు.

అలాంటి సంప్రదాయంకల పత్రికా విలేఖరి శ్రీహరి, ఊరికే ఊరుకోలేదు. క్షీరసాగర్ యూనివర్శిటీలో చేరిన దగ్గర్నించి జరిగిన విషయాలన్నీ సాగర్ స్నేహితుల దగ్గర్నించి రాబట్టాడు. ప్రచారం, సానుభూతి, లభిస్తాయని సాగర్ స్నేహితులు చాలా విషయాలు శ్రీహరికి నివేదించారు. అవి యధాతథంగా పత్రికలో వస్తాయి. అనుకున్నారు. కానీ ఈ వివరాలన్నీ ఒక దానికి ఒకటి అతికే విధంగా కూర్చి పెద్ద ఆర్టికల్ రాసాడు. సేకరించిన వివరాలతో ఎక్కడ కంటిన్యుటీ, రీజనింగ్ లోపించిందో, అక్కడ తన విలేఖరి కన్ను (జర్నలిస్టిక్ ఐ) ఉపయోగించి ఉంటాడు, ఆ వార్తని, దర్శించి, దాన్ని జోడించి, ఒక పెద్ద ఆర్టికల్, టేస్ట్‌ఫుల్‌గా తయారుచేసాడు. ఈ ఆర్టికల్‌కి సపోర్టింగ్‌గా ఆసక్తికరమైన వివరణలిచ్చాడు.

ఆ సమయంలోనే సాగర్ మరణం, అతని ఆర్టికల్స్‌కి గిరాకీ పెంచింది.

ఆ పాఠకుల్లో నాకు తెలిసినవాళ్ళూ, నాన్నకి తెలిసినవాళ్ళూ, మా కుటుంబ సభ్యులతో పరిచయం ఉన్నవాళ్ళూ, ఆ ఆర్టికల్స్‌ని అత్యంత ఉత్సాహంతో చదివారు.

ఆ ఆర్టికల్స్ వల్ల చాలా విషయాలు తెలుసుకున్నా.

●●●

మొదటి ఆర్టికల్ వచ్చిన రోజున నాన్న అసహనంతో చేతకానితనంతో ఆ పత్రిక చింపిపారేసారు. కానీ అదే పత్రికను చదివి ఆశ్చర్యపోతూ విషయం మాట్లాడదామని వచ్చిన, ఆయన స్నేహితుడు రాజుగారి చేతిలో పత్రికని ఏం చేయలేక, నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు.

నాకు కాంటిన్లో అవమానం జరిగిన నాటినుండి, ఇంటి పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇంటిలో ఎవరు ఎదురుపడ్డా, అద్దం చూసుకున్నా, గుండెలు మీద మచ్చ కొట్టొచ్చినట్టు కనబడి, ఎదుటి వాళ్ళ మనసు కలిచి వేస్తుంది. తెల్లటి శరీరం మీద నల్లని మచ్చ మొదట్లో చాలా కొట్టొచ్చినట్లు కనబడేది. కొంతకాలానికి మచ్చ బ్రౌన్ కలర్‌కి మారింది తప్ప, చర్మం రంగులోకి రాలేదు. మచ్చని దాచుదామని నే చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. జాకెట్ షేప్స్ మార్చి కుట్టించా.. చీర ధరించడంలో మార్పులు చేసినా మచ్చ ఉనికి కప్పి పుచ్చలేకపోయాను.

దానికి తోడుగా ఇన్నాళ్ళూ చదువు గురించి, యూనివర్శిటి విషయాల గురించి చాలా అభిమానంగా అడిగి, నాలోని నాయకత్వలక్షణాన్ని మెచ్చుకునే నాన్న ముభావంగా ఉంటూ అసలు మాట్లాడడమే తగ్గించేసాడు. అక్క రజనితో, అన్నయ్యతో మాట్లాడుతున్నప్పుడు, వాళ్ళెంత నిగ్రహించుకున్నా, చూపు మచ్చమీదకి పోతోంది. అందుకే వాళ్ళకి దూరంగా ఉంటున్నా. అవమానం జరిగిన తర్వాత ఆ సంఘటన మరుపున పడిందిగాననీ, అవమానం జరిగిన ప్రతి ఆడది, ఒక తల్లికి, కూతురో, ఒక తండ్రికి కూతురో, ఒక అక్కకి, అన్నకి చెల్లెలో అవక తప్పదు. వాళ్ళు మాత్రం ఆమెకి జరిగిన అవమానాన్ని మర్చిపోవడం కష్టం.

విచిత్రం ఏమిటంటే మగవాడికి జీవితంలో లభించినన్ని పునఃశ్చరణలు, లేదా స్వయం సంస్కరణ, అవకాశాలు, స్త్రీకి లేవేమో? దేర్ అయామ్ మిస్సింగ్.. అందుకే ఆడదాని విషయంలో జరిగిన, ఏ చిన్న అవకతవకైె మొత్తం కుటుంబాన్ని బెంబేలెత్తిస్తుంది.

ఆ విషయాలేవీ మనసుకు పట్టని చిన్నా హాయిగా నవ్వుతూ మాట్లాడతాడు. దానికి కారణం నేను, చిన్నా ఒకేగదిలో ఉండడం.

అంతంత మాత్రంగా ఉన్న ఇంటి వాతావరణం, సాగర్ మరణంతో మళ్ళీ మొదటికొచ్చింది. సాగర్ చనిపోయిన రోజున, నాన్న శలవు పెట్టి, ఇంట్లోనే ఉండిపోయారు. ఆయన ఉద్దేశం నేను బైటికి వెళ్ళకుండా చూడడం ఆయన ఉదేశం గ్రహించి, నేను ఇల్లు వదలి బైటకి పోలేదు. ఆ రోజంతా గదిలోంచి బైటకి రాలేదు. సాగర్ మరణం నాకు షాకే. దానికి తోడు పత్రికలో ఆర్టికల్స్ పుండుని బరికినట్టుగా బాధపెట్టాయి. ఆ ఆర్టికల్స్ వస్తున్న నాలుగు ఆదివారాలూ ఇంట్లో పరిస్థితి అనీజీగా ఉంది, ఆ తరుణంలో పుస్తకాలు నాతో స్నేహించాయి. సేద తీర్చాయి. చాలాకాలం పుస్తకపఠనంలో గడుస్తోంది.

●●●

ఆ రోజు స్నానం చేసి హాలుగుండా గదిలోకి వెళుతూంటే హాలులో ఉన్న ఎక్వేరియం నుండి టైగర్‌బార్బ్ ఫిష్ ఎగిరి ఎక్వేరియం పక్కగా నేలపైబడి కొట్టుకోడం కనిపించింది. నేలమీద పడిన టైగర్‌బార్బ్ మళ్ళీ ఎగిరి నీళ్ళల్లో పడగలనేమో అనే ఆశతో కొట్టుమిట్టాడుతోంది.

కొట్టుకుంటున్న టైగర్‌బార్బ్. అలా ఎంతసేపో కొట్టుకోలేదని, చచ్చిపోతుందని నాకు తెలుసు. అయినా ఆ చిన్న జీవి మృత్యువుకి, జీవితానికి మధ్య కొట్టుకోడం మనసులో ఎక్కడో ఆనందాన్ని ఇస్తుందేమో, అలా చూస్తూ నిలబడ్డా. గాని టైగర్‌బార్బ్‌కి సాయంగా వెళ్ళలేదు. అదేమిటి మిస్ అవుతోంది? అని ఆలోచిస్తున్నా. దానికి ఛాయిస్ లేదు ఎగరడం తప్ప. అది చచ్చిపోతుంది. కానీ అప్పుడే హాలులోకి వచ్చిన రజని, టైగర్‌బార్బ్‌ని చూసి కెవ్వున కేక వేసి ఎక్వేరియం పక్కనున్న నెట్ తీసి ఫిష్‌ని ఎక్వేరియంలో పెట్టింది.

రజని పెట్టిన కేకకి ఇంట్లో సభ్యులు అంతా హాలులోకి వచ్చారు. నేను గదిలోకి వెళ్ళిపోయా! హాలులోకి వచ్చిన సభ్యులకి టైగర్‌బార్బ్, విచిత్రమైన రంగులతో చుక్కలతో, మనసు ఆహ్లాదాన్ని కలిగించే క్రౌన్ ట్రిగ్గర్, వింతకాంతులనిచ్చే క్రౌన్‌రాస్ బొరా నేనే సంపాదించి పెంచుతున్నా. అలాంటిది ఇప్పుడు వాటి అందాల్ని ఎందుకు భరించలేకపోతోంది?

●●●

సూర్యభగవాన్‌ని మహోగ్ని గుండంలో పడి క్షణాలు, గంటలు రోజులు మండి మసై పోతున్నాయి. ఈ రోజు నిన్నై, మొన్నై మనుగడ కోల్పోతోంది. రోజులతోపాటు సంఘటనలు, జ్ఞాపకాలుగా మిగిలి మరుపులుగా మారిపోతున్నాయి. మరుపు మానవ సహజం ఒకానొక చోట నైజం కూడా.

ఇంటి వాతావరణంలో ఏర్పడ్డ వెలితి తగ్గి కొంత తెరిపిన పడి మనుషుల మధ్య సహజ వాతావరణం చోటుచేసుకొంటోంది. పుస్తక పఠనం కాలక్షేపంగా మొదలైనా, వ్యసనంగా మారింది. సాహిత్యం, సైన్సు, తన పాఠ్యపుస్తకాలు చదివి కాలాన్ని మరిచి, కాలక్షేపం ఇన్ని వ్యాపకాలూ, విసుగు పుట్టించినప్పుడు టైగర్‌బార్బ్ ఫిష్‌తో ఆడుకుంటున్నా. ఎవ్వరూ లేనప్పుడు, అందరూ మధ్యాహ్నం నిద్రపోతున్నప్పుడు నెట్‌తో టైగర్‌బార్బ్ ఫిష్‌ని బైటకి తీసి, వేరే టేబులు మీదపెట్టి అది కొట్టుకుంటుంటేఅలా అది కొట్టుకు ఇంక ఎగరలేక పోతే తీసి ఎక్వేరియంలో వేస్తున్నా. మొదట్లో అప్పుడప్పుడు చేసినా, ప్రస్తుతం ఫిష్‌తో చావుబతుకుల దోబూచులాట నిత్యకృత్యంగా సాగుతోంది.

రెండు మూడు సార్లు అమ్మ, నాన్న టేబులు ఎందుకు తడిసింది? అని అడిగారు. దానికి ఎవరూ సమాధానం చెప్పకపోవడంతో ఊరుకున్నారు. రజనికి అనుమానం. రహస్యంగా నే చేస్తున్న పనిని గమనించింది.

కానీ ఆ రోజు టైగర్‌బార్బ్ టేబుల్ మీద కొట్టుకుంటోంది. అది హింస,చావు బ్రతుకుల మధ్య కొట్టుకుంటోంది. ఎందుకిలా చేస్తోంది. అది నా మన ప్రవృత్తిని ప్రతిబింబిస్తోందా? తనూ చావుబ్రతుకుల మధ్య ఊగిసలాడుతోందా? మనసు కొన్నింటికి సమాధానపడుతోంది. కొన్నింటికి సమాధానం పడ్డం లేదు. సమాధానం పడ్డప్పుడు ఏది మిస్సవుతోంది? ఘర్షణ పడ్డప్పుడు ఏది మిస్సవుతోంది? దారి ఎటు? తానెటు పోతోంది? తానెటు పోవాలి? మార్గదర్శకత్వం ఎవరు వహిస్తారు. తనని ఏది ప్రేరేపిస్తోందో? ఇంతకీ

తనది జంతు స్వభావమా? చావుబతుకుల మధ్య హింసని చూసీ స్పందించనిది. జంతువు ఈ తేడా ఏ మనిషి మీద నమ్మకాన్ని పెంచుతుంది. తను ఆ నమ్మకాన్ని పోగొట్టుకుందా? అలాగే కనిపిస్తోంది! ఇంట్లో వాళ్ళకి నా మీద నమ్మకం పోయిందా? అందుకే ఏ పని చెయ్యాలన్నా సందేహం. నా ఛాయిస్ ఏమిటి?

టైగర్‌బార్బ్ కొట్టుకోవడంలేదు. టైగర్ బార్బ్ కొట్టుకోవటం ఆగిపోయింది. ఆలోచనల్లో నన్ను నేను మర్చిపోయా, ఆ విషయం గ్రహించే సరికి ఫిష్‌లో పూర్తిగా చలనం లేదు. గాభరాగా ఫిష్‌ని తీసి ఎక్వేరియంలో వేసా. ఎక్వేరియంలో అది ఈదలేదు. బరువుగా కిందకి దిగిపోయింది. కొంచెం బాధ కలిగింది. అనవసరంగా దాని జీవితంతో, ఆడుకున్నానే అనే ఫీలింగ్. కానీ ఆ బాధ మనసులో ఎక్కువసేపు నిలువలేదు. ఎక్వేరియంలో చెయ్యి పెట్టి టైగర్‌బార్బ్‌ని తీసి నా రూములోకి వెళ్ళి, కిటికీ గుండా బైటకి పారేసి, దాని గురించి మర్చిపోయా.

●●●

**సాయంకాలపు నీరెండ కిటికీలోంచి** తొంగిచూస్తోంది. "నాన్నగారు పిలుస్తున్నారు?" అని చెప్పాడు చిన్నా.

హాల్లోకి వెళ్ళా. హాల్లో నాన్న, అమ్మ, రజని కూర్చుని ఉన్నారు. నాన్న ఎదురుగా సెంటర్ టేబులు మీద ప్లాస్టిక్ పళ్ళెంలో మధ్యాహ్నం కాలం చేసిన ఫిష్ ఉంది.

నాన్న మొహంలో అసహనం స్పష్టంగా కనిపిస్తోంది.

నా వల్లే టైగర్‌బార్బ్ చచ్చిపోయినట్టు తండ్రికి ఎలా తెలిసింది? రజని మొహం చూసా. రజని నన్ను దీర్ఘంగా చూస్తోంది. టైగర్‌బార్బ్ ఫిష్‌తో ఆడుకోడం, మొదలు పెట్టిన దగ్గరనుండి, రజని ఎక్వేరియంలో చేపల్ని అబ్జర్వ్ చేస్తోంది. ఆ రోజు ఎక్వేరియం చేపల్లో ఒకటి తక్కువ వచ్చింది. రజనికి విఠలాచార్య సినిమాలో అందమైన అప్సరసలా డాన్సు చేసి, రాక్షసిగా మార్చిపోయిన వాంప్‌లా కనిపించి ఉంటా.

"జాహ్నవి నీకు అక్కరలేదు అనుకుంటే ఏక్వేరియం ఎవరికైనా ఇచ్చేదాం. అంతేకానీ వీటిని చంపడం ఎందుకు?" అని అడిగారు నాన్న.

టైగర్‌బార్బ్‌ని తను చంపిందా? దాన్ని బైట పెట్టింది. అంతే ఆఖరి నిముషంలో నీటిలోపలికి చేర్చలేకపోయింది. లైఫ్ ఒక ఛాన్స్. ఆ ఛాన్స్ ఫిష్‌కయినా, మనిషికయినా ఒకటే, ఆఖరి నిముషం వరకూ కొట్టుకున్న ఫిష్ చెప్పక చెప్పక ఏదో చెపుతోంది. ఆ విషయం అది చచ్చిపోయాక అర్ధం అయింది. నాలో జడత్వాన్ని ఒదలగొట్టుకోవాలి. ఏం చేయాలి? అన్నది ముందే నిర్ణయించి పెట్టుకున్నా.

"నాన్నా నేను చదువుదామనుకుంటున్నాను." అంది.

నీటిలోంచి టేబులుమీద పడిన ఫిష్‌లా గిలగిలా కొట్టుకునుంటుంది, నాన్న మనస్సు, కోపంతో అమ్మ ఏదో అనబోయింది. ఆమెని వారించారు.

నాన్న జీవితం చాలా సాఫీగా ప్రయాణం చేసిన నావ, ఆయన చదువు తర్వాత మంచి ఉద్యోగం, కళకళలాడే పిల్లలు, స్వంత ఇల్లు, సమాజపు హద్దులు దాటని సామాన్యపు మనస్సు ఆయనిది. ఆయనెప్పుడూ ఏదీ మిస్సయాననిగానీ, అవుతున్నాననిగానీ అనుకోలేదు.

నేను పుట్టాక, ఏ దేవతో ప్రత్యేకంగా ఈ ఇంట్లో పుట్టింది అనుకున్నారు. పదేళ్ళ వయసు నుండి చదువులోనూ, ఆటల్లోనూ, నే చూపించే తెలివితేటలకి అబ్బురపడి, ఇంటిలో ప్రత్యేక స్థానం ఇచ్చారు నాన్న. నేను కూడా ఆ కాన్ఫిడెన్సును నిలబెట్టాను. ఈ విషయంలో రజని అన్నయ్య కాస్త ఈర్ష్యపడేవారు. కానీ నాలో ఆ కాన్ఫిడెన్స్ ఓవర్ కాన్ఫిడెన్స్‌గా అభివృద్ధి చెందుతోందని తెలుసుకోలేకపోయా. అది

తెలుసుకోకుండానే జీవితం అదుపు తప్పిపోయింది. స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకున్నా? అది సంపాదించాలి. మళ్ళీ నా ఛాయిస్ నాదవ్వాలి. అదంత తేలిక కాదు అని తెలుస్తోంది.

నాన్నకి కోపం వచ్చిందని, అది అదుపులో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అర్థం అయింది. "నాకిష్టంలేదు జాహ్నవి" అన్నారు నాన్న తనకోపాన్ని అదుపులో పెట్టుకుని.

నేను ఆశ్చర్యపోలేదు. అదే సమాధానం వస్తుందని, నాకు తెలుసు. నా చదువు విషయం, హంగామా అవుతుంది అనుకున్నా కానీ నాన్న తనని తాను నిభాయించుకుని చెప్పిన సమాధానం చాల రిలీఫ్ కలిగించింది.

ఇంతవరకూ వచ్చి ఎమ్.ఎస్.సి పూర్తిచేయకపోతే, అయిన ఖర్చు వృధా.

"ఎమ్.ఎస్.సి పూర్తిచేసేస్తాను నాన్నా, ఈ ఒక్కదానికి పర్మిషను ఇవ్వండి. ప్రైవేటుగా వీలయితే సెప్టెంబరులో ఎక్జామ్స్ రాద్దామనుకుంటున్నాను" అన్నా.

నే చెప్పిన దాన్ని బట్టి నేను ఎమ్.ఎస్.సి పూర్తిచేసి ఆపేస్తానని, మధ్యంతరంగా చదువు ఆపెయ్యడం నన్ను బాధిస్తోందని అనుకున్నారు నాన్న. నే చెప్పిన దాంట్లో కొంచెం రీజనింగ్ కనిపించింది. మనసు మెత్తబడింది. అవును అని కానీ కాదని కానీ అనలేదు. మౌనంగా ఊరుకున్నారు.

●●●

నాన్నకి చదువు సాగిస్తానని చెప్పిన రెండు రోజుల తర్వాత చిన్నాని తీసుకుని హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు ఇంటికి వెళ్ళా. ఇంటికి వచ్చిన నన్ను చూసి హెడ్ సదాశివరావుగారు ఆశ్చర్యపోయారు. కానీ ఆశ్చర్యాన్ని అదుపులో ఉంచుకుని సాదరంగా ఆహ్వానించారు. ఆ రోజుల్లో నేనంటే ఆయనకి అభిమానం. అందుకే నన్ను పైనుండి కిందవరకూ దీర్ఘంగా పరిశీలించారు.

"మాష్టారు నేను ఎమ్.ఎస్.సి పూర్తిచేద్దామని అనుకుంటున్నాను. దానికి మీ సహకారం కావాలి" అన్నాను.

"జాహ్నవీ నేనొక మాట అడుగుతాను ఏమీ అనుకోకు" అన్నారయన తాపీగా. ఆయనకి తెలుసు మిడిల్ క్లాసు అమ్మాయిల హద్దులు.

ఆయన ఏం అడుగుతారో తెలుసు, అందుకే మౌనంగా ఉన్నా. "నీ చదువు పూర్తిచెయ్యడానికి మీ నాన్నగారి అనుమతి ఉందా?"

నా చదువుకి మా నాన్న అనుమతి ఎందుకు అని తిరిగి ప్రశ్నిద్దామనుకున్నా కానీ సమయం కాదు నేను ఫాదర్ లైక్ ఫిగర్‌తో మాట్లాడుతున్నా.

"నేను ఎమ్.ఎస్.సి పూర్తిచేస్తానని నాన్నగారిని అడిగాను. ఆయన ఏవిషయం చెప్పలేదు. అందుకే మీ సహకారం కావాలని అడుగుతున్నా. మళ్ళీ ఏడాది మొదలు పెట్టి ఫైనల్ చెయ్యాలంటే నాన్న ఒప్పుకోరు. ఇంత కష్టపడి ఒకటిన్నర ఏళ్ళు చదివి దాన్ని మధ్యలో వదిలి వేయడం నాకిష్టం లేదు. ఒక వేళ మీ సహకారం ఉండి, నేను ఎమ్.ఎస్.సి పూర్తి చేయగలిగితే ఆయనకి ఇష్టమే. మీరు ఏదైనా సలహా చెప్తారేమోనని వచ్చాను మాష్టారూ" అన్న. నా గొంతులో ప్రాధేయపడుతున్న లక్షణాలు ఆయన గుర్తించారు. నేను క్లాసులకి ఎటెండ్ అవకుండా రాయడం కుదురుతుందా? అని అడుగుతున్నట్టు అర్థం అయింది. ఆయన చిరునవ్వు నవ్వుకున్నారు. మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నారు.

"జాహ్నవీ నీకు ఎన్ని నెలలు పోయాయి?"

"మూడు నెలలు."

"సరే ఏ విషయంలో కాలేజీలో కనుక్కుని, ఏది వీలయితే అలా ఏర్పాటు చేస్తాను. నువ్వు తర్వాత వచ్చి కలువు." అన్నారు. సదాశివరావుగారు. దీర్ఘంగా ఆలోచిస్తూ.

ఆయనకి నమస్కరించి వెళ్ళడానికి లేచాను.

"జాహ్నవీ నీ గుండెలమీద మచ్చని, ఏ డెర్మటాలజిష్టుకో చూపించు. మచ్చపోయే అవకాశం ఉంది" అన్నారు సదాశివరావుగారు. ఆయన్ని కూడా మచ్చ ఆకర్షించింది. నాలో గిల్టీ కాన్షస్ మేల్కొంది. ఆయనతో "అలాగేనండి" అన్నా. వెనక్కి తిరిగి వచ్చేస్తుండగా కళ్ళు చెమర్చాయి.

●●●

కొన్ని రోజులు తీవ్రంగా ఆలోచించి, సిగ్గుపడకుండా డెర్మటాలజిష్టు ఏ ప్రశ్న అడిగినా చెప్పడానికి సిద్ధపడి వెళ్ళా. ఆయన మచ్చని చూసి పోతుందని చెప్పలేను గానీ, చాలా వరకు మార్పు తీసుకురావచ్చు. అంటూ "రెటినా - ఎ - 0.025' క్రీమ్ ప్రిస్క్రిప్షన్ రాసాడు. తర్వాత డాక్టరు నవ్వుతూ "మీకో సలహా చెప్పనా?" అన్నాడు.

"చెప్పండి" అన్నా నిర్లిప్తంగా, మచ్చ గురించి ఎవరు ఏం మాట్లాడినా చికాకుగానే ఉంటుంది.

"మీరు చీరకి బదులు "చుడిదార్ - కుర్తా" వేసుకోండి. దాని వల్ల మచ్చని దాచవచ్చు. అంతేకాదు ఆ క్రీమ్ రాసాక సూర్యరష్మి తగలకుండా చూడండి" అన్నాడు.

ఇంతవరకూ తను చుడీదార్ - కుర్తా వేసుకోలేదు. ఇప్పుడు బావుంటాయా? అయినా ఈ విషయంలో తండ్రి, తల్లి ఏమంటారో? అనే ఆలోచనలో పోయింది. కానీ డాక్టరుగారి మందుకన్నా, సలహా బాగా నచ్చింది.

●●●

డాక్టరుగారి సలహా విన్న తర్వాత ఒక మంచి కాటన్ చీర తీసి, టైలరు కిచ్చి, చుడీదార్ - కుర్తా కుట్టించా. అది వేసుకున్న రోజున, అమ్మ కోపంతో చిందులు తొక్కింది. పరంపరని చెడగొట్టినట్టు హంగామా చేసింది. అయిన బాగోతం చాలక వేషాలేసి మరీపేరు తెచ్చుకోవాలి గావాలు, అంటూ నిలేసింది. ఇప్పుడందరూ ఇవే వేసుకుంటున్నారు.

అంటే అందరి సంగతీ నాకనవసరం అంటూ గొడవ చేసింది.

"ఈ మార్పేమిటి జాహ్నవి" అని అడిగారు నాన్న.

"మచ్చ కనబడకుండా" అన్నా. నా సమాధానానికి, రజని, అన్నయ్య, తండ్రి ఒప్పుకున్నారు. మెచ్చుకున్నారు కూడా. కానీ అమ్మని వప్పించలేకపోయా.

●●●

నే గదిలో చదువుకుంటున్నా పక్కింటావిడ హాల్లో కూర్చుని అమ్మతో మాట్లాడుతోంది. ఆవిడ అమ్మ కన్నా కాస్త పెద్దది. ఆవిడే ఎక్కువ మాట్లాడుతోంది. ఆవిడ మాటల మధ్య "మీ జాహ్నవి చుడీదార్ - కుర్తా వేసుకుంది. చాలా బావుంది సుమండీ" అంది.

"ఆ! ఏం బావుంది, ఇప్పటివరకూ, మా ఇంట్లో ఎవరం వేసుకోడం ఎరగం, అయినా ఇదేమన్నా చిన్నపిల్లా, ఇరవై మూడేళ్ళు వచ్చాయి. చక్కగా చీరకట్టి పైట వేసుకోక" అంది అమ్మ.

అంత పెద్దావిడ నవ్వేసింది. మీకో విషయం చెప్పనా "ఏదేనా మార్పులు మన మనసుకు నచ్చి, మనం వాటిని ఒప్పుకునేసరికి చాలా సమయం పడుతుంది. అదే వయసులో పిల్లలు, వెంటనే వాటికి అలవాటు పడిపోతారు. నా పెళ్ళైన కొత్తలో అంటే ముప్పై ఏళ్ళ క్రితం, క్రొత్తగా బ్రాలు వచ్చేవి. అవి సానివాళ్ళే వేసుకుంటారని, సంసారి వాళ్ళకి తగవని ఈసడించుకునేవాళ్ళు పెద్దలు. ఎందుకంటే పొడుచుకొచ్చినట్టున్న ఆ షేపులు, ఆ లేసులు కొందరికి అసభ్యంగా అనిపించేవి. ఇప్పుడో మా అమ్మాయి షాపు కెళ్ళి తర్టీటూ బ్రా ఇవ్వండి అని అడుగుతుంది. "తర్టీటూ" ఏమిటే అని అడిగాను. మొదట్లో తెలీక "కొలతమ్మా" అంది. దానికి అసలు ఎబ్బెట్టుగా అనిపించలా! "

"సిగ్గు లేదే నీకు" అన్నాను.

లోపల కూర్చుని చదువుకుంటున్న నాకు నవ్వాగలేదు.

●●●

కష్ట సమయాల్లో మెల్లగానూ, సంతోష సమయాల్లో తొందరగానూ, కాలం నడుస్తుంది.

హెడ్ సదాశివరావుగారి అనుమతి లభించడం, నే పరీక్షలు రాయడం ఫస్ట్ క్లాసులో పాసవడం జరిగాయి. పరీక్షలు అయిపోయి రెండు నెలలు అయింది. ఇంటి వాతావరణం శాంత పడినట్టు కనబడింది. కానీ ఆ వాతావరణంలో అశాంతి ఉందని నేనూహించలేదు.

ఆ రోజు నిద్రలేచినా బద్ధకంగా పడుకున్నా.

"జాహ్నవి ఇంకా లేవలేదా?" అని అడుగుతున్నారు విసుగ్గా నాన్న.

ఆ విసుగు ఎందుకో అనుకున్నా. ఎప్పుడూ "జన్నూ" అని ముద్దుగా పిలిచే తండ్రి, ఆ గొడవ జరిగిన దగ్గర్నుంచి జాహ్నవి అని పిలుస్తున్నారు.

ఒక నెలరోజులుగా మళ్ళీ జాహ్నవి పేరుతో విసుగు, చిరాకు కలసి వినిపిస్తున్నాయి. తండ్రి విసుగు మనసులో ముల్లులా గుచ్చుకుంటుంది. మెల్లగా పక్కమీంచి లేచి హాలులోంచి బాత్రూములోకి వెళ్ళా. కార్యక్రమాలు ముగించుకుని, ఫ్రిజ్‌లో ఫిల్టర్ తీసి కాఫీ కలుపుకుని తిరిగి నా గదిలోకి వచ్చి మొత్తం బుక్ రేక్ అంతా వెదికి 'తిలక్' 'అమృతం కురిసిన రాత్రి' పుస్తకం తీసా కానీ చదివే అవకాశం ఇవ్వకుండా చిన్నా గదిలోకి వచ్చాడు.

"చిన్నక్కా నిన్ను నాన్న రమ్మంటున్నారు" అన్నాడు.

"ఎందుకు?" అని అడిగితే ఎందుకో తెలియదన్నట్టు పెదిమి విరిచి రమ్మన్నట్టు సైగ చేసి వెళ్ళిపోయాడు.

నేను హాల్లో అడుగుపెట్టేసరికి కుటుంబ సభ్యులు, అంతా కూర్చుని ఉన్నారు. వారు కాక నాన్నగారి స్నేహితులు రాజుగారు కూడా ఉన్నారు. అంటే పంచాయితీ జరుగుతోందన్నమాట. దేని గురించి?

"రా జాహ్నవి కూర్చో" అని ఎవరూ పిలవలేదు. నే వెళ్ళి అమ్మ వెనుక సోఫాని ఆనుకుని నిలబడ్డా. అందరిలో తేడా కనబడుతోంది, ఏం కారణం వల్ల కుటుంబ సభ్యులు మౌనంగా ఉన్నారో అర్థం కాలేదు.

రాజుగారు గొంతు సవరించుకుని 'జాహ్నవి కూర్చో' అన్నారు

నే నిలుచున్న స్థానం నుండి కదలలేదు. కూర్చోలేదు. కూర్చుంటానేమోనని ఎదురు చూసి, నే కూర్చోక పోవడంతో ఆయనే మొదలు పెట్టారు.

"నీకు జరిగిన అవమానంలో నీ బాధ్యత ఎంతో తెలీదు. కానీ, ఆ దుర్ఘటన ఛాయలు, మీ కుటుంబ సభ్యులని, వెన్నాడకుండా చూసే బాధ్యత నీకుంది."

నాకు ఆయన చెప్పే విషయాలు ఏమిటో అర్థం కావడంలేదు. మళ్ళీ కొత్తగా పాత విషయాలు ఎందుకు పైకి వస్తున్నాయి? నాకు అర్థం కాలేదు. మళ్ళీ కొత్తగా ఏం జరిగింది? మౌనంగా ఆయన చెప్పింది వినడం తప్పించి నేనేం చేయగలను?

"పాత విషయాలు బైటకి తీసి నీకు బాధ కలిగించిన మాట నిజమే అప్పుడు ఆగిపోయిన చదువు అలా ఆగిపోయివుంటే బావుండేది. కానీ దాన్ని నువ్వు పూర్తిచేసావు. అప్పుడే ఆయనకి అనిపించింది. అది అక్కడ ఆగదని నువ్వు ఉద్యోగం ఆ తర్వాత పెళ్ళి చేసుకోనని మొండికేసే అవకాశం ఉన్నాయని, మీ నాన్న అవనీ, నేను అవనీ సామాన్య మధ్య తరగతి కుటుంబీకులం, మా కుటుంబంలో ఎవరో ప్రత్యేకంగా ఉండి, వాళ్ళు అందరి నోళ్ళలోనూ నలగడం మేం సహించం అందరి ఇళ్ళల్లో జరిగేటట్టు, ఆడపిల్లలకి ఏదో కొంత చదువు తర్వాత పెళ్ళి సంసారం లాంటివి ఆలోచించగలమే గాని అంతకు మించి ఆలోచించలేకపోతున్నాం.

ఒక తండ్రిగాని, తల్లిగాని, అన్నగాని, అక్కగాని, తన కూతురికి, లేదా చెల్లెలికి నలుగుర్లో అవమానం జరిగింది, అన్నది జీర్ణించుకోలేరు. జరిగాక తప్పదు గాబట్టి సరిపెట్టుకుంటారు. రోగగ్రస్తమైన అంగాన్ని శరీరం నుండి కోసెయ్యం కదా, రోగాన్ని భరిస్తాం బాగుచేసుకుంటాం. కానీ అదే అంగం మాటిమాటికి బాధపెట్టి మిగతా శరీరాన్ని పాడు చేసే అవకాశం ఉంటే తప్పకుండా దాన్ని నరికేస్తాం. నిన్ను భరించి, నీకు జరిగిన అవమానాన్ని సరిపెట్టుకున్నా, నీ కుటుంబం నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు చేసే ప్రతీ పనిని సమర్థిస్తుందనుకోకు. ప్రస్తుతం మీ నాన్నగారు రజనీకి, నీకూ సంబంధాలు చూస్తున్నారు. నువ్వు బుద్ధిగా ఆయన చెప్పినట్టు వింటావని ఆయన ఆశ!"

గదిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది. రాజుగారు చెప్పాల్సింది అయిపోయింది అన్నట్టుగా సోఫాలో వెనక్కి వాలారు.

ఆయన చెప్పిన దానికి నే స్పందించాలి. నాన్న పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నాడు. పెళ్ళి చేసుకోడమా? చేసుకోకపోవడమా? అన్నది కాదు సమస్య. అందుకు తన మనసు సిద్ధంగా ఉందా? లేదా అన్నది. ఎందుకు లేదు. ఎందుకో తన జీవితం పెళ్ళితో సెటిలై అదే జీవితం అయిపోతుంది. అంటే నమ్మబుద్ధి కావడంలేదు. తాత్కాలికంగా ఈ పెళ్ళి కంపల్షన్ నుండి తప్పించుకోవాలి. ఎలా? ఉద్యోగం ఒక్కటే తనకున్న ఆసరా. కొన్నాళ్ళ తర్వాత మనసు సమాధానపడచ్చు. అప్పుడాలోచించవచ్చు ఏం చెయ్యాలా? అని ఆలోచన నుండి తేరుకుని.

"ఉద్యోగం చేద్దామనుకుంటున్నాను అంకుల్" అన్నా.

తల్లిగాని, తండ్రిగాని, చలించలేదు. అంటే తన నిర్ణయం గురించి వాళ్ళకి ముందే తెలుసా? అలా తెలియడానికి అవకాశం ఏదీ? నా ఆలోచనలకు అడ్డుకట్ట చేస్తూ రాజుగారు గొంతు సవరించుకున్నారు.

"నీ నిర్ణయం మాకు తెలుసు, మణి రాసిన ఉత్తరం మేం చదివాం, ఆమెని నువ్వు ఉద్యోగం వెతకమన్నావని రాసింది. ఇంకా మీరిద్దరూ మాట్లాడుకున్నవాటి గురించి రాసింది. మీ నాన్నగారి మాటకాదని ఈ ఇంట్లోంచి స్వతంత్రంగా దూరంగా వెళ్ళడం, ఆయనకి ఇష్టంలేదు. లేనిపోని ఆలోచనలు పెట్టుకోకు. కుదురుగా ఉండు. అని హెచ్చరించడానికే నీకు ఇదంతా చెప్పడం. మణి నిన్ను వారం రోజుల్లోగా రమ్మని రాసింది. కానీ ఆ ఉత్తరం నెల రోజుల క్రిందే వచ్చింది. మీ నాన్న అప్పుడే నీతో ఆ విషయం మాట్లాడుతానన్నారు. కానీ నువ్వు మొండిగా వెళతానంటే, ఘర్షణ జరుగుతుందని, నేనే ఊరుకోమన్నాను. ఇప్పుడు ఆ ఉత్తరంలో రాసినట్టు, నువ్వు వెళ్ళినా ఉద్యోగం ఉండదు. కాబట్టి భవిష్యత్తులో కూడా లేనిపోని, ప్రయత్నాలు చేయకు. ఒకసారి ఏ నిర్ణయమేదైనా తీసుకుని బయటికి, అడుగుపెడితే, నువ్వు ఇంటిలో శాశ్వతంగా స్థానాన్ని కోల్పోతావు. అది జ్ఞాపకం ఉంచుకో. ఇది నా హెచ్చరిక కాదు. మీ నాన్నగారి నిర్ణయం"

మణి ఉత్తరం రాసిందన్న విషయం ఆనందాన్ని కలిగించింది. మిగతా తర్జన భర్జనలన్నీ పెద్దగా బుర్రకెక్కలేదు. విశాఖపట్నం నుండి మణి ఉత్తరం రాసింది. రమ్మని రాసుంటుంది. తను సమయానికి వెళ్ళలేక పోయింది. మణి నాతో డిగ్రీ తీసుకుంది. కాన్వకేషన్‌కని మణి వచ్చినప్పుడు, తను మణితో కొత్త వాతావారణంలో చదువుసాగించాలని, దానికి ఆర్థిక సాయం కావాలని, మణి నాన్నగారి, ఇన్ ఫ్లూయెన్స్ ఉపయోగించి, యూనివర్శిటీలో ఉద్యోగం వెతికి పెట్టమని, కోరింది. మణి తను చాలా సీరియస్‌గా ఉద్యోగం వెదుకుతానని ప్రామిస్ చేసింది. కానీ రెండు నెలలైనా లెటరు రాకపోతే, ఆ ఆశ వదిలేసుకుంది. మణి మోసం చెయ్యలేదు. నాన్న భయపడ్డారు. మళ్ళీ తను బయట అడుగు పెడితే ఏం చేస్తానో? అని అందుకే ఉత్తరం నొక్కిపెట్టి, మళ్ళీ అలాంటి ప్రయత్నాలు చెయ్యవద్దని హెచ్చరించారు.

●●●

తండ్రి హెచ్చరిక చేసిన తర్వాత రెండు రోజుల పాటు దువిధలో పడ్డా. తండ్రిని కాదని ఉద్యోగం వెతుక్కుంటూ, మణి దగ్గరకి వెళ్ళిపోవడమా? లేక మళ్ళీ అవకాశం వచ్చేవరకూ, ఇక్కడే ఉండడమా? అనే ఆలోచన తెగలేదు. పెళ్ళి, పెళ్ళిచూపులు అనే పేరుతో జరిగే తతంగం తలచుకుంటే చికాకు.

అందరి ఆడపిల్లలాగ తనకి, తల్లి, తండ్రులనీడ, రక్షణ ఎక్కువ అవసరం అనిపించడంలేదు. మరి ఉన్న పాటున వెళ్ళిపోతే రోజు గడవడం కష్టం అవుతుందా? ఎంత మంచి అవకాశం, మణి ఉత్తరం తండ్రిచేతులో పడడం వల్ల పోయింది. అసలు పరిస్థితి ఏమిటో? మణిని అడిగి తెలుసుకోవాలి, ఉత్తరాల వల్ల, కాలం జాప్యం అవడం, మళ్ళీ మణి ఉత్తరం తండ్రి చేతుల్లో పడడం, పెళ్ళి ప్రయత్నాలు తప్పించి, ఫలితం ఉండదు. మణికి ఫోను చేయాలి.

నిర్ణయానికి వచ్చిన రెండు రోజులకి ఇంట్లో తల్లీ, తండ్రి రజనీ లేకుండా చూసి, మణికి ట్రంక్ డయల్ చేసా. ఆ కొసనుండి మణి పలికింది. "ఉద్యోగంలో జాయిన అవడానికి రాలేదేం" అంది.

"పోస్టల్ డిలే అయింది. నీ ఉత్తరం వచ్చి రెండు రోజులే అయింది. ఇప్పుడు బయలుదేరిరానా?" ఇంట్లో పరిస్థితులు మణికి అనవసరం చిన్న అబద్ధం.

"ఆ పోష్టు ఎప్పుడో భర్తీ అయిపోయిందే, నాన్నగారు నీ గురించి పదే పదే అడిగారు. కూడా ఇప్పుడెలా?" మణి సందేహం.

"అయితే ఇంక వీలవదా?"

"జాహ్నవీ ఇక్కడికి వచ్చేయ్ ఏదో ఒకటి ప్రయత్నించవచ్చు. నువ్వు ఇక్కడుంటే నాన్నగారికి నమ్మకం పెరుగుతుంది. తీవ్రంగా ప్రయత్నాలు కూడా చేస్తారు." అంది మణి.

మణి చెప్పినట్టు వెళ్ళడమా? లేక ఇక్కడే ఉండి ఉద్యోగానికి ప్రయత్నించడమా? అని క్షణం ఆలోచించింది. కానీ ఈ అవకాశం మళ్ళీ రాకపోవచ్చు. మణి అంత ఖచ్చితంగా చెబుతున్నప్పుడు ఉద్యోగం దొరికే తీరుతుంది. ఎక్కువసేపు ఆలోచించే అవకాశం లేకుండా.

"ఏం జాహ్నవీ ఎప్పుడు వస్తున్నావ్? నేను స్టేషనుకు వస్తాను. కంగారు పడకు నాన్నగారు తప్పక ప్రయత్నిస్తారు. నా హామీ" అంది ఫోనులో మణి.

"వచ్చే వారంలో ఇదే రోజున బయలుదేరి వస్తాను. స్టేషనుకి రా?"

"గోదావరికి బయలుదేరిరా" అంది మణి.

"అలాగే" అని ఫోను పెట్టేసాను.

●●●

మణితో ఫోనులో మాట్లాడిన సాయంత్రం బంగారం షాపుకి వెళ్ళి చెవిరింగులు, అమ్మేసి, వచ్చిన డబ్బుతో, రైల్వే స్టేషనుకు వెళ్ళి టికెట్ రిజర్వ్ చేయించి దారిలో సూట్‌కేసు కొని, నాతో యమ్.ఎస్.సి చదివిన ఫ్రెండ్ ఇంటిలో పెట్టా, అక్కడనుంచి రోల్డుగోల్డు షాపుకెళ్ళి, జత చెవి రింగులు కొన్నా.

ఆ రోజు నుండి రోజూ ఒకొక్క జత బట్టలు, కావలసిన పుస్తకాలు చిన్న సంచిలో పెట్టి, ఫ్రెండ్ ఇంటికి చేర్చా. అవన్నీ పెట్టెలో సర్దా. ప్రయాణం దగ్గరవుతున్న కొద్దీ, భయం పెరుగుతోంది. నా ప్రయాణం విషయం నాన్నకి తెలిసి, కోపం వచ్చి బలవంతంగా ప్రయాణాన్ని, ఆపు చేస్తాడా? అలా చేస్తే ఏం చేయాలి?

ఇంట్లో దెబ్బలాడి కాదని వెళ్ళిపోయేంత, మానసిక స్థైర్యం తనకుందా? ఏం జరుగుతుంది? అన్న ఆరాటం. తప్పులు జరగకుండా జాగ్రత్తపడాలి, అనుకున్నా. సమయం దొరికినప్పుడు రజని గదిలోకి వెళ్ళి కబుర్లు చెపుతున్నా. మొత్తం ఫేమిలీతో కూర్చుని కబుర్లు చెప్పా. నా ప్రవర్తన తల్లీ, తండ్రిలో నమ్మకం పెంపొందిస్తుందని అది తగినంత స్వేచ్ఛ నిస్తుందని తెలుసు. ఇది ఒకరకంగా తల్లితండ్రులని మోసం చేయడం. కానీ తప్పదు.

ప్రయాణం రోజున ఎంత నార్మల్‌గా ఉందామని ప్రవర్తించినా, మొహంలో టెన్షన్ కనబడుతూనే ఉంది. ఆ రోజు ఆలస్యంగా నిద్రలేచి, నాన్న ఆఫీసుకి వెళ్ళేవరకూ ఎదురుబడకుండా తప్పించుకుని తిరిగా. పదిగంటలకి ఇంటి వాతావరణం సద్దుమణిగాక మనసు కుదుటపడింది.

ఆ మధ్యహ్నమే నాన్నకి ఉత్తరం రాసా.

**నాన్నగారికి,**

నమస్కారం. మీ అభిప్రాయాలని నేను గౌరవిస్తాను. మీరు కూడా, న పరిస్థితిని నా దృష్టి కోణం నుండి, ఆలోచించండి. నేనూ, మీరూ, చెరిపేద్దామనా చెరగని మచ్చ, నా గుండెల మీద ఉంది. దీనితో నేను మీరు చెప్పినట్టు శిరస్సు వంచి మీరు తెచ్చిన సంబంధం చేసుకుంటే, దానిలో స్థిరత్వం ఎంత? తరువాత మనుగడ ఏమిటి? కాబట్టి నేను ఆ రిస్క్ తీసుకోదలచుకోలేదు. అందుకు మనసు అంగీకరించలేదు. ఇదంతా నా భ్రమే కావచ్చు. మీ ఛాయిస్ నాకు నచ్చలేదు.

నేను ఉద్యోగం చేద్దామనుకుంటున్నాను. ఆ తర్వాత ఏం జరుగుతుంది? అన్న విషయం నాకూ తెలీదు. నేను మీ మాట కాదని ఉద్యోగానికి వెళుతున్నానే గానీ, ఇంట్లోంచి పారిపోవడంలేదు. క్షమించగలరు.

**ఎప్పటికీ మీ జాహ్నవి.**

సాయంత్రం వరకూ ఉద్వేగంతో గడిచిపోయింది. ట్రైనుకి ఇంకా గంట టైముందనగా తయారై అప్పుడే కాలేజీ నుండి వచ్చిన చిన్నాని "చిన్నా నీ దగ్గర ఉన్న డబ్బియ్యరా, నాన్నగారు వచ్చాక ఇస్తా" అని అడిగా.

"దేనికి?"

"టైలరుకి ఇవ్వాలి నువ్వు తయారవ్వు టైలరు దగ్గరకి వెళ్దాము" అన్నా.

చిన్నా తన పాకెట్ మనీ తీసి ఇచ్చాడు.

చిన్నా తయారయ్యాక, "అమ్మా నేనూ చిన్నా టైలర్ దగ్గరకి వెళుతున్నాం ఇప్పుడే వచ్చేస్తా. అని హాలులోంచే అరిచా. ఆ గొంతు మామూలు స్వరంలాకాక అరుపులా వచ్చిన స్థాయికి చిన్నాకి ఆశ్చర్యం వేసి ఉండవచ్చు.

అమ్మ లోపలి నుండే 'తొందరగా వచ్చేయండి' అంది కానీ బైటికి వచ్చి నన్ను గమనించి ఉంటే, నా తొందరపాటు గమనించి డౌటు పడి ఉండేదేమో, కానీ అలా జరగలేదు.

చిన్నాతో కలిసి ఫ్రెండు ఇంటికి వెళ్ళి, సూట్‌కేసు తీసుకుని తిన్నగా స్టేషనుకి వెళ్ళా.

పెట్టె చూసిన దగ్గర్నించీ చిన్నా "అక్కా ఎక్కడికి?" అంటూ తెగ ప్రశ్నలెయ్యడం మొదలు పెట్టాడు.

స్టేషనుకి వెళ్ళి నా బోగీ నెంబర్ వెతికి, లోపలికి ఎక్కి, బెర్తుమీద పెట్టె పెట్టా. అప్పటికి చిన్నాకి అక్క వెళ్ళిపోతోందని అర్థం అయింది. అప్పుడు చిన్నా 'అక్కా ఎక్కడికి?' అని ప్రశ్నించలేదు.

"అక్కా వెళ్ళిపోతున్నావా?" అన్నాడు.

●●●

"హలో జాహ్నవీ" అంటూ పలకరించింది మణి, పరిసరాల్ని మరచి గతాన్ని సమీక్షించుకుంటున్న నేను ఆనందంతో మణి చేతిని, తన చేతిలోకి తీసుకుని స్నేహపూర్వకంగా నొక్కా.

మణికారు డ్రైవరు వచ్చి నా సూట్ కేసు అందుకున్నాడు. నేను మాట్లాడకుండా, మణిచేతిని పట్టుకునే ఉన్నా. ముగ్గురుం స్టేషను బైటకి వచ్చి కారులో మణి ఇంటికి చేరుకున్నాం.



కౌముది

మణి నా క్లాస్ మేట్. ఇద్దరం యూనివర్శిటీలో అంత పెద్ద స్నేహితులం కాము. ఎందుకంటే ఎప్పుడూ ఫాస్ట్‌గా రాజకీయనాయకత్వ పరిచయాలతో ప్రత్యేకంగా ఉండేదాన్ని. మణి ఖరీదైన అలంకరణంతో లేవిష్ స్పెండింగ్‌తో గొప్పదానన్న గర్వంతో ఉండేది. నా పాపులారిటీ తనకీ ఉండాలనే తపనతో కావాలని స్నేహితురాళ్ళని తనతో తిప్పుకునేది. దానికోసం బాగా డబ్బు ఖర్చు చేసేది మణి.

కానీ, మణి చుట్టూ చేరిన పరిచయస్థులు, స్నేహితులై మళ్ళీ పరిచయస్థులుగా మారిపోతుండేవారు. వాళ్ళు మణికి అహంకారం అని ప్రచారం చేస్తుండేవారు.

నేను చదువు ఆపేసానని తెలిసి, ఇంటికి వచ్చి సానుభూతి చూపించింది మణి. కాలేజీలో ఇద్దరి మధ్య ఏర్పడ్డ కాంపిటీషన్ కేవలం ఆ వాతావరణానికే పరిమితమైనది. కావడం వల్ల తదనంతరం జీవితంలో వాటి తాలూక ప్రభావం లేకపోవడం వల్ల, నా రాక మణికి ఆనందం కలిగించింది.

సాయంకాలం నన్ను తండ్రికి పరిచయం చేసింది.

సమయానికి నే రాలేకపోయినందుకు ఆయన విచారించారు. మళ్ళీ సమయం కోసం, ఎదురు చూడాలి అన్నారు. ఈలోగా ఏదేనా ఇంకొకటి ప్రయత్నిద్దామన్నారు.

నేను విశాఖపట్నం వచ్చిన అయిదో రోజు చిన్నా నుంచి ఉత్తరం వచ్చింది.

**అక్కకి.**

నువు రాసిన ఉత్తరం నాన్నగారి టేబుల్ మీద పెట్టాను. అది ఆయన చదివి చాలా కోపగించారు. వెంటనే రాజుగారింటికి వెళ్ళారు. ఆ రోజు రాత్రి పన్నెండయితేగానీ తిరిగి రాలేదు.

అమ్మ నేను అన్నయ్య చాలా గాబరాపడ్డాం. అందరి అనుమానాలు ఆయనేమైనా కాని పనిచేస్తారేమోనని భయపడ్డాం. అమ్మ నిన్ను తిట్టింది. ఎంతో బాధపడింది. నేను అన్నయ్య రాజుగారింటికి వెళ్ళాం. ఆయనలేరు.

నాన్నగారు వచ్చి ఆయన లేరంటే వెళ్ళిపోయారని చెప్పారు ఆంటీ. నాన్న ఎక్కడికి వెళ్ళారు? అంటూ చాలా తిరిగి వెదికాం ఎక్కడా కనబడలేదు. ఇంటికి చేరుకుని ఎదురు చూడ్డం తప్ప చేసేదేం లేదనిపించింది.

ఆ రోజు ఇంట్లో భోజనాలు లేవు. రజని అమ్మ పక్కనే కూర్చునుంది. అన్నయ్య, నేను మాటిమాటికీ బైటకి వచ్చి చూసాం. నాన్నగారు ఏదేనా అఘాయిత్యం చేస్తారేమో? అన్న అనుమానం అందర్నీ పీడించింది.

పన్నెండుగంటలకి నాన్నగారొచ్చారు. "అది చచ్చింది అనుకుంటా. దాని గురించి మీరెందుకండీ బాధపడ్డం" అంటూ అమ్మ ఏడ్చేసింది.

నాన్నగారి మొహం పీక్కుపోయింది. నువ్వు నాన్నగారిని బాధపెట్టావు అనిపించింది. నాన్నగారు చెప్పినట్టు వినవచ్చుగా పెళ్ళి చేసుకుంటే ఏం పోయింది. అంటూ అన్నయ్య నిన్ను చాలా అసహ్యించుకున్నాడు.

ఆ రోజు రాత్రి పన్నెండుగంటలకి భోజనాలు చేసాం. మర్నాడు నాన్నగారు, అన్నయ్య విశాఖపట్నంకి ప్రయాణం కట్టారు. ఇంట్లో అనీజీనెస్ ఎవరూ కాదనలేరు. మధ్యాహ్నం పన్నెండుగంటలకి రాజుగారొచ్చారు.

ఆయనొచ్చాక ఏదో చర్చమొదలైంది. నాన్నగారు వెళితే నువ్వు వెనక్కి వస్తావా? రావా? రాకుండా మొండిగా ఉంటే ఏం చెయ్యాలి? ఎక్కడో పరాయిచోట ఘర్షణ పడ్డం మంచిదా? దానివల్ల లాభం ఏమైన ఉందా? అని చాలాసేపు చర్చించారు.

అమ్మయితే నీ విషయం ఎత్తడం దండుగ అన్నట్టు మాట్లాడింది. రాజుగారి మాటలతో అందరికీ అర్థం అయింది. నువ్వు రావని అక్కడికి వచ్చి ప్రయోజనం లేదని.

కొన్నాళ్ళకి నువ్వు మనసు మారి వెనక్కి వస్తావనే నమ్మకంతో నాన్న అన్నయ్య విశాఖపట్నం ప్రయాణం విరమించారు. కానీ ఇంట్లో వాతావరణం ఇంకా సర్దుకోలేదు. ముఖ్యంగా నాన్నగారు ఇంకా తేరుకోలేదు.

ఇంతమందిని ఇంత బాధపెట్టి నువ్వు సాధించేదేమిటక్కా. వచ్చేయ్.

**నీ చిన్నా.**

చిన్నా ఉత్తరం చాలాసార్లు చదివా. ఏం రాసాడో అర్థం కాలేదు. తండ్రిని కుటుంబాన్ని బాధపెట్టిందా? బాధపెట్టినట్టే ఉంది.

దానికి నా బాధ్యత ఎంత? నే బాధపడలేదా? ఇప్పుడు కూడా పడటం లేదని ఎలా చెప్పగలదు. పెళ్ళిచూపులు, నచ్చడం బేరసారాలు నిరాకరణ నిరుత్సాహం అన్నింటినుండీ తప్పుకుంది అంతే.

నా పెళ్ళి, తండ్రి బాధ్యతగా పడే తపన చికాకు కలిగించింది. అది నాన్నతో చెప్పి ఒప్పించలేదు.

అందుకే ఆ వాతావరణం నుండి తప్పుకున్నా. ఇవన్నీ చెపుతూ నాన్నకి ఉత్తరం రాద్దామనుకున్నా. చాలాసార్లు ప్రయత్నించా. ఆ ఉత్తరం ఎప్పటికీ పూర్తవలేదు.

మణి తండ్రి ఎంత ప్రయత్నించినా నా కోరిక మేరకు ఎకడమిక్ లైనులో అంటే టీచింగ్ అసిస్టెంట్‌గానో, ట్యూటరుగానో ఉద్యోగం దొరకలేదు. యూనివర్శిటీలోనే ప్రొఫెసర్ సంగమేశ్వరరావు దగ్గర ప్రోజెక్ట్ అసిస్టెంటుగా జాయినయా.

ఉపాధి (ఉద్యోగం) దొరికిన రెండోరోజే, మణి బలవంతం చేస్తున్నా వినకుండా ఉమెన్స్ హాస్టలుకి మకాం మార్చేసాను.

●●●

**నేను ప్రాజెక్ట్ అసిస్టెంటుగా జాయిన్ అయి** రెండు నెలలు దాటింది. ప్రాజెక్ట్ చీఫ్ ప్రొఫెసరు సంగమేశ్వరరావుగారు మేధావి. ఆయనకి యూనివర్శిటీలో "జాదూగర్" అని పేరుంది. అలాంటి ప్రొఫెసర్ జాదూగర్ దగ్గర చేరావు అంది మణి.

యూనివర్శిటీలో రకరకాల మేధావులు. ఈయనో రకం మేధావి. ఈయన మేధస్సంతా ఉపయోగించి యూనివర్శిటిలో బతకడానికి, ఒకదారి కనిపెట్టారు. ఆ దారిలో నిరాటంకంగా నడుస్తున్నారు. ఈయన ఏం మాట్లాడతారో, అది చెయ్యరు. ఈయన ఏం చెయ్యదల్చుకున్నారో, దాని గురించి మాట్లాడరు. ప్రపంచంలో, మనుషుల్లో ఉండే డబుల్ స్టాండర్ట్స్, బద్ధకం, నిరుత్సహం, ఆయనకి ఇష్టమైన టాపిక్స్ గురించి ఆయన గంటల తరబడి లెక్చరివ్వగలరు. రోజూ ఇస్తారు. ఇచ్చిన తర్వాత, యూనివర్శిటి వాళ్ళు ఇస్తున్న జీతానికి తనిచ్చిన లెక్చరుకి సరిపోయింది అనిపిస్తుంది. అప్పుడాయన వాల్తేరు క్లబ్బుకి వెళ్తారు. డబ్బు ఆయనకి తృణప్రాయంగా కనిపిస్తుంది. రెండురూపాయల ష్టేకులో కూర్చుంటారు.

అయితే సంగమేశ్వరరావు ప్రభుత్వం, నుండి ప్రాజెక్ట్స్ తేగల సమర్థుడు. ప్రభుత్వాన్ని ఎక్స్‌పర్ట్స్‌ని, తను ఏ సబ్జెక్ట్‌లోనైనా ఏవిధంగా ప్రాజెక్ట్ నిర్వహించి పూర్తిచేయగలడో చెప్పి ఒప్పించగల దిట్ట. పట్టుకొచ్చిన డబ్బు, ప్రాజెక్ట్ క్రింద ఖర్చుపెట్టి, తను చిప్పపట్టుకునే రకంకాదు. ప్రాజెక్ట్‌కి అవసరం అంటూ ఒక కారు, దానికి అయే ఇంధనం, తను తిరిగే తిరుగుడు ప్రాజెక్ట్ పనికే అని నమ్మి, ఎదుటి వారిని నమ్మింపచేయగల సమర్థుడు, అంటూ చాలా చెప్పింది మణి. చెప్పింది వినడం తప్ప చేసేదేముంది. మా నాన్నకి ఆయన మీద పెద్ద అభిప్రాయం లేదు కానీ- నీ అవసరం అలాంటిది - అంటూ సంజాయిషీ ఇచ్చుకుంది కూడా.

●●●

జాయిన్ అయిన దగ్గర్నించీ లేడీస్ హాస్టలు, లైబ్రరీ, కాలేజీ, సాయంకాలం రామకృష్ణాబీచ్, తప్ప ఇంకెక్కడికి వెళ్ళాలనిపించడం లేదు. మణిని కూడా కలవడం లేదు. నాకు వచ్చే పన్నెండొందల రూపాయలు హాస్టలు ఖర్చులకి, పై ఖర్చులకి సరిపోతున్నాయి. ఒక్కోరోజు హుషారుగానూ, ఒకొక్క రోజు నిర్లిప్తంగా గడిచిపోతున్నాయి రోజులు.

ఇంట్లో మనుషులు అప్పుడప్పుడు జ్ఞాపకం వస్తున్నారు. కానీ ఆ ఇరుకైన ఇంటి వాతావరణం నుండి ఈ స్వేచ్ఛ కొంత ఊరట కలిగిస్తోంది. జీవితం యాంత్రికంగా మారిపోడంతో ఆలోచనల హోరు, మనసంతా ఆక్రమించి ఇంట్రావర్ట్‌గా తయారయానేమో అనిపిస్తోంది. అప్పుడప్పుడు మణి నా ఒంటరితనన్ని డిష్టర్బ్ చేస్తోంది.

●●●

జాయిన్ అయిన ఏడాదికి ఓరోజు మణి తండ్రి "సంగమేశ్వరరావు నీకు వేరే ఉద్యోగం చూస్తున్నాడు. అతను తన జాదూ చూపిస్తాడు" అన్నారు.

"నా మీద అభిమానమే"

"కాదు అతనికేదో అవసరం పడివుంటుంది" అన్నారు.

ఇది జరిగిన కొద్దిరోజులకి సంగమేశ్వరరావు నన్ను తన రూములోకి పిలిచాడు.

"జాహ్నవీ మార్చి వచ్చేస్తోంది. ప్రాజెక్ట్ కోసం నువ్వు చేసిన పని చాలా బావుంది. నువ్వు తీసుకున్న రెమ్యూనరేషన్ లేదా సాలరీ బిల్స్ మీద సంతకం పెట్టలేదు. ఇవన్నీ పూర్తిచేసి నిన్ను పిలుద్దామనుకున్నాను. కానీ వీటిని పూర్తిచేయడం కుదరలేదు. " అంటూ ఆమె సాలరీ తీసుకున్నట్టు వోచర్స్ మీద సంతకం పెట్టమని, ఆమె ముందు పెట్టాడు. ఆ వోచర్స్‌లో ఆమెకి పదిహేను వందలు ఇస్తున్నట్టుగా ఉంది. జాహ్నవి అమాయకంగా "సర్ ఇందులో పదిహేనువందలు ఉంది" అంది.

"ఆ! ఆ! మిగతా డిఫరెన్స్ ఇస్తాను. ఎక్కడికి పోతుంది?" అన్నాడు నవ్వుతూ "అంతేకాదు నువ్వు ఎక్కడికి వెళ్తావు. నీలాంటి పనిమంతురాల్ని యూనివర్శిటి ఒదిలేసుకుంటే ఎలా? అందుకే నీ విషయం వైస్ ఛాన్సలర్‌తో మాట్లాడాను. ఇదిగో ఇది విప్పి చూసుకో" అంటూ ఎపాయిమెంటు లెటరు ఇచ్చాడు.

ఆ లెటరులో జాహ్నవిని న్యూక్లియర్ ఫిజిక్స్ డిపార్టుమెంటులో ట్యూటరు పోష్టులో కన్సాలిడేటెడ్ "పే" మీద ఎపాయిమెంట్ చేస్తున్నట్టుగా ఉంది. అది చూసిన తర్వాత నా ఆనందం అవధులు దాటింది. సంగమేశ్వరరావు దేవుడిలా కనిపించాడు.

ఆయన చెప్పిన రసీదుల మీద చకచకా సంతకం పెట్టేసాను. వాటిని చూడనుకూడా లేదు. నాలుగు రోజుల తర్వాత నన్ను పిలిచి "ఇదిగో నీ బేలన్స్ మని" అంటూ మూడువేల ఆరొందలూ ఇచ్చేసాడు. దాంతో జాహ్నవికి ఆయన నిజాయితీ మీద తిరుగులేని నమ్మకం ఏర్పడింది.

ఆ డబ్బులోంచి వెయ్యి రూపాయలు పెట్టి ఒక హౌస్ హోల్డ్ ఆర్టికల్ కొని ఆయనకి, ప్రెజెంట్ చేసింది. "అబ్బే ఎందుకూ?" అంటూ పుచ్చుకున్నాడు. సంగమేశ్వరరావు.

●●●

జాహ్నవి అన్న పేరుని రిజిష్టరులో చూసి ఎదురుగా సంతకం చేసా, ఉద్యోగంలో చేరిన రెండు నెలలకిగాని కొత్త ఎకడమిక్ ఇయర్ మొదలవదు.

సెమిష్టర్ బ్రేక్. పనిలేదు. ఆ సమయంలో డిపార్ట్‌మెంట్ స్టాఫ్ ఒక్కొక్కరే పరిచయం అయారు.

డాక్టరు భీమప్రసాద్ ఆ డిపార్టుమెంటుకి హెడ్ గంభీరంగా, తనపని తను చేసుకుపోయే మనిషి ఆయన స్టాఫ్‌ని పట్టించుకోరు. నిదానం ఎక్కువ. డిపార్ట్‌మెంటులో విద్యార్థుల మధ్య ఏ సమస్య వచ్చినా గాబరా పడరు. అలాగని పరిష్కారం చెయ్యరు. సమస్య దానంతట అది పరిష్కారం అయేవరకూ ఓపిగ్గా వేచి ఉండగల, ఏబుల్ ఎకడమికల్ ఎడ్మినిస్టేటర్, ఆయన కాక డిపార్టుమెంటులో మరో ఇద్దరు ప్రొఫెసర్లు, ముగ్గురు రీడర్లు, ఇద్దరు లెక్చరర్లు, ముగ్గురు టీచింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

భీమప్రసాద్ తర్వాత సీనియర్ ప్రొఫెసర్ పూర్ణానందం ఆయనకి ఆ పేరు ఎవరు పెట్టారోగానీ, ఆయన ప్రతి మాటకి ముందో, వెనుకో నవ్వి తీరతారు. ఆయన హృదయం చాలా మంచిదని, ఎదుటి వాళ్ళు నమ్మడం లేదని ఆయన తపన, అందుకే ఆయన జీవితంలో ఎవ్వరినీ నమ్మలేదు. ఆ విషయం దాచలేదు. అందుకే ఆయన మాట వంకలు తిరిగిన హరివిల్లులా ఉండి, నవ్వు విల్లువిరిగి ఫెళ్ళుమన్న, చప్పుడులా ఉంటుంది.

మూడో ప్రొఫెసరు వెంకటరత్నం, ఈయనికి మంచి టీచరనే పేరుంది, కానీ ఈయనది చిన్నపిల్లాడి మనస్తత్వం, ఈయన మాట ఎవరేనా ఖండిస్తే, లేదా కొంచెం వ్యతిరేకంగా మాట్లాడితే, ఈయన ఉడుక్కుంటాడు. కోపం వచ్చేస్తుంది. ఎదుటివాడిని శత్రువుగా పరిగనించే తీవ్రప్రకృతి, ఈయన బలహీనత ఈయనకి కులం మీద ఉన్న విపరీతమైన అభిమానం. వీరుకాక డిపార్టుమెంటులో డా.శాంతాదేవి, సోమేశ్వరరావు, జ్ఞానప్రభాకర్, రాజేంద్ర కాశ్యప చెప్పుకోతగ్గవారు.

డిపార్టుమెంటు అంతా రోజూ కలవడం చాలా అరుదు, నే జాయిన్ అయిన పదిరోజులకి డిపార్ట్‌మెంటు స్టాఫ్ మీటింగ్ అయింది.

విద్యార్థులు పరీక్షల తేదీలలో మార్పులు కోరుతూ, ప్రిన్సిపల్‌కి అర్జీ పెట్టారు. పరిస్థితి సమీక్షించడం కోసం అంటే - టీచర్స్ సిలబస్ పూర్తిచేసారా? మిగతా అడ్డంకులేమైనా ఉన్నాయా? సిలబస్ పూర్తిచేయకపోతే ఏం చెయ్యాలి? - అనే విషయం చర్చించి, డిపార్టుమెంటు నుండి రిపోర్టు ప్రిన్సిపల్ గారికి పంపడం కోసం స్టాఫ్ మీటింగ్ ఏర్పాటయింది.

డిపార్టుమెంటు లైబ్రరీలో డిపార్ట్‌మెంట్ స్టాఫ్ మీటింగ్ జరుగుతుంది. నా అవసరం, సలహా ఎవరికీ అక్కరలేదని తెల్సినా అందరు టీచర్లని కలుసుకోవచ్చని డిపార్టుమెంటు మీటింగ్‌కి హాజరు అయాను.

అందరూ సమావేశం అయ్యారు. కానీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంటు భీమప్రసాద్ ఇంకా రాలేదు.

అంతవరకూ ఏవో విషయాలు మాట్లాడుతున్న పూర్ణానందం "మీ పేరు జాహ్నవి అనుకుంటాను కొత్తగా చేరారు. నా పేరు పూర్ణానందం. నన్ను వీళ్ళంతా ప్రొఫెసరు అంటారు." అని పకాలున నవ్వారు.

జాహ్నవి లేచి నమస్కారం చేసింది. తర్వాత పూర్ణానందం ఒక్కొక్కర్నే పరిచయం చేసారు. అందరికీ నమస్కరించింది.

"మీ ఇష్టమైన స్పెషలైజేషన్ ఏమిటి?" రాజేందర్ ప్రశ్న.

"రేడియో బయాలజీ.." జాహ్నవి జవాబు.

"పీటర్ అలెగ్జాండర్ పుస్తకం చదివారా?" ప్రభాకర్ ప్రశ్న.

"ఆ చదివాను అతని బుక్స్ అన్నీ చదివాను." అంది సంతోషంగా ఆ సబ్జెక్ట్ గురించి పట్టించుకునే ఇంకో స్టాఫ్ మెంబర్ కనిపించడంతో.

జ్ఞానప్రభాకర్ నవ్వుతూ "ఈ ప్రపంచాన్ని రేడియేషన్ ఎఫెక్ట్స్ నుండి కాపాడడానికి అవతరించిన అపరజ్ఞానమూర్తిలా ఉన్నారు" అన్నాడు. ఆ కామెంటులో వెటకారం ఉందేమో?

రాజేంద్ర నన్ను డిఫెండ్ చేస్తూ, "పేరులోకన్నా, బుర్రలో జ్ఞానం ఉండడం ముఖ్యం" అన్నాడు.

జ్ఞానప్రభాకర్, రాజేంద్రకాశ్యప క్లాసుమేట్సు. జ్ఞానప్రభాకర్ ఈ యూనివర్సిటీలోనే పి.హెచ్.డి చేసాడు. రాజేంద్ర కాశ్యప స్టేట్స్ వెళ్ళి పి.హెచ్.డి చేసి వచ్చాడు. దానికి అతని మామగారి అండదండలు ఎంతెనా ఉన్నాయని. యూనివర్శిటి స్టాఫ్ ఉవాచ. వాళ్ళిద్దరూ ఒకర్ని ఒకరు మాటలతో దెప్పుకుంటారు. దీన్ని యూనివర్శిటీ భాషలో లెగ్ పుల్లింగ్ అంటారు. కానీ ఉడుక్కోరు. ఇద్దరూ మంచి స్నేహితులు.

రాజేంద్ర కామెంటుకి ధీటుగా సందర్భం లేకపోయినా "అవును నాకు ఏ మామగారూ లేరు, స్టేట్స్ పంపించి జ్ఞానబిక్ష పెట్టడానికి," అన్నాడు ప్రభాకర్.

రాజేంద్రకి వళ్ళుమండింది. "ఇట్ ఈజ్ బెటర్ టు కాంప్రమైజ్ విత్ ఫూల్స్" అన్నాడు కొంచెం విసుగ్గా.

"ష్యూర్ ఐ యామ్ కాంప్రమైజింగ్" అన్నాడు ప్రభాకర్ సమయస్ఫూర్తిగా. మొత్తం టీచర్లు అందరూ నవ్వారు. వాళ్ళుగాని నవ్వకపోతే మిత్రుల్ని కంట్రోలు చెయ్యడం కష్టం, ఇలా నవ్వులు సాగుతూండగా మెల్లగా లోపలికి వచ్చారు భీమప్రసాద్ ఆయన రాకతో వాతావరణం మారింది.

●●●

ప్రీవియస్ విద్యార్థుల పరీక్షలు జరిగిపోయాయి. రిజల్ట్సు వచ్చేసాయి. ప్రీవియస్ వాళ్ళు ఫైనల్‌కి వస్తున్నారు. ఈ ఎకడమిక్ ఇయర్‌లో తన వర్కు లోడ్ ఏమిటో కనుక్కోడానికి, హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు రూముకి వెళ్ళాను. భీమప్రసాద్ చాలా సీరియస్‌గా ఎవరో స్టూడెంట్ చెప్పింది వింటున్నారు. నా రాక ఆయన గమనించి కూర్చోమన్నట్టు చేత్తో సైగచేసారు. ఆయన ఎదురుగా సీటులో కూర్చున్నా.

నే కూర్చున్నాక, ఆయన విద్యార్థి వేపు తిరిగి "ఊ చెప్పు" అన్నారు.

"నేను ప్రీవియస్‌లో వెంకటరత్నంగారి క్లాసు ఒక్కటీ మిస్ కాలేదు. ఆయన తీసుకున్న ప్రాక్టికల్ ఎగ్జామ్స్‌లో అరవైశాతం మార్కులు మాత్రమే వచ్చాయి" విద్యార్థి మొర.

"నువ్వు ఫైనల్ ప్రాక్టికల్ బాగా చేసి ఉండకపోవచ్చు" భీమప్రసాద్‌గారి సందేహం.

"లేదు నేను ఫైనల్ ప్రాక్టికల్స్ మౌఖిక పరీక్ష రెండూ బాగా చేసాను." విద్యార్థి సమాధానం.

"నువ్వు బాగా చేసావని నీ ఉద్దేశం నువ్వు అరవైమార్కులకే అర్హుడవని ఎక్జామినర్ల ఉద్దేశం, చూడు శశిధర్ ఇలా ఎవరికి వారి అభిప్రాయాలు ఉంటాయి"

భీమప్రసాద్ లాజిక్, శశిధర్ బుర్రకి ఎక్కలేదు. అతను వెళ్ళిపోలేదు. తనకి తక్కువ మార్కులేకాక తన ఈ కంప్లైంట్ వెనుక ఇంకో బలమైన కారణం ఉంది అని చెప్పడమా? వద్దా? అతని సందేహంలా ఉంది.

అతని సందేహం గ్రహించిన భీమప్రసాద్‌గారు "పర్వాలేదు సందేహించకు, నీకు తెలిసిన విషయం చెప్పు" అన్నారు. శశిధర్ సందేహిస్తూనే "రవీంద్రకి తొంభై శాతం మార్కులు వచ్చాయి." అన్నాడు.

భీమప్రసాద్ కళ్ళజోడు తీసి మొహాన్ని ఒకసారి తుడుచుకున్నారు. తనలో వచ్చిన మార్పు బైటకి కనబడనీయకుండా "ఇందులో తప్పేముంది. రవీంద్ర ప్రాక్టికల్స్ బాగా చేసి ఉండచ్చు" అన్నారు.

"లేదు సర్ రవీంద్ర ప్రాక్టికల్స్ బాగా చేయలేదు. లేబ్‌లో వెంకటరత్నంగారే అతని రీడింగ్స్‌ని చింపేసి బైటపారేసారు. ఎక్స్‌పెరిమెంటుని మార్చేసారు కూడా దానికి ఎక్స్‌టర్నల్ ఎక్జామినర్ 'ఎందుకూ మార్చడం అతన్ని ఆ ఎక్స్‌పెరిమెంటే చేయనివ్వండి. మళ్ళీ' అని అన్నారు కూడా" అన్నాడు శశిధర్ మెల్లగా.

అంతా విని భీమప్రసాద్ "శశిధర్ నీ సంగతేదో నువ్వు చూసుకో, అంతేకాని వాడికి ఎక్కువ మార్కులు వచ్చాయి. నాకు తక్కువ వచ్చాయి అనడంలో అర్థంలేదు. అంతేకాక అరవై పర్సెంటు అంటే ఫస్టు క్లాసేకదా, అదీకాక ఇప్పుడు గతం తవ్వుకుని లాభం ఏమిటి?" అంటూ శశిధర్‌ని అనునయించారు.

భీమప్రసాద్‌గారి అనునయవాక్యాలూ, సానుభూతీ, శశిధర్‌కి ఊరట కలిగించలేదు. ఇంకా తను చెప్పుకోడానికి మిగిలి ఉంది అన్నట్టుగా నిలబడ్డాడు. అతని మొహం చూస్తే ఎవరికేనా అర్థం అవుతుంది. ఏడవడానికి సిద్ధంగా ఉన్నాడని, భీమప్రసాద్ గారు అతనిని వెళ్ళిపొమని అనలేదు. తన ఆలోచనలోంచి తేరుకుని "ఏమిటి?" అన్నట్లు చూసారు.

"సార్ నాకు ఆ ప్రాక్టికల్స్ తప్ప, మిగతా అన్ని మార్కులు తొంభై శాతం పైనే వచ్చాయి. ఈ ఒక్క ప్రాక్టికల్స్ మార్కుల వల్లా, నా మార్కుల శాతం పడిపోయింది. ఈ రోజుల్లో తొంభై శాతానికి రీసెర్చి స్కాలర్ షిప్ రావడంలేదు. నాకు కష్టపడి చదవడం తెలుసు. కానీ నాకు ఇన్‌ఫ్లుయన్స్ లేదు. స్కాలర్ షిప్పులు తెచ్చుకునేందుకు ఈ ఒక్క ప్రాక్టికల్స్ మార్కులు వల్లా నా భవిష్యత్తు తారుమారవుతుంది. ఈ రకంగా నా భవిష్యత్తుని పాడుచేయడం భావ్యం కాదుసార్ మీరే ఏదో చేయాలి. ప్లీజ్" శశిధర్ గొంతు బొంగురు పోయింది. అతను మాట్లాడలేకపోయాడు.

భీమప్రసాద్‌గారికి కోపం వచ్చింది. "ఏమిటి మాట్లాడుతున్నావు. మేము నీ భవిష్యత్తుని పాడు చెయ్యడం ఏమిటి? నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడకు. నీకెన్ని మార్కులు రావాలో నువ్వుకాదు, మాకు చెప్పవలసింది. విద్యార్థులే వాళ్ళకెన్ని మార్కులు కావాలో చేప్పేస్తే ఇంక టీచర్లు ఎందుకు? డోన్ట్‌టాక్ రబ్బిష్. నువ్వేదో మంచి స్టూడెంటువి కదా అని ఇంతసేపు నువ్వు చెప్పింది విన్నా నువ్వు అదుపు తప్పుతున్నావు వెళ్ళు" అన్నారు.

శశిధర్ కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా దైన్యంగా తలవంచుకుని వెళ్ళిపోయాడు. భీమప్రసాద్ కోపం ప్రదర్శించడం చూసి నేను ఆశ్చర్యపోయా.

నిజమే స్టూడెంటుకి ఎన్ని మార్కులు రావాలో, స్టూడెంటు, డిక్టేట్ చెయ్యడం ఏమిటి? శశిధర్ మెత్తగా అడిగాడు. కొందరు రౌడీయిజంకి దిగుతారు కూడా. అదే మాటని, భీమప్రసాద్ అన్నాడు.

భీమప్రసాద్ జీవం లేని చిరునవ్వు నవ్వారు. "మీరు చెప్పినట్టు విద్యార్థులలో క్రమశిక్షణపోయి, రౌడీయిజం పెరిగిపోయింది. కానీ దానికి మనమూ కొంత కారణం క్లాసులో పాఠాలు చెప్పక ఇంటికి ప్రైవేటుకి రమ్మనడం, లేబరేటరీలో ప్రయోగం విషయం బోధపర్చక విద్యార్థిని "కీప్ గెస్సింగ్" గేములో పెట్టి, విద్యార్థిలో ఒక అస్థిర భావాన్ని లేదా అభద్రతా భావాన్ని పెంపొందించి, దాని ద్వారా డబ్బులు చేసుకోడం, వగైరా శశిధర్‌కి అన్యాయం జరిగిందని నాకు తెలుసు. కానీ నేనేం చేయలేను. అది సరి లెండి మీలోడ్ విషయం తర్వాత మాట్లాడుతాను" అన్నారు.

శశిధర్ విషయం, భీమప్రసాద్ మాటలు, నన్ను వెన్నాడుతుండగా, నేను భీమప్రసాద్ గదిలోంచి బైటకి వచ్చేసా. వరండాలో సాలోచనగా నడుస్తున్నా "హలో జాహ్నవి" అన్న పిలుపు వినబడి ఈ లోకంలోకి వచ్చా. వెనక్కి తిరిగి చూసా. జ్ఞానప్రభాకర్ కనిపించాడు. ఇద్దరం కలిసి లైబ్రరీకి నడిచాం. డిపార్టుమెంట్ లైబ్రరీలో చాలా తక్కువమంది స్టూడెంట్స్ ఉన్నా అక్కడ కూర్చోడం ఇష్టంలేక తన చాంబర్స్ వేపు తీసుకెళ్ళాడు ప్రభాకర్,

ఇద్దరం కూర్చున్నాక "ఇప్పుడు చెప్పండి. ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నాడు.

భీమప్రసాద్ రూములో జరిగింది చెప్పడానికే సందేహించా కానీ చివరికి చెప్పేసాను. ప్రభాకర్‌కి ఈ విషయం ఆశ్చర్యం కలిగించలేదు.

"ఇట్ ఈజ్ నాట్ న్యూస్. ఇట్ ఈజ్ వెల్ నోన్ ఫేక్ట్!" అన్నాడు సాలోచనగా తర్వాత చిన్నగా నవ్వుతూ "శశిధర్ వెంకటరత్నంగారి కులంకాక పోయివుండచ్చు. తొంభైశాతం అదే కారణం అయివుంటుంది." అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసి. తను కాలేజీలో చదివినప్పుడు ఇలాంటివి చెప్పుకునేవారు. కానీ కులాలు జీవితాన్ని నాశనం చేసేంతగా ఉంటాయా? అప్పుడు తను విద్యార్థుల్లో ఉండి వింది. చూసింది. అంతగా సమస్యల్ని అర్థం చేసుకోలేదు. ఇప్పుడు టీచర్లలో ఉండి చూస్తోంది. "ఇట్ కెన్ నెవ్వర్ బిక్యూర్డ్" అనుకుంది.

నా ఆలోచనలని పసిగట్టాడు ప్రభాకర్, ఇది చాలా చిన్న విషయం, ఇక్కడ కొందరు టీచర్లు తమ సిద్ధాంతాలని అనుసరించని, విద్యార్థుల్ని వెర్రివెధవలనే ముద్రవేసి, ఈ విషయం మార్కుల్లో చూపిస్తారు" అన్నాడు.

"మీరు చెప్పింది నాకు అర్థం కాలేదు" అంది జాహ్నవి.

"సిద్ధాంతం అంటే ఉదాహరణకి ఒక ప్రొఫెసర్ పేదలన్నా కమ్యూనిజం అన్నా ప్రీతి, సింపతీ అనుకోండి లేదా, ప్రొఫెసర్‌కి సత్యబాబా అంటే ప్రీతి ఆ ప్రొఫెసర్ దగ్గర విద్యార్థి, అతని సిద్ధాంతానికి విరోధిగానో లేక వేరు విధంగానో కనిపించాడనుకోండి. ఆ విద్యార్థి శ్లేష్మంలో పడ్డ ఈగలా కొట్టుకుంటాడు. కమ్యూనిష్టులు అంటే సానుభూతి ఉన్న ప్రొఫెసర్ దగ్గరికి ఎర్ర చొక్కా వేసుకువెళ్ళి పోవడమే. సాయిబాబా అంటే ప్రీతి ఉన్న ప్రొఫెసర్ దగ్గరికి వీభూది బొట్లతో వెళ్ళిపోవడమే. నక్క వినయాలు ప్రదర్శిస్తే గాని గట్టెక్కలేని పరిస్థితికి విద్యార్థుల్ని నెట్టేస్తోంది, నేటి విద్యావిధానం" అన్నాడు ప్రభాకర్.

ప్రభాకర్ చెప్పింది అక్షరాలా నిజం. శశిధర్ జ్ఞాపకం వచ్చాడు. 'పూర్ శశిధర్' అనుకున్నా. శశిధర్‌ని చాలా రోజుల వరకూ మర్చిపోలేకపోయాను.

●●●

ఫైనల్ విద్యార్థులు పరీక్షలు అయిపోయి, రిజల్ట్సు వచ్చేసాయి. కొత్తగా విద్యార్థులు వచ్చి చేరారు. ఏ క్లాసులు ఎవరు తీసుకోవాలి? అనే విషయమ్మై మొత్తం స్టాఫ్ అంతా సమావేశమయ్యార్. టీచింగ్ లోడ్ డిస్ట్రిబ్యూషన్ అయిపోయింది. ఇంక ప్రాక్టికల్స్‌కి అసిస్టెంట్స్‌ని వేయాలి.

శాంతాదేవి "నా ప్రాక్టికల్స్ క్లాసులో జాహ్నవి అసిస్ట్ చేస్తుంది" అంది.

"జాహ్నవి కొత్తకదా ప్రభాకర్‌నో రాజేంద్రనో తీసుకోండి" అన్నారు భీమప్రసాద్, ఆయనకి నన్ను ఇవ్వడం ఇష్టంలేదు.

"పర్వాలేదు జాహ్నవిని ఇవ్వండి" అంటు కొంచెం నొక్కి చెప్పింది. భీమప్రసాద్ ఏం చెప్పడానికి లేకపోయింది. నన్ను శాంతాదేవితో పాటు ప్రాక్టికల్స్ వేసారు. మీటింగ్ అయిపోయింది.

అందరూ బైటకి వచ్చేసారు. బైటకి వచ్చేసాక రాజేంద్ర నన్ను ఆపి, "ఏమండోయ్ శాంతాదేవి హృదయాన్ని దోచుకున్నారు." అన్నాడు.

రాజేంద్ర మాటలకి చిరునవ్వు నవ్వా.

"మీరేమీ అనుకోకపోతే శాంతాదేవే మీ హృదయాన్ని దోచుకోడానికి ప్రయత్నిస్తోందేమో?" అంటే ఎలా ఉంటుంది అన్నాడు మళ్ళీ.

"ఇప్పుడు మీరన్నదాంట్లో పసలేదు, ఆవిడ నాకంటే చాలా సీనియర్, నా అవసరం ఆవిడకి ఏం ఉంటుంది? నాకు కాకా పట్టడానికి" అన్నా.

"రాజేంద్ర నవ్వేసాడు 'కాకా ' అన్న ఎక్స్‌ప్రెషన్ చాలా బావుంది." అంటూ ఇంకా నవ్వుతూనే ఉన్నాడు.

"కాకా" అన్నమాట నా నోటివెంట వచ్చినందుకు సిగ్గుపడ్డా.

"మీకు ముందు, ముందు తెలుస్తుంది లెండి శ్రీ శ్రీ చెప్పినట్లు, నేటి ఫోర్జరీని రేపటి సంతకంగా మార్చగల దిట్ట శాంతాదేవి" అన్నాడు.

"అంటే?" అన్నా ఆశ్చర్యంగా.. రాజేంద్ర నవ్వేసి ఊరుకున్నాడు, సమాధానం చెప్పలేదు.

●●●

నేను, రాజేంద్ర, ప్రభాకర్, మరో పి.హెచ్.డి స్కాలరు డిపార్టుమెంటు లైబ్రరీలో కూర్చుని మాట్లాడుకుంటున్నాం. క్లాసులు జరుగుతుండడం వల్ల, డిపార్టుమెంటు లైబ్రరిలో స్టూడెంట్స్ ఎవరూ లేరు.

ఫణి లైబ్రరీలోకి వచ్చాడు. అక్కడి నుండి కారిడార్లోకి వెళ్ళి స్టాఫ్ చేంబర్‌లో సోమేశ్వరరావు చేంబర్ దగ్గరకి వెళ్ళి చూసాడు. అక్కడ సోమేశ్వరరావు లేకపోయేసరికి, మళ్ళీ డిపార్టుమెంటు లైబ్రరీలోకి వచ్చాడు. ప్రభాకర్‌తో, "మాష్టారూ సోమేశ్వరరావుగారు రాలేదా?" అని అడిగాడు.

ఫణి ఎమ్.ఎస్.సి ఫైనలియర్ స్టూడెంట్, పరీక్షలు రాసాడు మనిషి కరకుగానూ, మోటుగానూ కనిపిస్తాడు. కానీ చాలా వినయం ప్రదర్శిస్తాడు.

సోమేశ్వరరావు డిపార్టుమెంట్‌లో రీడర్. అతను ఎవరితోనూ ఎక్కువ మాట్లాడడు, కలవిడిగా ఉండడు. అందుకే అతనిని ఎవరూ పట్టించుకోరు. అతను తన పనేదో, తనేమో అన్నట్టుగా ఉంటాడు.

"ఈ రోజు కాలేజీలో చూసాను. ఇప్పుడు ఎక్కడున్నారో తెలీదు. క్లాసుందేమో?" అన్నాడు ప్రభాకర్ ఫణికి సమాధానంగా, ప్రభాకర్ మాట ముగియనే లేదు. సోమేశ్వరరావు లైబ్రరీ హాలులోకి వచ్చి తన ఛాంబర్స్ వేపు వెళుతున్నాడు. ఫణి సోమేశ్వరరావుకి ఎదురుగా వెళ్ళాడు. వెళ్ళడం విసురుగా వెళ్ళాడు. మాష్టారు అన్న గౌరవంతో నమస్కరించలేదు. సోమేశ్వరరావు తూలిపడ్డాడు. అతని కళ్ళద్దాలు నేలమీద పడిపోయాయి. సోమేశ్వరరావు సర్దుకునే లోపల మళ్ళీ కొట్టాడు ఫణి.

సోమేశ్వరరావుకి నలభై అయిదేళ్ళు ఉంటాయి. చాలా సన్నగా, పొడుగ్గా, బుగ్గలు లోతుకుపోయి, అర్భకుడిలా ఉంటాడు. ఫణి కొట్టిన రెండో దెబ్బకి, మొత్తం జుట్టు చెదిరి, కళ్ళు తిరిగి గట్టి దెబ్బతిన్న పాములా గిలగిలా లాడాడు. అప్పటికి జరుగుతున్నదేమిటో అర్థం అయింది. ప్రభాకర్ వెళ్ళి ఫణిని పట్టుకున్నాడు.

"ఏమిటది ఫణీ?" అంటూ ప్రశ్నించాడు.

ఫణి ప్రభాకర్ ప్రశ్న వినిపించుకోలేదు. సోమేశ్వరరావుని చూస్తూ, "తప్పు చెయ్యడానికైనా ధైర్యం ఉండాలిరా. డబ్బుపుచ్చుకోగానే సరికాదు. నా డబ్బు నాకు పదిరోజుల్లో కావాలి. లేకపోతే పరిస్థితి ఇంతకన్నా దారుణంగా ఉంటుంది." అని హెచ్చరించి, హాలులోంచి వెళ్ళిపోయాడు.

ఫణి వెళ్ళిపోయాక, ప్రభాకర్ సోమేశ్వరరావు కళ్ళద్దాలు తీసి, ఆయనికి ఇచ్చాడు. సోమేశ్వరరావు ప్రభాకర్‌కి కనీసం "థాంక్స్" చెప్పలేదు మెల్లగా కారిడర్ లోంచి తన ఛాంబర్స్‌లోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు.

జరిగిన సంఘటన ప్రభావం నుండి కోలుకోడానికి చాలాసేపు పట్టింది మౌనంగా కూర్చున్నాం. ఛాంబరులోకి వెళ్ళిన సోమేశ్వరరావు, తలుపు తీసుకుని బైటికి వచ్చి, లైబ్రరీ లోంచి బైటకి నడిచి వెళ్ళిపోయాడు. చాంబరులోకి వెళ్ళిన సోమేశ్వరరావుకి చాంబరులోంచి, పదినిమిషాల తర్వాత బైటికి వచ్చిన సోమేశ్వరరావుకి చాలా తేడా ఉంది.

ఛాంబరులోకి వెళ్ళేముందు సోమేశ్వరరావు జుత్తు చెదిరి, మొహం కందగడ్డలా ఎర్రగా ఉంది. చాంబరులోంచి బైటకి వచ్చిన సోమేశ్వరరావు, క్రాపు నీటుగా దువ్వి ఉంది. మొహానికి పౌడర్ పూత పెదిమల మధ్య సిగరెట్టు. ఛాంబరులోంచి, బైటకి వచ్చిన సోమేశ్వరరావు దెబ్బతిన్న పాములా కాక, కుబుసం విడిచిన నాగులా మెరిసి పోతున్నాడు. అతను బైటకి వెళ్ళిన పద్ధతి చూస్తే, జరిగిన సంఘటనవల్ల షాక్ తిన్నది సోమేశ్వరరావు కాదు. మేం ముగ్గురూ అని అర్థం అవుతోంది.

"వెళ్ళి హెడ్‌కి రిపోర్టు చేస్తే బావుంటుందేమో?" అన్నా.

"ఏమని రిపోర్టు చేస్తారూ, ఫణి సోమేశ్వరరావుని కొట్టాడనా? ఎందుకు? అన్న ప్రశ్న వస్తుంది? ఇది చాలా మందికి తెలిసిన విషయం, ప్రైవేట్ల పేరుతో సోమేశ్వరరావు డబ్బు వసూలు చేస్తాడు. రిజిస్ట్రార్ ఆఫీసులో ఇన్ఫ్లుయెన్స్ చేసి ఆన్సర్ స్క్రిప్టు తన పేర వేయించుకుంటాడు.  డబ్బు లిచ్చిన విద్యార్థుల పేపర్ల మీద ఆన్సర్లు అదే పెన్నుతో దిద్దేసి, ఎక్కువగా మార్కులు వేస్తాడు. ఒకవేళ సెకండు కరెక్షన్కి వెళ్ళినా పర్వాలేదు అన్నమాట. ఈ మధ్య జరుగుతున్న స్పాటు వేల్యూషను వల్ల, అది కొంచెం కష్టం అయింది. ఈసారి తారుమారైందేమో. ఫణి కొంచెం ఉద్రేకపడ్డాడు. అంతే. మీరెళ్ళి రిపోర్టు చేసినా, ఫణీ, సోమేశ్వరరావూ ఇద్దరూ అబ్బే అదేం జరగలేదు, అనేస్తారు. ఎందుకంటే వాడు కంన్స్యూమరు, వీడు సప్లయిరూ" అన్నాడు రాజేంద్ర సీరియస్గా.

"నేను రిపోర్టు చేస్తే మీరు వచ్చి జరిగింది నిజం అని చెప్పరా?" అన్నా వీళ్ళ నాడి తెలుసుకుందామని.

"చెప్పవచ్చు కానీ చెప్పదం వల్ల మనమే వెధవలం అవుతాం, చెప్పకుండా ఉన్నాం అనుకో మనం మేధావులమవుతాం, తెలిసీ నీతో రావడం మంచిది కాదేమో! " ప్రభాకర్ నవ్వుతూనే అన్నాడు.

నేను మాత్రం సీరియస్గా తీసుకుని "అయితే ఈ విషయంలో మనమేం చేయలేమా?" అన్నా.

"చేయగలం" అన్నాడు రాజేంద్ర.

"ఏమిటి?"

"మౌనంగా ఉండడం. జరిగింది మర్చిపోవడం" అంటూ రాజేంద్ర, ప్రభాకర్ ఇద్దరూ నవ్వేసారు. వాళ్ళతో నేను కూడా నవ్వేసాను. కానీ జరిగిన సంఘటనని మర్చిపోలేకపోయా. సోమేశ్వరరావుని కాలేజీలో చూసినప్పుడల్లా, ఆ దెబ్బలు నేనే తిన్నట్లు, ఆ అవమానం నాకే జరిగినట్టు అనిపిస్తోంది.

నేను చాలా సెన్సిటివ్. ఈ వృత్తికి కొత్త. దూరంగా బెంచీ మీద కూర్చుని, సుద్దముక్కల గుండతో అమాయకంగా ఫాంట్సు, షర్టులు, తెల్లమరకలు చేసుకునే ఉపాధ్యాయుల్ని చూస్తే ఏర్పడే గౌరవం, ఇప్పుడూ కొంచెం సడులుతోంది, పిగిలి పోతున్న ఖరీదైన పట్టుచీరలా ఉంది ఈ వృత్తి. ఈ వృత్తిలో ముందు ముందు ఇంకేం అనుభవాలు మిగిలి ఉన్నాయో!

కానీ ఇలాంటి సంఘటనలు మామూలనీ, ప్రతి ఎకడమిక్ ఇయర్ ఆఖర్న డిపార్టుమెంట్లో కనీసం వో రెండో, మూడో, 'సీన్లు' ఉంటాయని తెలుసుకోలేకపోయా.

●●●

రోజులు గడుస్తున్నాయి కానీ, కోరుకున్నట్టు గడవడం లేదు. ఎందుకు? అన్న అనుమానం పీడిస్తోంది. నిరాసక్తత మనస్సుని ఆవరిస్తోంది. నిరంతర ఏదో చదవడంలోనో, నోట్సు రాయడంలోనో, లేబరేటరీలోనో, గడుస్తోంది. కానీ గమ్యం లేని పని, ఏదో చేసేస్తున్నాననే ఫాల్సు ఇల్యూషన్ తనని తాను మోసం చేసుకొంటోందా? సెల్ఫ్ శాటిస్ ఫాక్షన్ లేదు.

లైబ్రరీనుండి బైటకి వస్తుండగా పక్కనే ఫియట్ పద్మిని ఆగింది. అందులోంచి శాంతాదేవి తొంగి చూసింది.

"జాహ్నవీ డిపార్టుమెంటుకేనా?" అని అడిగింది శాంతాదేవి.

"అవును మేడమ్"

వెంటనే కారుడోర్ తెరిచి "రా నేనూ డిపార్టుమెంటుకే వెళుతున్నా" అంది. ఇద్దరం కారులో డిపార్టుమెంటుకి వెళ్ళాం. తన ఛాంబర్స్కి తీసుకెళ్ళింది శాంతాదేవి.

శాంతాదేవి క్లాసు వర్కు గురించి చెపుతుంది అనుకున్నా. ఛాంబర్లో కూర్చున్న తర్వాత "జాహ్నవీ పి.హెచ్.డికి వర్కు స్టార్ట్ చెయ్యకూడదూ?" అని ప్రశ్నించింది.

"నేనూ ఆ విషయమే ఆలోచిస్తున్నాను. మేడమ్" అంది. నా సమాధానం శాంతాదేవికి సంతోషాన్ని కలిగించింది.

"నీకు ఏ సబ్జెక్టు ఇష్టం" అని అడిగింది.

"రేడియో బయాలజీ"

"నువ్వు బయాలజీ గురించి చదవాలి కదా?" శాంతాదేవి ప్రశ్న.

"చాలా వరకు చదివాను మేడమ్, నోట్స్ రాసాను కూడా, చాలా పబ్లిష్ అయిన పేపర్లు సంపాదించాను. డైసెక్షన్ కూడా నేర్చుకున్నాను." అని చెప్పా. శాంతాదేవి ఎప్రిసియేషన్ కోసం ఎదురు చూస్తూ, కానీ నాకు ఆ క్షణంలో రాజేంద్ర చెప్పిన విషయం గుర్తుకి వచ్చింది. తను ప్రవేశించిన వాతావరణంలో ఎవరి ఎప్రిసియేషన్ వాళ్ళే చేసుకోవాలని, ఎదుటి వాళ్ళని ఎప్రిషియేట్ చేయకూడదని.

నా సమాధానం శాంతాదేవి నచ్చలేదు, నచ్చదు కూడా. ఆమె సలహా చెపుతున్న ధోరణిలో 'చూడు జాహ్నవీ, ఏం చేసినా స్టాండర్డు (ప్రామాణికం)గా, కొత్తదిగా ఉండాలి. నీకు సంబంధం లేని సబ్జెక్ట్ తీసుకుని, అభాసుపాలయి, సమయాన్ని వృధా చేసుకునేకన్నా, ఏదేనా తెలిసున్న విషయం తీసుకుని డాక్టరేటు చెయ్యడం మంచిది" అంది.

తెలుసున్న విషయం అంటే ఆవిడకి అవసరమైన విషయం. అయినా నేనేం చదివానో, నాకేం తెలుసో ఈవిడకేం తెలుసు? ఇంత తొందరగా నిర్ణయానికి వచ్చేసింది నా మౌనం శాంతాదేవికి ఉత్సాహాన్ని కలిగించింది.

"జాహ్నవీ నా దగ్గర ప్రోబ్లం ఒకటి ఉంది. ప్రాజక్టు సాంక్షన్ కావచ్చు. నువ్వు డాక్టరేటుకి రిజిష్టర్ చేసుకుంటే మూడేళ్ళలో డాక్టరేటు వచ్చేస్తుంది. నీకు ఫైనాన్షియల్ హెల్ప్ కూడా వస్తుంది" శాంతాదేవి ఇంతలా బోధపర్చడం వివరంగా చెప్పడం ఆశ్చర్యమే.

"మీరిచ్చే సమస్య గురించి మళ్ళీ చదవాలేమో మేడమ్!?" అన్నా. అప్పటికి తప్పించుకుందామని.

"ఆ చదవాలి నా దగ్గర పబ్లిష్డ్ పేపర్లు ఉన్నాయి. అన్నీ చదివి నోట్సు ప్రిపేరు చెయ్యి" అని ఒక ఆరునెలల పని పురమాయించింది శాంతాదేవి. ఇంక నేను నిజం చెప్పకపోతే శాంతాదేవి ఇలాగే పీకుతుంది. అని అర్థం చేసుకున్నా.

"ఇప్పుడు కొత్తగా ఏ సబ్జెక్టూ చదవలేను మేడమ్. చాలా కష్టం" అన్నా సూటిగా.

ఆ సమాధానం శాంతాదేవి లాంటి అనుభవజ్ఞులకి "నాకు నీ సబ్జెక్టు చదివే ఉద్దేశం లేదు" అన్నట్టుగా అర్థమై, చాలా హ్యూమిలియేటింగ్‌గా ఫీలయింది అయినా తనని తను కంట్రోలు చేసుకుంది. "సరిలే నువ్వెళ్ళు" అంది నాతో.

అక్కడితో ఆవిషయం మరుగున పడిపోతుంది అనుకున్నా. కానీ ఇది మేధావుల ప్రపంచం. ఇక్కడ అతి చవకగా, ప్రతి మెదడులోనూ టన్నుల కొద్దీ, దొరికే పదార్థం అసహనం ... ఇన్‌టోలెరెన్స్... ఎదుటివాడి అభిప్రాయాన్ని గౌరవిస్తే సహిస్తే తాము ఎక్కడ చిన్నపోతామో అనే కాంప్లెక్స్. ఆ పదార్థం శాంతాదేవిలోనూ అంతో కొంతో ఉంది. ఆ విషయం నాకు తెలిసేసరికి కొంత టైము పట్టింది.

అలా కాకుండా ప్రభాకర్ చెప్పినట్టు లౌక్యంగా (టేక్ట్‌ఫుల్) పరిస్థితి నుండి బైటపడటం తెలియలేదు. "అలాగే మేడమ్ ఇవ్వండి." అని ఆ పేపర్లన్నీ తీసుకెళ్ళి రూములో ఒక మూల పడేసి వాటి సంగతి మర్చిపోయి నా పని నేను చేసుకోడం ఒక పద్ధతి లేదా ప్రస్తుతం క్లాసులకి ప్రిపేరవుతున్నాను మేడం, రెండురోజుల్లో మీ దగ్గర ఆ పేపర్లు తీసుకుంటాను, అని వాటి సంగతి మరి ఎత్తకపోవడం, శాంతాదేవి కంట పడకపోవడం రెండోపద్ధతి, పైరెండూ అనుభవంతో పట్టుపడే విషయాలు.

ఆ అనుభవం లేకపోవడం వల్ల ఇద్దరికీ జరిగిన సంభాషణ గురించి, చాలా సెన్సిటివ్‌గా ఆలోచించా. తనకి డాక్టరేటు ముఖ్యమా? లేక సిన్సియర్‌గా, నాకు నచ్చిన విషయపు లోతుల్లోకి వెళ్ళి, అన్వేషించడం ముఖ్యమా? ఏది తనకి మానసిక తృప్తినిస్తుంది? డాక్టరేటే ముఖ్యమైతే శాంతాదేవి దగ్గర చేరవచ్చు. డాక్టరేటు సాధించవచ్చు. మళ్ళీ ఏదో మిస్సయిపోయాను. అదే 'ఐ' అనుకుంటా! డాక్టరేటు గురించి ఆలోచిస్తున్న నాకు, ప్రభాకర్ చెప్పిన సంఘటన జ్ఞాపకం వచ్చింది.

ఈ యూనివర్శిటీలోనే తెలుగు డిపార్ట్‌మెంటులో రిజిష్టర్ చేసుకున్న పి.హెచ్.డి స్కాలర్, మూడేళ్ళు కష్టపడి, పురాణాలన్నీ చదివేసి, సావిత్రీ - సత్యవంతుడూ కథ పాతకాలంలో, చాలా తప్పుగా చెప్పబడిందని, దానికి పాతివ్రత్యం విశేషణంగా చేర్చారని, తన మూడేళ్ళ పరిశోధన జోడించి అసలు కథ "ఇదీ" అంటూ మూడువందల పేజీల పుస్తకం రాసాడు.

సత్యవంతుడు బీదవాడు. అత్తమామలు గుడ్డివాళ్ళు. జీవనం అడవిలో కట్టెలు కొట్టుకోడం, అందుకే సత్యవంతుడి ప్రాణాలు పట్టుకుపోతున్న యముడ్ని వరించింది సావిత్రి. యముడితో అతని లోకనికి చేరుకున్నంత పని చేసింది. యముడే తన భార్యకి జడిసి సావిత్రిని ఎలా వదిలించుకోవాలో తెలీక సత్యవంతుడ్ని బతికించేసాడు. దాని లాజిక్ ఏమిటంటే, సత్యకాలంలో సెక్స్ సంబంధాలు అంతగా పట్టించుకునే వారు కారు. ఉదాహరణకి తారాచంద్రులు, విశ్వామిత్రుడు మేనక, ఇంద్రుడు - అహల్య ఏట్సెట్రా. కలియుగం మొదట్లో ఎయిడ్స్, అన్న వ్యాధితో కలి మొట్టమొదటి దాడి చేసాడు. దాని ఎఫెక్ట్ తగ్గించడానికి పాతివ్రత్యం అనేది కనుక్కున్నారు. పబ్లిసిటీ కోసం సావిత్రి - సత్యవంతుడు, కథని పాతివ్రత్యపు కథగా మార్చి ప్రచారం చేసారు.

దీన్ని చదివిన ఫారిన్ ఎక్జామినర్ "అద్భుతం, అద్భుతం" అంటూ కామెంట్సు రాసాడు. ఇండియాలో అదీ తెలుగులో శాస్త్రులు, కళావాచస్పతులు, వాళ్ళ కురచ బుర్రని చూపించి "ఏమిటీ గొడవ" అని రాశారు. కానీ ఇన్నాళ్ళకి తెలుగులో స్టాండర్డ్‌లో ఉన్న, ఒక్క డాక్టరేనా యూనివర్శిటీ ఉత్పత్తి చేసినందుకు మెచ్చుకుంటూ అతనికి డాక్టరేట్ ఇచ్చేసి, సాయంత్రం డిపార్టుమెంటులో అతన్ని అభినందిస్తూ సభ చేసారు. అందులో అతన్ని గైడు చేసిన ప్రొఫెసర్ మాట్లాడుతూ 'మన పురాణాలు ఇతి హాసాలూ, రుద్రాక్షమాలలు, అక్షింతలూ పట్టుకుని మడిగా చదవుకోడం కాక, బుర్రపెట్టి చదివి పాతివ్రత్యంపై, డాక్టరేటు పుచ్చుకున్న తన స్టూడెంట్‌లాగ, మనం కూడా బుర్రపెట్టి (పాడుచేసుకుని) చదవడం ఎంతేనా అవసరం' అంటూ విద్యార్థిని ప్రొఫెసరూ ఇంత గొప్ప థీసెస్‌ని గైడ్ చేసినందుకు "ప్రొఫెసర్ని" విద్యార్థి ప్రశంసించుకున్నారు. సమావేసానికి రాని కొందరు పెద్దలు విషయం అంతా తెలుసుకుని, "వీళ్ళిద్దరూ గోడవతలి వాళ్ళు రా" అన్నారు.

అప్పటికే గోడవతలి వాళ్ళ గురించి, తెలిసిన నాకు, మెంటల్ హాస్పటలు వాతావరణం జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నా. ఆ కథ జ్ఞాపకం రావడంతో తను సైన్సులో సావిత్రి - సత్యవంతుడు కథ తిరిగి రాయకూడదు. బలమైన "ఐ" ఉండడం కూడా మంచిదే ఆ ఆలోచనతో మనస్సు కడిగిన ముత్యంలా అయింది. ప్రశాంతతతో నిద్రలోకి జారిపోయా.

●●●

శాంతాదేవికీ నాకూ జరిగిన సంభాషణ నేను ఎవరికీ చెప్పలేదు. కానీ శాంతాదేవి మాత్రం ప్రశాంతంగా ఉండలేకపోయింది. హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటుని కలిసి నాతో క్లాసు నడపడం కష్టంగా ఉందని, నన్ను మార్చేసి ఇంకొకర్ని ఇమ్మని అడిగింది. భీమప్రసాద్ గారు ముందు నన్ను మార్చడానికి ఒప్పుకోలేదు. శాంతాదేవి మరీ మూర్ఖంగా పట్టుబట్టేసరికి, నన్ను ఆ క్లాసు నుండి తీసెయడానికి ఒప్పుకున్నారు. కానీ ఆ ప్లేసులో ఇంకొకళ్ళని ఆ క్లాసులో వేయకుండా, ఆలోచించి చెపుతానన్నారు.

ఈ వార్త నాకు చెప్పి, "మీ ఇద్దరికీ మధ్య ఏం జరిగింది?" అని అడిగాడు రాజేంద్ర.

జరిగిన విషయం అంతా చెప్పి, "నేను వీలుకాదన్నమాటని నిజమే కానీ, దానికి సబ్జెక్ట్ రాదని, మేనర్స్ తెలియవని, తప్పుగా నన్ను రిప్రజంట్ చేయడం చాలా అన్యాయం, ఆవిడ "ఇగో" దెబ్బ తింటే నేనేం చేయను? భీమ్‌ప్రసాద్ గారు ఏమని అనుకుని ఉంటారో" అన్నా కొంత సందేహపడుతూ.

నా సందేహానికి రాజేంద్ర నవ్వుకున్నాడు. "మీరేం బాధపడక్కరలేదు. భీమ్‌ప్రసాద్ గారికి డిపార్టుమెంటులో అందరూ తెలుసు. అందుకే శాంతాదేవి కోరుకున్నట్టు మిమ్మల్ని క్లాసునుండి తప్పించేసారు. కానీ శాంతాదేవి కోరుకున్నట్టు, ఎవరినీ క్లాసులో వేయలేదు.

భీమ్‌ప్రసాద్ ఏ పరిస్థితుల్లోనూ తూకం చెడని మనిషి, కానీ రెండు నెలల్లో పూర్ణానందంగారు హెడ్ అవబోతున్నారు. అసలు డాన్స్ అంతా అప్పుడుంటుంది" అన్నాడు.

"ఏం ఆయన మంచివారు కాదా?" అంటూ సూటిగా ప్రశ్నించా.

"నేను అలా అన్నానా? ఆయన చాలా మంచివారు. చాలా తెలివైన వారు. చాలా క్రమశిక్షణ గల మనిషి. గొప్ప టేక్ట్‌ఫుల్ పర్సన్. ఇవన్నీ ఆయన గురించి ఆయనకి గల అభిప్రాయాలు" అన్నాడు రాజేంద్ర కొంటెగా నవ్వుతూ.

రాజేంద్రని చురుగ్గా చూసి "మరి మీ అభిప్రాయం?" అన్నా.

"మన బోటి వాళ్ళ అభిప్రాయాలకి, ఇంకా ఈ యూనివర్శిటీలో విలువలేదు. కాబట్టి ప్రస్తుతానికి అభిప్రాయాలు కూడా లేవు" అన్నాడు రాజేంద్ర నవ్వుతూ.

"అంటే?" అన్న నా ప్రశ్నకి.

"అనుభవంతో అర్థం అవుతుందిలెండి" అన్నాడు రాజేంద్ర.

అనుభవం కోసం ఎక్కువ రోజులు నిరీక్షించకుండానే పూర్ణానందంగారు హెడ్ అయిన మూడోరోజే తెలిసింది.

తన హెడ్‌షిప్ ముగియకుండానే, భీమ్‌ప్రసాద్ ఫారిన్ ఎసైన్‌మెంట్ మీద వెస్ట్ జర్మనీ వెళ్ళారు. అయితే ఆయన వెస్ట్ జర్మనీకి వెళ్ళేందుకు, విశాఖపట్నం నుండి హైదరాబాద్ ఫ్లైట్‌లో వెళ్ళాలి. విశాఖపట్నం నుండి బయలుదేరే ఫ్లైట్ పదకొండుగంటలకి, యూనివర్శిటీ నుండి ఎయిర్ పోర్టు చాలా దూరం. డిపార్టుమెంటులో స్టాఫ్ అందరూ, ఒక మినీ బస్ అరేంజ్ చేసుకుని, ఎయిర్ పోర్టుకి వెళ్ళి ఆయనకు వీడ్కోలు చెప్దామనుకున్నారు. అనుకున్నట్టు పదిగంటలకి మినీ బస్ వచ్చింది. ఆ రోజు క్లాసులు విడిచి పెట్టేసి, స్టాఫ్ మినీ బస్ ఎక్కారు. ఈ విషయం పూర్ణానందం పసిగట్టేశారు.

బస్ బయలుదేరుతుండగా, గబగబా వచ్చి బస్సుకి అడ్డంగా నిలబడ్డారు.

"మీరిలా క్లాసులు వదిలి వెళ్ళిపోడం ఏం బాగోలేదు" అన్నారు ఉద్వేగంగా.

"రోజూ క్లాసులు వదిలి వెళ్ళిపోడం లేదుగా. ఈ రోజు అవసరం" అన్నారు వెంకటరత్నంగారు.

"అవసరమా? ఏమిటి అవసరం? మనం ఈ సమయంలో క్లాసులు చెప్పడానికి కాలేజీకి వచ్చాం. మరేదో కారణం పెట్టుకుని క్లాసుల్ని గాలికి వదిలేసి మీరిలా వెళ్ళిపోడం మోస్ట్ ఇన్‌సిన్సియర్ ఆన్ ది పార్ట్ ఆఫ్ అవర్ బిహేవియర్. మాష్టర్లే ఇలా ప్రవర్తిస్తే ఇంక విద్యార్థుల్లో క్రమశిక్షణ ఎక్కడ నుండి వస్తుందీ? అంటూ ఆయన ఉపన్యాసం కొనసాగుతూనే ఉంది. అది వినే ఓపికలేనివారు, బస్ దిగి వెళ్ళిపోయారు.

ఇంక ఈ బస్సు వెళ్ళదు, అని నిర్ధారించుకున్నాక పూర్ణానందంగారు, తన గదిలోకి నిష్క్రమించారు.

సీనియర్ ప్రొఫెసర్లు, మిగతా స్టాఫూ "వీడిబొంద డిసిప్లిన్" అంటూ స్కూటర్ల మీద, కార్లమీద ఎయిర్ పోర్టుకి వెళ్ళిపోయారు జూనియర్స్ ఎటూ వెళ్ళలేక కాలేజీలో ఉండిపోయారు.

జరిగిన సంఘటన మొత్తం, యూనివర్శిటీలో తెలిసి నవ్వుకున్నారు. గోడవతల జరగవలసిన సంఘటన, గోడివతల, జరిగిందోయ్ అంటూ ఆశ్చర్యపోయారు. పూర్ణానందంగారు హెడ్ అయ్యారు, అన్న విషయం అంతవరకూ తెలియని వాళ్ళకు కూడా తెలిసిపోయింది.

●●●

**డిపార్టుమెంటులో ప్రతీ విషయంలోనూ,** వెంకటరత్నానికి, పూర్ణానందానికి టగ్ ఆఫ్ వార్‌గా ఉండేది. ఏ విషయంలోనూ, ఇద్దరికీ పడేది కాదు. వెంకటరత్నం, పూర్ణానందం నుండి ఏ విధమైన ఆదేశాన్ని స్వీకరించేవారు కాదు. సబ్జెక్ట్‌లో కూడా ఇద్దరి మధ్యా గొడవైంది. వెంకటరత్నంకి కావాలన్న సబ్జెక్ట్ పూర్ణానందం ఇవ్వలేదు. పూర్ణానందం ఇచ్చిన సబ్జెక్ట్ వెంకటరత్నంకి నచ్చలేదు.

ఇలా ఇద్దరి మధ్యా ఘర్షణ జరుగుతుండగా, వెంకటరత్నం చిన్న తెలివి తేటలు చూపిస్తూ ఎకడమిక్ ఇయర్ మధ్యలో ఒంట్లో బావుండలేదని శెలవు పెట్టడం మొదలుపెట్టారు. ఒకటి రెండు శెలవులు శాంక్షన్ చేస్తూ ఎన్ని రోజులు ఇలా శెలవు పెట్టి తప్పించుకుంటాడ్లే అనుకున్నారు పూర్ణానందం. కానీ వెంకటరత్నం అక్కడితో ఆగలేదు. ఇరవైరోజుల పాటు తనకి ఒంట్లో బావుండలేదని మెడికల్ లీవు పెట్టారు.

దాంతో ఒళ్ళు మండిన పూర్ణానందంగారు ఆ అప్లికేషన్ని, యూనివర్శిటీ మెడికల్ ఆఫీసర్‌కి రిఫర్ చేస్తూ 'ఫ్యూచర్లో వెంకటరత్నంగారి ఆరోగ్యం బాగుపడి ఉద్యోగానికి పనికి వస్తారో, రారో తెలియచేయమని' రాసారు.

ఇది తెలిసిన వెంకటరత్నం పూర్ణానందంతో దెబ్బలాటవేసుకున్నా, లీవు ఉపసంహరించుకుని జాయిన్ అయ్యారు.

●●●

టీచింగ్ అసిస్టెంట్‌గా జాయిన్ అయిన తర్వాత, ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, లేడీస్ హాస్టలు ఖాళీ చేసేసి సముద్రపు ఒడ్డుకి ఎదురుగా లాసన్స్ బె కాలనీలో చిన్న అపార్ట్‌మెంటు అద్దెకు తీసుకుని, అందులోకి మారిపోయాను. లాసన్స్ బె కాలనీలో నిశ్శబ్ధవాతావరణం గంభీరంగా ఉంటుంది. ఆ వాతావరణాన్ని సాగరం అలలతో క్రమబద్ధంగా భంగం చేస్తూ, అల్లరి చేస్తూ ఉంటుంది.

అలల గోల మీద ఇష్టం ఏర్పడింది. బాల్కనీలో కూర్చుని ఎదురుగా సముద్రం అలల గోల, క్షితిజరేఖ అందాలు, నీలాకాశపు వంపులు, అలలమీది తేలియాడే పడవల వయ్యారపు పోకడలు చూస్తూ గంటలు నిముషాల్లా గడిచేవి, శాంతిని వెదుక్కునే ఉబలాటం తగ్గింది. తరంగాల్లా ఆలోచన్లు మనస్సుని కలిచేస్తున్నాయి.

పూర్ణానందం హెడ్ అయింది లగాయితూ, ఆయన బుర్రలో ఒక అనుమానం మొదలయింది. డిపార్టుమెంటులో ఎవరూ పనిచేయడం లేదని. అందుకని ఆయన రహస్యంగా, టీచర్లు క్లాసులు తీసుకుంటున్నారా? లేదా? అని పరిశీలించడం మొదలుపెట్టారు. అది గమనించిన రాజేంద్ర ఆయనకి "ప్రొఫెసర్ 007" అని పేరు పెట్టాడు.

ఆ పేరు విని రాజేంద్ర కొంటెతనానికి నవ్వుకున్నా, రాజేంద్ర, ప్రభాకర్ డిపార్టుమెంటులో ఒక గ్రూపు అయాం. అందులో ప్రభాకర్‌కి తనమీద తనకి విపరీతమైన నమ్మకం, మాటకారి. రాజేంద్ర భావకుడు, ముభావి, కాని తన సబ్జెక్ట్ విషయంలో దిట్ట. ఈ విషయం మొత్తం విద్యార్థుల్లో, టీచర్లలో అంతర్లీనంగా ఏర్పడిన అభిప్రాయం ముగ్గురి మధ్యా స్నేహం, అవడానికి, నిలవడానికి కారణం, ముగ్గురికీ తమ మధ్యగల అభిప్రాయబేధాలని పరస్పరంగా గౌరవించే సహనం, నమ్మకం, అన్నింటినీ మించి వయస్సూ.

ముగ్గురూ కలిసినప్పుడల్లా, ఏదో విషయంపై చర్చ జరుగుతుంది.

"విద్యార్థిలోకంలోనూ అసహనమే, ఉపాధ్యాయుల వాతావరణంలో అసహనమే, దీనికి మౌలికమైన కారణం ఏదో ఉంది? అదేమిటి?" అని ప్రశ్నించా.

ముగ్గురం ఇంటి బాల్కనీలో కూర్చుని, ఎదురుగా అనంతంగా మడతలు పడుతున్న సాగరపు అలలని చూస్తున్నాం. ఇంతలో పనిమనిషి మూడు కప్పులతో కాఫీ, బిస్కట్లు తీసుకొచ్చి మధ్యన టీపాయ్ మీద పెట్టింది. సాయంత్రం నీరెండ సముద్రపు అలలమీద పడి ఉయ్యాలలూగుతోంది. వాతావరణంలో తేమకి, శరీరం చికాకు పడినా, అలలమీద నుండి ప్రసరిస్తున్న గాలి హాయినిస్తోంది. ముగ్గురం కాఫీ సిప్ చేయడం మొదలుపెట్టాక, మళ్ళీ నా ప్రశ్నని తిరిగి వేసా.

"అసహనం, ఆరాటంలేని జీవనస్రవంతి, ఎక్కడ ఉంది? లేదు. జీవిత సమస్యలకి, సమాధానం బాహ్యంగా వెతుకులాడడంవల్ల ఘర్షణ, దానినుండి అసహనం పుడుతున్నాయి." అన్నాడు ప్రభాకర్.

దానికి ఎవరూ సమాధానం చెప్పలేదు. కాఫీలు తాగడం పూర్తిచేసి, ముగ్గురం బీచ్‌కి వెళ్ళాం. అక్కడినుండి రామకృష్ణా బీచ్ వేపు నడక సాగించాం.

"నే చెప్పిన దానికి అవుననికానీ, కాదనికాని, ఎవరూ అనలేదే?" అన్నాడు ప్రభాకర్.

"నువ్వు చేసిన వివేచనకు అవుననికాని, కాదనికాని, అనక్కరలేదు. కానీ ***జీవితంలో, ముఖ్యమైన సంఘర్షణా పూరితమైన విద్యార్థిదశ ఏడెనిమిదేళ్ళు మాత్రమే ఉంటుంది. అలాగే ఏ వృత్తి స్వీకరించినా దానిలో కూడా సంఘర్షణ దశ పది పదిహేను ఏళ్ళు ఉండచ్చు, ఆ సంఘర్షణ దశలో సంయమనం కోల్పోకుండా, గడుసుతనంతో, తన జీవితాన్ని మలచుకోడం, నేటి యాంత్రిక మానవుడికి అవసరం. జీవితంలో నిలకడలేని ప్రయాణాలు చేసే వాళ్ళకి ఆసహనం తప్పదు***" అన్నాడు రాజేంద్ర.

ఇలా సాగుతున్న సంభాషణ రామకృష్ణా మిషన్ జంక్షన్ రావడంతో ఆగింది. అక్కడ వీడ్కోలు చెప్పి బస్సు ఎక్కి వెళ్ళిపోయాడు రాజేంద్ర.

రామకృష్ణా మఠం నుండి, లాసన్స్‌బే కాలనీకి తిరిగి నడక సాగించాం. మౌనాన్ని భగ్నం చేస్తూ ప్రభాకర్

"జాహ్నవీ రాజేంద్ర చెప్పిన జీవితాన్ని మలచుకోడం మీద మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు ప్రభాకర్. నేనేం సమాధానం చెప్పలేదు.

కాసేపు మౌనంగా ఉండి మళ్ళీ ప్రభాకరే "మీ పరిచయం అయిన దగ్గరనుండీ, మీ పట్ల నాలో పెరుగుతున్న ఆకర్షణకి, అనేక అర్థాలు వెదికాను. దానిని మీతో చెప్పడమా? మానడమా? అన్నది సంశయం మీకు ఇది చెప్పి మనిద్దరి మధ్యా స్నేహాన్ని ఇబ్బందిపాలు చేయదలచుకోలేదు. కానీ మీరు నన్ను, అర్థం చేసుకుంటారని ఆశిస్తా, మీకిష్టమైతే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను." అంటూ తన పెళ్ళి ప్రపోజల్‌ని నా ఎదుట ఉంచి నన్ను ఎపార్ట్‌మెంట్స్ దగ్గర వదిలి, ముందుకు సాగిపోయాడు.

నల్లటి రోడ్డుమీద ఫ్లోరోసెంటు వీధిదీపాల వెలుగులో, తలొంచుకు వెళుతున్న ప్రభాకర్ కాలిన పెనం మీద నీటిబొట్టులా పడ్డాడు.

ప్రభాకర్ మేరేజ్ ప్రపోజల్ కొత్తగా అనిపించలేదు. కొన్నాళ్ళుగా అతని కళ్ళల్లో అది కనిపిస్తోంది. రాజేంద్ర ఈ విషయంపై కామెంటు కూడా చేసాడు.

ఎపార్టుమెంటులోకి వెళ్ళి, అద్దం ముందు నిలబడి పరీక్షగా చూసుకున్నా. ఆరేళ్ళ క్రిందట తను మెరుపుతీగ, ఇప్పుడు ఏదో మిస్ అయిందా? ఏమిటి? తనలో ఇంకా ఆకర్షణ మిగిలివుంది. నన్ను చూసి స్పందించే వాళ్ళున్నారు. కానీ ఆనాడు క్షీరసాగర్ నన్ను చూసి పొందిన స్పందనకి, సాగర్‌ని చూసి తను పొందిన ప్రతిస్పందనకి ఉన్న అనిర్వచనీయమైన మత్తు, ఈనాటి ప్రభాకర్ స్పందనలోలేదు. క్షీరసాగర్ చూపించిన చురుకుదనాన్ని, దుందుడుకుదనాన్ని, మెచ్చుకున్న భావోద్వేగం ఇప్పుడు లేదు.

ఇప్పుడంతా నిర్లిప్తత.

మళ్ళీ అలాంటి ఊబిలో దిగరాదనిపిస్తోంది. క్షీరసాగర్ తలపులతో, విచలితమైన మనస్సుతో, పక్క మీదకి చేరుకున్న నాకు, ఆ రాత్రి నిద్ర కరువయ్యింది.

●●●

ఏదో అసహనం, ఏదో అనిర్వచనీయమైన అనీజీ. దానికి కారణం ప్రభాకర్ ప్రపోజలా? ఈ ప్రపోజల్ నాలో ఆసక్తి లేపలేదు సరికదా.. ఈ స్నేహం ఏ మలుపు తిరుగుతోందో అన్న భయం వెన్నాడుతోంది.

ఎంతో హాయిగొలిపే ప్రపోజల్ ఆలంబనకాదు. ఎంత మాత్రం కాదు. ఒక బంధం కోరుతున్నాడు. అందులో స్నేహం తక్కువ. డిమాండ్ ఎక్కువ ఉంటుంది. అసలు ఈ స్నేహాన్నుంచి బంధంలోకి మారమని డిమాండ్ చేస్తున్నాడు. అప్పుడతని ప్రవర్తనలో మార్పువస్తుందా? స్నేహాన్ని కలుషితం చేస్తుందా? అలా జరిగితే మళ్ళీ జీవితం ఇరుకై పోతుంది.

ప్రభాకర్ పక్కకి పెడితే. నేనేం కోరుకుంటున్నాను? స్నేహం ఇస్తున్నంత ఆనందం, హాయి, బంధం ఇవ్వదేమో? ప్రేమని తెలియచేసిన ప్రభాకర్ రెండుమూడు రోజులు, నా సమాధానం కోసం ఎదురుచూసుంటాడు, రోజులు గడుస్తున్నా, సాయం సంధ్యలు

చీకటి మలుపుల్లోకి తిరిగిపోతున్నా, ఆశించిన సమాధానం అందలేదు ప్రభాకర్‌కి, దానికి కారణాలు వెతుకుతాడు. సిగ్గే దానికి కారణం అనుకుని ఉంటాడు. కానీ సాయంత్రపు సమావేశాల్లో, నా ప్రవర్తనలో నా మాటల్లో, తన పట్ల ఎటువంటి ప్రత్యేకమైన మొగ్గు లేకపోయేసరికి, నేను తనని తిరస్కరించానా? అన్న ఆలోచన అతనిలో మొదలైంది. దాన్ని జీర్ణించుకోలేకపోయాడు. నేను తనని తిరస్కరించడం, తట్టుకోలేకపోయాడు. తిరస్కారానికి కారణం వెదకసాగాడు.

నాకు బాగా పరిచయం ఉన్న వ్యక్తులు తను, రాజేంద్ర. రాజేంద్ర వివాహితుడు. తను అవివాహితుడు. అవసరం తనే అన్న గట్టి నమ్మకంతో ఉన్నాడు ప్రభాకర్. కానీ తనని స్వీకరించలేదంటే ఖంగుతిన్నాడు.

నా మౌనాన్ని భరించలేకపోయాడు. అది అతని ప్రవర్తనలో కనిపించింది. అతని ప్రవర్తన, అప్పుడప్పుడు సాయంసంధ్యల మిత్రసంగమాన్ని కలుషితం చేస్తోంది. నా మీద అర్థం పర్థం లేని అధికారంకోసం ప్రభాకర్ తపిస్తున్నాడని అర్థం అవుతోంది.

ఆలోచనలు ఎన్ని పోకడలు పోయినా మిత్రులు ముగ్గురూ సాయంత్రపు సంధ్యకి వీడ్కోలు ఇవ్వడం మానలేదు. కలియడం మానలేదు.

●●●

ఆ రోజు సాయంత్రం ముగ్గురం బీచి వొడ్డున కూర్చున్నాం.

'జీవితానికి అర్థం ఏమిటి?' నా ప్రశ్న.

'ఇది చాలా చిక్కు ప్రశ్న' అన్నాడు రాజేంద్ర తన సహజధోరణిలో.

'చిక్కు ప్రశ్నేం కాదు దానికి అసలు సిసలు సమాధానం ఉంది" అన్నాడు ప్రభాకర్.

'అయితే చెప్పండి' అన్నా.

'సమాధానం చెప్పవచ్చు, కానీ అర్థం అవుతుందా అని!?' ప్రభాకర్ సందేహం.

దానికి రాజేంద్ర నవ్వుతూ 'అర్థం అయేటట్టు చెప్పవోయ్. మనం కూడా విషయాన్ని అర్థం అయేటట్టు చెప్పకపోతే, మన వృత్తికే అవమానం' అన్నాడు.

దాంతో ప్రభాకర్ అహం దెబ్బతింది. 'జీవిస్తున్న వాళ్ళకే, జీవితానికి అర్థం ఏమిటో చెపితే బోధపడుతుంది.' అన్నాడు.

'అంటే మేం జీవించడం లేదనా నీ ఉద్దేశం?' రాజేంద్ర క్రాస్ ప్రశ్న.

'నేనలా అన్నానా? ఏ ఉద్దేశమూ లేకుండా "జీవచ్ఛవాలు" అన్న నానుడి ఎందుకు పుట్టుకొస్తుంది' అన్న ప్రభాకర్ సమాధానం, రాజేంద్రని, నన్నూ గాయపరచింది.

సంభాషణ అక్కడితో ఆగిపోయింది. కానీ ఇంటికి చేరుకున్నా మనసులో ఆ సంభాషణ అదే పనిగా రింగ్ అవుతోంది.

జీవచ్ఛవంలా బతుకుతున్నానా? అదే ప్రభాకర్ చెప్పదలిచాడా? ప్రభాకర్‌ని తను స్వీకరిస్తే జీవితానికి అర్థం ఏర్పడినట్టు, లేకపోతే లేదా?

ప్రభాకర్ తన ఇష్టాన్ని వ్యక్తం చేసింది మొదలు, విచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. అతని ప్రవర్తనకి తనెంతవరకూ కారణం? అతన్ని స్పష్టంగా తిరస్కరించక, సంకోచిస్తోంది? అందుకే మౌనంగా ఉందా? ఆ మౌనంలో సంకేతం, అతనికి ఇంకోలా అర్థమయిందా? అసలు మౌనంలో స్వార్థం ఉందా? ప్రభాకర్‌ని జీవితంలోకి ఆహ్వానించి అదే రంగుల కల అనుకునే స్థితిలో లేను. ప్రభాకర్ స్నేహాన్ని వలపుగా మార్చే ప్రసక్తే లేదు.

స్నేహం చెడిపోతుందని మౌనం వహించింది. కానీ ఇంకో పరిస్థితుల్లో అయితే, ప్రభాకర్‌ని నిరాకరించడానికి, ఆలోచించవలసిన అవసరం కూడా ఉండదు.

●●●

ప్రతి నిమిషం ప్రభాకర్ ఆలోచనలు వెన్నాడుతున్నాయి. వంట చేస్తున్నా, స్నానం చేస్తున్నా, భోజనం చేస్తున్నా, పక్క వేస్తున్నా, పడుకున్నా సరే ప్రభాకర్, అతని ప్రవర్తన, అన్ని కోణాలనుండీ బేరీజు వెయ్యడానికి ప్రయత్నిస్తోంది. కాలం గడుస్తున్నకొద్దీ అతని ప్రవర్తనలో మార్పు వస్తుంది. అతను మారతాడనే ఆశ బలంగా ఉంది. అర్థం చేసుకుంటాడనే అనుకుంది.

ముఖ్యంగా తనకి కావలసింది అతని స్నేహం, ముగ్గురి మధ్యా సద్భావం. అప్పుడప్పుడు అది చెడుతున్నా, సహనం వహించడం ద్వారా ఒకరి పట్ల ఒకరికి నమ్మకం ఏర్పడాలి. స్పష్టంగా తన తిరస్కారాన్ని అతనికి తెలియచేసే శక్తి చేకూర్చుకోవాలి. అన్నింటినీ మించి, తన తిరస్కారాన్ని స్నేహశీలిగా స్వీకరించే శక్తి ప్రభాకర్‌కి ఉండాలి. తమ మధ్య స్నేహం నిలవాలి. అది ఎంతకాలం నిలుస్తుందో? అన్న ఆలోచనల సుడిగుండంలో కొట్టుకుని, అలసి నిద్రాదేవి ఒడిలోకి జారుకున్నా.

●●●

కార్ల్‌సెగన్ చెప్పినట్టు మనిషి జీవితంలో ఖర్చు అయిపోయిన కేలండర్లన్నీ, ఒక కట్టగట్టి, ఎస్ట్రనోమికల్ కేలండర్లో, వాటి స్థానంలో ఉంచితే, మనిషి జీవితంలోని అరవై లేక డెబ్బై కేలండర్ల కట్ట, మమూలు, కంటికి కనిపించదు. భూతద్దంలో చూస్తే ఒక చిన్న చుక్కలా కనిపించవచ్చు.

అరవై, డెబ్బై ఏళ్ళ జీవితం ఫ్రేక్షనల్ డిష్టిలేషన్‌కి గురి అయినట్టుగా, మరుగుతూ మార్పులు చెంది గడుస్తున్న ప్రతి క్షణం మరిగి సెగలై, పొగలై విశ్వంలో కలిసి మనుగడ కోల్పోతుంది. మనిషి జీవితం స్వాంతన చెందడానికా అన్నట్టు, క్షితిజం నుండి ఉదయిస్తున్న తదియ చంద్రుడు, తన కళలోని కమ్మని రుచిని, ఇసుకలో ఒడ్డున, కూర్చుని, తనకై ఎదురు చూస్తున్న భావుక ప్రేక్షకులకు చవిచూపించాడు.

'ప్రకృతి ఏ తర్కానికీ, ఏ కొలమానానికీ అందని అద్భుతమైన రసానుభూతి' అన్నాడు రాజేంద్ర. అతని మనసూ, తదియ చంద్రుడ్ని చవిచూసింది.

'ఈ దృశ్యం బుచ్చిబాబు కథానాయకుడికి ఎదురైతే, అతను సాగరంలోని అలలని బేధించి క్షితిజను చేరి ఉదయిస్తున్న చంద్రబింబానికి తల బాదుకుని ఉద్వేగం భరించలేక, మూర్చిల్లేవాడు' అన్నాడు.

నాకు తెలుసు బుచ్చిబాబు అంటే రాజేంద్రుడికి ఇష్టం. చంద్రుడి కళలో లీనమైపోయిన మా ఇద్దరి సాన్నిహిత్యం ప్రభాకర్‌కి వెగటు కలిగించింది.

'ఏం బుచ్చిబాబు నాయకుడికి మూర్చరోగమా?' అన్నాడు.

అతని ప్రశ్నకి మేమిద్దరం ఈ లోకంలోకి వచ్చాం, అతని ప్రశ్నలో ఉన్న హేళనని గుర్తించాం. అప్పటికి చంద్రోదయం అయిపోయింది. చంద్రుడు ఆకాశంలో వేలాడదీసిన ఫ్లోరొసెంట్ దీపంలా తయారయ్యాడు.

'నే వెళ్తాను' అని విసురుగా లేచి వెళ్ళిపోయాడు రాజేంద్ర.

'బుచ్చిబాబు కథానాయకుడికి మూర్చరోగం అంటే వీడికి ఎందుకు కోపం?' ప్రభాకర్ మాటల్లో గిల్టీ కాన్షస్ కనబడుతోంది. కానీ అతని అహం అది ఒప్పుకోనివ్వలేదు.

రాజేంద్ర అంత విపరీతంగా రియాక్ట్ అవుతాడనుకోలేదు.

ప్రభాకర్ తన ప్రేమ ప్రకటించిన తరువాత, నా సమాధానం కోసం ఎదురు చూసాడు. ఆ నిరీక్షణ అతనికి భరించరానిదిగా అనిపించింది. నా మౌనం తిరస్కారం అన్న ఆలోచన అతన్ని నిలవనీయలేదు. నేను తనని అవమానం చేసాను అనుకున్నాడు. అతని

ప్రవర్తనలో హుందాతనం, మాటల్లో మృదుత్వం పోయాయి, పూర్వపు సంభాషణలో ఉండే సహజమైన హాస్యం స్థానంలో, వెటకారం వెక్కిరింపు చోటు చేసుకున్నాయి.

ఈ మార్పులన్నింటికి నా మౌనం కారణం అనుకున్నా, నా ఛాయిస్ ఒకటి ఉంటుందని అతను ఆలోచించలేదు. నాకు ఛాయిస్సే లేదని అతని ఉద్దేశం ఏమో?

నా మౌనం తిరస్కారం కాదని నేను ప్రభాకర్‌ని ఏవిధంగానూ, కించపరచలేదని చెప్పాలి. కానీ ఎలా చెప్పడం? చెబితే నమ్ముతాడా? ఈ స్నేహం నాకు ఎంతైనా కావాలి, ముగ్గురి మధ్య స్నేహం చెడకుండా చూడాలి. ఈ స్నేహం వల్ల తన మనసుకి కలుగుతున్న శాంతిని పోగొట్టుకోడం తనకి ఇష్టంలేదు.

వాతావరణాన్ని తేలికపరిచే ఉద్దేశంతో 'ప్రభాకర్ మీరు మాయాబజార్ చూసారా?' అని అడిగా నవ్వుతూ.

'ఆ!' ప్రభాకర్ సమాధానం.

'అందులో శ్రీకృష్ణుడు అంటాడు లెండి. 'రసపట్టులో తర్కం కూడదు' అని అంటే ప్రకృతిలోని అనేక అందాలు మన హృదయాన్ని తాకి రసానందాన్ని కలుగచేస్తాయి. వాటిని బుద్ధితో తర్కించి, మనకు లౌకికంగా తెలిసిన అర్థాల్ని అంట గట్టడం దారుణం, మూర్ఛన పొందడం అనేది దశవిధాలైన మన్మథావస్థల్లో ఒకటి' అన్నా

నా వివరణ, రాజేంద్ర నిష్క్రమణ, ప్రభాకర్‌ని, కదిలించి అందమైన సాయంత్రం చెడగొట్టాననే పశ్చాత్తాపం ప్రభాకర్‌లో కలుగుతుందనే అనుకున్నా కానీ అలా జరగలేదు.

ప్రభాకర్ ఎప్పుడు జోక్ చేసినా నేను, రాజేంద్ర ఇంతకు ముందులా తేలిగ్గా నవ్వడంలేదు. ఏదో లేనిపోని అర్థాలు వస్తున్నాయి. హాస్యం వెటకారంగా మారుతోంది. ముఖ్యంగా రాజేంద్రకి వకాల్తా పుచ్చుకుని వివరణ ఇవ్వడం, ప్రభాకర్ భరించలేకపోతున్నాడు.

'మీరేం మాట్లాడుతున్నారో, నాకేం అర్థంకాలేదు. మీ మాటల్లో కర్త, కర్మ క్రియలైతే ఉన్నాయి, అర్థమే లేదు. అందుకే మీకు లెక్చరు క్లాసు ఇవ్వలేదు. విద్యార్థులు బ్రతికిపోయారు' అన్నాడు తన హాస్యానికి తానే నవ్వుకుంటూ.

మరో సమయంలో అయితే హాస్యానికి నవ్వేదాన్నేమో, కానీ తను టీచింగ్ అసిస్టెంటు అని అతనికి తెలుసు. తనకి లెక్చరు క్లాసు ఇవ్వరనీ అతనికి తెలుసు. ప్రభాకర్ తనలో పేరుకు పోతున్న కసి బైటకి పోయేదారి, వెతుక్కుంటున్నాడు.

'పదండి వెళ్దాం' అని లేచాను. అతను లేచాడా, లేదా అని చూడలేదు. నడిచి గట్టు ఎక్కి అక్కడ నుండి అపార్ట్‌మెంటు వేపు వెళ్ళా. అతను ఇసుకలోంచి ఒడ్డుకి చేరేసరికి నేను అపార్ట్‌మెంట్ చేరుకున్నా. నా కోపం ప్రభాకర్ గ్రహించేవుంటాడు. మనసు శాంతించి ఉంటుంది. ***ఎదుటి మనిషికి బాధ కలిగించి ఆనందించేవాడ్ని అంటిపెట్టుకుని ఉండేకన్నా మిస్ అవడం మేలు.***

●●●

శాంతాదేవి మూడు నెలలు శెలవు మీద వెళ్ళింది. శాంతాదేవి క్లాసులన్నీ పూర్ణానందం నాకు అప్పచెప్పారు. ఆశ్చర్యపోయా, మళ్ళీ శాంతాదేవితో గొడవపడేకన్నా? క్లాసులు ఇంకెవరికైనా ఇమ్మని చెప్దాం అనుకున్నా కానీ రాజేంద్ర ప్రోత్సాహంతో క్లాసులు తీసుకోడానికి ఒప్పుకున్నా.

నా క్లాసులు సజావుగా జరిగిపోతున్నాయి.

అప్పుడప్పుడు ప్రభాకర్ అపహాస్యంగా, వెక్కిరింపుగా మాట్లాడినా, ఇద్దరం పట్టించుకోడం మానేసాం. సాయంత్రం సమావేశాలు మానలేదు.

ఓ సాయంత్రం.

'ఎదురుగా ఉన్న సముద్రం ఇంకిపోతే ఎలావుంటుంది.' నా ప్రశ్న.

'ఇంకదు కదా?' రాజేంద్ర జవాబు.

'ఇంకదు అందుకే ఇంకిపోతే ఏమనిపిస్తుందో అన్న ప్రశ్న.'

'అంటే జాహ్నవి ఏదో అనుభవాన్ని చెప్దామని అనుకుంటున్నది, క్లాసులో మొదటిరోజు అనుభవం ఎంతో ప్రిపరేషనుతో ఏదో గొప్పగా ఊహించుకుని క్లాసుకి వెళ్ళిన నేను ఎలా మొదలుపెట్టాలో తెలీక తడబడ్డాను. ఏదోలా మొదలుపెట్టిన పాఠం, నా ప్రిపరేషన్ పావుగంటలో అయిపోయింది. ఒకరకంగా బోధపరుద్దామని వెళితే అది ఇంకో రకంగా మారిపోయింది. నామీద నాకే నియంత్రణ లేకుండా పోయింది. క్లాసునుండి వచ్చాక నా మీద నాకే నమ్మకం పోయింది.' అన్నా మొదటిరోజు క్లాసులో నా అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ.

'అంత అసంతృప్తి కలగడం, చిత్రంగానే ఉంది. మీకే కాదు చాలా మందిలో ఈ అసంతృప్తి ఉంటుంది. అది కాలక్రమేణ తగ్గుతుంది. కొన్ని వృత్తులు ఉన్నాయి. వీటిలో సంతృప్తి ఏర్పడదు. ముఖ్యంగా కళాత్మకమైన వృత్తులు, ఏ కళాకారుడికీ సంతృప్తినివ్వవు. "బోధన" ఒక కళ, అందుకే ఈ వృత్తిలో అసంతృప్తి' అంటూ ప్రభాకర్ చేసిన కామెంటు ఇద్దరికీ నచ్చింది.

'అలాంటి టీచర్స్ ఉన్నారంటావా?' రాజేంద్ర ప్రశ్న.

'ఓ ఉంటారు.. వాళ్ళే మనకి జ్ఞాపకం ఉంటారు' అన్నాడు ప్రభాకర్, సంభాషణ అక్కడితో ముగిసింది.

●●●

అలాంటి వాళ్ళు ఉన్నారో లేదో తెలీదు కానీ, పూర్ణానందంగారు లాంటి వారు ఈ వృత్తికి ప్రత్యేకమైన వారు అని నిరూపించుకున్నారు.

శాంతాదేవి శెలవు నుంచి రాగానే, తన సబ్జెక్టు జాహ్నవి చెపుతోందని తెలిసి పెద్ద గొడవ చేసింది. అసలు నాకు ఏం రాధని, నాకు సబ్జెక్టు ఇవ్వడం వల్ల విద్యార్థులకి అన్యాయం జరిగిపోయిందని, విద్యార్థులు రిపోర్టు చేసారంటూ పూర్ణానందంగార్ని నిలబడనివ్వలేదు. ఆయన నన్ను పిలిచి స్టూడెటు నోట్సు చూపించి 'జాహ్నవీ ఈ టాపిక్ నువ్వే చెప్పావా?' అని అడిగారు.

'ఆ నేనే చెప్పాను.'

'అయితే ఇది ఫండమెంటల్లీ తప్పు' అన్నారు పూర్ణానందం నవ్వుతూ.

శాంతాదేవి 'అవేకాదు ఇంకా ఉన్నాయి. అసల్ నువ్వు ప్రిపేరయి క్లాసుకి వెళ్ళావా?' అంది.

అక్కడ ఏం జరుగుతోందో నాకు అర్థం అయేసరికి, పూర్ణానందంగారు నవ్వుతూ 'ఇంకా కొత్తలెండి, క్లాసుకి ప్రిపేరవాలని, జాగ్రత్తగా చెప్పాలని, ముందు ముందు నేర్చుకుంటుంది లెండి' అన్నారు.

వీళ్ళు నన్ను పీనలైజ్ చేసే విధానానికి తట్టుకోలేకపోయాను. నాకు ఇచ్చిన క్లాసు, తీసికోవడం నా తప్పు అన్నట్టుగా ప్రవర్తించారు. పెద్దలిద్దరూ, నేను తప్పుచేసాను, అంటూ స్టూడెంటు నోట్సులు చూపించి న్యూనత పరచడం, బాధ కలిగించింది. ఆ విషయమే ఆ సాయంకాలం సముద్రపొడ్డున టాపిక్ అయింది.

'మీరు కరెక్ట్‌గానే చెప్పొచ్చు, కానీ విద్యార్థి తప్పు రాసుండచ్చుగా' అన్నాడు రాజేంద్ర.

'అదెలా?' నా ప్రశ్న.

'నలభై మంది క్లాసులో అందరి పెర్‌సెప్షన్ ఒక్కలా ఉండదు. దానికి మనమేం చేయగలం?'

'అది శాంతాదేవికి, పూర్ణానందంగారికి తెలీదా?'

'ఎందుకు తెలీదు? తెలుసు కాబట్టే నోట్సు చూపించి, మీ తప్పు ఎత్తి చూపించారు.'

'ఇదంతా ప్రొఫెషనల్ రాగింగ్ క్రింద తీసుకోవచ్చు. అదొక్కటే కాదు ఇలా జరుగుతుందని ఊహించే ఆ సబ్జెక్టు మీకిచ్చారు. పూర్ణానందంగారు, మీకు శాంతాదేవికి మధ్య ఏర్పడ్డ అభిప్రాయబేధాలు, ఆయన దృష్టిలో పెట్టుకునే ఇది చేసాడు.'

ఇదంతా ప్రిప్లాన్డ్‌గా చేసారంటే నమ్మబుద్ది వేయలా. అయినా కుతూహలం ఆపుకోలేక 'దానివల్ల అతనికి ఒరిగింది ఏమిటి?' అడిగా.

'అదంతా తన ఎడ్మినిస్ట్రేటివ్ టేక్ట్ అనుకుంటాడు, పూర్ణానందం మీ ఒక్కరితోకానేకాదు. అందరితోనూ అలానే ప్రవర్తిస్తాడు మీరేం స్పెషలు కాదులెండి' అన్నాడు రాజేంద్ర.

జరిగింది చిన్న విషయమైనా, కొన్నాళ్ళు బాధపెట్టి కాలగర్భంలో కలిసిపోయింది.

●●●

ఆ రోజు ఆదివారం, తీరుబాటుగా బాల్కనీలో కూర్చుని, ఎదురుగా ఉన్న సముద్రపు అలలని లెక్కిస్తున్నా. లెక్కని ఆటంకపరుస్తూ డోర్ బెల్ మోగింది.

పొద్దున్నే వచ్చే అతిధులు ఎవరా? అని ఆశ్చర్యపోతూ తలుపు తీసా. ఎదురుగా చిన్నా, నాన్న. మనసు ఆనందంతో గంతులేసింది.

'రండి నాన్నా బావున్నారా?' అంటూ చేతిలో సూట్‌కేసు అందుకున్నా.

'ఆ! బాగానే ఉన్నా, నువ్వో?' అన్నారు. ఆయన నవ్వలేదు.

'ఏరా.. చిన్నా చదువు అయిపోయిందా?'

'ఊ', అన్నాడు చిన్నా నవ్వుతూ.

'చిన్నాకి ఈ ఊళ్ళో ఇంటర్వ్యూ ఉంది. వాడు ఇంటర్వ్యూకి వచ్చిన ఫర్మ్‌లో నాకు తెలిసిన మిత్రుడు ఒకడు ఉన్నాడు. అతన్ని కలిస్తే సహాయం ఏదేనా చేస్తాడేమోనని, చిన్నాతో నేనూ వచ్చాను' అన్నారాయన తను ఇక్కడికి అవసరం కొద్దీ వచ్చానని, రావడం ఇష్టంలేదన్నట్టుగా ధ్వనించింది ఆయన గొంతు.

కొడుకు గడప దాటితే ఆదరించే విశాల భావం ఉన్న సంప్రదాయకుటుంబం, కూతురు గడపదాటితే కిట్టదు, 'నువ్వు హాస్టలు నుండి వేరే ఇంటికి ఎందుకు మారేవు?' అన్నారాయన కుర్చీలో కూర్చుంటూ.

ఆ స్వరంలో అధికారాన్ని, ఆ ప్రశ్నలో అనుమానాన్ని అర్ధం చేసుకున్నా. తాను ఒంటరిగా స్వతంత్రంగా ఉండడం, ఆయనకి ఇష్టంలేదు. అలా ఉండడంలో ఏదో అస్వభావికత, అరక్షణ ఉంది. అనుకుంటున్నారు. సమాధానం చెప్పలేదు.

'ఇంకా టీచింగ్ అసిస్టెంటువేనా లేక లెక్చరర్ అయ్యావా?' అని మరో ప్రశ్న నువ్వు ఇల్లు వదిలేసి వచ్చి సాధించింది ఏమిటి? టీచింగ్ అసిస్టెంటు ఉద్యోగం, అన్న హేళన ఆ ప్రశ్నలో ఉందేమో? తండ్రి తనని హేళన ఎందుకు చేస్తున్నాడు. నాలో ఆలోచనలు అడ్డ కట్టలు తెంచుకుని, ప్రవహిస్తున్నాయి. కానీ వాటికి అడ్డకట్ట వేస్తూ 'రజని పెళ్ళికి రాలేదేం. అతను బెంగుళూరులో హెచ్.ఎమ్.టిలో మెకానికల్ ఇంజనీరు' అన్నారు జానకీరామ్.

ఈ ప్రశ్నలు, రజని పెళ్ళిప్రస్తావన, నాన్న ఎందుకు ఎత్తినట్టు, నాన్నరాక వెనుక ఏదేనా ఉద్దేశం ఉందా? లేక దైన్యంగా ఉంటే సహాయం అందిస్తాడేమో అదే అభిమానం అంటే.

'రజని పెళ్ళికి చిన్నా పంపిన కార్డు నాకు చాల ఆలస్యంగా అందింది' అన్నా.

ఆ రోజంతా చిన్నాతో నాన్నతో కబుర్లలో పడికాలం కరిగిపోయింది. సాయంకాలం రాజేంద్ర, ప్రభాకర్ వచ్చారు. పరస్పర పరిచయాలు అయ్యాక, అందరం సముద్రపు ఒడ్డుకి చేరారు. కాలేజీ చదువులు, విద్యార్థులు తీరు దేశంలో రాజకీయాల మీద చర్చ జరిగింది. ఎనిమిది గంటలకి రాజేంద్ర, ప్రభాకర్ వెళ్ళిపోయారు.

మర్నాడు సోమవారం నాన్న వచ్చారని శెలవు చీటీ పంపించి ఇంట్లోనే ఉండిపోయా.

●●●

నాన్నా, చిన్నా, ఇంటర్వ్యూకి వెళ్ళడానికి తయారవుతుండగా, ప్రభాకర్ వచ్చాడు.

'ఏమిటి ఇప్పుడు వచ్చారు?' అన్నా ఆశ్చర్యంగా.

'మీ నాన్నగారిని ఆటోనగర్ తీసుకెళ్ళడానికి' అన్నాడు ప్రభాకర్.

'కాలేజీ'

'శెలవు పెట్టాను. బోల్డు శెలవలు మిగిలిపోయాయి' అన్నాడు ప్రభాకర్ నవ్వుతూ ముగ్గురికీ టిఫిన్లు పెట్టి, కాఫీ ఇచ్చాను. ముగ్గురూ ఆటోలో వెళ్ళిపోయారు.

ప్రభాకర్ తనకీ చిన్నాకి తెలియకుండా, నాన్నతో ప్రోగ్రామ్ ఫిక్స్ చేసాడు. నాన్న దగ్గర తన మాటకారితనం చూపిస్తాడు. ఇద్దరూ కలిసి నాకు వాళ్ళు ఎంత అవసరమో అని తమని తాము నమ్మించుకుంటారు. అందులో ఆడది ఎంత లొంగి ఉండాలో, లేకపోతే ఎంత నష్టమో, ఎన్ని పోకడ్లు పోయినా, ఆడది తన వ్యక్తిత్వాన్ని త్యాగం చెయ్యకపోతే సంఘం దృష్టిలో ఎంత చులకన అవుతుందో అనే అనేక విషయాలని, చర్విత చర్వణంగా చెప్పుకుంటారు. ఇద్దరూ నేను యువర్స్ ఫెయిత్‌ఫుల్లీగా ఉండడంలో గల లాభాలు తయారు చేసి, వినిపిస్తారు. ముఖ్యంగా నేనేం మిస్ అవుతున్నానో వాళ్ళు అంచనా వేస్తారు. ఈ విషయంలో నాన్ననేనా సహించవచ్చుకానీ ప్రభాకర్‌ని భరించడం కష్టం.

●●●

చిన్నా, నాన్న మధ్యాహ్నం, మూడు గంటలకి ఇంటికి వచ్చారు.

'చిన్నా ఇంటర్వ్యూ ఎలా అయిందిరా?'

'బాగానే అయింది అక్కా, నాన్నగారి ఫ్రెండ్ కనపడ్డారు. ఆయనకి మా కంపెనీ జనరల్ మేనేజరు తెలుసు, చెబుతానన్నారు. "సో" ఉద్యోగం వచ్చేసినట్టే' అన్నాడు చిన్నా హుషారుగా.

ఇద్దరూ భోజనం చేసాక, తిరుగుడు వల్ల బాగా బడలికగా ఉండి నాన్న విశ్రమించారు.

సాయంకాలం రాజేంద్ర ఒక్కడే వచ్చాడు. చిన్నా, రాజేంద్ర నేను బీచ్‌కెళ్ళాం. కాసేపు కబుర్లు చెప్పుకున్న తర్వాత, నాన్న నిద్రలేస్తారేమోనని తొందరగా నేను వెనక్కి వచ్చేసాను. కాసేపటికి వాళ్ళిద్దరూ కూడా వెనక్కొచ్చేసారు.

రాజేంద్ర వెళ్ళిపోయక, రాజేంద్ర వెళ్ళిన వేపే చూస్తూ, 'ప్రభాకర్‌కి, రాజేంద్రకి చాలా తేడా ఉందక్కా' అన్నాడు చిన్నా.

'ఏమిటా తేడా?' అంటూ ప్రశ్నించా కుతూహలంగా.

'ఒక్కమాటలో చెప్పాలంటే "అతి" ' అన్నాడు.

'ఇద్దరిలో ఎవరు అతిగా ఉంటారు?'

'ప్రభాకర్ చాలా అతిగాడు' అని 'గాడు' అన్నందుకు నాలిక్కొరుక్కున్నాడు. చిన్నా. అది చూసి నవ్వాగలేదు.

మా నవ్వుల్లో మేముండగా నాన్న మేలుకొన్నారు. ముగ్గురి భోజనాలూ ముగిసాయి 'అక్కా బాగా అలసటగా ఉంది.' అంటూ, చిన్నా వెళ్ళి పడుకున్నాడు.

నాన్న భుక్తాయాసం తీర్చుకోడానికి, బాల్కనీలో కూర్చుని, ఆ రోజు పేపరు తిరగ వేస్తున్నారు.

నే వంటింట్లో పని ముగించి, వచ్చి బాల్కనీలో కూర్చున్నా. ఇద్దరం మౌనంగా సముద్రాన్ని, అలలని, దూరంగా లంగరు వేసిన ఓడల్ని అలలమీద ఊగాడుతున్న కోస్టల్ గార్డు బోటుల్ని, కాంతికిరణాన్ని ప్రసరించి, దాచేసుకుంటున్న లైట్ హౌస్‌ని, క్షితిజానికి కొంచెం పైగా, ఆకాశంలో మినుకు, మినుకు మంటూ వేలాడుతున్న తారల్ని గమనించాం.

ఒక్కో ప్రదేశంలో ఒక్కో కేన్వాస్ దొరుకుతుంది. విశాఖ కేన్వాస్ దాని సీనరీయే వేరు.

'విశాఖపట్నం చాలా అందమైంది' అన్నారు నాన్న సంభాషణకి ఉపక్రమిస్తూ.

నేను 'ఊ' అనలేదు 'ఆ ' అనలేదు మౌనంగా కూర్చున్నా,

'నీతో ఒక విషయం మాట్లాడదామని అనుకుంటున్నా జాహ్నవి' అన్నారు. నాన్న

'ఏ విషయం నాన్నా?' అన్నా. నాన్న ఏ విషయం మాట్లాడతారో, నాకు చూచాయగా తెలుసు.

'అప్పట్లో పెళ్ళి చేసుకోనన్నావు, ఉద్యోగం, అంటూ ఇల్లు వదిలి వచ్చేసావు. ఇప్పుడు నీ నిర్ణయంలో మార్పు ఏదైనా ఉందా?' మౌనంగా ఊరుకున్నా. మార్పులేదు అని చెప్పాలి, కానీ అది చెప్పడం అంత అవసరం కాదు.

నా మౌనం ఆయన్ని ప్రోత్సహించింది. ఇంటికి రావడానికి తటాపటాయిస్తోంది. అనుకున్నారు.

'నీకు పెళ్ళి విషయంలో ఆలోచన ఉంటే, ఇంటికి వచ్చేయ్ రజనికి పెళ్ళిచేసినట్లే, నీకూ పెళ్ళి చేసేస్తాను. నువ్వు చదువుకున్నావు. ఉద్యోగం ఉంది. జీవితంలో నీ బ్రతుకుని, నిర్మాణాత్మకంగా అభివృద్ధి చేసుకోవచ్చు. నా మాటకాదని, ఇల్లువదిలి వచ్చావు. ఏం సాధించావు. ఓ చిన్న ఉద్యోగం, దాని వల్ల జీవితంలో పరిపూర్ణత, తృప్తి ఉన్నాయని, నేను అనుకోను. ఈ ఒంటరితనాన్ని, వదిలి సహజమైన, పద్ధతిలో అందరిలా జీవించడానికి, నీకు అభ్యంతరం ఏమిటి?'

తండ్రి చెప్పినదంతా శ్రద్ధంగా విన్నా. నిజమే అభ్యంతరం ఎమిటి? తండ్రి చెప్పేదాకా నాకు ఒంటరితనం తెలియరాలేదు. నా ఒంటరితనంలో అసంతృప్తి, దైన్యం ఉన్నాయని, అనుకోలేదు. ఎందుకు అలా అనిపించడంలేదు? తన దారి వేరా? తనది అందరిలా ఆలోచించే మనసుకాదా? రజనికి పెళ్ళైందని, తండ్రి చెప్పినా, ప్రభాకర్ ప్రేమని వ్యక్తపరచినా, నాలో ఏ స్పందన కలుగలేదు. అన్న ఆలోచనల్లో మునిగిపోయా.

ఆ ఆలోచనల్ని తెగ్గొడుతూ, 'ఏం మౌనంగా ఉన్నావ్ జాహ్నవి, నువ్వు ఇంటి నుండి వెళ్ళిపోయాక, నా మొండితనం వెనుక మరేదైనా కారణం ఉందేమో? అనిపించింది' అన్నారాయన.

'ఏమిటి?' ప్రశ్న. ఆయన ఊహించిన కారణం ఏమిటై ఉంటుందా అని ఆశ్చర్యపోయను.

'నేను ఇలా అడుగుతున్నానని బాధపడకు, కాలేజీలో చదువుతున్న రోజుల్లో నువ్వు సాగర్ ఏమైనా తొందరపడ్డారా?'

నాన్న ప్రశ్నకి ఆశ్చర్యపోయినా తర్వాత "లేదు" అని స్పష్టంగా సమాధానం చెప్పా

నాన్న రెండు నిమిషాలు నన్ను చూస్తూ ఉండిపోయారు. ఆయన మస్తిష్కంలో ఏమి ఉందో, ఆయన కళ్ళల్లో, ఏ భావాలు చోటు చేసుకున్నాయో తెలుసుకోడానికి నేను ప్రయత్నించలేదు.

సముద్రపు అలల్ని చూస్తూ కూర్చున్నా.

ఆఖరికి ఆయనే తేరుకున్నారు. గొంతు సవరించుకున్నారు. ఇంకా చెప్పవలసింది ఉందన్నమాట, ఇక్కడితో ఇది అయిపోలేదు అనుకున్నా.

'ఒక చిన్న విషయం నీకు చెప్పాలి జాహ్నవి'అంటూ మొదలు పెట్టారు ఆయన 'శరీర, ఆకర్షణలు, స్త్రీ పురుష సంబంధాలు, సహజం కాని అవి లోకసమ్మతంగా ఉండాలి. పెళ్ళైన పురుషుడ్ని పట్టుకుని అతనంటే నాకు ఆకర్షణ అంటే లోకం వాళ్ళని అదుపు తప్పిన మనుషుల్లా అంచనా వేస్తుంది. అంతేకాదు సామజిక న్యాయంతో మనల్ని తూచి అడుగడుగునా అవహేళనకి గురి చెయ్యొచ్చు.

నువ్వు ఎడారిలో జీవించడంలేదు, నీకున్న చిన్న ప్రపంచంలో, పరిస్థితుల్లో జీవించడం కష్టమవుతుంది. ' నాన్న తన మాటల్ని పూర్తిచెయ్యలేదు.

నేను ఆశ్చర్యంతో 'నాన్నా ఎవరిని గురించి మాట్లాడుతున్నావ్?' అన్నా.

'నీ గురించే. నువ్వు రాజేంద్ర ఆకర్షణలో పడ్డావని తెలిసింది. అతను వివాహితుడట కదా? నువ్వు చేసే పని మంచిదికాదు.' అన్నారు నాన్న నీ విషయం నాకు తెలుసు అన్నట్టుగా.

నిన్న వచ్చిన తండ్రికి ఇన్ని విషయాలు ఎలా తెలిసాయి? అబద్దాన్ని నిజంగా మలిచి చెప్పగల నేర్పు ఎవరికుంది, ప్రభాకర్‌కి తప్ప, అందుకే పొద్దున్న, తండ్రితో ఆటోనగర్ వెళ్ళాడు. అయినా విషయం నాన్న ద్వారా తెలుసుకుందామని,

'నీకి విషయం ప్రభాకర్ చెప్పాడా?' అని అడిగా.

'అబ్బే ఎవరో చెప్పడం ఎందుకు? నిన్న నాకే అనుమానం వచ్చింది. ఇవాళ ప్రభాకర్‌ని అడిగితే, అవుననలేదు, కాదనలేదు, అందుకే నిజమే అనుకున్నాను' అన్నారు నాన్న.

ఆయన ఎంత దాచినా ప్రభాకరే ఈ విషయం తండ్రి దృష్టికి తీసుకొచ్చాడని అర్థం అయింది, ప్రభాకర్ అంటే అసహ్యం వేసింది. ఈ విధంగా ఎందుకు ప్రవర్తిస్తున్నాడో, దీనివల్ల అతనికి ఒరిగేదేమిటో? ఈ రకంగా తన వ్యక్తిత్వం మీద దెబ్బ తీయడం వలన అతను సాధించదలచుకున్నది ఏమిటీ? నాన్న బోధించ తగ్గవి తనదైన పంథాలో బోధించి, మర్నాడు ట్రైనుకి వెళ్ళిపోయారు.

●●●

**ఆ రోజు ఎంతో ఆనందాన్ని కలిగించి,** విషాదానికి బీజంగా మారుతుందని అనుకోలేదు. రెండు రోజుల శలవు తర్వాత, కాలేజీకి చేరిన నాకు, లెటరు స్టాండులో నా పేరు మీద ఉన్న కవరు చూసా. ఉత్తరాన్ని పరిశీలిస్తే అది ఫారిన్ ఉత్తరం. విదేశీ జర్నల్ నుండి తన పేపర్‌ని వేసుకుంటున్నట్టు, తెలియచేస్తూ పంపిన ఆమోద పత్రం. కాలేజీ కాకపోయుంటే, సభ్యత అడ్డురాక పోయివుంటే నాట్యం చేసుండేదాన్నేమో! ఆ ఉత్తరంతో మనసు ఎంతో తేలికపడింది. నిన్నటి వరకూ పిశాచాల్లా మస్తిష్కం చుట్టూ నాట్యం చేసిన ఆలోచనలు, మాయమయిపోయాయి. ఆమోదపత్రం, వేసవిలో మంచుముక్కల హాయినిచ్చింది.

ఆమోదపత్రాన్ని, పూర్ణానందంగారికి చూపించాను.

"అలాంటివి మరో రెండు పబ్లిష్ చేస్తే లెక్చరర్ పోస్టుకి రికమెండ్ చేస్తాను." అన్నారు ఆయన.

"లేకపోతే రికమెండు చేయరా?" అని చిలిపిగా అడిగా.

ఆయన కనుబొమలు ఎగరేసి "ఊ" అన్నారు.

ఆయన రూమునుండి వస్తుంటే రాజేంద్ర, ప్రభాకర్ కనిపించారు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటూ వస్తున్నారు. ఇద్దరూ కలిసి ఉంటే, ఇద్దరి మధ్యా ఏ స్పర్థలూ ఉన్నట్టు కనిపించరు. కానీ నేను వాళ్ళతో కలిస్తే, మొత్తం ప్రపంచమే వేరు అన్నట్టుగా ఉంటుంది. మనసులో పడ్డ బాధని పక్కకి పెట్టి, ఇద్దర్నీ ఆనందంగా పలకరించి జర్నల్ నుండి వచ్చిన స్వీకృతి పత్రాన్ని చూపించి, ఆ పేపరు తయారు చేయడంలో సహకరించిన రాజేంద్రకు ప్రత్యేకంగా "థాంక్స్" చెప్పాను.

"ఇద్దరూ కంగ్రాట్యులేషన్స్" అన్నారు ఒకేసారి

"మంచి పార్టీ ఇవ్వండి" అన్నాడు రాజేంద్ర.

"తప్పకుండా రండి కాంటిన్‌కి వెళ్దాం" అన్నాను.

"వట్టి స్వీటు హాటేనా? ఏదైనా సెలబ్రేషను ఉండాలి?" అన్నాడు ప్రభాకర్

"అంటే కేబరే డాన్సు, షాంపేన్ ఉండాలా?" అన్నా నవ్వుతూ.

"అవేం అఖ్ఖరలేదు కానీ సాయంత్రం సినిమాకి వెళదాం, జగదాంబలో 'రెయాన్స్ డాటరు' సినిమా ఆడుతోంది" అన్నాడు రాజేంద్ర. అంగీకారం కుదిరింది.

"ముగ్గురం ఆరుగంటలకి, జాహ్నవి ఇంటి దగ్గర కలుద్దాం" అన్నాడు ప్రభాకర్.

●●●

సూర్యకిరణాల తాకిడికి ఉత్తేజితురాలైన పృధ్వి, సాయంకాలం, అనే ఉదాత్తమైన అలంకరణని మనస్పూర్తిగా చేసుకుంటున్నది. ఆనందంతో నిండిన మనసు, పంచుకునే వాళ్ళకోసం ఎదురు చూస్తోంది.

ముందుగా ప్రభాకర్ వచ్చాడు. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. నేను పాత విషయాలు ఎత్తలేదు. అవి ఎత్తి ఈ అందమైన సాయంత్రాన్ని పాడుచేయదల్చుకోలేదు. కొంతసేపు తర్వాత, స్నానానికి లోపలికి వెళ్ళాను.

నే తయారై వచ్చినా రాజేంద్ర జాడ ఎక్కడా కనపడలేదు. ఇద్దరం వాచీలు చూసుకున్నాం. ఆరుగంటలయింది. సినిమా ఆరుంపావుకి. ప్రభాకర్ తొందరచేసాడు.

"రాజేంద్ర రానని మీకేమైనా చెప్పాడా?" నా ప్రశ్న.

"లేదు, మిసెస్‌కి వంట్లో బావుండలేదని, ఇవాళ తొందరగా ఇంటికి వెళ్ళిపోయాడు. మరి ఆవిడకి ఎలా ఉందో, లేటయితే డైరెక్ట్‌గా జగదాంబ థియేటరుకి వచ్చేసి వెయిట్ చేస్తున్నాడేమో? ఆరులోగా వస్తానన్నాడు. అప్పుడే ఆరయింది. పద మనం వెళ్దాం. లేకపోతే మనం కూడా సినిమా ఇంటర్‌వెల్‌కి వెళతాం" అంటూ తొందరచేసాడు ప్రభాకర్.

ఆరులోగా వస్తానన్న రాజేంద్ర రాలేదుకదా! అని ఇద్దరం బయలుదేరాం.

"ఆరయినా సరే ఇంత వెలుగ్గా ఉందేమిటా?" అని ఆశ్చర్యపోయా. అదేం పట్టించుకోకుండా, ఆటో పిలిచాడు ప్రభాకర్. ఇద్దరం ఆటోలో సినిమాహాలుకి చేరుకున్నాం. ఇద్దరం హాలు చేరుకున్న చాలాసేపటికి గాని టికెట్లు ఇవ్వలేదు. టికెట్లు ఇచ్చిన పావుగంటకి సినిమా మొదలయింది.

సినిమా హాలు దగ్గర రాజేంద్ర రాకకోసం ఎదురు చూసిన నాకు నిరాశే ఎదురయింది. హాలు దగ్గర సమయం గడుస్తున్నట్టు అనిపించలేదు.

కానీ ఇంతదూరం వచ్చి సినిమా చూడకుండా వెనక్కి వెళ్ళిపోతే, ప్రభాకర్ ఆలోచనకి పట్టు ఏర్పడుతుంది. తను రాజేంద్ర ఆకర్షణలో పడినట్టు రుజువు చేసినట్టు అవుతుంది. అది నాకు ఇష్టంలేదు.

మళ్ళీ పరిమితులు. ఆలోచనల్లో ఏదో బూచి వెంటాడుతోంది. భయపెడుతోంది. ఎందుకు? అంటే తనకి తెలియకుండా ఏదో హద్దు ఏర్పడింది. ఈ హద్దు ఎవర్ని ఆనందపెడుతుంది. ఎవర్ని దుఃఖపెడుతుంది అన్నమాట అటుంచితే ప్రస్తుతానికి తనెంత హింస పడుతోంది అన్నది అంచనా వేయడం కష్టంగా ఉంది.

"సరిలే ఈ ఒక్కసంఘటనతో, ప్రభాకర్‌లో అనుమానం తొలిగిపోతుంది" అనుకుని సినిమా చూడడంలో మునిగిపోయా. సినిమా 'రెయాన్స్ డాటర్' ఒక అమాయకురాలు, అందమైన యువతి, అదే గ్రామంలోని గ్రామవాసులందరూ మెచ్చుకుంటున్న, మంచి పేరున్న స్కూలు మాష్టర్ని పెళ్ళిచేసుకుంటుంది. ఆ మాష్టరు ఉదాత్తస్వభావం ఆమెను నిరాశపరుస్తుంది. వయసుకోరే వేగం, జీవితంలో కొత్తదనం, ఆమె అందానికి ఆరాధన అతను అందించలేకపోతాడు.

ఆ సమయంలో ఆమెకి ఆర్మీ ఆఫీసరుతో పరిచయం అవుతుంది. ఆమె అతని ఆకర్షణలో పడుతుంది. అతను ఆమె అందానికి కావలసిన 'ఆరాధన' అందిస్తాడు. వీరిద్దరి అక్రమ సంబంధం తెలిసిన ప్రజలు ఆమెను అవమానిస్తారు. ఆమె అందాన్ని చెడగొట్టే విధంగా జుత్తు, కనుబొమలు కత్తిరిస్తారు. అవమాన పడిన ఆమెని సేదదీర్చి, మాష్టారు ఆమెని గ్రామానికి దూరంగా తీసుకెళ్ళిపోతాడు. కథ చిన్నది అయినా, కథ చెప్పడంలోనూ, సపోర్టింగ్ కేరెక్టర్స్ ద్వారా పాత్రల జీవితాల్లో విమర్శనాత్మకంగా చూపడం ద్వారానూ కథలో పట్టు తీసుకొచ్చాడు. డైరెక్టర్ డేవిడ్‌లీన్.

నాకు సినిమా బాగా నచ్చింది. ప్రభాకర్‌కి నచ్చినట్టులేదు.

"సినిమాకి అర్ధం లేదు, రాజేంద్ర అన్నీ ఇలాంటి సినిమాలే ఎంచుతాడు. చక్కనైన భర్త ఉండగా వ్యభిచరించడం దేనికో అర్ధం లేని కేరెక్టర్, గ్రామస్తులందరూ, ఆమెని అవమానించినా మాష్టారు ఆమెని స్వీకరించి, గ్రామస్తులందరినీ అవమానించాడు. మాష్టారికి సిగ్గులేదు" అంటూ ప్రభాకర్ దారి పొడవునా సినిమాని విమర్శించాడు. ఆటో అపార్టుమెంట్స్ దగ్గర ఆగింది.

నే దిగిపోతూ చిన్న వెలుగులో ఆటోడ్రైవరు వాచీ చూసా. తొమ్మిదిన్నర అయింది. నా వాచీ చూసుకున్నా. పదినిముషాల తక్కువ పది అయింది. ఇంత తేడా ఎలా వచ్చింది అన్న ఆలోచనలో పడ్డా. ఆటో ప్రభాకర్‌ని తీసుకుని వెళ్ళిపోయింది.

డేవిడ్‌లీన్ గొప్ప డైరెక్టర్. అతను తీసిన అన్ని సినిమాల్లో మానవత్వపు స్పర్శ ఉంటుంది. ఆయన మలచిన పాత్రల్లో మానవత్వం మౌలికంగా ఉండి, అది మనలో ఉన్న ఎలిమెంటు ఆఫ్ సారో, ఎలిమెంట్ ఆఫ్ జాయ్, ఎలిమెంట్ ఆఫ్ కాంఫ్లిక్ట్, మౌలికంగా వ్యక్తుల్లో ఉండే ద్వంద్వస్వభావాన్ని బలంగా తాకి, ప్రభావితం చేస్తాయి. ఇదంతా ప్రభాకర్‌కి ఎలా చెప్పడం? అది రేపు రాజేంద్ర చూసుకుంటాడు.

అయినా రాజేంద్ర ఎందుకు రాలేదో కనుక్కోవాలి అనుకున్నా.

రాజేంద్ర కాలేజీ జ్ఞాపకం రాగానే, కాలేజీలో నా టైము, కాలేజీ టైముతో నాలుగు గంటలకి సరిపోయింది. సరిగ్గా లాంగ్‌బెల్ కొట్టేసరికి తన వాచీలో నాలుగు అయింది రాత్రి తొమ్మిదిన్నరకి ఇరవైనిముషాలు ఫాస్ట్ తిరిగింది. అంటే థియేటర్‌కి ఇరవై నిముషాల ముందే చేరుకున్నామా? ఆరుగంటలకి రాజేంద్ర వచ్చివుంటాడా? వాచీది తప్పంటే, నమ్ముతాడా? వాచీలో టైము ఎవరు మార్చారు. ప్రభాకారా? ఎప్పుడు? తను స్నానానికి వెళ్ళినప్పుడు టైము మార్చి ఇరవైనిముషాలు ముందుకి పెట్టి ఉంటాడు, ఎంత చలాకిగా ఇద్దర్నీ ఫూల్స్ చేసాడు. రాజేంద్రని తప్పించడానికే ఇలా చేసాడా? ఉత్సాహంలో ప్రభాకర్‌ని పట్టించుకోలేదు.

రాజేంద్ర గురించి, నా గురించి నాన్న దగ్గర అపోహ సృష్టించగలిగినవాడు. ఎంత పనైనా చేయగలడు. తెలిసి తెలిసి, మోసపోయింది.

రాజేంద్ర ఏమనుకున్నాడో, ఎలా అర్ధం చేసుకున్నాడో పొద్దున్న సంతోషం పోయి, సాయంకాలం జరిగిన సంఘటన మనస్తాపాన్ని మిగిల్చింది. రాజేంద్రకి జరిగింది చెప్పి అతనికి సంశయం లేకుండా చేయాలి. రాజేంద్రకి సంజాయిషీ చెప్పుకోవాలా? ఎందుకు చెప్పుకోవాలి? ఏం తప్పు చేసిందని సంజాయిషీ. నే సంజాయిషీ చెపితే దోషిగా నిలబడుతుంది. జరిగిన తేడా తనకీ ప్రభాకర్‌కి తప్ప ఎవరికీ తెలీదు ప్రభాకర్ చెప్పడు. నే చెప్పుకోలేను. ఈ విధంగా జరుగుంటుందని రాజేంద్ర ఊహించడు. ఆ అవసరం అతనికి లేదు. ఈ స్నేహం ఏం కానుందో? అంటూ అర్ధరాత్రివరకూ ఆలోచించి నిద్రపోయా.

●●●

ఎవరేనా ఎవర్నైనా ఎందుకు అర్ధం చేసుకోవాలి? జరిగిన సంఘటనతో నాకు ఏ విధమైన సంబంధమూ లేదని రాజేంద్ర అనుకోలేదు. ఎదురైనప్పుడు పొడి నవ్వు ఒకటి నవ్వి తన పనిమీద తను వెళ్ళిపోయాడు.

రాజేంద్ర ప్రవర్తనని బట్టి, నిన్న రాజేంద్ర ఇంటికి వచ్చాడని, కావాలనే తాము రాజేంద్రని తప్పించామని అనుకున్నాడని అర్ధం చేసుకుంది. రాజేంద్ర తనని అపార్ధం చేసుకున్నాడు. ఆ పరిస్థితులలో ఎవరైనా అంతే? అతను అపార్ధం చేసుకోడంలో తప్పులేదు.

రాజేంద్రకి జరిగింది, వివరించి చెప్పడం ఎలా? చెప్పినా నమ్ముతాడా? మనస్సంతా చిరాకుగా తయారైంది. ఎంత మర్చిపోదామని అనుకుంటున్నా నిన్నటి సంఘటన చికాకు పెడ్తూనే ఉంది.

ప్రభాకర్ వచ్చి పలకరించబోయాడు. "లైబ్రరీలో పనుంది" అంటూ తప్పించుకు వెళ్ళిపోయాను.

●●●

అది జరిగింది మొదలు రాజేంద్రలో మార్పుని బట్టి సాయంకాలం రాజేంద్ర రాడని అర్థం అయింది. ఇంటి బాల్కనీలో కూర్చుని టైము చూసుకున్నా. సాయంత్రం ఐదుగంటలు కావస్తోంది. ప్రభాకర్ వచ్చే టైమ్ అయింది. ప్రభాకర్ ఒక్కడితో సముద్రపు ఒడ్డుకి వెళ్ళడం ఇష్టంలేదు.

ప్రభాకర్‌ని తప్పించుకోడం ఎలా? అన్న ఆలోచన రాగానే లేచి, తొందరగా తయారై ఇంటికి తాళం పెట్టి బస్‌స్టాప్‌కి వచ్చి బస్ ఎక్కాను.

బస్సులో రామకృష్ణ మఠం వరకూ వెళ్ళి అక్కడ దిగి, అక్కడనుండి బీచ్‌లోకి దిగి కెరటాలకి అందీ, అందకుండా, లాసన్స్ బే కాలనీ వేపుగా నడకసాగించాను.

బీచ్‌లో జనం ఎక్కువగా ఉన్నారు. కెరటాలకి అందకుండా పిల్లలు పరుగెడుతున్నారు. కెరటాలు పిల్లల్నీ, అందుకోలేక నిరాశతో వెనక్కి వెళ్ళిపోతున్నాయి. ఈ విధంగా కెరటాలు పిల్లలు దోబూచులాడుకుంటున్నారు. దొంగ కెరటాలని కనిపెట్టలేని పిల్లలు కెరటాలకి చిక్కి తమ బట్టలు తడిపేసుకుంటున్నారు. పిల్లల్నీ అందుకున్న కెరటం గర్వంగా వెనక్కి వెడితే, అందుకోలేని కెరటం, వస్తా, మళ్ళీ వస్తా అంటూ వెనక్కి వెళ్ళిపోతున్నాయి. ఈ నిరంతర దోబూచులాట సాగుతూనే ఉంది.

నడుస్తున్నప్పుడు నా అడుగు పడిన చోట పాదం ముద్రగా పడుతోంది. పాద ముద్రని కెరటం తనలో దాచుకుంటోంది. ఏ పాదముద్ర ఉనికినీ, కెరటం నిలువనీయడంలేదు. ఇసుకలో నడవడం మూలంగా కాళ్ళు నొప్పి పుట్టాయి. మెల్లగా నడిచి గట్టు ఎక్కి జంగిడీ వాడి దగ్గర ముంతకింద పప్పు తిందామని అనుకున్నా, కానీ ఒంటరిగా తినడానికి మనస్కరించలేదు. గట్టు మీద అలసట తీరేవరకూ కూర్చుని, ఇంక ప్రభాకర్ ప్రమాదం ఉండదని, నిశ్చయించుకున్నాక, ఆటోలో ఇంటికి చేరుకున్నా. స్నానం చేసి, భోజనం చేసి పక్క చేరిన నాకు ప్రభాకర్ నుండి ఎందుకు పారిపోయానా అనిపించింది. ప్రభాకర్‌తో సాయంత్రం గడపటం ఇష్టం లేకపోతేం డైరెక్ట్‌గా మొహం మీద ఆ విషయం చెప్పవచ్చుగా. చెప్పలేదు. తను కొన్ని పనులు చెయ్యలేదు. సభ్యతా? లేక అశక్తతా? అన్నది అర్థం కాలేదు. ఇంక ప్రభాకర్‌ని దూరంగా ఉంచాలి. రేపు డిపార్ట్‌మెంటులో అతను ఈ విషయం ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్పాలో నిర్ణయించుకుని అలసిన శరీరంతో నిద్రని ఆశ్రయించా.

●●●

మర్నాడు ప్రభాకర్ డిపార్టుమెంటులో కలిసాడు. "నిన్న సాయంత్రం ఇంట్లో లేరే.. ఎక్కడికి వెళ్ళారు?" అని అడిగాడు.

"పనుండి మెయిన్ రోడ్డు మీదకి వెళ్ళాను. మీరెంతసేపు వెయిట్ చేసారు?" ఇష్టం లేకపోయినా అవసరార్థం అబద్ధం చెప్పక తప్పదు.

"అరగంట"

"రాజేంద్ర వచ్చాడా?" ప్రభాకర్‌కి అవసరంలేని ఎంక్వైరీ.

"లేదు రాలేదు."

"............"

"ముగ్గురూ ఉంటేనే బావుంటుంది కదూ?" అని ఏదో పనివున్నట్టు వెళ్ళిపోయా. ప్రభాకర్ ఖంగు తిన్నాడు. వాళ్ళిద్దరూ ఉంటేనే సాయంత్రాలు అన్నది అర్ధం అవుతుంది. అతనిపై ప్రత్యేకమైన ఇంట్రస్టులేదనేది అర్ధం అవుతుంది. అదే నాక్కావలసింది. ఆ సంఘటన జరిగింది మొదలు, రాజేంద్రలో మార్పు అర్ధం అయింది. ఎక్కడ కలిసినా ఇంతకు ముందులా నవ్వులో జీవం, పలకరింపులో స్నేహం లేవు. వాటి స్థానంలో పొడి నవ్వు. మర్యాదకోసం పలకరింపు అన్నట్టుగా ఉన్నాయి. రాజేంద్ర నిజం తెలుసుకుంటే బావుండును అన్న తపన నాలో మొదలయింది. రాజేంద్ర అర్ధం లేని ఆలోచనలతోనూ, ప్రవర్తనతోనూ, మనసుని గాయపరుస్తున్నట్టుగా అనిపించింది. అంత నమ్మకం లేని రాజేంద్రతో స్నేహం చేయడం, అనవసరం కానీ జరిగిన సంఘటన తెలిగ్గా, మర్చిపోలేకపోతోంది.

ప్రభాకర్ని క్షమించలేకపోతోంది. రెండోరోజు ప్రభాకర్ని తప్పించుకుంది. కాలేజీలో అతని ఏదో సమాధానం చెప్పింది. ఇలా మూడు, నాలుగు రోజులు జరిగిన తర్వాత, ప్రభాకర్ సాయంత్రాలు రావడం మానేసాడు. మళ్ళీ ఒంటరితనాన్ని కొంటెగా చూశాడు అలల విలుకాడు.

●●●

ఇది జరిగిన నెలరోజులకి జర్నల్లో నే రాసిన "ఆర్టికల్" రావడం గతాన్ని మరిచి ఉత్సాహంతో రాజేంద్రకి, వెంకటరత్నంతో చెప్పా. రాజేంద్ర అభినందన, వెంకటరత్నం వెటకారం తిరుగు సమాధానంగా లభించాయి.

మధ్యాహ్నం పర్మిషను అడగనికి పూర్ణానందం ఛాంబరుకెళ్ళాను, లోపల నా ప్రస్తావన రావడంతో బైటే నిలబడి పోయా. "క్లాసులే తీసుకోడం చేతకాదు, అన్నీ తప్పులు తడకలు, ఈ పేపరు ఎవరిచేతో రాయించి ఉంటుందిలెండి" అంటోంది శాంతాదేవి.

"అప్పుడు ఎవరూ ఖాళీగా లేరు. అందుకే ఆమెకి క్లాసులు ఇవ్వాల్సివచ్చింది." పూర్ణానందం పశ్చాత్తాపం.

"ఈ పేపరు కూడా ఏ రాజేంద్రచేతో రాయించి ఉంటుంది. ఆ ఇద్దరూ జాహ్నవి వెనకాల తిరుగుతున్నారుగా.." శాంతాదేవి కామెంటు.

పూర్ణానందం పకపకా నవ్వారు. ఇద్దరూ జాహ్నవి వెనకాల తిరుగుతున్నారన్న కామెంటుకి చాలా ఆవేశం వచ్చింది. ఛాంబరులోకి ప్రవేశిస్తున్న నాకు "అందాలు ఎరవేసి కొన్ని పేపర్లు" అంటున్న శాంతాదేవి కామెంటు అగ్నికి ఆజ్యం పోసినట్టుగా అయింది.

"డోంట్ టాక్ రబ్బిష్ శాంతాదేవి. సంస్కారహీనంగా మాట్లాడడం నాకూ వచ్చు, నేను అందం ఎరవేస్తే, మీకు అందం లేదుగా ఏది ఎరపెట్టారో ఇన్నాళ్ళూ నేను ఇంకా అనగలను. ఎందుకనడం లేదంటే" అన్నా కోపంగా.

నేను ఏమన్నానో శాంతాదేవికి అర్ధం అయి "యూ గెటౌట్" అంది. గొంతుచించుకుని, ఇద్దరి సంగతి చూసి పూర్ణానందం ఏదో సర్దబోయారు. కానీ శాంతాదేవి ఊరుకోలేదు. రెచ్చిపోతుంది పిచ్చికుక్కలా.

"మీరు మీ సీనియర్ టీచర్ని అలా అనకూడదు జాహ్నవీ" అన్నారు.

పూర్ణానందం వేపు తిరిగి 'సారీ' అని చెప్పి ఛాంబర్ నుండి బైటికి వచ్చేసా. శాంతాదేవి ఎంత రెచ్చిపోయింది. ఒక్కమాట శాంతాదేవిని ఎంత బాధించిందో.

నేను లేనని శాంతాదేవి అలా మాట్లాడింది. ఉంటే సభ్యత పేరుతో అలా మాట్లాడదు. కానీ తనమీద అభిప్రాయం అదే తనంటే చులకన. ఎందుకు ఆమె మాట వినలేదనే. ఆమె మాట వినకపోయినంత మాత్రాన ఎందుకంత కసి. తనని బాధిస్తే కాని ఆమెకి సంతృప్తి ఉండదు.

●●●

"అందం ఎరవేసి వేయించుకున్న పేరు" అన్న శాంతాదేవి వాఖ్య వెన్నాడుతోంది. ఎంత అనాగరికత.

ప్రభాకర్ చెప్పినట్టు ఇటీజ్ ఆల్‌పార్ట్ అండ్ పార్సల్ ఆఫ్ ది గేమ్ అనుకోలేకపోయాను. తనంటే కసి, అసూయ దానికి కారణమేమిటి? సమాధానంలేదు. అకారణంగా అసూయ పుడుతోందా? అహంకారం తనని కాదన్నది అన్న దురహంకారం, ఎందుకు కాదందో అన్న ఆలోచన లేదు. అసభ్యంగా మాట్లాడుతున్నాన్న ఇంగితం కూడా లేదు. ఈ చదువులు ఈ పదవులు ఏవీ ఇంగితాన్ని ప్రసాదించవు. మరి ఈ పశుత్వం పోయేదెప్పుడు?

ఇంతకీ తనలో ఆకర్షణ శాంతాదేవిని ఎందుకు కలవర పెట్టింది?

చాలా రోజుల తర్వాత అందాల్ని వెతుక్కుంటూ అద్దంలో చూసుకున్నా. శరీరంలో వచ్చిన మార్పుకి ఆశ్చర్యపోయా. ఆ రోజుల్లో చిగురుటాకులా ఉండేది. ఇప్పుడు ముదురు రంగుకి తిరిగినా, బిగి కోల్పోని పచ్చని ఆకులా ఉంది. కాలేజీ రోజుల్లో విశాలమైన నుదుటిమీద రెండు, మూడు, వంకీలుతో ముంగురులు నాట్యం చేసేవి. ఇప్పుడు అవన్నీ అలసి వెనక్కి ఒదిగి అలసట తీర్చుకుంటున్నాయి. నుదుటికి దిగువుగా నయనాల మధ్యగా చిత్రకారుడు గీసిన గీతలా, అలంకార ప్రాయంగా ఉండే నాసిక, చిన్నగా ఎర్రబడి ముదిరి ముక్కులా తయారైంది. ధనస్సులా వంపులు తిరిగిన కనుబొమలు ఇప్పుడు దట్టంగా పెరిగి నీగ్రోబానిసల్లా తయారయ్యాయి. కళ్ళల్లో మెరుపు తగ్గి, దేదీప్యమానంగా వెలుగుతున్న గాజుగోళాల్లా తయారయ్యాయి. వయస్సు మార్పుకి సంకేతంలా నడుము దగ్గర ముడతపడ్డాయి. నేను కూడా శాంతాదేవిలా, పెరిగిన వయసుని దాచేందుకు, ఇతరుల్ని నమ్మించేందుకు, స్లీవ్‌లెస్ జాకెట్ల పెదాలకి లిప్‌స్టిక్ వెయ్యాలేమో?

ఇదంతా ఎవరి కోసం చేయాలి? ఇదెక్కడి ప్రశ్న? నాలో కొత్తగా పుట్టింది. ఎవరికోసమైనా ఎందుకు చేయాలి?

నో ఉమన్ ఈజ్ మేన్. విచిత్రం తను ఇంటిపనులు, కాలేజీ పనులు చాలా కాజువల్‌గా చేసుకుంటోంది. పనిమనిషి రానప్పుడు చిరాకు లేదు. వంట మొదలు మిగతా ఆడవాళ్ళు చేసే దినసరి కార్యక్రమం చేసేటప్పుడు స్త్రీగా కేజువల్‌గా చేసుకుపోతుందే తప్ప, ప్రత్యేకంగా ఎక్కువ శ్రమ పడుతున్నానని, అనిపించడంలేదు. నా కోసం నేనే శ్రమ పడ్డం స్వేచ్ఛా, స్వతంత్రాలలో భాగమేమో?

కానీ ఎక్కడో వెలితి. నన్ను మనిషిగానే కాక స్త్రీగా ఎవరేనా గుర్తించాలనే కోరిక అంతర్గతంగా ఉందా? నన్ను స్త్రీగా గుర్తించగలిగింది మొగాడే అంటే తను సెక్స్‌ని మిధ్యగా కొట్టిపడేయడం కూడని పని, నన్ను నాలో స్త్రీత్వాన్ని అలక్ష్యం చేయడం వలన ప్రత్యేకమైన ఇబ్బందులు ఏమైనా వస్తా? లోక సమ్మతం అయిన మొగాడి చెలిమి జీవితానికి అవసరమా? తను ఇష్టపడ్డవాడు, లోక సమ్మతం కాకపోతే చపలనవుతానా? ప్రస్తుతం స్త్రీ పురుష సంబంధాలన్నీ, సహజ కట్టుబాట్లకి ఇమిడి ఉన్నాయా? ఇక ముందు కూడా ఉంటాయా? అందుకే ప్రభాకర్ అంత అహంకారంతో ఎందుకు వ్యవహరించాడు. వాడి ప్రవర్తనలో ఒక అధార్టీ చూపించాడు? నా విశ్వాసాన్ని దెబ్బ తీసాడు.

శాంతాదేవి, వెంకటరత్నం, పూర్ణానందం, రామ్మోహన్, ప్రభాకర్, వీళ్ళంతా ఒకే ఆవంలో కాలుతున్న కుండలు. వీళ్ళందరిలో రాజేంద్ర పేరెందుకు రాలేదు? అతనూ తన అర్థం పర్థంలేని ఆలోచనలతో తనని దూరంగా ఉంచాడు. రాజేంద్ర వివాహితుడు, నేను రాజేంద్ర వేపు ఆకర్షితురాలవుతున్నానా? వివాహితుడు కావడం అతని అనర్హతా? అతని సోగకళ్ళల్లో కోటి భావాలు మౌలికంగా నిద్రిస్తున్నట్టుంటాయి. అతను మాట్లాడుతున్నప్పుడు, బలంగా రెండు పెదాల్ని కదుపుతున్నట్టు ఉంటుంది. అతని మాటలు స్పష్టంగా డీప్ త్రోటెడ్‌గా ఉండి, విని తీరాలనిపిస్తుంది. అతని మాటల్లో ముఖకవళికల్లో ఉద్వేగం, ఆవేశం ఉండవు. ఎదుటివాళ్ళని హర్ట్ చెయ్యడు.

ఎవరికీ సంజాయిషీ. రాజేంద్ర గురించి నేనెందుకు ఆలోచిస్తున్నా? నాలో రాజేంద్ర పట్ల ఏర్పడిన ఆకర్షణకి కార్యకారణ సంబంధం వెదుకుతోందా? ఎన్ని ఆలోచించినా స్నేహం చెడిపోయింది. పాతరోజులు.... సాయంత్రాలు మళ్ళీరావు.

●●●

నా ఇష్టాఅయిష్టాలమీద నాకే కాక ఇతరులకి కూడా హక్కు ఉందేమో అనిపిస్తోంది. వ్యక్తుల్ని కలవడం ఇష్టపడడం, సహించడం, అసహ్యించుకోవడం, మనసులో దాచుకుని అందర్నీ హిపొక్రటిక్ చిరునవ్వుతో పలకరించడం విష్ చెయ్యడం, సభ్యత నేర్పిన అసంకల్పిత హిపొక్రసీ సాంఘిక తొడుగు. అవి కూడా తన జీవితంలో పని చెయ్యని రోజులు వస్తాయని అనుకోలేదు.

ఆ రోజు పోస్టులో రెండో ఆర్టికల్ తిరిగి వచ్చింది. ఆర్టికల్ తిరిగి వచ్చిందని డిపార్టుమెంటులో తెలియడం ఇష్టంలేదు. ఎందుకంటే డిపార్టుమెంటులో ఎదురయ్యే, ప్రతిక్రియలు నాకు తెలుసు.

"మొదటి ఆర్టికల్ ఎవరూ చూసి ఉండరు, అందుకే ప్రచురించారు." అని పకపకా నవ్వుతారు పూర్ణానందం.

"నీ స్టాండర్డ్‌కి రెండో ఆర్టికల్ కూడానా?" అంటుంది శాంతాదేవి.

"వాళ్ళకి ఈ పాటికి నీ స్టాండర్డ్ తెలిసింది" అంటారు వెటకారంగా వెంకటరత్నం.

సాయంకాలం ఇంటికి వెళ్ళి సావధానంగా కవరు విప్పి చూసా, లోపల నేను పంపిన ఆర్టికల్, దానిపైన ఎడిటర్ రాసిన రిమార్కులు రెండు పేజీలు ఉన్నాయి. ఎడిటరు రాసిన రిమార్కులు అన్నీ చదివా, కొన్ని అర్థం అయాయి కొన్ని అర్థం కాలేదు. అర్థం అయినవన్నీ ఒక పేజీమీద రాసుకుని, మూడురోజులు లైబ్రరీలో కూర్చుని సమాధానం రాయగలిగా. కొన్నింటికి పరిష్కార మార్గం కనబడింది. కొన్నింటికి తుదిమొదలు కనబడలేదు. ఎవర్ని సలహా అడగాలి? పూర్ణానందం, వెంకటరత్నం అందరూ సూటిగా నిజాయితీగా సమాధానం చెబుతారని నమ్మకంలేదు. ఆపని చెయ్యగలవాడు రాజేంద్ర ఒక్కడే

రెండో పేపరు, పంపేటప్పుడు అతనికి చూపించలేదు కూడా. గత మూడు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న రాజేంద్రని రమ్మని పిలవడం ఎలా? పిలిస్తే రాజేంద్ర వస్తాడా? వస్తే వస్తాడు, లేకపోతే లేదు. అన్నిటికీ సిద్ధపడి, చొరవ తీసుకుని, రాజేంద్రని పిలవడానికి నిర్ణయించుకున్నా.

మర్నాడు లైబ్రరీలో రాజేంద్రని కలిసా, "ఇంటికి రావడం మానేసారేం?" అని ప్రశ్నించా.

ఏం జవాబు చెబుతాడు?

"నువ్వు ప్రభాకర్ నన్ను తప్పిద్దామనుకున్నారు? ఒకరు తప్పించేంత వరకూ పట్టుకుని వేలాడే, కుసంస్కారం నాకులేదు" అంటాడా?

రాజేంద్ర సమాధానం చెప్పలేదు కానీ చూసిన చూపులో అవే భావాలు కనబడ్డాయి.

"ఊరికే క్లాసు వర్కు వల్ల రాలేదు" అని నవ్వేసాడు రాజేంద్ర అతని సమాధానం అతనికే నచ్చక.

ఆ నవ్వు మునపటిలా కడిగిన ముత్యంలా కాక, ఎర్రటి పెదవుల మీద బొల్లిలా కనిపించింది. అయినా కొంత రిలీఫ్ నే చొరవతీసుకుంటే, మళ్ళీ ఈ స్నేహం చిగురించవచ్చు. అనే అభిప్రాయానికి వచ్చా.

"ఈ రోజు సాయంకాలం ఇంటికి రండి" అని ఆహ్వానించా

"ఎందుకు?"

"ఏముంది. వస్తారని ఎదురు చూస్తాను" అన్నా అభ్యర్థనగా.

నా అభ్యర్థనలో సీరియస్‌నెస్ రాజేంద్ర గుర్తించాడు. అతను ఇంకేం ప్రశ్న వేయకుండా `వస్తాను` అన్నాడు.

ప్రభాకర్ గురించి అడుగుతాడేమో అనుకున్నా, కానీ రాజేంద్ర సంభాషణ పొడిగించక పోవడంతో అక్కడినుండి లేచి, బయటికి వచ్చేసా. కానీ వెనుక నుండి రాజేంద్ర నన్నే దీర్ఘంగా చూస్తున్న సంగతి నాకు తెలుసు, తననెందుకు రమ్మందో బేరీజు వేసుకుంటాడు.

●●●

**చల్లదనపు చీర కట్టుకుని, చిరుగాలిని** ముస్తాబుగా చేసుకుని, నక్షత్రాల మల్లెలని తలలో పెట్టుకునే ప్రయత్నం చేస్తోంది సాయంత్రపు సంధ్య.

రాజేంద్ర రాకకోసం ఎదురు చూస్తున్న నాకు అతని రాక ఊరట కలిగించింది. ఇద్దరం మెల్లగా నడుచుకుంటూ పామ్ బీచికి వెళ్ళాం. ఎవరికి వారు సంభాషణ కోసం మాటలు వెతుక్కుంటున్నాం.

"ప్రభాకర్ రాలేదేం?" రాజేంద్ర ప్రశ్న.

"ఈ మధ్య రావడంలేదు"

"ఉహూ.." రాజేంద్ర, ఉహూలో నాకు అనేక అర్థాలు కనిపించాయి.

"నేనేం ఒంటరితనాన్ని భరించలేక, మిమ్మల్ని రమ్మనలేదు" అన్నా ఉక్రోషంగా.

రాజేంద్ర సమాధానం చెప్పలేదు. రాజేంద్ర మౌనంతో రోషం కరిగిపోయింది. తనని ఎందుకు పిలిచానో చెప్పా.

అంతవరకూ ముభావంగా ఉన్న రాజేంద్ర ఆర్టికల్ విషయం చెప్పగానే మారిపోయాడు. జర్నల్ పేరు అడిగాడు, ఆర్టికల్ వివరాలు అడిగాడు. ఆర్టికల్ చూడటానికి తొందరపడ్డాడు.

ఇద్దరం సముద్రపు ఒడ్డునుండి ఇంటికి వచ్చేసాం. ఆర్టికల్ తిరిగి వచ్చిన కవరు తీసుకొచ్చి రాజేంద్రకి ఇచ్చా.

అతను కవరు విప్పి ఆర్టికల్ తీసి చూసాడు. ఆర్టికల్ 'మెటాటిక్ అరెస్ట్' మీద రాయబడింది. అతను ఆర్టికల్ చదవడంలో మునిగిపోయాడు. అది చదవడానికి అతనికి గంటపైగా పట్టింది.

అతను ఆర్టికల్ చదువుతుండగా, నేను వంట పూర్తిచేసి స్నానం చేసి బట్టలు మార్చుకుని హాలులోకి వచ్చా. ఆ సమయానికే అతను ఆర్టికల్ చదవడం పూర్తిచేసాడు. ఆ తర్వాత ఎడిటర్ రాసిన కామెంట్స్ చదివాడు. అంతా చదివి "నీ ఆర్టికల్‌లో కన్‌క్లూషన్స్ హైపొథటికల్‌గా ఉన్నాయి?" అన్నాడు నవ్వుతూ.

మౌనంగా ఊరుకున్నా.

"ఈ ఆర్టికల్ పంపే ముందు నాకు చూపించలేదేమి?" అన్నాడు.

"మీరు అలిగారు కదా! అందుకు, అయినా మీరు చెప్పిన స్టాండర్డ్‌లోనే పేపరు ప్రిపేరు చేసి పంపాను కదా?" అన్నా.

రాజేంద్ర మళ్ళీ నవ్వాడు.

"అన్ని సబ్జెక్ట్స్ (విషయాలు)కి ఒకే విధంగా పేపరు తయారు చేయకూడదు. ఒక్కో విషయానికి, ఒక్కోలాగ పేపరుని ప్రెజంటు చేయాలి. ఆ విషయాలన్నీ మీకు తెలుసు అనుకునే ఎడిటరు పేపరు చదువుతాడు. మీరు ఇప్పుడు రాసిన పేపరులో విషయానికి, దానిలో ఇమిడిన, సాంకేతిక పద్ధతి వివరించాలి. ఈ రోజుల్లో ఎనాలిసిస్ కన్నా సాంకేతిక పద్ధతికి విలువ ఎక్కువ. పేపరుని ఈ విధంగా రాయండి" అంటూ దాన్ని పూర్తిగా మార్చిరాసాడు. అప్పటికి రాత్రి తొమ్మిది అయింది.

అతను రాసినదంతా చదివా. పేపరు స్వరూపమే మారిపోయింది.

"ఇంక మూలకణం వివరాలూ, అది రేడియేషనుకి ఎక్స్‌పోజ్ అయిన కణం చుట్టుకొలతతో పోల్చి చెప్పడం ఒక పద్ధతి," అన్నాడు రాజేంద్ర.

"వైశాల్యం ఎందుకుకాకూడదు?" అన్న నా ప్రశ్నకి,

"వైశాల్యం కాదు ఎందుకంటే, సరిహద్దులు మారినంత మాత్రాన వైశాల్యంలో ఎక్కువ బేధం ఉండకపోవచ్చు. లేదా మార్పు ఎక్కువగా ఉండి మిస్ లీడింగ్ చెయ్యొచ్చు." అని చిన్న చిన్న లెక్కలు రెండువేసి చూపించాడు, చుట్టుకొలత కట్టే విధానం పూర్తిగా తెల్లకాగితం మీద రాసాడు.

"రేపు ఫిజిక్స్ లేబ్‌లో దీనిని ప్రిపేరు చెయ్యండి, చుట్టుకొలతల్ని పెర్సెంటేజ్ (శాతం)లో ప్రెజెంట్ చెయ్యండి" అని చెప్పి అలసటగా వెనక్కి వాలాడు.

అప్పటికి రాత్రిపదకొండు అయింది.

"అబ్బ చాలా టైమ్ పట్టిందే!" అన్నాడు వాచి చూసుకుంటూ.

ఇద్దరం బాల్కనీలోకి వెళ్ళి చూసాం. బీచ్ రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

"ఇప్పుడు వెళ్ళడం ఎలా? " అన్నాడు రాజేంద్ర.

"పోనీ ఉండి పొండి. రేపు పొద్దున్నే వెళ్ళిపోవచ్చు" అన్నా.

"మీకు ఇబ్బందేమో?" అతని అనుమానం

"నాకే ఇబ్బంది లేదు. మీరు ఇంట్లో చెప్పలేదు కదా, ఇంట్లో వాళ్ళు ఎదురు చూడరా?"

"ఇంట్లో ఎవరూ లేరులెండి, మూడు నెలలనుండి ఒంటరిగా ఉంటున్నాను." అన్నాడు.

ఆ తర్వాత నే మాట్లాడలేదు. వంటింటి వైపు దారి తీసా.

"మీరు మళ్ళీ వండాలా? మంచి ఆకలేస్తోంది" అన్నాడు రాజేంద్ర.

"పర్వాలేదు! వండింది ఇద్దరికీ సరిపోంది."

భోజనానికి ఏర్పాట్లు చేసా. ఇద్దరం చల్లబడి పోయిన పదార్థాలు వడ్డించుకు తిన్నాం.

రాజేంద్రకి మంచం మీద పక్కేసుకుని, నేను క్రింద పక్క వేసుకున్నా. గదిలో బెడ్ లైటు వెలుగుతోంది. రాజేంద్ర అలసటగా దిండుపై తల పెట్టుకుని పైనున్న కప్పువేపు చూస్తున్నాడు.

క్రింద పడుకున్న నాకు నిద్రపట్టలేదు. ఆ రోజు ప్రభాకర్ చేసిన తేడా గురించి చెపుదామనుకున్నా. అతను అడగకుండా చెప్పడం దేనికి, తప్పులేనప్పుడు సంజాయిషీ ఎందుకు? సంజాయిషీ చెప్పుకుందామన్న తపన దేనికి? రాజేంద్ర మౌనం చూస్తే సంజాయిషీ చెప్పుకోవాలనే ఆరాటం కలుగుతుంది.

సాయంత్రం ఆరుగంటల నుండి, పదకొండున్నర వరకూ ఎంతలా పనిచేసాడు, నిస్వార్థంగా ఆర్టికల్ పూర్తిచేసాడు. అటువంటి వాడికి సంజాయిషీ చెప్పుకోడంలో తప్పులేదేమో? ఆలోచనలు నిద్రని దూరం చేసాయి.

పడుకుంది అనుకున్నాడేమో? అన్న ఆలోచన వచ్చి, చిన్నగా పొడిదగ్గు దగ్గా, రాజేంద్ర కదులుతాడేమో, మంచం చప్పుడు అవుతుందేమో అని చెవులు రిక్కించుకు విన్నా. మంచం కదిలినట్టుగాని, అతను పక్కమీద కదలినట్టు గానీ లేదు. కళ్ళకి మోచెయ్యి అడ్డం పెట్టుకుని చూసా. రాజేంద్ర మొదట్లో ఎలా పడుకున్నాడో, ఇప్పుడూ అలాగే పడుకున్నాడు. కనీసం వీలుగా కూడా పడుకోలేదు. కానీ శ్వాస దీర్ఘంగా బరువుగా పీలుస్తున్నాడు. రాజేంద్ర నిద్రపోతున్నాడంటే నమ్మబుద్ధికాలేదు.

రాజేంద్రతో బాగా మాట్లాడాలని, అతనికి నా మనసులో మాట చెప్పాలని నా ఆరాటం. కానీ రాజేంద్ర అదేమీ పట్టనట్టు నిద్రపోవడం, నాలో అసహనాన్ని రేపింది.

చప్పుడు చేయకుండా లేచి, బాత్రూముకి వెళ్ళా. రాజేంద్ర నిద్రపోతున్నాడు. చికాకనిపించింది. వచ్చేటప్పుడు బాత్రూము తలుపులు చప్పుడు చేస్తూ వేసా. గదిలోకి వచ్చి కూజాలో నీళ్ళు గ్లాసులోకి వంపి, గ్లాసు ఎత్తి నీళ్ళు తాగుతూ రాజేంద్రని చూసా. రాజేంద్ర పడుకున్న తీరులో మార్పులేదు. రాజేంద్ర మంచి నిద్రలో ఉన్నాడు. గ్లాసు టేబులు మీద పెట్టి, బెడ్ లైటు ఆఫ్ చేసా.

"అమ్మయ్య ఇంక నిద్రపడుతుంది." అనుకున్నా మనసులో, చీకటికి కళ్ళు అలవాటు అయేవరకూ టేబులు దగ్గిర నిలబడి, టేబులు దగ్గర నుండి వెళ్ళి, నా పక్కకి, మంచానికీ మధ్య నిలబడ్డా. మంచం మీద రాజేంద్ర సర్వం మరచి నిద్రిస్తున్నాడు.

అతని నిద్ర కలవర పెట్టింది. నా మనసు పడుతున్న ఆరాటం అతనికి తెలియచెయ్యాలి ఎలా? ఇదే మంచి తరుణం అతనికి నే నిర్దోషినని తెలియచెప్పాలి? ఎందుకు? అని ప్రశ్న ఆలోచించలా, ఈ అవకాశం మిస్ అవకూడదు. చెప్పాలి అంతే. తెలియరాని ఉద్వేగం నిలువెల్లా ముంచెత్తేసింది. ఆపుకోలేని ఉద్విగ్నతతో రాజేంద్ర వక్షంపై తల వాల్చి ఏడ్చా. ఒంటరిగా స్తబ్ధుగా గడిచిపోయిన కాలం కరిగి, నీరై కనుల వెంబడి ధారగా ప్రవహిస్తోంది. మనసు నుండి బరువు దిగి, ప్రసాంతమైన వాతావరణపు చల్లదనం అకస్మాత్తుగా తెలివి వచ్చిన రాజేంద్ర ఏం జరిగిందో తెలుసుకునేసరికి రెండు నిమిషాలు పట్టింది.

నాలో ఉప్పొంగుతున్న తపనని అర్థం చేసుకున్నాడు. నా చుట్టూ చెయ్యి వేసి పొదవి పట్టుకున్నాడు. మెల్లగా పక్కమీద జరిగి, చోటిచ్చాడు, ఒత్తిళ్ళకు, అలజడులకి, దిగులు పడిన మనసు గతి తప్పి మత్తులో పడింది, ఆకర్షణలో రాజేంద్ర వక్షంపై పొందిన ఊరడింపుకి మై మరచిపోయా, అతని స్పర్శకి వివశనయ్యా, శరీరం తేలికై ఆచ్చాదన అస్తవ్యస్తం అయింది. అతని పెదవుల మృదుత్వం శరీరాన్ని కాల్చేసింది. మెరుపులాంటి మత్తు, శరీరం గుండా ప్రవహించి, కళ్ళు బరువెక్కి, శరీరం మరుపులో పడింది. మహత్తరమైన అసాధారణ అనుభవానికి కాలం నిలిచిపోయింది. పారవశ్యత, ప్రతి అణువుని సృజించి క్రమంగా మగతని, నా కనురెప్పల మీద ముద్రించింది. సర్వం మరచి నిద్రించా.

●●●

ఉలిక్కిపడి లేచా. టైము తొమ్మిదన్నర?

తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయినట్టున్నాడు రాజేంద్ర. తలుపుకి వేసున్న గడియ తీసి ఉంది. తలుపు తీసి తలుపు గడియకి ఉన్న పేపరు తీసుకు లోపలికి వచ్చా.

ఈ రోజు పనిమనిషి రాలేదు. అందుకే ఇంతవరకూ తెలివిరాలేదు. తలారా స్నానించి, కాఫీపెట్టుకుని, బాల్కనీలోకి వచ్చి కూర్చున్నా.

కాఫీ సిప్ చేస్తూ, పేపరు చదువుదామనుకున్నా. కానీ పేపరు మీద మనసు నిలువలేదు. ఎదురుగా బీచ్ రోడ్డులో అప్పుడో కారు, అప్పుడో స్కూటరు వెళుతున్నాయి. సముద్రంలో పైకి ఎగిసిన కెరటాలు ఎవరో నరికేసినట్టుగా, ఆధారంలేనట్టుగా కూలిపోతున్నాయి.

రాత్రి గడిచిన అనుభవాలు క్షణాలు. స్మృతులై తరంగాల్లా ఉవ్వెత్తున పైకి వచ్చి మనసుని కుదిపేస్తున్నాయి. ప్రభాకర్ మీద విముఖతతో, రాజేంద్ర వేపు ఆకర్షితురాలైందా? లేక తనలో రాజేంద్ర అంటే ప్రత్యేకమైన ఆకర్షణ ఉందా? తనే ఇవన్నీ ఆలోచిస్తోందా? రాజేంద్రలో కూడా ఈ ఘర్షణ ఉందా? రాజేంద్ర ఏ విధంగా ఆలోచిస్తాడు. నైతికంగా బేలతనాన్ని చూపింది. అనుకుంటాడా? మరి రాజేంద్ర తన బలహీనతని చూపలేదా? ఇద్దరి మధ్య నైతిక ప్రశ్న రాదా? తాను సర్వస్వతంత్రురాలు. అతని సంగతి తనకి అనవసరం. స్వతంత్రత అంటే ఆర్థిక స్వతంత్రతా? అది ఉంటే చాలా? అది ఉందన్న ధైర్యంతోనే తను తన ఇష్టాన్ని స్వేచ్ఛగా ప్రకటించగలిగిందా? ఈ రకం ఆలోచన్లు ఎక్కడా ఆగేటట్టు లేవు. ఏదేనా పని చేయాలి, అప్పుడు గానీ ఆలోచనలకి అడ్డుకట్టపడదు.

రాత్రి రాసిన పేపరు గుర్తుకి వచ్చి గబగబా తయారై, వ్రాతప్రతి పేపరుని తీసుకుని, కంప్యూటరు సెంటరుకి వెళ్ళి అక్కడ పేపరు టైపింగ్‌కి ఇచ్చి, కంప్యూటర్ సెంటర్ నుండి డిపార్ట్‌మెంటుకి ఫోన్ చేసి, ఒంట్లో అనీజీగా ఉంది అంటూ శలవులకి అప్లై చేసింది. టెలిఫోను చేసి బైటకి వచ్చాక, ఒంట్లో అనీజీగా ఉందా? మనసులో అనీజీ ఉందా?

మళ్ళీ ఆలోచనలు మళ్ళీ రాజేంద్రని కలిస్తే ఎలా ప్రవర్తిస్తాడు. అతని మౌనం తనని వివశురాల్ని చేసింది. ఎందుకింతలా ఆలోచిస్తోంది?

పదకొండు గంటలకి, పోస్టు వచ్చింది. యూనివర్శిటీ వాళ్ళు లెక్చరర్ పోస్టుకి ఇంటర్వ్యూకి రమ్మని కాల్ లెటరు పంపించారు.

●●●

మర్నాడు డిపార్టు మెంటులో ఎవర్నీ కలియకుండా జాగ్రత్తపడ్డా. అలా ఎందుకు జాగ్రత్త పడ్డానా? అని రాత్రంతా ఆలోచించా.

రెండురోజుల తర్వాత రాజేంద్ర తటస్తపడ్డాడు. మామూలుగా మాట్లాడాడు, అతనిలో మార్పులేదు. అతనిలో మార్పుంటుందని, నేనెందుకనుకున్నానో నాకే అర్థంకావడంలేదు.

"మీరు తయారు చేసిన ఆర్టికల్ టైపు చేయించా.. ప్రాక్టికల్ చెయ్యాలి."

"మీ ఇంట్రెస్టు వివరిస్తూ, ఫారిన్‌లో ఒక మిత్రుడికి ఉత్తరం రాసాను." అన్నాడు రాజేంద్ర.

"థాంక్స్" అన్నా.

"మీ ఇంటర్వ్యూ ఎలా అయింది?" అని అడిగాడు.

"బాగానే జరిగింది కానీ, మూడు నాలుగు పి.జి సెంటర్లు ఓపెన్ చేసారు. కదా? అందులో ఎక్కడేనా వెయ్యవచ్చు."

"పి.జి సెంటర్లో పడితే ఇక్కడి ఫెసిలిటీలు, ఏమీ ఉండకపోవచ్చు ఫరదర్‌గా ఏదైనా చెయ్యడం కష్టం"

అక్కడితో సంభాషణ తెగిపోయింది. ఆ రోజు రాత్రి గడిచిన నాజుకు క్షణాల ప్రభావం పూర్తిగా తగ్గి, మాములు అవడానికి నెలరోజులు పైగా పట్టింది కానీ రాజేంద్రని మర్చిపోలేదు.

దానికి కారణం రాజేంద్ర ప్రవర్తన కారణం కావచ్చు. రాజేంద్రతో గడిపిన క్షణాలు పదే పదే తలుపుల్లోకి వస్తున్నాయి. రాజేంద్ర అప్పుడప్పుడు, సాయంత్రం ఆపార్టుమెంటుకి వస్తున్నాడు. ఇద్దరం కలిసి బీచ్‌కి వెళ్తున్నాం. రాజేంద్ర సన్నిహితుడు కాక ముందు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలానే ఉన్నాడు. కానీ ఆ హుందాతనాన్ని అతని నిర్లిప్తతని ఎలా అర్థం చేసుకోవాలో అర్థం కాలేదు. ఏవేవో కబుర్లు ఎన్నో ఆలోచన్లు వెంటాడుతున్నాయి.

ఆ రోజు ఏవో కబుర్లు చెప్తూ నాతో ఎపార్టుమెంటుకి వచ్చేసాడు రాజేంద్ర. అతను చెపుతున్న కబుర్లు ఏవీ నా బుర్రకి ఎక్కడం లేదు. రాజేంద్రని భోజనానికి ఉండమంటే ఉంటాడా? ఉండడా? ఉండకపోతే ఏం చెయ్యాలి? అతనికి ఉండాలని ఉందా? ఎందుకుండదు? తప్పకుండా ఉండే ఉంటుంది? కానీ పైకి చెప్పడు. నేను మాత్రం బేలగా ఎందుకైపోవాలి? అతన్ని భోజనానికి ఉండమంటే? బేలగా అయిపోతోందా? అతని సాన్నిహిత్యాం కోరుకుంటుందా? అతనికి అక్కర్లేదా? అతనికి నా సాన్నిహిత్యం కావాలి అని కోరుకుంటున్నాడు కాబట్టే ఎప్పటిలా బీచ్‌లో వదిలేసి వెళ్ళిపోలేదు. ఎపార్టుమెంటు వరకూ వచ్చాడు. అతను చెపుతున్న కబుర్లు వింటున్నా అవేవీ బుర్రలోకి ఎక్కడం లేదు నడుస్తూ తలెత్తి "నీకూ డిన్నర్ ప్రిపేర్ చెయ్యనా?" అన్నా.

రాజేంద్ర నిముషం మాట్లడ్లేకపోయాడు. ఏం చెప్పాలో తెలీలేదు.

"నీ ఇష్టం" అన్నాడు.

"అయితే నీ కిష్టంలేదా మరోసారి పిలుస్తాలే!" అంటూ వేగంగా నడిచి ఎపార్టుమెంటులోకి వెళ్ళిపోయా. అసలలా ఎందుకు అడిగింది. అతను నీ ఇష్టం అంటే సరే అని ఎందుకన్లేదు. తన కిష్టం లేదా? అతను నీ ఇష్టం అనకూడదా? మరేమనాలి. తనెందుకలా విచిత్రంగా ప్రవర్తించింది. తన మనసే తనకి కొత్తగా కనిపిస్తోంది. అతన్ని డిన్నర్‌కి రమ్మనడం ఎందుకు? కాదనడం ఎందుకు? అతనెందుకు ఎపార్టుమెంటు వరకూ వచ్చాడు. నా సమాధానంతో హర్ట్ అయాడా? ఇంకరాడా? నన్నో పిచ్చిదాని కింద జమకడ్తాడా? నేనేదైనా భ్రమలో ఉన్ననా? ఆ భ్రమ ఎందుకు కలిగింది. రాజేంద్ర వేపు ఆకర్షణవల్లా? ఎందుకిలా జరుగుతోంది? నా అస్థిత్వం ఏమిటి?

నాలో ఏదో నాకు తెలియని నేను ఉన్నానా? ఈ విధంగా ప్రవర్తించడం వల్ల నేనేం సాధిస్తున్నట్టు. గమ్యం ఎటు? అన్ని ప్రశ్నలూ నిద్రపోనివ్వలేదు.

●●●

రాజేంద్రకి నా ప్రవర్తన పట్టలేదు. నా సాన్నిహిత్యమే కావాలన్నట్టు మర్నాడు సాయంకాలం వచ్చాడు. సాయంకాలం రాజేంద్ర వచ్చేవరకూ మనసు వెంపర్లాడేది. రాజేంద్ర వచ్చాక విలవిల్లాడేది. అన్నిటికీ రాజేంద్ర మౌనమే సమాధానంగా నిలిచేది. నాలుగు రోజుల తర్వాత ఓ రోజు సాయంత్రం "ఈ రోజు వండేసాను ఉండిపో" అన్నా.

ఏ సమాధానం చెప్పకుండా ఉండిపోయాడు.

ఇద్దర్నిద్దరూ తెలుసుకున్నాం అనుకున్నాం. రాజేంద్ర నెందుకు ఉండిపొమ్మన్నానా? అని ఆలోచించా. అతనికి ఉండిపోడం ఇష్టం లేదేమో? అందుకే ఏం మాట్లాడలేదా? తను ఉండిపోమంటే ఉండిపోతాడు. లేదంటే లేదు.

విచిత్రమైన మనిషి రోజూ వస్తాడు. ఏవేవో కబుర్లు. అన్నింటి వెనక నా సాన్నిహిత్యం మీద అభిలాష ఉండే ఉంటుంది. కానీ పైకి చెప్పడు. నేను అతన్ని శాసించాలి. బేలగా అర్ధించాలి అప్పుడు హుందాగా ఒప్పుకుంటాడు. అదతని అహంకారం నచ్చలేదు. ఎందుకు నచ్చుతుంది? అలాంటి వాటికి దూరంగా ఉందామనే తపన కానీ ఉండలేక పోతోంది. అతని స్నేహంలో ఓ తియ్యదనం ఉంది. అతని మాటల్లో, ఓ స్వచ్ఛత ఉంది. అది కావాలి. అతని మౌనం మాత్రం దహిస్తోంది. అతనెలా ఉండాలో నిర్ణయించుకోలేకపోతోంది.

●●●

రెండు రోజులు రాజేంద్ర రాలేదు. ఎందుకు రాలేదు? ఈ స్నేహం నాకేనా? అతనికి అక్కర్లేదా? అతనొస్తే నేం? రాకపోతేనేం? అతను నన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడా? లక్ష్యమైనా, నిర్లక్ష్యమైనా ఎందుకు చెయ్యాలి? ఏం సంబంధం. ఏ సంబంధమూ లేకపోతే తనెందుకు ఆలోచిస్తోంది. తపన పడుతోంది.

రాజేంద్ర వివాహితుడు. అలాంటివాడికోసం తపన పడుతోంది. రాజేంద్ర నన్నెందుకు తిరస్కరించలేదు? రాజేంద్ర అభిప్రాయమేమిటి? రాజేంద్రలో ఉన్నది ఆకర్షణా? గౌరవమా? ఆరాధనా? రాజేంద్ర వైవాహిక జీవితంలో ఈ మూడూ కరవయ్యాయా? ఏదీ చెప్పడు. ఏమీ మాట్లాడడు. ఒక నిశ్చల విగ్రహం. అందుకే రాజేంద్ర అంటే చిరాకేస్తోంది. ఇంక రాకుండా ఉంటే బావుండు. రాకుండా ఉంటే బావుండునా? రావద్దని చెపితే సరిపోలా? రావద్దని చెప్పాలి.

రాజేంద్ర నుండి దూరంగా ఉండాలి. రాజేంద్ర వివాహితుడు. నాణానికి అటుపక్క ఏముందో ఏం తెలియటంలేదు. ఏం జరుగుతుందో తెలియటంలేదు. తెలియవలసిన అవసరం లేదు. తెలుసుకోవలసిన అవసరం లేదు. తనకి ఉద్యోగం వస్తే ఏదో పి.జి. సెంటర్‌కి దూరంగా వెళ్ళిపోవాలి. రాజేంద్ర నుండి ప్రభాకర్ నుండి శాంతాదేవి నుండి దూరంగా పోవాలి.

ఈ నిర్ణయం, ఈ ఆలోచన రాజేంద్రని చూసాక కలగలా, సాయంకాలం బీచొడ్డుకెళ్ళారు, ఏం రెండురోజులు రాలేదు. అని నేను అడగలేదు. అతను చెప్పలేదు. వస్తే వస్తాడు పోతేపోతాడు. నాకేం అనుకున్నా.

కానీ అలా ఊరుకోలేకపోయా. అతని మౌనంలో క్రూరత్వం బాధపెడుతోంది. అంతర్లీనంగా అదే ఇష్టపడుతోంది కూడా. ఇద్దరి మధ్యా స్నేహంలో ఆకర్షణ, అతని నిశ్శబ్దం. మోడెష్టీ తెర తొలిగిన నాడు ఇద్దరూ ఒకరినొకరు అర్ధం అయినట్టు, ఆనందంగా గడుపుతున్నట్టు. కానీ రాజేంద్రలో తెరలు పొరలు ఉన్నాయన్న అపోహ. నన్ను వదలడంలేదు. ఎందుకు ఈ స్నేహం? ఈ కలియకకి ఆమోదం లేకపోవడం వల్లా ఎవరి ఆమోదం? ఎందుకు?

నాలో జరిగిన మార్పేమిటి? అన్నది కూడా అర్ధం కాలేదు. రాజేంద్రలో భావాలు అతను తెలియనివ్వడంలేదు.

సెక్స్‌కి ముందు స్త్రీ వేరు, సెక్స్ తర్వాత స్త్రీ వేరా? సెక్స్‌కి ముందు పురుషుడు వేరు సెక్స్ తర్వాత పురుషుడు వేరా? లేక ఇద్దర్నీ వేరు చేసేది, మొరాలిటీ ఒక్కటేనా? మౌలికంగా మొరాలిటీ అయితే దాని అస్థిత్వం ఎక్కడుంది? లేనిపోని ఆలోచన్లు వస్తున్నాయి. వీటన్నింటికీ దూరంగా ఉండాలంటే రాజేంద్రని వదలి ఏ.పి.జి సెంటర్‌కో వెళ్ళిపోవాలి. ఇంటర్వ్యూ రిజల్ట్ ఎప్పుడొస్తాయో ఇంటర్వ్యూ రిజల్ట్ రాలేదుకానీ అనుకోని సమస్య వడిలో వచ్చి కూర్చుంది.

●●●

పెనం మీద కాలుతున్న రొట్టెకి జీవం వచ్చి, ఒక్క ఎగురు ఎగిరింది. దాని వేడి క్షణకాలం తగ్గింది. కానీ ఎగిరిన రొట్టె ఎర్రని కొరకంచుల మీద పడింది.

ఆలోచనలకి తెరవేసి, ముఖానికి చిరునవ్వు తొడుక్కుని, యాంత్రికంగా గడుపుతున్న రోజులకి తెరపడింది.

తెల్లవారు ఝామున తెలివి వచ్చింది. మరి నిద్రపట్టలేదు. ఒళ్ళంతా నొప్పులుగా ఉండి జ్వరం వచ్చినట్టుగా ఉంది. కళ్ళవెంట వెచ్చగా నీటి బిందువులు బయలుదేరి బుగ్గల మీదుగా జారి తలగడలో ఇంకిపోయాయి. నోరు ఆర్చుకుపోయింది. లేచి కూజాలోంచి మంచి నీళ్ళు ఒంపుకు తాగింది. మంచి నీళ్ళు రుచిగా అనిపించలేదు. కడుపులోంచి ఎవరో తోసినట్టుగా, మంచినీళ్ళు బైటకి వచ్చాయి. వాంతి అవుతుందని తెలిసి, బాత్రూముకి వెళ్ళింది. మంచినీళ్ళు వాంతి అయ్యాయి. నోరు చేదుగా అయి, పొడారిపోయింది.

టైం అయిదుగంటలయింది. తూర్పున తెలతెలవారుతోంది. ఇంక నిద్రపట్టే సూచనలు లేవు. బాల్కనీలోకి వెళ్ళా. తూర్పు సౌందర్యం రంగులు పులుముకుంటోంది.

మనసు అచలత్వం నుండి కరిగి అశాశ్వతమైన నదిగా మారి, వాలుకి పయనించి మైదానాన్ని, సారవంతం చేసి, సముద్రుడ్ని చేరి క్షారవంతం అయింది. సముద్రుని రుచితో, నిరాశ చెంది, వెనక్కి పోలేక, ముందుకి పయనించలేక మధన పడింది. తనంటే జాలిపడేవారెవరు? అనే ఆలోచనకు తపించి, తాపం భరించలేక ఆవిరై, పైకెగసి హృదయంలో చల్లదనానికి, ద్రవించి కనుకొలకులలో బిందువై మెరిసింది. ఆ కన్నీటి బిందువే సూర్యబింబమై తూర్పున ఉదయిస్తోందా? అన్నట్టుగా సూర్యోదయం అవుతోంది.

పాలు, పేపరు ఉదయాన్నే వచ్చే అతిథి, పనిమనిషిగా వచ్చారు. పనిమనిషి పాలు తీసుకుని, కాఫీ చేసి, తీసుకు వచ్చింది. కాఫీ తాగిన వెంటనే మళ్ళీ వాంతి అయింది.

''ఏమయింది అమ్మగారూ ఒంట్లో బాగోలేదా?'' అని అడిగింది పనిమనిషి.

''లేదు కాస్త జ్వరంగా ఉంది, వెళ్ళి బ్రెడ్ తెచ్చిపెట్టు వంట చెయ్యనక్కరలేదు'' అన్నా.

కాలేజీకి శలవు పంపించి, వాంతులతో ఇబ్బందిగా అనిపించి కాలనీలో ఉన్న డాక్టరుదగ్గరకి వెళ్ళా. అనుమానం ఉండనే ఉంది.

డా.లీలాప్రసాద్ పరీక్ష చేసింది. పరీక్ష చేస్తున్నంత సేపూ ఇదంతా రొటీన్ చెక్అప్ అన్నట్లు చేసింది. కానీ ఆమె కళ్ళు గుచ్చి గుచ్చి మరిదేనికోసమో వెదుకుతున్నాయి. ఆ చూపుల్లో అనుమానం పసిగట్టా. లీలాప్రసాద్ పరీక్షించడం ఆపి.

''మీ మిష్టరు ఎక్కడ పని చేస్తున్నారు?''

''...''

''మీకు పెళ్ళి అయిందా?''

''....''

''మీరు ఉద్యోగం చేస్తున్నారా?''

''ఊ''

''ఎక్కడ?''

''అసిస్టెంట్ లెక్చరర్గా యూనివర్సిటీలో''

లీలాప్రసాద్ ఆశ్చర్యపోయింది. తర్వాత ఆలోచనలో పడింది.

వెడతాను అన్నట్టు లేచి ''మీ ఫీజు'' అన్నా.

ఆలోచనల్లోంచి తేరుకున్న లీలాప్రసాద్ ''కూర్చోండి'' అంటూ సైగ చేసింది.

"తల్లి కాబోయే వాళ్ళకి ఈ ఇబ్బంది సహజం వాంతులు అవకుండా మందులు వాడవచ్చు. కానీ వెర్టిగో అండ్ నాసియా విల్ కంటిన్యూ ఫర్ సమ్ టైమ్" అంటూ మందులు రాసి ఇచ్చింది.

నాలో ఏ రియాక్షనూ లేదు. "మీ ఫీజు చెప్పండి" అన్నా మెల్లగా.

లీలా ప్రసాద్ ఫీజు చెప్పింది. ఫీజు చెల్లించి, డాక్టరు రాసిన మందులు చీటీ తీసుకుని, దారిలో మందులు కొనుక్కుని, ఇంటికి వచ్చా.

ఇంటి తలుపులు తెరిచేసరికి, యూనివర్సిటీనుంచి వచ్చిన కవరు నేలమీద పడుంది. దాని చింపి చదివా. అమలాపురం పి.జి. సెంటర్లో, ఫిజిక్స్ డిపార్టుమెంటులో లెక్చరర్‌గా ఎపాయింట్ మెంట్ చేస్తూ యూనివర్సిటీ వాళ్ళు పంపిన అపాయింట్ మెంట్ లెటరు దాన్ని టేబులు మీద పడేసి, నాసియాకి మాత్ర మింగి, ఫ్లాస్కులో వేడీ కాఫీ తాగి, మంచం మీద పడుకున్నా.

●●●

సాగరంలో కెరటపు మడతల్లా మనసు కూడా నలుగుతోంది. డాక్టరు రాసిన మందులవలల్ రోజూ కార్యక్రమానికి ఆటంకం లేకపోయినా, అప్పుడప్పుడు రాజేంద్రని చూసినప్పుడు, నా సమస్యని తలుచుకున్నప్పుడు ఎంత ఒద్దు అనుకున్నా ఆలోచనా తరంగాల్లో కొట్టుకు పోతున్నా. అమలాపురం పి.జి. సెంటర్లో లెక్చరర్ పోష్టు రావడం వల్ల, త్వరలో ఈ డిపార్టుమెంటు వదలి వెళ్ళి పోతున్నానని అక్కడ జాయిన అవుతున్నానని అభిప్రాయం అందరిలో స్థిరపడిపోయింది.

మళ్ళీ మరొక సమస్య ఇది సమస్య కాదు అని ఎంత సమర్ధించుకున్నా, రాజేంద్రని తనని పోల్చి చూసుకుంటే ఇది తనకి సమస్యే. ఎబార్షన్ ఇల్లీగల్ కాదూ? తను అబార్షన్ చేయించుకుంటే చట్టవిరుద్ధం. పిల్లవాడ్ని కంటే అనుచితం. ఈ పరిస్థితి నుండి రాజేంద్ర తప్పించుకున్నాడు. అంటే ఈ సమాజం పురుష నిర్మితమైంది. అనే విషయంలో ఎక్కడా సందేహం కనబడటంలేదు. అందుకే సమాజం, (పురుషులూ స్త్రీలూ), స్త్రీల నుండి వినయం, శీలం నడవడి కోరుతున్నారు. అది అందుకోలేనప్పుడు, బరితెగింపుగా భావిస్తున్నారు. ఈ బరికి హద్దులెవరు ఏర్పరిచారు? ఈ హద్దుల్ని దాటి మనకలిగిన స్త్రీలు ఎంతమంది? వాళ్ళకి ఆలంబన ఏమిటి? ఆర్ధిక స్వాతంత్ర్యం మాత్రం కాదు మరి ఏమిటి?

అంతలోనే తనదైన ఒంటరి జీవితంలోకి మరో జీవి అదీ తన పేగు చించుకుని వస్తోంది. అంటే చాలా ఎక్సైటింగ్ గానూ, ఆనందంగాను ఉంది. తనలో పెరుగుతున్న జీవిపై ప్రత్యేకమైన అభిమానం, మమత పెరుగుతోంది. ఆ క్షణంలో నైతిక సమస్య, సమాజపు హద్దులూ, తలుపులోకి రానందుకు ఆశ్చర్యం వేసింది. ఎప్పటిలా కాలేజీకి వెళుతున్నా. కొద్ది మంది "అదేం అలా ఉన్నారూ?" అని అడిగారు. "ఒంట్లో బావుండలేదు" అని సమాధానం

ఏం బావుందలేదు, ఎందుకు బావుండలేదు. కానీ ఈ విషయం దాచితే దాగేది కాదు. దీనికి కారణం ఎవరూ? అన్నది మాత్రం దాగుతుందేమో? కానీ శరీరంలో జరిగే మార్పులు ఎక్కడా దాగనివి. కారకుడు రాజేంద్ర, అని ఢంకా కొట్టి చెప్పి, బాధ్యత రాజేంద్ర మీదకి కొంత నెట్టగలనా? నెవ్వర్.. నే చెప్పినంత మాత్రాన సరిపోదు అతను ఒప్పుకోవాలి? రాజేంద్రకి ఉన్న స్వతంత్రపు హద్దులకి, తనకి ఏర్పడిన సరిహద్దులకి ఆశ్చర్యం వేస్తోంది. అతను ఒప్పుకోక మౌనం వహిస్తే తనకి అమర్యాద, నిరాదరణ, మిగులుతాయి. తను ఎవరి పేరూ చెప్పక మౌనం వహిస్తే, చపలత్వానికి, అవినీతికి నమూనాగా మిగిలిపోతుంది. కానీ దీనికి ఒక మొగాడు కూడా బాధ్యుడే అన్న విషయం మరుపున పడిపోతుంది ఆడదాని సెక్స్ స్వాతంత్ర్యాన్ని కాపాడాలంటే, ఏదో ఒక ఇనొవేటివ్ టెక్నాలజీ రావాలి, ప్రకృతి అంటగట్టిన ఈ నీతి, నియమ బద్ధ బాధ్యత నుండి తప్పించు కునేందుకు, స్త్రీలోకాన్ని భ్రూణ హత్యల నుండి కాపాడేందుకు సైన్స్ ఉపయోగపడాలి - అనుకున్నా. ఆలోచనల్లో తర్కం కసి, కలిసి కాపురం చేస్తున్నాయేమో?

●●●

**ఆకాశం వంకర తిరిగి సముద్రగర్భంలో చొచ్చుకుపోయింది.** ఆ రెండింటి సంగమ సరిహద్దుపై ప్రభవించిన సూర్యుడు, లోకాన్ని దహించడానికి బయలు దేరిన వీరభద్రుడిలా ఉన్నాడు. కాలం నడవడానికి, మార్పులు జరగడానికి ఈ రవే పైరవీలా కనిపించాడు.

పనిమనిషి కాఫీ చేసి పట్టుకొచ్చింది. కాఫీ కప్పు అందుకున్నా. కాఫీ ఇచ్చిన తర్వాత, పనిమనిషి లోపలికి వెళ్ళి మిగతా పనులు చేసేది. కానీ ఆ రోజు కాఫీ అందించి ఆమె లోపలికి వెళ్ళలేదు, నాకు అనుమానం వచ్చి, పనిమనిషి వేపు చూసా. ఏదో అడగడానికి సందేహిస్తోంది. శలవు అడుగుతుందేమో అన్న అనుమానంతో 'ఏమిటి?' అన్నట్లు సైగ చేసా?

"మీరేమీ అనుకోనంటే నేనొకటి అడుగుతాను అమ్మగారు?" అంది పనిమనిషి.

పనిమనిషిని దీర్ఘంగా చూసా. 'ఏమిటడుగుతుంది?' తన ప్రస్తుత పరిస్థితి గురించి అడిగే ధైర్యం పనిమనిషికి ఉంది అంటే, తను ఆమె పట్ల అభిమానంగా ప్రవర్తించడమే కారణం. ఎంత అభిమానంగా ప్రవర్తించినా పనిమనిషి చొరవ మెచ్చుకోదగిందే "అడుగు" అన్నా చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"అమ్మగారూ" నాకు తెలిసినంతవరకూ మీకు పెళ్ళికాలేదు, అనుకుంటాను. కానీ మీరు" అంటూ పనిమనిషి వాక్యం పూర్తిచేయకుండా నసిగేసింది.

"లేదు"

"నేను మీకు చెప్పగలిగిన దాన్నికాదుగానీ, ఆ విషయంలో ఎంత తొందరపడితే అంత మంచిది."

"ఏ విషయం?"

"...." పనిమనిషి మౌనం వహించింది.

"పర్వాలేదు ఏం చెప్పదలచుకున్నావో, నిస్సంకోచంగా చెప్పు."

"బాబో పాపో పుట్టకుండా జాగ్రత్తపడితే"

"బాబో పాపో కావాలనుకుంటే"

ఈ సారి పనిమనిషి అవాక్కయింది.

"అయినా నేను దేనికి జాగ్రత్త పడాలి?" అన్నా.

పనిమనిషి ఏం సమాధానం ఏం చెపుతుందా? అన్న ఆలోచన కొంతసేపటికి పనిమనిషి తేరుకుంది.

"అమ్మగారూ, ఇది మీ సమస్య ఒక్కటే కాదు, మీరు 'నాకెవరూ' వద్దనుకున్నా, మీ చుట్టుపక్కల మనుషులు ఉంటారు. వారికి కావాలి, మీ వివరాలు అందునా ఈ విషయం ఏ ఒక్కరోజో, రెండు రోజుల్లోనో పోయేదికాదు. నా లెక్క సరిపోతే ఏడునెలలు పడుతుంది. అంటే రోజు రోజుకి పెరిగే బిడ్డ బైటకి రావడానికి రెండు వందల పదిరోజులు పడుతుంది. ప్రతి రోజూ, ప్రతీ మార్పు ఎదుటి వాళ్ళకి ఆసక్తి కలిగిస్తుంది. మీకు మానసికంగా హింస, ఆఖర్ని దేనికైతే మీరు ధైర్యం చూపించారో, అది దక్కక పోవచ్చు" అంది.

"అవన్నీ తట్టుకోలేనని ఎందుకనుకుంటున్నావ్?"

"సమయం మించిపోతే ఆ తర్వాత కష్టం అమ్మగారూ, ఆరోగ్యానికే ప్రమాదం?"

"నీ కివన్నీ ఎలా తెలుసు?"

"మా పేటలో ఇవన్నీ మాములే అమ్మగారూ, బహుమతులకు ఆశపడి కొందరు, అందానికి లొంగి పోయి కొందరూ, మోసగించబడి కొందరూ గుంటముండలు చటుక్కున మైలపడ్డం మానేసి తల్లితండ్రులు పీకల మీదకి తెస్తారు. అక్కడ కడుపే సమస్య, కానీ వాడెవడ్నో తీసుకొచ్చి కట్టపెట్టడం, తల్లితండ్రులు సమస్యే కాదు. అందుకే అది తీయించేసి నోరు మూసుకు కూర్చుంటారు. ఒక్కొక్కప్పుడు ఆశకొద్దీ పెళ్ళి ప్రయత్నాలు చేస్తారు. కానీ కుదర్దు, అలాంటప్పుడు ముదిరిపోతుంది అప్పుడుంటుంది అసలు నరకం,

అయిదునెలల, ఆరునెలల పిండాలు వీధికి దూరంగా చెత్తకుండీలో కాకులు, పీక్కుతింటుంటే, అది ఎవరింటి గ్రహచారమో చెప్పక్కరలేదు, అర్థం అయిపోతుంది" అంది పనిమనిషి సాలోచనగా.

"పోగొట్టేసు కోడం అంత తేలికా?" అడిగా అలాంటి వివరాలు వినడం ఇష్టం లేకపోయినా

"దించేసుకోడం.." అంటూ మొదలు పెట్టి నాలుక్కరుచుకుకుంది. పనిమనిషి

"పోగొట్టేసుకోడం చాలా తేలికైన విషయం అమ్మగారూ కొన్నాళ్ళకి అన్నీ మర్చిపోతారు" అంది నవ్వుతూ.

"సరిలే నువ్వెళ్ళి పని చూసుకో" అన్నా.

నన్ను నా ఆలోచనలకి వదిలి, పనిమనిషి, బాత్రూములోకి వెళ్ళిపోయింది.

రెండు వందల పదిరోజులు క్షణం క్షణం మానసికంగా చిత్రవధకి గురి అవుతుందా? ఏ క్షణమేనా మనసు బలహీన పడి జీవితం మీద విరక్తి కలగవచ్చు.

ఏక్షణానైనా నీతి హద్దులకి భయపడవచ్చు ఆ హద్దుల్ని గౌరవించాలా? వద్దా? అనే దువిధ మనసులో ఏర్పడి, ఆ హద్దుల్ని గౌరవించాలనే నిర్ణయం ప్రాణసంకటంగ మారచ్చు, ఈనాడు అవకాశవాదంగా కనబడ్డ ఎబార్షన్, కొన్నాళ్ళ తర్వాత అలా కనపడకపోవచ్చు - ఇంక ఆలోచించలేకపోయా. కళ్ళ ఎదురుగా చెత్తల కుండీ, కాకుల గుంపు కనబడి మనసు పాడయింది.

ఆ రోజు కాలేజీకి వెళ్ళకుండా, ఇంట్లోనే ఉండిపోయా. స్నానం చేసి, తొందరగా భోజనం చేసి, విశ్రాంతిగా పడుకున్నా పడుకోగానే మత్తుగా నిద్రపట్టేసింది.

●●●

బజర్ మోగిన చప్పుడికి తెలివి వచ్చింది లేచి తలుపు తీసా. వరండాలో కటిక చీకటి ఎదురుగా ఎవరు ఉన్నదీ కనబడటంలేదు. వరండాలో ఎవరూ లేరు. మెల్లగా వరండా చివరి వరకూ వెళ్ళి చూసా. క్రిందనుండి ఎవరో పిలుస్తున్నట్టు అనిపించి మెట్లు దిగా. క్రిందకి దిగి ఆశ్చర్యపోయా. ఎదురుగా నిరంతరం ఘోషించే సముద్రం ఈనాడు లేదు. అలల నలుగుడు, గాలి సణుగుడు వినిపించలేదు. ఎదురుగా ఇసక మేటలు, ఇసకదిబ్బలు, నెత్తిపై మిణుకు మిణుకు మని నక్షత్రకాంతులతో ఆకాశం దారి చూపుతోంది.

సముద్రం ఎప్పుడు ఇంకిపోయింది? ఎందుకు క్షితిజరేఖ వైపు ప్రయాణం, తనకి ఇష్టమైన సముద్రం కూడా తనని విడిచి వెళ్ళిపోయింది. చెలియలి కట్టదాటనివ్వడం, లేదని కష్ట పెట్టుకుందేమో? ఎంత నడిచినా క్షితిజం దూరం అవుతోందిగానీ సముద్రంగానీ, దాని హోరుగానీ వినబడడం లేదు.

దూరంగా చిన్న దీపం మిణుకు మిణుకు మంటూ కనిపించింది. ఆ దీపం కనిపిస్తున్న దిక్కుగా ప్రయాణం చేసా. అక్కడ పెద్ద తాటాకుల ఇల్లు. ఆ ఇంటిపై కప్పు, అంటుకుని తగలబడి పోతోంది. పైకి ఎగసిన మంటలు, దూరానికి మిణుకు మిణుకుమంటూ చిన్న దీపంలా కనిపించాయి. కాలిపోతున్న ఇంట్లోంచి, హహాకారాలు వినిపిస్తున్నాయి. ఆహాహాకారాల మధ్యగా "జాహ్నవీ లోపలికి రా" అన్న మాటలు వినిపించాయి.

ఆశ్చర్యంతో ముందున్న ద్వారం గుండా లోపలికి వెళ్ళా. లోపలి దృశ్యం నిశ్చేష్టంగా నిలబడిపోయా. వెన్ను జలదరించింది. గుడిసెలో కప్పు చాలా ఎత్తుగా ఉంది. ఆ కప్పు రెండు కొసలు కలుపుతూ పెద్ద దూలం ఉంది. ఆ దూలానికి వరుసగా మానవాకారాలు వేలాడుతున్నాయి. అవి హింస పడిపోతున్నాయి. ఇంటి కప్పు మీంచి నిప్పు ముద్దలు, ముద్దలుగా ఆ ఆకారాలమీద పడుతున్నాయి. అవి మీది పడ్డప్పుడల్లా ఆ ఆకారాలు హాహకారం చేస్తున్నాయి. అందులో కొన్ని ఆకారాలు మూలుగుతున్నాయి. ఆ ఆకారాలన్నింటినీ తను ఎక్కడో చూసింది. ఆ ఆకారాలన్నీ రక్తవర్ణ నేత్రాలతో తీవ్రంగా నన్నే చూస్తున్నాయి.

ఆ ఆకారాలు మధ్యగా వేలాడుతున్న ఆకారం, "జాహ్నవీ" అని పిలిచింది. ఆ ఆకారాన్ని పోల్చుకున్నా ఆ గొంతును పోల్చుకున్నా. అది తన తండ్రిది.

"నాన్నా" అన్నా దీనంగా. నోట్లోంచి మాట రావడం కష్టమైంది.

"నాకున్న కన్నీళ్ళన్నీ ఇంకిపోయాయి. జాహ్నవీ నేను నీకోసం దాచివుంచిన ఒకే ఒక్క రక్తపు బొట్టు స్వీకరించు" అంది ఆకారం. రక్తపు బొట్టు అరచేతిలో పడింది.

గోళీకాయ ఆకారంలో అరచేతిలో రక్తపు బొట్టు స్పష్టంగా కనిపిస్తోంది. అది కదులుతోంది. అది గర్భాన్ని చీల్చి తీసిన భ్రూణం.

ఆ కదలికకి భయం వేసి, కెవ్వున కేక వేసా.

బెల్లు నిరంతరంగా మోగడంతో, తెలివి వచ్చేసింది కళ్ళల్లో పడ్డ వెలుగుకి, ఇది రాత్రినిద్రా, పగటి నిద్రా అర్థం కాలేదు. బీచ్ ఒడ్డున కార్ల సందడి విన్నాక, ఆ రోజు కాలేజీ మానేసి, నిద్రపోయాననే సంగతి జ్ఞాపకం వచ్చి వాచీ చూసుకున్నా. నాలుగయింది. లేచి వెళ్ళి తలుపు తీసా.

ఎదురుగా చిన్నా. క్షణం సేపు చిన్నాని గుర్తుపట్టలేకపోయా. చిన్నా పూర్తిగా గుండు చేయించుకున్నాడు.

"పడుకున్నావా అక్కా?" అన్నాడు చిన్నా నవ్వుతూ.

"ఏమైందిరా?" అన్నా చిన్నా గుండుని చూస్తూ.

"నాన్నగారు పోయారు" అన్నాడు చిన్నా.

"మరి నాకు తెలియచేయలేదేం" అన్నా కోపంతో ఆశ్చర్యంతో.

నాన్నగారు ఆఫీసు పనిమీద నాగ్‌పూర్ వెళ్ళారు. అక్కడ హార్ట్ ఎటాక్ వచ్చి పోయారు. ఆ విషయం మాకు తెలిసి, అన్నయ్య వెళ్ళి శవాన్ని తీసుకొచ్చే సరికి మూడు రోజులు అయింది. ఆ గొడవలో పడి తెలియచెయ్యలేదు. ఆ తర్వాత నేను వైజాగ్ వెళ్తున్నానని తెలిసి, ఇంక అప్పుడే తెలియచెయ్యమన్నాడు అన్నయ్య. "

"అమ్మ ఎక్కడుంది"

"రజని అక్క తీసుకెళ్ళింది. తనకి సాయంగా ఉంటుందని."

"ఏం?"

"రజనక్క కేరీయింగ్. ఇంత పెద్ద పొట్టేసుకుని కూర్చుంటే లేవలేక కూర్చోలేక ఆపసోపాలు పడుతోంది. అనుకో, దానికి తోడు దాని కూతురు దాన్ని ఎక్కడా నిలువనియ్యదు. పెద్ద సిసింద్రీ" అన్నాడు చిన్నా నవ్వుతూ.

చిన్నా ఉన్న రెండురోజులూ, తండ్రి తలుపులు, తండ్రి ఆలోచనలు, కన్ను చెమర్చింది.

నాన్న! ఉన్న ఒక్క లింకు తెగిపోయింది. అన్నయ్యతోగానీ, తల్లితోగానీ తనకు అంత చనువూ, అవసరం కలిగేవి కావు. తనని అందరూ "బాబు కూచి" అనేవారు, నాన్నకూడా ఆ ప్రత్యేకత ఇచ్చేవాడు. ఇంట్లో అందరి అవసరాలూ తీర్చేవాడు, కానీ నా సరదాలు కూడా తీర్చేవాడు. అది రజనీకి కాస్త అసూయ కలిగించిందేమో?

తనకి జరిగిన అవమానంతో, తనని దూరంగా ఉంచాడు. తనకి తెలియకుండానే తండ్రి ఆధిక్యాన్ని ఒప్పుకునేదేమో? అందుకే తండ్రి కూడా తనకి విలువ ఇచ్చేవాడు. కానీ క్షీరసాగర్‌తో పరిచయం, యూనివర్సిటీలో జరిగిన సంఘటనలు నా ప్రమేయం లేకపోయినా, దోషిగా నిలబెట్టాయి.

నాన్న నాకిచ్చిన ఆధిక్యాన్ని ప్రశ్నించినట్టుగా, అనిపించి ఉండచ్చు. వీటన్నింటికీ అంతర్వాహినిగా నాన్న మనసులో నా అసహాయతకి, నైతిక సరిహద్దులకీ, కాపలాదారునన్న గర్వం ఉండేదేమో. అందుకే నాన్న ఆటిట్యూడ్‌లో మార్పు వచ్చింది.

ఆ పెద్దరికం తను ఇంటినుండి బయటకు వచ్చేయడంవల్ల గాయపడిందేమో. అందుకే ఆయన నన్ను దూరంగా ఉంచాడు. లొంగి వస్తాను అనుకున్నాడు. అది తప్పు అని నిరూపణ అయిపోయింది. ఇప్పుడు ఉన్న ఒక్క లింకూ పోయింది. అనుకుని నిట్టూర్చింది. ఆ నిట్టూర్పుకి తోడుగా కళ్ళు చెమర్చాయి.

రజని కడుపుతో ఉంది అన్న వార్త మనసులో బొంగరంలా తిరుగుతోంది. రజనిని ఎన్ని హాస్యాలాడాడు తన సంగతి తెలిస్తే, తన మీదా అలా హాస్యాలాడతాడా చిన్నా? రజని నీతి హద్దుల్లో హాయిగా ఉంది. మరి నేను అవనీతి పద్దులోకి ఎక్కి, పనిమనిషి దగ్గర కూడా చులకన అయింది. మితిమీరానని బాధపడుతోందా? అంటే నీతి హద్దులకి భయపడుతోందా? నీతి హద్దుల్ని గౌరవిస్తోందా? స్వతంత్ర భావానికి, నీతి అనే హద్దులకి ఖచ్చితంగా లక్ష్మణరేఖ ఉందా? లేక ఇదంతా ఉహాజనితమా? అన్ని ఆలోచనలూ కట్టిపెట్టి మనసు తేలిక చేసుకోడానికి ప్రయత్నించా. రెండు రోజులుండి చిన్నా వెళ్ళిపోయాడు.

●●●

కానీ చిన్నా మనసుని కలగొట్టి వెళ్ళిపోయాడు.

పనిమనిషి చెప్పినట్టు ఎబార్షన్‌తో తన సమస్యలన్నీ తీరిపోతాయా!

సమస్యని కాలానుగుణంగా పరిష్కరించుకుని, నైతిక సమాజంలో శరణార్థిగా ఉండి పోడం ఇష్టంలేదు. అవసరమూ లేదు. రాజేంద్ర చెప్పినట్లు "ఉయ్ లివ్ ఒన్లీవన్స్" అందులో పరిస్థితులతో సమాధాన పడటం కన్నా, పరిస్థితుల్లో ఎలా మార్పు తెస్తుందో?

తనలో పెరుగుతున్న ఈ రూపాన్ని కాపాడాలి. ఏం చేస్తే బావుంటుంది? అదీ ఆలోచన. ఇక్కడే ఉంటే, విమర్శకి, నైతిక భయానికి కొట్టుమిట్టాడుతుంది. అది ఒకరోజు కాదు ఒకనెల కాదు పూర్తిగా ఏడునెలలు. ఈ వాతావరణం, ఈ వ్యక్తుల మధ్యనుండి మార్చుకావాలి. మార్పు ధైర్యాన్ని ఇవ్వచ్చు. ప్రత్యామ్నాయం ఏమిటి?

ఈ విషయంలో రాజేంద్ర సహాయం తీసుకోకూడదు. ఈ వాతావరణం నుండి మారాలి. నా గమ్యం ఏమిటో? నేనేం చేయాలో అన్నీ ఆలోచించి నిర్ణయించుకున్నా.

●●●

మర్నాడు వైస్ చాన్సలర్‌ని కలిసి లెక్చరర్ పోస్టుకి ఏక్సెప్ట్ చేసినట్టు తెలియచేసా. కానీ అక్కడికి వెళ్ళి జాయిన్ అవడానికి ఏడునెలలు సమయం కావలన్నా.

ఆయన 'దేనికి?' అన్నారు.

మౌనంగా ఊరుకున్నా. ఏమని చెపుతా! ఆయన ఆలోచనలో ఆయన ఉన్నారు. ఇలా ఆడపిల్లలు పెళ్ళి అనీ, ప్రెగ్నెన్సీ అనీ ఐదారు నెలలు మాయం అవడం సహజం. నా మౌనం చూసి, అది సిగ్గు అనుకున్నాడు ఆయన. "జీతం నష్టం మీద శలవు తీసుకోండి" అన్నాడు. దాంతో శలవు, ఉద్యోగం సమస్య తీరిపోయాయి. ఇంక ఏడునెలలకీ సరిపోయే డబ్బు కావాలి. ఇంట్లో వస్తువులన్నీ అమ్మేసా. బేంకులో బేలన్స్ చూసుకుంటే పదిహేనువేలు ఉన్నాయి. వస్తువులమ్మిన డబ్బు, బేంకులో ఉన్న డబ్బు కలిపితే ముప్పైవేల వరకూ కూడాయి.

డిపార్టుమెంటులో రిలీవింగ్ ఆర్డర్ తీసుకున్నా. ప్రభాకర్‌కి తెలిసి, అమలాపురంలో లెక్చరర్ ఉద్యోగం కన్నా ఇక్కడ టీచింగ్ అసిస్టెంట్ ఉద్యోగం మంచిది అన్నాడు.

అందరికీ చిరునవ్వు సమాధానంగా చెప్పి, ఎవ్వరికీ ఏమీ చెప్పకుండా రైలు ఎక్కేసాను.

●●●

ఊటీలో పేయింగ్ గెస్టుని ఎంగేజ్ చేసే ఇళ్ళకోసం వెదికా. ఊరికి దూరంగా, లేండ్ స్కేప్‌ల మధ్య ఇల్లు నచ్చింది.

ఆ ఇంటి ఓనరు తమిళియన్, రిటైర్ అయ్యాడు. అతని సుమారు డెబ్బై ఏళ్ళు పైగా ఉంటాయి. ఆ ఇంటికి వెనగ్గా ఒక చిన్న గది ఉంది. గదిలో పెద్దగా సామాన్లూ అవీ లేకపోయినా, గది చాలా నీటుగా ఉంది. ఆ గదికీ ఇంటికీ మధ్యగా పెద్ద తలుపు. దాన్ని తెరిస్తే ఇంటివారి డైనింగ్ హాలు కనబడుతుంది. తలుపుకి పక్కనే అలార్మ్ బెల్లు, ఎర్రలైటు ఉన్నాయి. తలుపు తీసా. అవతల ఒక ఫ్లాస్క్, కప్పు, సాసరు ఉన్నాయి. ఫ్లాస్క్‌లో వేడివేడి కాఫీ ఉంది. ఆ రెండూ తీసుకుని ఎర్రలైటు క్రింద ఉన్న స్విచ్ వేసా. ఎర్రలైటు ఆరిపోయింది. అంటే టు వే స్విచ్. ఈ సౌకర్యం నాకు నచ్చింది. మొత్తం బోర్డింగ్, లాడ్జింగ్ కలిపి ఒక మనిషికి మూడువేలు తీసుకుంటున్నాడు ముసిలాయన. ఆయనతో పాటు ఒక ముసలావిడ ఉంది. ఇల్లు ఎప్పుడూ నిశ్శబ్దంగా ఉంటుంది. నే ఉన్న గదినుండి బైటకి రావడానికి ప్రత్యేకమైన దారి ఉంది. ఆ ఇంటికి చుట్టుపక్కల ఎక్కడా ఇళ్ళు లేవు. ఇలాటి ఇళ్ళే రెండేసి మూడేసి ఫర్లాంగ్ దూరంలో ఉన్నాయి.

గదిలోంచి కొండలు, లోయలు ఆహ్లాదకరంగా ఉన్నాయి. గది కిటికీలోంచి పెద్దగా లేండ్ స్కేప్ కనిపిస్తుంది. ఊటీ వాతావరణానికి, నిశ్శబ్దానికి, చల్లదనానికి, అలవాటు పడేసరికి, పదిరోజులకి పైగా పట్టింది.

నిరంతరం హోరు పెడుతున్న సముద్రం, చలనచిత్రంలా హడావిడిగా ఉంటే మూగపోయిన ఊటీ ప్రకృతి ఘనీభవించిన నిశ్శబ్ధంలా, ప్రశాంతంగా ఉంది. ఒంటరిగా గడపడానికి ఎన్నుకున్న చోటు సరయింది. మనసు ఊరట పొందింది.

●●●

ప్రకృతి అందం, మనసుకి ఊరట కలిగించినా, లోయలు లోతుల్లోంచి వచ్చే ప్రతిధ్వని దిగులు పుట్టిస్తున్నాయి.

నన్ను నేను ఎక్కువగా అంచనా వేసుకున్నానా? జీవితంలో జరిగే మార్పులకి తట్టుకోలేనా? ఎక్కడ లోపం? ఎందుకీ ఒంటరితనం? అన్న ప్రశ్నలు, నాకే అర్థం కావడంలేదు.

ఉదయాన్న దట్టమైన పొగమంచులో పచ్చనైన గడ్డిమీద నడుస్తూంటే గొప్ప థ్రిల్లింగ్‌గా అనిపిస్తుంది. మేఘాల్లో విహరిస్తున్న అనుభవం. సూర్యకిరణాలు పొగమంచును కరిగించి ప్రకృతి వడిని వశపరచుకునే వరకూ, లోయల్లో విహరిస్తూ, ఆ కొండ లోయల్లో ఒంటరిగా, తలపుల లోతుల్లోకి జారిపోయేదాన్ని జీవితానికి తుప్పు పట్టినట్టుగా ఉంది. ఇలాంటి స్థలాలకి ఏకాంతం కోసం కాకుండా, ఏకాంతం పంచుకునేందుకు రావడం సబబుగా ఉంటుంది. "టకటక" తలుపు చప్పుడయింది.

ఇంటి ఓనరు వచ్చి ఉంటాడు. పని అయిపోగానే పోనివ్వకూడదు, మాటలు పెంచాలి అనుకుని తలుపు తీసా. ఎదురుగా ఎనిమిదేళ్ళ పాప తెల్లగా బొద్దుగా ఉంది. పాప చంకలో "బార్బీ" పట్టుచీర కట్టుకుని కూర్చుంది.

"ఆంటీ ఏం చేస్తున్నారు?" అంది పాప చనువుగా.

ఇంత చనువుగా తలుపు తట్టి అడిగిన పాప ఎవరా? అని ఆశ్చర్యపోయా! పాపని చూసి చిరునవ్వు నవ్వా.

"ఆంటీ లోపలికి రానా?" అని ప్రశ్నించింది అమాయకంగా.

"రా" అన్నా.

"మేము తెలుగువాళ్ళమే ఆంటీ, మేం వచ్చి పదిహేనురోజులైంది. మాతోపాటు నాన్న వచ్చారు. కానీ మళ్ళీ ఏదో పనుందని బెంగుళూరు వెళ్ళిపోయారు. ఆ ఇంట్లో మాలి చెప్పాడు. మీరు విశాఖపట్నం నుండి వచ్చారని, అమ్మ బైటకి ఎక్కడికీ రాదు. నాన్న ఉన్నప్పుడు రోజూ మార్నిగ్ వాక్‌కి వెళ్ళేవాళ్ళం, ఇప్పుడు అమ్మ ఎక్కడికీ వెళ్ళనివ్వదు" పాప వివరాలన్నీ చెప్పుకుంటూ పోతోంది. నా ఏకాంతం పాప అందంగా చెడగొట్టింది.

"నీ పేరేమిటి పాపా?"

"కృష్ణ మాల్యద"

"అర్థం తెలుసా?"

"తెలుసు నాన్న చెప్పారు. కానీ కృష్ణుడేడీ మాలికలు ఇవ్వడానికి? " అంది పాప అమాయకంగా. హాయిగా నవ్వా.

"ఎవరు చెప్పారు కృష్ణుడు లేడని, ఇంట్లో కృష్ణ విగ్రహం లేదూ?" అన్నా నవ్వుతూనే.

"ఇంట్లో కృష్ణవిగ్రహం ఉంది, కానీ వివేక్ అంకుల్ అంటారూ, ఈ కృష్ణుడ్ని నమ్మకూ, పదహారువేల మాలల్లో, నీదీ ఒక బోడిమాల అవుతుంది. కలియుగ కృష్ణుడు ఎవరో ఒకడు వస్తాడు వాడి కోసం నీ మాలలన్నీ దాచు అని" అంది పాప అమాయకంగా మొహం పెట్టి, కానీ అక్కడితో ఆగక 'నిజమేనా ఆంటీ?" అంది. అంతవరకూ కృష్ణ మాల్యద మాటలు ఏకాగ్రతతో వింటున్న నేను "ఆ! నిజమే" అనేసా

"ఆంటీ రేపటి నుండి నేనూ మార్నింగ్ వాక్‌కి వస్తాను. నేను వచ్చేవరకూ ఉండండేం" అని చెప్పి వెళ్ళిపోయింది కృష్ణమాల్యద. అనుకోకుండా లభించిన కొత్త స్నేహితురాలు చాలా హాయినిచ్చింది.

కానీ కృష్ణమాల్యద చెప్పిన కలియుగ కృష్ణుడు సమాధానం, ఆమె ఎత్తుకున్న బార్బీ బొమ్మ నన్ను మళ్ళీ ఆలోచనా ప్రపంచంలోకి నెట్టివేసాయి.

"ఆడపిల్లని ఎప్పుడూ, సమర్పిత భావంతోనే పెంచుతుంది. ఎక్కడా 'ఐ' కనపడదు. ఆమెకి ఎప్పుడూ రెండో స్థానమే. ఎవరి కోసమో మాత్రమే ఆడది పుడుతుంది. ఎవరి కోసమో జీవిస్తుంది. ఆమెకి ప్రత్యేక వ్యక్తిత్వం ఆలోచన ఉంటాయంటే సమాజంలో, ఎవరికీ నమ్మబుద్దేయదు. ఆడదాని కన్నీటికున్న విలువ తెలివితేటలకి లేదు, తన్ను తాను సమర్పించుకుని ఎదురుచూసి, ఎదురుచూసి, పరిస్థితులని జయించాలే తప్ప, ఎదురుతిరిగి ధైర్యంగా సమస్యకి పరిష్కారం వెతుక్కోకూడదు అలా వెతుక్కుంటే నేలవిడిచి సాము చేసినట్టే, నేలవిడిచి సాము చేసినదాన్ని పౌరాణికురాల్ని (MYTH) చేసేస్తారు. తన భర్తకోసం సాము చేసిన స్త్రీ పౌరాణికురాలై, కథగా కన్యలకి పనికి వస్తుంది. లేదా కష్టాల్లో పడి తేలుస్తున్న భ్రష్టుగా మిగిలిపోతుంది. యూనివర్శిటీలో ఉంటే తనకి అంతకన్నా ఎక్కువ బిరుదు లభించి ఉండేదికాదేమో. ఇంత జరిగినా రాజేంద్ర మౌనంగా ఉన్నాడు, తన పట్ల చేతలలోగానీ, మాటలలోగానీ వెకిలి తనం చూపలేదు. అదే మనసుకి కొంత ఊరట.

●●●

తొలికిరణం చల్లదనంతో సంగమిస్తూ కలకూజితం చేసినట్టుగా తెలతెలవారుతున్న ప్రకృతి ఒడి, చెట్లపై పక్షుల కలకారావాలతో, అందంగా ఆహ్లాదకరంగా ఉంది. నేలమీద పచ్చిక, కార్పెట్ పరచినట్టుగా మెత్తగా ఉంది.

"కృష్ణా.. మార్నింగ్ వాక్ అంటే నీ కెందుకంత ఇష్టం?"

కృష్ణ మాటల్లో పసితనం. అమాయకత్వం బాగా నచ్చాయి. కృష్ణ ఎప్పుడూ మాట్లడుతూంటే బావుంటుంది. అందుకే లేనిపోని ప్రశ్నలు వేస్తున్నా,

"స్నానం చేస్తే శరీరం ఎంత ఆరోగ్యంగా ఉంటుందో. మార్నింగ్ వాక్ వల్ల లోపల ఎక్కడో సంతోషంగా ఉంటుంది" అంది కృష్ణ.

"అంటే మనసు స్నానం చేసినట్టా?"

"మనసంటే?"

"నీకు ఏది హాయిగా అనిపించిందో అది"

"కాదు ఆంటీ.. అంకుల్ ఇంకేదో చెప్పారు. అది"

"ఆత్మా?"

"ఆ! ఆత్మసుద్ధి చేసినట్టుగా ఉంటుందట"

వస్తున్న నవ్వుని ఆపుకుంటూ "ఆత్మ అంటే ఏమిటి? కృష్ణా" అన్నా.

"ఏమో! అది అందరికీ ఉంటుందట కదా ఆంటీ.."

"అలాగని ఎవరు చెప్పారు?

"వివేక్ అంకుల్. అందరికీ ఆత్మ ఉంటే మార్నింగ్ వాక్ అందరికీ బావుండాలి కదా ఆంటీ"

"అవును"

"మరి అమ్మకి బావుండదేం"

"ఎవరి ఇష్టాలు వారివి"

"మరి నా ఇష్టం నాది కదా? నన్ను కూడా వెళ్ళవద్దంటుందేం" కృష్ణలో 'ఐ' లేక కాదు. దాన్ని అణిచేస్తాం.

"కృష్ణా సమాధుల వరకూ వచ్చేసాం, వెనక్కిపోదాం పద" అని వెనక్కి తిరిగా. ఎత్తైన సాల్ చెట్లు మధ్య నడుస్తున్నాం. కృష్ణను దట్టమైన పొగమంచు కప్పేసింది.

"సమాధి అంటే ఏమిటి? ఆంటీ" కృష్ణ ప్రశ్న.

"సమానత్వ సాధనే సమాధి."

"ఆంటీ మీ మాటలు నాకు అర్ధం కావేం"

"..............."

"కానీ మీ మాటలు బావుంటాయి. ఆంటీ"

"ఎందుకు?"

"అర్ధం కావు కాబట్టి"

నడుస్తున్న నాకు నవ్వు తెర కమ్మేసింది, గడ్డిలో చతికిల బడి నవ్వాపుకుని, "ఇంకా ఎవరి మాటలు అర్ధం కావు నీకు" అని అడిగా.

"వివేక్ అంకుల్వి, కానీ వివేక్ అంకుల్ మాటలు చాలా బావుంటాయి ఆంటీ మా క్లాస్ టీచరు మాటలు అసలు అర్ధం కావు. బాగానూ ఉండవు" అంది బుంగమూతి పెట్టి.

గడ్డిమీద పడుకుని నవ్వా. నవ్వి నవ్వి అలసి పోయి అలాగే పడుకున్నా. నన్నూ నా నవ్వుని చూసి అవాక్కయిపోయింది కృష్ణమాల్యద, నన్ను ఆశ్చర్యంగా చూస్తూ, నా పక్కనే కూర్చుండిపోయింది.

●●●

కృష్ణమాల్యదతో మార్నింగ్ వాక్ నాలో ఉత్సాహాన్ని పెంచింది. ఒంటరితనానికి జోడు అందాన్నిచ్చింది.

ఆ రోజు కృష్ణమాల్యద పొద్దున్నే ఆరుగంటలకి వచ్చింది. ఆమె చేతుల్లో, 'బార్బీ' బొమ్మ ఉంది. ఆ బొమ్మని కృష్ణమాల్యద, సుతారంగా ఎత్తుకుంది.

"చూడు ఆంటీ బార్బీ కూడా వస్తానని మారాం చేసింది తీసుకొచ్చాను. బావుందా ఆంటీ?" అని అడిగింది ఎంతో గారంగా. కృష్ణమాల్యద ఎత్తుకున్న బార్బీని చూసా. ఎర్రటి గౌను, నల్లటి కళ్ళు, తెల్లగా రెండు జెడలు 'బార్బీ' ఎంతో ముద్దుగా కృష్ణమాల్యద ఒడిలో ఒదిగి కూర్చున్నట్టుంది.

"నీ దగ్గర ఎన్ని బార్బీలు ఉన్నాయి కృష్ణా?" అని అడిగా.

"నాలుగున్నాయి ఆంటీ" అంటూ బార్బీతోనూ, నాతోనూ ఏవో కబుర్లు చెబుతూనే ఉంది కృష్ణమాల్యద.

ఇంకో రోజు "నువ్వు ఒంటరిగా ఉన్నావేం ఆంటీ?"

"................"

"అంకుల్ ఏరీ?" అని అడిగింది.

ప్రతి ఆంటీ పక్కన అంకుల్ ఉండాలనే, కృష్ణమాల్యద తర్కం చకితురాలిని చేసింది. ఏ సమాధానం చెప్పాలి? స్త్రీలు పురుషులు కలిసి స్త్రీ జీవితాన్ని దగా, చేసారు. ఆడపడుచులన్నా, పతివ్రతలన్నా, మాతృదేవతలన్నా మొగాడి ప్రిఫరెన్స్ లేకుండా, ఆడదాని రిఫరెన్స్ లేకుండా చేసారు. కృష్ణమాల్యద చెయ్యి పట్టుకులాగడంతో తలపుల ప్రపంచం నుండి ఈ లోకంలోకి వచ్చి

"నే ఒంటరిగా ఎక్కడున్నానూ.. నువ్వు ఉన్నావుగా" అన్నా నవ్వుతూ.

●●●

ఆ రోజు ఎంత ఎదురు చూసినా కృష్ణమాల్యద రాలేదు. ఆలస్యం అయినా తిరిగి వద్దామని బయలుదేరా. అప్పటికే "ఉదయరవి" తన కిరణాలతో పొగమంచును ఏకేసాడు. ఉదయం దట్టంగా ఉన్న పొగమంచు దూదిపింజెల్లా పచ్చిక మీద దొర్లుతూంది. సూర్యకిరణాలు తీవ్రంగా ఉన్నాయి. ఆయాసం ఎక్కువయింది, నడకని ఆపి పచ్చిక మీద చతికిలపడ్డా కంఫర్టబుల్‌గా అనిపించి పచ్చిక మీద వాలా, అలసిన శరీరం సొలిసిపోయింది. స్పృహ తెలిసేసరికి పక్కనే ఎవరో స్త్రీ నా మొహం మీద మొహం పెట్టి చూస్తోంది. పక్కనే కృష్ణమాల్యద నిలబడి నన్ను ఆతృతగా చూస్తోంది. తెలివి వచ్చినా నీరసంగా ఉంది. మెల్లగా లేచి కూర్చుని వాచీ చూసుకున్నా. ఎనిమిదయింది. గంటసేపు సొలసిపోయి, ఇక్కడ పడిపోయా.

"కృష్ణకి వంట్లో నలతగా ఉంటే, మార్నింగ్ వాక్‌కి వెళ్ళద్దన్నాను. కృష్ణ అల్లరి పెడితే మీ గదికి వెళ్ళాం. అక్కడ మీరు లేకపోతే వస్తూ వస్తూ పచ్చిక మీద పడుకున్న మిమ్మల్ని చూసాం, మీరు పచ్చిక మీద పడుకుని నిద్రపోయినట్టున్నారు" అంది ఆమె.

"ఆ" అన్నా నీరసంగానే లేస్తూ.

ఆమె కృష్ణ చెయ్యిపట్టుకుని "మేం వెళ్తాం" అంది.

"రండి గదికి వెళ్దాం, కాఫీ తాగుదురుగాని," అన్నా.

"ఎక్కడికి? కళ్యాణ్ రామన్ ఇంటికా, మీరు ఇలా రావడం కొత్త అనుకుంటాను. మేం ప్రతీ శలవులకీ వస్తాం. మాకు అన్ని విషయాలు తెలుసు."

"ఏ విషయాలు?" ఆశ్చర్యంగా అడిగా.

"కళ్యాణరామన్ ఆ గదిని చాలా తక్కువలో మీకు అద్దెకిచ్చి ఉంటాడు, అడ్వాన్స్‌గా ఏం పుచ్చుకుని ఉండడు" అంది ఆమె.

"ఆ మూడువేలకి ఇచ్చాడు, ఆయన ఎడ్వాన్స్ ఏం పుచ్చుకోలేదు."

"ఇక్కడ ఉన్న ఇళ్ళల్లో ఐదువేలకి తక్కువగా పుచ్చుకోరు. అదీ మొదట్లో మూడు నెలల ఇంటి అద్దె పుచ్చుకుంటారు. అఫ్‌కోర్స్ మీరు వెళ్ళిపోయేటప్పుడు మిగతా సొమ్ము వాపస్ ఇచ్చేస్తారు అనుకోండి."

"మరి ఆయన మూడువేలకే ఎందుకిచ్చారు?" అని అడిగా ఆశ్చర్యంతో.

"వాళ్ళావిడకి కుష్టురోగం, అది తెలిసిన వాళ్ళెవరూ ఆ ఇంట్లో దిగరు. అందుకే ఆయన చవకగా ఇచ్చాడు గదిని. వస్తాం" అని చెప్పి కృష్ణ చెయ్యి పట్టుకుని చరచరా తీసుకుపోయింది ఆవిడ.

"అమ్మా కుష్టురోగం అంటే ఏమిటే?" అని అడుగుతోంది కృష్ణ.

"నోర్మూసుకో, లేనిపోని విషయాలన్నీ కావాలి నీకు" అని కసురుకుంది కృష్ణని.

వాళ్ళు వెళ్ళిన వేపే చూస్తూ అచేతనంగా నిలబడిపోయా. కళ్యాణ రామన్ భార్యకి కుష్ఠు. తను వచ్చి నెలరోజులు దాటినా తనకి తెలియలేదు. రోజూ ఆమె చేతి వంట తింటోంది. అప్పుడప్పుడు తన గదిలోకి వచ్చి పక్కలు మార్చి గదిని శుభ్రం చేసి పోతుండాలి. నెలరోజులూ తన కళ్ళపడకుండా తప్పించుకు తిరుగుతోంది.

ఎంత మోసం!! ఇవాళో రేపో కళ్యాణరామన్ నెల అద్దెకి వస్తాడు. అప్పుడు నిలబెట్టి నిజం చెప్పించాలి.

గదికి వచ్చేసరికి, తలుపు దగ్గర ఎర్రలైటు వెలుగుతోంది. నీరసంగా పక్కమీద పడుకున్నా మంచి నిద్రపట్టేసింది.

●●●

ఎవరో లేపినట్టు తెలివి వచ్చింది, కానీ ఎదురుగా ఎవరూ లేరు. ఇలా ఎన్నాళ్ళు. కుష్ఠుదాని వంట తింటూ, సహించగలదా? ఎంత మోసం తెలియదనుకున్నాడు ముసలాయన. వెళ్ళి అటో ఇటో తేల్చేసుకోవాలి అనుకుని స్లిప్పర్స్ వేసుకుని ఇంటి వేపున్న గేటు తీసుకుని లోపలికి వెళ్ళి తలుపు దబదబా బాదా. నే తలుపు కొట్టిన పదినిమిషాలకి తలుపు తెరిచాడు కళ్యాణరామన్ కోపంగా "మీరు నన్ను మోసం చేసారు?" అన్నా.

"ఏ విషయంలో?"

"మీ ఆవిడ కుష్ఠురోగా? అంత భయంకరమైన జబ్బు ఇంట్లో పెట్టుకుని, వచ్చిన అతిథులకి తెలియనివ్వకుండా కుష్ఠు అన్నం, కుష్ఠుబట్టలు, ఇస్తారా? అసలు ఈ ఇల్లే కుష్ఠుమయం" అన్నా.

"ఇక్కడికి వచ్చి మీరు ఇల్లు అడిగారు ఇచ్చాను. మీరు కుష్ఠు గురించి అడగలేదు. నే చెప్పలేదు, ఇందులో మోసం ఏముంది?"

"వచ్చిన వాళ్ళు ప్రతీ ఇంటికీ వెళ్ళి, మీ ఇంట్లో కుష్ఠురోగి ఉందా? క్షయ ఉందా? అని అడుగుతారా?"

"లేకపోతే మా ఇంటి ముందు ఇంట్లో కుష్ఠురోగి ఉంది అని బోర్డు పెట్టమంటారా? మీరు పెట్టుకున్నారా? నేను భ్రష్ఠుముండని అనే బోర్డు, వచ్చినప్పుడు చెప్పారా? నేను భ్రష్ఠుదాన్ని అని" అన్నాడు కళ్యాణరామన్ స్వరం పెంచుతూ.

అతని కుతర్కానికి. ఆశ్చర్యపోయి తిరిగి విసురుగా తనగదిలోకి వెళ్ళిపోయింది. వెనగ్గా శబ్ధం చేస్తూ తలుపు వేసింది. తలుపు బాదుతున్న చప్పుడికి తెలివి వచ్చింది. ఎవరో తలుపు కొడుతున్నారు. కల చెదిరింది. కళ్యాణరామన్ ఇంటిలోకి వెళ్ళడం, ఘర్షణ అంతా కల, నిజంగా జరిగినట్టు అనిపించే కల టైము చూసుకున్నా. మూడు గంటలయింది.

వెళ్ళి తలుపు తీసా ఎదురుగా కళ్యాణ రామన్, తెల్లని ఖద్దరు షర్టు వేసుకుని, తెల్లని లుంగీ కట్టుకున్నాడు. డెబ్బై ఏళ్ళు వరకూ ఉంటాయి. భూతద్దాల్లాంటి కళ్ళజోడు లోంచి నిశ్చలంగా చూస్తున్నాడు.

తలుపు తెరవగానే "ఒడంబుగునమా ఇల్లియా?" అని అడిగాడు.

అర్ధంకాక ఏమిటి? అన్నట్టు చూసా, కళ్యాణరామన్‌కి తను చేసిన తప్పు అర్ధం అయింది.

"ఆర్ యు నాట్ ఫీలింగ్ వెల్?" అని అడిగాడు.

"ఊ" అని మూలిగా.

"యు హేవ్ నాట్ టేకెన్ మీల్స్?" అన్నాడతను మళ్ళీ. ఆయన మొహంలో దీర్ఘంగా చూసా.

"ఈజ్ యువర్ వైఫ్ సఫరింగ్ ఫ్రమ్ లెప్రసీ?" అని అడిగా. అడుగుతూ ఇబ్బందిపడ్డా.

కళ్యాణరామన్ ఆశ్చర్యపోలేదు. పరిస్థితిని నిర్లిప్తంగా ఎదుర్కోడం అతనికి అనుభవంతో వచ్చి ఉంటుంది. అతని మొహం ఎర్రగా అయింది. రెండు నిమిషాలు మౌనంగా ఉన్నాడు.

"నానేషమియల్ పొన్నరేన్" అన్నాడు. అన్నప్పుడు అతని కంఠం జీరపోయింది.

త్వరలోనే తేరుకున్నాడు. "ఐ కుక్ మై సెల్ఫ్, షి నెవ్వర్ ఇంటర్ ఫియర్స్ ఇన్ కుకింగ్ ఆర్ ఎనీ వర్క్ ఇన్ ది కిచెన్" అన్నాడాయన.

"ఐ థింక్ దట్ యుడు నాట్ హా ఎనీ సర్వెంట్ టుడు స్వీపింగ్. ఛేంజింగ్ ది బెడ్ షీట్స్. ఇన్ మై ఆబ్‌సెన్స్ షి మైట్ హావ్ డన్ దీజ్ దింగ్స్, దటీజ్ వై ఆల్ ది క్లీనింగ్ హాజ్ బీన్ డన్ ఇన్ మై ఆబ్‌సెన్స్. యు ఆర్ హైడింగ్ సమ్ థింగ్" అన్నా ఉద్వేగంగా.

"దినపడినాన్ రూమ్ శుద్ధ పడితె రేన్ నో ఐ మీన్ ఐడు ఎవ్విరిథింగ్, క్లీనింగ్, చేంజింగ్ ఆఫ్ బెడ్ షీట్స్ ప్లీజ్ ట్రస్ట్‌మి" అన్నాడు. ఇప్పుడు ఆయన గొంతుకలో జీరలేదు. మెల్లగా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

ఆయన ఆఖర్న అన్నమాట చెవుల్లో గింగుర్లు తిరుగుతోంది. "ప్లీజ్ ట్రస్ట్ మి" నమ్మకం. అతనే ఇన్నాళ్ళూ గది ఊడ్చాడు. పక్క బట్టలు మార్చాడు. వంట వండి పెట్టాడు. ఆ విషయం తట్టనే లేదు. అతను మోసం చెయ్యలేదు. నే ఆలోచనల్లోంచి తేరుకోనేలేదు. గుమ్మంలో ఒక పల్లెటూరి వాడు లుంగీ కట్టుకుని నిలబడ్డాడు.

"అమ్మగారూ నేను భోజనం హోటలునుండి తెద్దునా?" అన్నాడు.

తనలో విశ్వాసం లేదని తెలిసి కళ్యాణరామన్ ఈ గడ్డికోసుకునే వాడ్ని పంపించాడు. రెండు నిముషాలు ఆలోచించి,

"వద్దు నువ్వెళ్ళు" అన్నా.

వాడు వెళ్ళిపోయి వెంటనే మళ్ళీ వచ్చాడు.

"ఏం?" అని అడిగా.

"అయ్యగారు డబ్బులు ఇస్తానన్నారు. మీరియ్యక్కర్లా, మీకు ఏం కావాలో చెప్పండి." అన్నాడు వాడు.

వాడ్ని దీర్ఘంగా చూసా. "ఏం వద్దు నువ్వెళ్ళు' అన్నా, లేచి కళ్యాణరామన్ ఇంటివేపు వెళ్ళా. ఆయన బయట వరండాలో కూర్చుని దీర్ఘంగా ఎదురుగా ఉన్న కొండల్ని చూస్తున్నారు. నన్ను చూసి, ఎదురుగా ఉన్న కుర్చీ చూపించారు. కూర్చున్నా "ఐ ట్రస్ట్ యూ" అన్నా మెల్లగా.

"కెన్ ఐ హేవ్, ఎనీ నేమ్ ఆఫ్ గుడ్ గైనకాలజిస్ట్" అనడిగా.

అతను అవుననలేదు. కాదనలేదు. ఇంటిలోకి వెళ్ళి లోపలనుండి ఒక తెల్లకాగితం తీసుకొచ్చి దానిమీద పెన్నుతో పేరు రాసి ఇచ్చాడు. ఆ కాగితం తీసుకుని చూసా, "స్నేహలత - పీక్స్ నర్సింగ్ హోమ్" అని రాసుంది.

వెళ్ళడానికి లేచి "కెన్ ఐసీ యువర్ వైఫ్?" అన్న నా అభ్యర్థనకి.

"నో" అన్నాడాయన నిశ్చలంగా, ఆ భూతద్దాల కళ్ళల్లో ఏ భావాలు లేవు. రెండు నిముషాలు మౌనంగా అక్కడ నిలబడి, నడుచుకుంటూ గదిలోకి వచ్చేసా. గదిలోకి వచ్చేసిన అరగంటకి లైటు వెలిగింది. తలుపు వెనక ఫ్లాస్క్, పక్కగా రెండు బిస్కెట్లు పాకెట్స్, నాలుగు అరటిపళ్ళూ ఉన్నాయి. అవి తీసుకుని తలుపు వేసి ఎర్రలైటు, ఆర్పేసా.

●●●

కొండ శిఖరాల అంచున కట్టబడి ఉంది, పీక్స్ నర్సింగ్ హోమ్, హాస్పిటల్‌లోకి వెళ్ళగానే రిసెప్షన్ కౌంటర్, ఇద్దరు ముగ్గురు రిసెప్షనిస్టులు, కంప్యూటర్ ఉన్నాయి. నే వెళ్ళి రిసెప్షనిస్టుని "జి.స్నేహలత కావాలి" అని అడిగా.

"మీరు ప్రయర్ అపాయింట్ మెంటు తీసుకున్నారా?" అని అడిగింది నర్సు.

"లేదు"

"ప్లీజ్ సిట్ డౌన్" అంది.

రెసెప్షన్ కౌంటరు ఎదురుగా సీట్లలో కుర్చున్నా ఒక అరగంట తర్వాత "మీరు స్నేహలతగారని ఆవిడ చేంబర్‌లో కలుసుకోవచ్చు. సెకండ్ ఫ్లోర్‌లో, రైట్ హాండ్ కార్నర్ చివరి గది' అని చెప్పింది.

మెట్లవైపు వెళ్ళబోతున్న నన్ను "లిఫ్ట్, దిస్ సైడ్ ప్లీజ్" అంటూ లిఫ్ట్ వేపు చూపించింది. లిఫ్ట్ వేపు చూపించింది. లిఫ్ట్ ఎక్కి సెకండ్ ఫ్లోర్‌కు చేరుకుని, అక్కడ నుండి స్నేహలత చాంబర్‌కి వెళ్ళి, తలుపు మీద చిన్నగా కొట్టా.

"యస్ కమిన్" అని వినిపించడంతో, తలుపు తీసుకు లోపలికి వెళ్ళా. డాక్టరు స్నేహలత కుర్చీలో కూర్చుని ఏదో రిపోర్టు దీర్ఘంగా చదువుతూ ఆమె పక్కగా ఉన్న కంప్యూటరు టెర్మనల్‌లోకి 'డేటా' ఫీడ్ చేస్తోంది.

కూర్చోమన్నట్టు సైగ చేసింది. స్నేహలత ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నా. స్నేహలత వయస్సులో పెద్దదికాదు. స్నేహలతకి ముప్పైఏళ్ళు మించి ఉండవు. సన్నగా పొడుగ్గా ఉంది. స్నేహలతని ఇంతకు ముందు ఎక్కడో చూసినట్టు అనిపించింది. నా ఆలోచనకి అడ్డుకట్టవేస్తూ "చెప్పండి" అంది స్నేహలత.

తను స్పృహ తప్పిపోయిన సంగతి, నీరసం గురించి చెప్పా. స్నేహలత డ్రాయరులో నుండి, ఒక డేటా షీటు తీసి నా కిచ్చి నింపమంది నింపాక, దాన్ని శ్రద్ధగా చదివింది.

"ఇక్కడ మీతో పాటు ఎవరెవరు ఉంటున్నారు?"

"ఎవరూ లేరు నేను ఒంటరిగా ఉంటున్నాను."

"క్రింది ఫ్లోర్‌లో సీనియర్ రెసిడెంట్ డాక్టరు ఉన్నారు. ఆవిడని చూడలేకపోయారా?"

"కళ్యాణరామన్ మా ఇంటి ఓనర్ మీ పేరు ఇచ్చారు" అన్నా.

"ఓహ్ అలాగా" అని రెండు నిమిషాలు మౌనంగా ఉండి

"మంచం మీద పడుకోండి" అంది స్నేహలత.

నే పడుకున్న తర్వాత, పరీక్ష చేసింది.

"అయిదో నెల నడుస్తోంది. కానీ ఇంతకు ముందు ఏ డాక్టరు నేనా చూసారా?"

"నాలుగు నెలలక్రితం వైజాగ్‌లో లేడీ డాక్టర్ డిటెక్ట్ చేసింది. ప్రెగ్నెన్సీ అని, కానీ నా ఉద్యోగానికి అడ్డురాకుండా, వాంతులు అవకుండా మందులు ఇచ్చింది" అంటూ జరిగింది చెప్పా.

స్నేహలత తను చెప్పిన విషయాలు ధ్యానంతో వినడంలేదని అనిపించింది. ఆ విషయం స్నేహలత సీనియర్ రెసిడెంట్ డాక్టరుకి, ఫోను చేసి ప్రెగ్నెంట్ పేషెంట్‌ని పంపుతున్నానని చెప్పడంతో నిర్ధారణ అయింది.

"జాహ్నవి మీరు ఫస్ట్ ఫ్లోర్ లెఫ్ట్ హాండ్ కార్నర్‌లో నాలుగో రూములో డా.రాజరత్నంగారి దగ్గరకి వెళ్ళండి" అంది డేటా షీటు ఇస్తూ.

"మీరు రాకూడదూ?" అన్నా.

"అలా రాకూడదు" అంది స్నేహలత విసుగ్గా మొహం పెట్టి,

క్రిందకి దిగా. కానీ డా.రాజరత్నంని చూడబుద్ధి వెయ్యలేదు. క్రిందకి రోడ్డుమీదకి వచ్చి ఆటో తీసుకుని ఇంటికి వచ్చేసా. బిడ్డమీద మమకారం లేదా? తను ఎందుకు డా.రాజరత్నం అంటే జంకింది. డేటా షీటులో ఉన్న వివరాలు ఆమెకి డా. లీలాప్రసాద్‌లా నిరసనగా చూస్తుందేమో?

తనలో ఈ ద్వంద్వస్వభావం తనకే అర్థం కావడంలేదు.

స్నేహలత దగ్గరకి వెళ్ళి ఒచ్చిన రెండు రోజుల వరకూ మామూలుగానే ఉంది. పొద్దున్నే మార్నింగ్ వాక్ తగ్గించేసా. కృష్ణమాల్యద తలపుల్లోకి వస్తోంది. బార్బీ బొమ్మని లాలిస్తున్న దృశ్యం కళ్ళముందు కనిపిస్తోంది. దానికి కారణం, రొమ్ముల్లో జరిగిన మార్పు, నిరంతరం బ్రా వేయడం వల్ల తెలియలేదు కానీ ఇప్పుడు బ్రా వేయబుద్ధి వేయడం లేదు. రాజరత్నం దగ్గరకి వెళదామని ఒకసారి, ఎందుకులే అని ఒకసారి, ఊగులాడుతున్నా ఆ ఊగిసలాటలో పదిరోజులు గడిపా.

●●●

**ఆ రోజు తెల్లవారుఝామున** నాలుగుగంటలకే తెలివి వచ్చి శరీరంలో ఏదో తేడాకనిపించింది. తలనొప్పి, జ్వరం వచ్చినట్లయింది. వంట్లో విపరీతమైన నిస్సత్తువ, అన్నింటికీ మించి తన నిస్సహాయతకి, ఒంటరితనానికి భోరున ఏడవాలనే దైన్యం! మనిషికి మనిషి ఎంత అవసరమో అర్ధం అవుతోంది. ఎవరి సహాయం అఖ్ఖరలేదు, ఏమయితే అదే అవుతుంది. అనుకుని పగలు ఎనిమిది గంటలకి తయారై రోడ్డు వరకూ నడిచి ఆటో తీసుకుని పీక్స్ నర్సింగ్ హోమ్‌కి వెళ్ళా. రిసెప్షన్‌లో డా.రాజరత్నం గురించి అడిగా.

"నో.. డాక్టరు ఈజ్ ఎటెండింగ్ డెలివిరీ" అంది రిసెప్షనిష్టు. ఏం చెయ్యాలో తెలియక ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నా. ఓ అరగంట పోయాక రిసెప్షనిష్టు పిలిచి "డా.స్నేహలత ఈజ్ కాలింగ్ యు, టు హెర్ రూమ్" అంది.

తను స్నేహలతని అడక్కపోయినా, స్నేహలతకి ఎలా తెలుసు తను వచ్చానని, రిసెప్షనిస్టు చెప్పి ఉంటుంది. మెల్లిగా లేచి, లిఫ్ట్ వేపు వెళ్ళాను.

●●●

ఈసారి స్నేహలత ప్రవర్తన స్నేహపూర్వకంగ ఉంది. ఆమె టెస్ట్ చేసే పద్దతిని బట్టి, చాలా ధ్యానంతో పరీక్ష చేస్తున్నట్టనిపించింది. మొత్తం రిపోర్టు అంతా డేటా షీటు మీద రాసి మొదటిసారి వచ్చినప్పుడు పట్టించుకోనిది, "మీ భర్తపేరు, వయసు ఇవ్వలేదేం" అని అడిగింది.

"........"

"అలా కుదరదు. డేటా షీటు పూర్తిగా ఉండాలి లేకపోతే డా.రాజరత్నం ఒప్పుకోదు. పర్వాలేదు నింపండి, మీతోపాటు నేనూ ఉంటాను."

డేటా షీటు తీసి మొత్తం అన్నీ నింపి ఇచ్చింది. అందులో రాజేంద్ర పేరు యూనివర్సిటీ ఎడ్రసు ఇవ్వకనే ఇచ్చేసింది. అప్పటికి నింపేసినా రాజేంద్ర పేరు అతని అనుమతి లేకుండా ఎందుకు ఇచ్చానా అని ఫీలయా. ఆ రోజంతా చిరాకే. ఇంత దూరంలో ఎవరి పేరైతేనేం అనుకున్నా.

ఇద్దరం కలిసి రాజరత్నం ఛాంబర్‌కి వెళ్ళాం. అప్పుడే ఆమె పురుడు పోసి వచ్చింది. కూర్చుని తీరిగ్గా కాఫీ తాగుతోంది. "రా లతా, ఈమెనా ఆ రోజు పంపుతానన్న ప్రెగ్నెంట్ పేషెంట్" అంది ప్రెగ్నెంట్ పేషెంట్, అన్న దగ్గర నొక్కి పలికింది. ఇద్దరూ వెళ్ళి ఆమెకి ఎదురుగా కూర్చున్నారు. రాజరత్నం డేటాషీటు తీసుకుని మొత్తంగా చదివి పడుకోమని, పరీక్ష చేసి, కుర్చీలో కూర్చుంటూ.

"జాహ్నవీ ప్రెగ్నెన్సీ రోగం కాదు. నువ్వు రోగివి కాదు, ఇది సహజంగా ప్రకృతి సిద్ధంగా శరీరంలో జరిగే మార్పు దీనికి భర్త, తల్లితండ్రుల లాలన స్త్రీకి చాలా అవసరం. అందుకే మన సంప్రదాయంలో కడుపుతో ఉన్న స్త్రీని పుట్టింటికి పంపిస్తారు.

అక్కడ ఉన్నంత స్వేచ్ఛ, మానసిక ఆనందం, తల్లిలాలన ఇంకో దగ్గర లభ్యం కాదని. ఆల్‌రైట్, నీ కడుపులో బిడ్డ పూర్తిగ ఎదగలేదు, దానికి నీలో అనవసరపు టెన్షన్, ఆతృత, కారణాలు కావచ్చు. ప్రెగ్నెన్సీ తలచుకుని చింతపడుతున్నవేమో యు నీడ్ నాట్ వర్రీ. బి చీర్ ఫుల్ అన్నీ సవ్యంగా జరుగుతాయి. స్నేహలత విల్ టేక్ కేర్'' అంది ముగింపుగా స్నేహలతతో లేచి స్నేహలత రూముకి వచ్చేసాం.

●●●

''కహీదూర్ జబ్ దిన్ ఢల్ జాయె, సాంజ్‌కి దుల్హన్ బదన్ చురాయె, చుప్ కెసె ఆయె.

మేరే ఖయాంలోంకే ఆంగన్ మే కొయీ సప్నోం కె దీప్ జలాయె.''

అంటూ టేప్ రికార్డర్‌లో ముఖేష్ గొంతుక, జీవితాన్ని మంటగా పెట్టి, విషాదాన్ని కరిగించడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఈ అంగన్ గురించి ఎవరికి తెలుసు? ఎవరు వస్తారు? అనుకున్నా.

స్నేహలత దగ్గరకి వెళ్ళి, ఆమె రాసిన మందులు వాడుతున్న కొద్దీ ఆరోగ్యం కుదుటబడుతోంది. ఆరోగ్యం కుదుటబడుతున్నకొద్దీ కడుపులో కదలికలు ఎక్కువ అవుతున్నాయి. కడుపు కూడా పెద్దదయింది. కడుపు మీద చెయ్యిపెట్టి చూసుకుంటే కడుపులో కదలికలతో పాటు, చిన్న హార్ట్ బీట్ అనుభవంలోకి వస్తోంది, ఫీటస్ కళ్ళు తెరిచిందా? లేదా? ఈ రకం ఫీటస్ చూసే పనిమనిషి చెత్తకుండీలో పిల్లాడ్ని చూసాను. అందా? ప్రెగ్నెన్సీ కలా? పీడకలా?

ఒక్క తల్లే సహజం చట్టబద్ధమైన బంధువు. ఇంట్లో తండ్రీ తల్లీ ఆదరంతో, తోబుట్టువులు చేసే హాస్యాలతో మొగుడు చూసే మగసిరి చూపులకి ప్రెగ్నెన్సీ అందమైన రంగుల ఇంద్రధనస్సు. కలే కలకాక ఏమిటి? తల్లీ, తండ్రీ పడేవేదనకి, తోబుట్టువుల అస్పృశ్యతాభావానికి, మగాడు చూపే కపట బుద్ధికి, ప్రెగ్నెన్సీ పీడకలే రాకూడని పీడకల.

ఎప్పుడు, ఏం ఆలోచిస్తోందో? అర్థం కావడంలేదు, ఇంతకు ముందు ఒక్కదాని గురించే ఆలోచించేది ఇప్పుడు, ఇద్దరి గురించి ఆలోచిస్తున్నా.

ఆ రెండోది కడుపులో ఉన్న ఫీటస్, అది పెరిగి శిశువు అనబడడానికి ఇంకా రెండు నెలల సమయం పడుతుంది. తలుపు 'టకటక' చప్పుడయింది. ఆలోచనలు చెదిరిపోయాయి. కళ్యాణ్‌రామన్ వచ్చారా? ఈ సమయంలో ఎందుకు వస్తారు. అనుకుంటూ తలుపు తెరిచా. ఎదురుగా రాజేంద్ర.

●●●

''మీరెలా వచ్చారు?'' అని అడిగా ఆశ్చర్యంగా.

రాజేంద్ర జవాబు చెప్పలేదు. నవ్వుతూ నిలబడ్డాడు గుమ్మం దగ్గరే.

''రండి లోపలికి'' అన్నా. లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుని ''నీ ఆరోగ్యం ఎలా ఉంది?'' అని అడిగాడు.

మౌనంగా వెళ్ళి టేపురికార్డరు ఆఫ్ చేసి వచ్చి మంచం మీద కూర్చున్నా. నన్ను పరీక్షగా చూస్తున్నాడు. నా మొహంలో నిగారింపు, కళ్ళల్లో నీరసం భారంగానే పడుతున్న ఇబ్బంది, నన్ను దగ్గరగా తీసుకుని లాలించాలని, నాతో ఎన్నో కబుర్లు చెప్పాలని అనిపించిందా అన్నట్టు తమకంగా ఉన్నాయతని చూపులు.

కానీ ప్రతి దానికి నా ఇష్టం, నా అనుమతి అవసరం అనుకుంటాడు. అందుకే కుర్చీలో మౌనంగా ఎవరో కట్టేసినట్టు కూర్చున్నాడు. అది ఓ రకంగా నా 'ఐ'ని గుర్తించడమే. నాకు అవసరం అనిపించదు.

''ఎలా వచ్చారో చెప్పలేదు.'' అన్న.

''డా.స్నేహలత ఉత్తరం రాసారు. నీ ఆరోగ్యం గురించి, నిన్ను చూడాలని అనిపించి వచ్చేసా''

''స్నేహలతని కలిసారా?''

"ఆ! ఆమే చెప్పింది ఈ ఇంటి ఎడ్రసు, నేను రావడం నీకేమైనా ఇబ్బందిగా ఉందా?" అనిఅడిగాడు రాజేంద్ర.

పొడినవ్వు ఒకటి నవ్వా.

"ఎక్కడ ఉంటున్నారు? "

"హోటల్లో. ఇక్కడ ఎంత బావుందో, నేను నీతోపాటు ఈ గదిలో ఉంటే, ఏమైనా అభ్యంతరమా!"

"ఎవరికి నాకా? ఇల్లు గలవాళ్ళకా?"

"ఇద్దరికీ" అన్నాడు నవ్వుతూ.

రెండు నిముషాలు ఆలోచించా. తర్వాత మంచం మీంచి లేచి, కళ్యాణరామన్ దగ్గరకి వెళ్ళా. వెనక్కి వచ్చి "అభ్యంతరం లేదు, రా ఎప్పుడు వస్తావు? " అన్నా.

"రేపు వస్తాను" అన్నాడు రాజేంద్ర. ఆ తర్వాత ఇద్దరి మధ్యా మాటలు కరువైయ్యాయి.

●●●

రాజేంద్ర వచ్చి నాతో ఉన్న పదిహేనురోజులూ పదిహేను నిముషాల్లా గడిచిపోయాయి.

ప్రతి నిముషం సర్వీసు చేసాడు మాటల్లో కాక చేతలతో లాలించాడు. నన్ను ఏ పనీ చేసుకోనిచ్చేవాడు కాదు. మార్నింగ్ వాక్‌లో బాడీగార్డులా నడిచేవాడు. ఇద్దరం మౌనం తెగ్గొట్టుకుని ప్రకృతి ఒడిలో కబుర్లు చెప్పుకునేవారం. ఏవేవో కాలేజీ కబుర్లు, సముద్రపు ఒడ్డు సంగతులు, ఇంక అనేకమైనవి. కానీ ప్రస్తుత పరిస్థితి గురించిగానీ నే తీసుకున్న నిర్ణయం గురించిగాని, సంభాషణల్లో రాకుండా చాలా జాగ్రత్త తీసుకునేవాడు రాజేంద్ర. మార్నింగ్ వాక్ నుండి రూముకి వచ్చిన తర్వాత, నే స్నానం చేసి వచ్చేసరికి పక్క వేసి సిద్ధం చేసేవాడు. మంచం మీద కూర్చున్నాక, టిఫిన్ ఇచ్చి, కాఫీ ఇచ్చేవాడు.

ముఖేష్ కేసెట్ పెట్టేవాడు. నే స్థిమిత పడ్డాక, తను స్నానానికి వెళ్ళేవాడు. అతను స్నానం చేసి వచ్చేసరికి నిద్రపోయేదాన్ని. టేపు రికార్డరు కట్టేసి, ప్లేట్లు కప్పులు తీసేసి, నే నిద్రలేచేవరకూ ఎదురుచూసేవాడు. నే నిద్రలేచాక కాసేపు పుస్తకం చదువుకునేదాన్ని. మధ్యాహ్నం ఇద్దరం కలిసి భోజనం పూర్తిచేసేవాళ్ళం. నాకన్నా ముందుగా భోజనం పూర్తిచేసి, నా భోజనం పూర్తయేవరకూ ఆగి, భోజనసామాగ్రి అంతా సర్దేసేవాడు. మళ్ళీ నే రెండు గంటల వరకూ నిద్రపోయేదాన్ని.

రాజేంద్ర "ఇది చెయ్యనా? అదికావాలా?" అని ఎప్పుడూ అడగలేదు. తను చేసిన సర్వీస్ నాకు నచ్చలేదని నా మొహం మీద కనిపించే ప్రతి చిన్న విరుపు కూడా పసిగట్టి, దానికి తగ్గట్టు మసలుకునేవాడు.

అడ్డు చెప్పలేక పోయేదాన్ని. సహజంగా చేసుకుపోయేవాడు. ఈ సర్వీస్‌ని కోరుకునే ఆడపిల్లలు పుట్టింటికి చేరుకుంటారేమో, తమ మాతృత్వభారాన్ని మనసికంగా తల్లి చేతుల్లో పెట్టడం ద్వారా, ఊరట లభిస్తుందేమో? కడుపుతో ఉన్న ఆడపిల్ల అవసరాలు తల్లికి తప్ప మరెవరికి తెలుస్తాయి. సంప్రదాయం అంతా ట్రాష్ కాదేమో! అనే ఆలోచనల్లోకి జరుకునేదాన్ని.

ఆ రోజు నిద్రపోతున్నా. నా బట్టల్ని తీసి లాండ్రీకి వేస్తున్న రాజేంద్ర లంగా మీదున్న రక్తపు మరకలు చూసాడు. ఈ విషయం నాకు ఏమీ తెలీదని నిర్ధారణ చేసుకున్నాడు. బట్టలు లాండ్రీకి వేసి, తలుపు దగ్గరగా వేసి రోడ్డు మీదకి వెళ్ళి డా.స్నేహలతకి ఫోను చేశాడు.

●●●

నన్ను పూర్తిగా పరీక్ష చేసి "నువ్వు ఎడ్మిట్ అయితే మంచిది జాహ్నవీ" అంది స్నేహలత.

అవుననలేదు కాదనలేదు. స్నేహలత నా అనుమానం గుర్తించి, "ఇందులో భయపడవలసింది ఏంలేదు. అప్పుడప్పుడూ అలా జరగవచ్చు. కానీ బేబి ఇంకా అండర్ గ్రోత్ లోనే ఉంది నువ్వు చాలా నీరసంగా ఉన్నావు. అక్కడ ఒంటరిగా ఉండడం, మంచిదికాదు, నర్సింగ్ హోమ్‌కి షిఫ్ట్ అయిపో" అంది.

"అలాగే" అని ఒప్పుకున్నా.

ఆ సాయంకాలం కళ్యాణ్ రామన్‌కు చెప్పి ఆయనకు చెల్లించవలసిన సొమ్ము చెల్లించి సామాన్లతో సహ నర్సింగ్ హోమ్‌లో రూములోకి మారిపోయా. నా దగ్గర ఉన్న డబ్బంతా స్నేహలత దగ్గర దాచి, ఏ విషయంలోనూ, వెనుదీయవద్దనీ, ఆరోగ్యం ముఖ్యం అని మరీమరీ చెప్పాడు రాజేంద్ర.

నాకు వీడ్కోలు చెపుతూ తను మళ్ళీ వస్తానని, ఉత్తరాలు రాస్తుండమని చెప్పి వెళ్ళిపోయాడు రాజేంద్ర. నా దిగులు పసిగట్టగల సమర్ధుడు రాజేంద్ర.

కళ్యాణరామన్ ఇంటికి, హాస్పటల్ గదికి చాలా తేడా ఉంది. ఈ గదిలో ఈ తెల్లగోడల మధ్య, సురక్షిత భావం ఉంది.

నా గదికి ఆనుకుని, చిన్న బాల్కనీ ఉంది అక్కడ రెండు కుర్చీలు ఉన్నాయి. ఆ కుర్చీలో కూర్చుంటే, ఆ కొండలోయల్లో, పెద్ద చెరువు, చెరువులో బాతుల్లా అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్న పెడల్ బోట్లు కనిపిస్తున్నాయి.

గది రెండో అంతస్థులో చల్లగా ఉంది. తెల్లవారు ఝామున మరీ చల్లగా అయిపోతోంది. తెల్లవారిన తర్వాత బాల్కనీ తలుపులు తీస్తే ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్టుగా అనిపించింది. నిన్న సాయంకాలం చూసిన చెరువులేదు, పెడల్ బోట్లు లేవు, కొండలోయలు లేవు. చిన్న శిఖరాలు బైటకి కనిపిస్తున్నాయి. పొగమంచుని కప్పుకున్న ప్రకృతి, తెల్ల ఫుల్‌వాయిల్ చీరకట్టుకున్నట్టుగా ఉంది. సూర్యోదయం అవుతున్నకొద్దీ పొగమంచు విరిగి, గాలికి ఎగిరి, పాలమీద నురగలాగ, సందేశం మోసుకెళుతున్న మేఘాల్లాగ, ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.

తీరిక సమయాల్లో స్నేహలతతో బాతాఖానీ. ఆ బాతాఖానీలో భాగంగానే రాజేంద్ర వచ్చినాడు జరిగిన సంభాషణ చెప్పింది.

"జాహ్నవి పడుతున్న మానసిక వేదన నేను గ్రహించాను. అది చాలా సహజం ఆమెలో విపరీతమైన ధైర్యం ఉంది. అందుకే జీవితం మలుపుల్ని సవాళ్ళు క్రింద తీసుకుంటోంది. ***జీవితం గొప్పది కాకపోవచ్చు. జీవితంలో తీసుకునే సవాళ్ళు గొప్పవి కావాలి.***

జాహ్నవి అధైర్యపడుతోందని చెప్పలేను కానీ ఇలాంటి సమయంలో నేను చెప్పే ధైర్యం నేను చేసే సహాయం జాహ్నవి ఒక డాక్టరు సహాయంగానే తీసుకుంటుంది అందుకే మిమ్మల్ని పిలిపించాను." అన్నా.

రాజేంద్ర నే చెప్పింది విన్నాడు. చివరికి "జరిగిన దాని గురించి జాహ్నవి పశ్చాత్తాప పడుతోందేమో?" అన్నాడు.

"అదీ ఆలోచించవలసిన విషయమే జాహ్నవి జరిగిపోయిన దానికి పశ్చాత్తాప పడితే, అది ఆమె ఆరోగ్యానికే ప్రమాదం మీరు ఆమెని పెళ్ళిచేసుకోలేరా?" అని అడిగా.

అకస్మాత్తుగా నే అడిగిన ప్రశ్నకి రాజేంద్ర అవాక్కయిపోయాడు.

సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ, "నాకు పెళ్ళయింది. ఆ విషయం జాహ్నవికి తెలుసు. చెడిపోయింది. ఈ విషయం జాహ్నవికి తెలీదు. ఏడాదిగా సంధ్య నాతో ఉండటంలేదు. వాళ్ళ అన్నయ్య దగ్గర నార్త్‌లో ఉంటోంది. జాహ్నవిని పెళ్ళి చేసుకోడానికి నాకు అభ్యంతరం ఏంలేదు. కానీ ప్రపోజల్ జాహ్నవి చెయ్యాలి. నేనుగానీ, మీరుగానీ చెయ్యకూడదు. అది ఆమెని, ఆమె వ్యక్తిత్వాన్ని కించపరిచినట్టు" అన్నాడు.

అతని సమాధానం నాకు సరి అయినదే అనిపించింది. "ఈ సమయంలో మీరు జాహ్నవి దగ్గర ఉంటే, ఆమెకి ఊరట ఉంటుందని మిమ్మల్ని పిలిపించాను. మీకు ఇష్టమేనా" అని అడిగా.

"నాకేం అభ్యంతరం లేదు ఇంతకీ జాహ్నవి ఎక్కడుంది?"

"నే ఎడ్రసు చెప్పా. రాజేంద్ర నీ దగ్గరకి వచ్చాడు" - అంటూ స్నేహలత చెప్పిన సమాచారం వెనక తనకి ఏదైనా ఆటో సజషన్ ఉందా? ఈ సంబంధాన్ని లీగల్ కానీ, సమాజ సమ్మతంకానీ చెయ్యాలా? అన్న ఆలోచనలో కూరుకుపోయా.

●●●

నర్సింగ్ హోమ్‌లో జాయిన్ అయినతరువాత స్నేహలతతో స్నేహం పెరుగుతున్నకొద్దీ నాలో ఆరోగ్యం పెరిగింది. స్నేహలతని నువ్వు అని సంభోదించే చనువు ఏర్పడింది.

"నేను మొదటిసారి నీ దగ్గరకి వచ్చినప్పుడు, అంత నిరసన ఎందుకు చూపావు?" అని అడిగా.

ఆ ప్రశ్నకి స్నేహలత చాలాసేపు మౌనంగా ఉండి "నువ్వు కళ్యాణరామన్ గారి ఇంట్లో ఉండటమే కారణం" అంది మెల్లగా.

"దానికీ దీనికీ సంబంధం ఏమీటి?" అన్నా ఆశ్చర్యంగా.

"కళ్యాణరామన్ ఇంట్లో దిగిన ప్రతి టెనెంటూ ఆ ఇంట్లో కుష్టురోగి ఉంది అని తెలిసి దెబ్బలాట పెట్టుకుని వెళ్ళిపోయేవారు. వాళ్ళందరూ మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని అనిపించేది. అందుకే నీకావిషయం తెలిస్తే నువ్వూ అలాగే ప్రవర్తిస్తావని తోచి, నీతో డాక్టరు దగ్గరకి రానన్నాను."

"మరి రెండోసారి నేను వచ్చినప్పుడు నీ ప్రవర్తన మారడానికి కారణం"

"నువ్వు మొదటిసారి వచ్చినప్పటికే, నీకు ఆ విషయం తెలుసునని తెలిసింది. ఆ తర్వాత నీకు కళ్యాణరామన్ గారికి మధ్య జరిగిన సంభాషణ తెలిసింది" అంది స్నేహలత.

"ఎవరు చెప్పారు? కళ్యాణరామనా" అన్నా.

స్నేహలత ఆమె గొంతు బొంగురుపోయింది. గాద్గదిగంగా "అవును తాతే చెప్పారు." అంది.

"తాతా! కళ్యాణరామన్ నీకు తాత అవుతారా?" అంటూ ఆశ్చర్యపోయా.

కానీ స్నేహలత మౌనంగా ఉండిపోయింది.

"మీరు తమిళులా? మరి నీ తెలుగు అంత స్పష్టంగా ఉంది?"

"అప్ప నర్సాపురం, ఓ.న్.జి.సి ప్రోజెక్ట్‌లో ఇంజనీరు. నా స్కూలింగ్, అంతా భీమవరంలో జరిగింది. మెడిసెన్ కాకినాడలో ఎమ్.డి విశాఖపట్నంలో చదివాను. ఇక్కడికి వచ్చి రెండేళ్ళే అయింది."

"మరి మీ తాతగారి దగ్గర ఉండచ్చుకదా!"

"పాటి ఒప్పుకోదు. ఎవరూ రావడానికే ఒప్పుకోదు. ఆమె అనుమతి లేకుండా తాత ఏ పనీ చేయరు"

నే మౌనంగా ఉండిపోయా.

కానీ స్నేహలత మౌనంగా ఉండలేకపోయింది.

"తాత పదిహేనేళ్ళ క్రితమే రిటైర్ అయ్యారు. తన దగ్గర ఉన్న డబ్బు, పాత ఆస్తులు అమ్మి చేసి మద్రాసులో నాలుగు బెడ్ రూముల ప్లాటు కొన్నారు. ప్రతీ దీపావళి పండక్కి అందరం అక్కడ చేరే వాళ్ళం. పాటి ఎంత ఆనందపడేదో, ఎంత ఉత్సాహంగా ఉండేదో మమ్మల్నందర్నీ తీసుకెళ్ళి "నల్లీ" "కుమరన్ సిల్క్ హౌస్" ఇవన్నీ తిప్పుతూ వెతికి వెతికి బట్టలు కొనేది. ఏవేవో పిండి వంటలు చేసేది. మధ్యాహ్నం అందరూ విశ్రాంతి తీసుకుంటుంటే, అమ్మ నేను, పిన్ని, తమ్ముడు పాటి అందరం కూర్చుని 'పచ్చీస్ పాళి' 'పరమపద సోపానపటము' ఆడుకునేవాళ్ళం.

అందరికన్నా ముందుగా పాటి పరమపదము చేరుకునేది, ఏడాదల్లా చదువులతోనూ పనులతో అలసిపోయిన మేము దీపావళి శలవలు ఐదురోజులూ, పాటి గురించి, ఆమె చేసే పిండివంటల గురించి, ఆమెతో గడిపే మధుర క్షణాలు గురించి కలలు కనేవాళ్ళం

అలా చాలా ఏళ్ళు గడిచాయి. మూడేళ్ళ క్రితం అనుకుంటా, నేను మెడిసిన్ పూర్తిచేసా. ఆ దీపావళికి పాటీ ఇంటి దగ్గర మరోసారి రంగులకల మొదలై ఆనందంగా, ఉత్సాహంగా సాగిపోతోంది. పాటి, తమ్ముడు, అమ్మ, పిన్నమ్మ, తంబి, అందరూ పచ్చీసు పాళి ఆడుతున్నారు. నేను నిద్రలేచి బద్ధకంగా వచ్చి పాటి పక్కన కూర్చున్నాను.

"ఏమే డాక్టరువైతే పచ్చీసుపాళి ఆడకూడదా? " అంది పిన్ని. నేను నవ్వేసాను. నన్ను చూసి నవ్వుతూ పాటి కాళ్ళు జూపింది. నేను కూడా బద్ధకం తీరక పాటి కాళ్ళమీద తల పెట్టుకు పడుకున్నాను. తనవంతు గవ్వలు విసిరి, దాని ప్రకారం నప్పడం అయిపోయాక, నా తల నిమురుతోంది.

"అలా తలనిమరకండి అత్తయ్యా(అత్తే) అది ఈమధ్య ఎక్కడపడితే అక్కడ నిద్రపోతోంది" అంది అమ్మ.

అలా తల నిమురుతున్న పాటి చేతిగాజులకి ఉన్న పిన్నులు, నన్ను ఆకర్షించాయి. అందులో చిన్న పిన్ను తీసాను. అది ఇత్తడి పిన్ను బలే అందంగా ఉంది. నేను పిన్ను తీసుకున్న తర్వాత పాటి నా తల నిమరడం మానేసింది. ఎవరూ ఎవర్నీ గమనించడంలేదు. అందరూ పచ్చీసుపాళీలో మునిగిపోయరు. ఆట ఆఖరి స్టేజిలో సీరియస్‌గా ఉంది పాటి తల నిమరడం లేదన్న కోపంతో పాటి కాలిమీద పిన్నుతో గుచ్చాను. పాటి అసంకల్పితంగా కాలు వెనక్కి తీసుకుంటే, కోప్పడితే, చూద్దామని అనుకున్నాను. కానీ పాటి అసంకల్పితంగా కాలు వెనక్కి తీసుకోలేదు. బాధగా మొహమూ పెట్టలేదు. నేను పొరపాటుగా ఎవరి పాదమేనా గుచ్చేనా అని, చూసాను. కాదు అది పాటి కాలే, పాదం మీద తెల్లటి మచ్చని అప్పుడు అబ్జర్వ్ చేసాను. మళ్ళీ పిన్ను మొనతో గట్టిగా గుచ్చాను. పాటిలో ఏవిధమైనా మార్పులేదు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అప్పుడే అప్ప, నిద్రలేచి బైటికి వచ్చారు.

"అమ్మా అది పిన్నుతో నీకాలు పొడుస్తోందే!" అన్నారు పాటితో.

"మెడిసిన్ చదవనీ ఏమి చదవనీ దానికి చిన్నపిల్ల చేష్టలు ఇంకా పోలేదు" అంది అమ్మ

'పాటి' మాత్రం సీరియస్‌గా పచ్చీసుపాళీ ఆడుతోంది. నేను కాసేపు ఊరుకుని మళ్ళీ పాటి కాలుని, పిన్నుతో పొడిచాను. 'పాటి'లో ఏవిధమైన మార్పులేదు. ఈసారి మచ్చకి పక్కగా కాలుమీద పిన్నుతో గుచ్చాను. పాటి 'ఏం చేస్తున్నావే' అంటూ కాలు వెనక్కి తీసుకుంది.

పాటి కాళ్ళ దగ్గర్నించి లేచి మొహం కడుక్కున్నాను. ఏం చెయ్యాలి? ఏమిటా మచ్చ దాని విషయం ఎవరితో మాట్లాడాలి అన్న ఆలోచనలతో చాలాసేపు గడిపాను. తర్వాత అప్పని, తీసుకుని తాతగదిలోకి వెళ్ళాను. తాతతో 'పాటి'ని డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళమని చెప్పాను. ఇద్దరూ నన్ను అంత సీరియస్‌గా తీసుకోలేదు. మచ్చ గురించి చెప్పి డెర్మటాలజిస్ట్ దగ్గరకి తీసుకెళ్ళమని చెప్పాను. 'ఒరేయ్ నువ్వు తీసుకెళ్ళరా' అన్నాడు తాత, అప్పని చూస్తూ 'అలాకాదు నువ్వే తీసుకెళ్ళు' అని తాతని బలవంతం చేసాను.

దీపావళి వెళ్ళిన మర్నాడు 'పాటి' డాక్టరు దగ్గరికి వెళ్ళింది. ఆ రోజుకాక మర్నాటికి డాక్టరు రిపోర్టు చేతికి వచ్చింది. డాక్టరు దాన్ని 'కన్‌ఫర్మ్‌డ్ హేన్‌సెన్స్ బాసిల్యూస్' అని డైయాగ్నైజు చేసాడు. డాక్టరు పెట్టిన పేర్లూ కనుగొన్న మందులూ, పెరిగిన జ్ఞానం, సామాన్య మానవుడికి ఎందుకూ పనికిరావని ఆ క్షణాన నాకు అర్థం అయింది.

నేను దాన్ని, "మైక్రోబాక్టీరియాయ్ లెప్రే" అన్నా అది డాక్టర్ల ప్రపంచం వరకే పరిమితం 'పాటికి' ఇవేమీ తెలియక పోవచ్చు కానీ, అకస్మాత్తుగా మందుల వర్షం, జాగ్రత్తలు, ఆవిడకి అనుమానం కలిగించాయి. ఏదో అనుమానం వచ్చి పిన్నుపెట్టి పొడుచుకు చూసుకుంది.

●●●

ఆ రోజు రాత్రి ఎవరో ఏడుస్తున్న అలికిడికి అందరికీ తెలివి వచ్చింది. 'పాటి' గదిలోంచి ఏడుపు వినిపిస్తోంది. అప్ప, చిన్నాన్న, అమ్మ, పిన్ని, తమ్ముడు అందరం ఆ గదిలో చేరేం 'పాటి' ఏడుస్తోంది. హృదయవిదారకంగా ఏడుస్తోంది బాధ పడుతోంది. తాత

దూరంగా కిటికీ దగ్గర నిలబడి కళ్ళనీళ్ళు పెడుతున్నారు. ఆయనా బాధపడుతున్నారు 'పాటి' ఆయన్ని అడిగి తెలుసుకుంది. అది నిశ్చయంగా 'కుష్టే'అని నిర్ధారణ చేసుకుంది.

'పాటి' మా మొహాలు కూడా చూడలేదు. కానీ మా అడుగుల సవ్వడికి, ఆమె ఏడుపు ఎక్కువైంది. కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. ఎవ్వరూ ఆమెని ఓదార్చే ప్రయత్నం చేయలేదు.

మేము కూడా ఏడుస్తున్నాం అని అర్థం అయింది. 'పాటి' తన గదిలోంచి బైటకి రాలేదు. రాత్రల్లా ఏడుస్తూనే ఉంది.

తాత మా అందర్నీ వెళ్ళిపొమ్మన్నట్టు అనుమతి ఇచ్చేసాడు. ఆ దీపావళికి 'పాటి' వీడ్కోలు లేదు, సరదాలేదు, పిండివంటలు, ఆవకాయల పేకింగ్ లేదు. అందరం భారంగా మద్రాసు వదిలి, ఎవరి స్థానాలకి వాళ్ళం చేరుకున్నాము.

ఆ తర్వాత 'పాటి' సంగతులు అప్పద్వారా తెలిసేవి. అప్పుడప్పుడు అప్ప మద్రాసు వెళ్ళివచ్చేవారు.

"అప్పా 'పాటి'కి తగ్గిందా? ఎలా ఉంది" అని అడిగితే.

"జబ్బు సంగతి వదిలెయ్ స్నేహ. తనేదో పాపం చేసాను. అందుకే ఈ జబ్బు తనకి వచ్చింది అంటుంది. మనం ఎన్ని చెప్పినా వినడంలేదు. తనకే ఎందుకు రావాలి? అనే అమ్మ ప్రశ్నకి జవాబు కనబడటంలేదు. అప్పుడే పక్కవాళ్ళు, అమ్మ జబ్బు గురించి చెప్పుకుంటున్నారు. కొందరు బంధువులకి కూడా తెలిసింది. అనేకమైన పుకార్లు, అనేకమైన తప్పుడు సమాచారాలు, ప్రచారం అయే అవకాశం ఉంది. పిల్లలకి పెళ్ళిళ్ళు కావు అంటుంది. బాధపడుతోంది."

అని ఒకసారి 'ఇంటిపని కూడా మానేసిందని, తాతే మొత్తం పనంతా చేసుకుంటున్నారని 'పాటికి' కూడా తాతే సేవ చేస్తున్నారని, నాన్న తెచ్చే సమాచారం వినడం తప్ప ఏం చెయ్యలేక పోయాం. ఒకసారి అప్పని రమ్మని తాత టెలిగ్రామ్ ఇస్తే అప్పవెళ్ళారు.

అప్పుడు తాత మద్రాసులో ఇల్లు అమ్మేసారు. ఊటీ వచ్చి దూరంగా ఈ చిన్న ఇల్లు కొన్నారు. దాన్ని తనకి అనుగుణంగా కట్టించుకున్నారు. మేం ఎవరేనా వస్తే ప్రత్యేకంగా ఉండడానికి ఒక ప్రత్యేకమైన గది కట్టించారు. ఇంతకు ముందులా అందరూ ఒకేసారి రావడానికి 'పాటి'ని చూడటానికి 'పాటి' ఒప్పుకోడంలేదు. అదీకాక తాత అందరికీ చేసిపెట్టడం, ఆయనకే కష్టం కదా ఇక్కడికి వచ్చింతర్వాత 'పాటి' బైటకి రావడం మానేసింది. పనుల్లో కలుగచేసుకోడం కూడా మానేసింది. తాతే అన్నీ చేస్తారు. 'తాతా ఎవర్నేనా వంటమనిషిని పెట్టుకోకూడదా అంటే 'ఇన్నాళ్ళూ అది నాకు చేసింది, నేదానికి ఈ మాత్రం చేయలేనా' అంటారు" కానీ ఇంటిలో పని చేసే వంటవాళ్ళు, పాటిని చూసే ప్రత్యేకమైన చూపు వాళ్ళకళ్ళలో ఏహ్యాభావం, తాత సహించలేకపోయారు అనుకుంటా.

ఊటీలో కొన్నాళ్ళు ఉన్న తర్వాత, మా కోసం కట్టించిన గది ఏడాదల్లా ఖాళీగా, పడి ఉండడం నచ్చక, అప్ప చెప్పిన ప్రకారం, హాలిడే రిసార్ట్‌గా మార్చారు. ఆ గది శుభ్రం చేయడానికి, ఒక సర్వెంటుని పెట్టారు. కానీ ఆ గదిలో దిగే, టూరిస్ట్‌లకి రెండు మూడురోజుల తర్వాత 'పాటి' సంగతి తెలిసేది. కొందరు దెబ్బలాట పెట్టుకుని, కొందరు తాతని, మోసం చేసావని, ఖాళీ చేసి వెళ్ళిపోయారు. దానికి కారణం తాత దగ్గర పనిచేసే సర్వెంట్స్.

తర్వాత సర్వెంట్స్‌ని తప్పించేసి, అన్ని పనులూ తనే చేసుకోడం, మొదలుపెట్టాడు తాత. వండడం, ఇంటిని శుభ్రం చేయడం, అన్నీ ఆఖరికి హాలిడే రిసార్టు గదిలో లెట్రిన్‌ని కూడా తాతే శుభ్రం చేస్తాడు" అంది స్నేహలత.

ఆఖరి మాట చెపుతున్నప్పుడు ఆమె గొంతు జీరపోయింది.

"పాపం నైతిక భీతివల్ల 'పాటి' ఇలా అయిపోయిందిగాని, ఆ జబ్బు అన్నింటిలాగే మాములిదే అది చెప్పి 'పాటి'ని ఒప్పించడం ఈ జన్మలో కుదరని పని" అంది స్నేహలత చివరిగా.

నా కళ్ళలో తిరిగిన కన్నీటిని గమనించి, మౌనంగా కూర్చుంది. కాస్సేపటికి తేరుకున్న నేను 'పాటి' చూడాలని ఉంది అన్నా. 'పాటి'కి ఫోను చేసి అడుగుతాను. - అంది స్నేహలత.

●●●

ఒక ఆదివారం 'పద జాహ్నవి, 'పాటి'ని చూసి వద్దాం' అంది స్నేహలత. ఇద్దరం ఆటోలో కళ్యాణరామన్ ఇంటికి వెళ్ళాం. మేం వెళ్ళేసరికి ఆయన బయట వరండాలో కూర్చుని చదువుకుంటున్నారు. ఆయన్ని చూసి నమస్కారం చేసా. ఇద్దరం గదిలోకి వెళ్ళి మాతో తీసుకొచ్చిన పళ్ళబుట్టని టేబులు మీద పెట్టాం.

స్నేహలత కళ్యాణరామన్ కొంచెం సేపు తమిళంలో ఏదో మాట్లాడుకున్నారు తర్వాత ముగ్గురూ 'పాటి' తనకై తను విధించుకున్న వెలిప్రాంగణంలోకి అడుగుపెట్టారు.

'పాటి' ఉన్నగది, ఆ ఇంటికి రెండోవేపున ఉంది. గది చాలా పెద్దది. గదికి తెల్లని ప్లాష్టిక్ పెయింట్ వేసి ఉంది. గదికి ఆనుకుని బాత్రూము, లెట్రిను ఉన్నాయి. గదికి పక్కగా ఒక ప్రాంగణం ఉంది. దాని నిండా పూలమొక్కలు, రెండు మూడు నిలువులు పెరిగిన రబ్బరు మొక్కలు ఉన్నాయి. వాటి మధ్య రెండు కేన్ కుర్చీలున్నాయి. గదిలో అగరవత్తుల వాసన వస్తోంది. గదిలో ప్రవేశించగానే ఎదురుగా నిలువెత్తు మురుగన్ ఫోటో కనిపిస్తుంది. దాని టేబులు మీద పువ్వులు ఉన్నాయి.

వాటన్నింటికీ మూలగ ఒక ఎత్తైన టేబులు మీద, టు ఇన్ వన్ లోంచి మెల్లగా ఎం.ఎస్.సుబ్బలక్ష్మి పాట వినిపిస్తోంది.

"నానాటి బ్రతుకూ నాటకమూ కానక కన్నది కైవల్యమూ" అంటూ.

మంచం మీద మధ్యగా 'పాటి' కూర్చుని ఉంది. పాటికి అరవై అయిదు ఏళ్ళుపైగా ఉంటాయి. వంటిమీద నగలేవీ లేవు. పెద్దగళ్ళ చీరకట్టుకుంది. ఆ చీర మొత్తం శరీరాన్ని కప్పి ఉంది. పాటి కళ్ళు మూసుకుని పాట వింటోంది. మధ్యలో చిరునవ్వు నవ్వు కొంటోంది. పాటి నన్నుగాని స్నేహలతగాని గమనించలేదు. రమ్మనలేదు. కూర్చోమనలేదు. ఇద్దరం వెళ్ళి, మంచానికి దూరంగా ఉన్న కుర్చీల్లో కూర్చున్నాం. పాట అయిపోయాక పాటీ కళ్ళు తెరిచి, స్నేహలతని చూసి, నవ్వింది.

"నల్లఇరికియా?" అని అడిగింది. నా వేపు చూడనేలేదు.

స్నేహలత తల ఊపింది. మళ్ళీ టేపు రికార్డరులో "మనుజుడైపుట్టి... మనుజుని సేవించి అనుదినము దుఃఖమందనేల" అనే పాట మొదలైంది. పాటి కళ్ళు మూసేసింది.

ఇద్దరం కాసేపు కూర్చుని బైటకి వచ్చేసాం. వచ్చేస్తుంటే వెనక నుండి ఎమ్.ఎస్ "అందరిలో పుట్టి అందరిలో పెరిగి అందరి రూపములు అటుతానై" అంటూ హృదయం చీల్చుకు ఘోషిస్తోంది.

●●●

**పాటిని చూసి వచ్చిన దగ్గర్నించి,** పాటిలో లోపం ఏమిటి? ఆమె ఎందుకు ఈ శిక్ష విధించుకుంది. ఆమెను గౌరవించే కొడుకులు, ఆమెకు విలువనిచ్చి, వ్యక్తిగా ఆరాధించే భర్త ఇవన్నీ ఉండగా ఆమె తన్నుతాను వెలివేసుకుంది? తను ఎంతో పాపం చేసాను అనుకుందా? అన్న అనేకమైన ఆలోచనలు నాలో తలెత్తాయి.

పాటి గురించి విమర్శలతో స్నేహలత, నేను చాలా సాయంకాలాలు గడిపాం.

చాలా రోజుల తర్వాత, "పాటికి శత్రువులు, పాటీ ఇంట్లోనే ఉన్నారు." అంది స్నేహలత.

"ఎవరు?"

"అమ్మ, పిన్ని. మొదట్లో అప్పకి, చిన్నాన్నకి జడిసినా, మెల్లిగా అమ్మ, పిన్ని పాటీకి వ్యతిరేకంగా మసలసాగారు. పిన్నయితే, చిన్నాన్నకి చెప్పకుండా పుట్టింటికి వెళ్ళి 'లూప్' వేయించుకుంది. అది కొన్నాళ్ళకి చిన్నాన్నకి తెలిసింది. ఏం? అని అడిగాడు.

"ఐడు నాట్ వాంట్ టు బేర్ చైల్డ్ ఆఫ్ యువర్స్ (నేను నీకు పిల్లల్ని కనను)" అని చెప్పేసింది. పెద్ద ఘర్షణ జరిగింది. పిన్ని సంసారాన్ని వదిలేసి వేరే పోయి ఉద్యోగం చేసుకోడానికి కూడా సిద్ధమే కాని, చిన్నాన్నకి పిల్లల్ని కని ఇవ్వడానికి సిద్ధం కాదు.

లెప్రసీ హెరిడిటరీకాదు. అని ఎంతమంది డాక్టర్లు చెప్పినా, ఆమె నమ్మడానికి సిద్ధపడలేదు. పిన్ని చదువుకున్నదే, మరి ఆమె విశ్వాసాన్ని ఏమిటంటావ్? అంధ విశ్వాసం కాదా? అయితే తాను నమ్మినదాన్ని, తన విశ్వాసం కోసం పిన్ని అందర్నీ ఎదిరించలేదా? ఆమెకి ధైర్యం లేదా?" అంటూ ఏవేవో విషయాలు చెప్పింది స్నేహలత.

●●●

నేను హాస్పటలుకి వచ్చి మూడు నెలలు కావస్తోంది. కదలితే ఆయాసం వస్తోంది. కడుపు పెరుగుదల చాలా ఇబ్బందికరంగా ఉంది. మాతృత్వపు, అనుభూతికన్నా జాఢ్యం పట్టి పీడిస్తున్న, భావం ఎక్కువగా ఉంటోంది. దానికి స్నేహలత "తల్లి లాలన, పాలన పొందిన గర్భవతుల్లో గర్భధారణలో ఉన్న ఇబ్బందులు, గర్భదారణ భయాలు చాలా తక్కువగా ఉంటాయి అని మా డేటా రిపోర్ట్ వల్ల తెలుస్తోంది" అని చెప్పింది. నే చిన్నగా నవ్వి ఊరుకునేదాన్ని.

అయినా హాస్పిటల్లో, తీసుకునే కేర్ ప్రకారం స్నేహలత 'పోలియో వాక్సిన్' ఇచ్చింది. ఛాతీ,గుండె ఎక్స్‌రేస్ తీసింది. పెల్విస్ ఎక్స్‌రే కూడా తీసింది.. దాన్ని చూసాక, దాని విషయం డా.రాజరత్నంతో చర్చించింది. ఇద్దరూ చర్చించుకున్న తర్వాత "పోజిబుల్ ఓపెనింగ్ ఆఫ్ సెర్విక్స్ - నాలుగు అంగుళాలు" అని డేటా ఎంటరీ చేసింది. రిమార్కులో సిజేరియన్ అక్కర్లేదు అని రాసింది. కానీ మొత్తం డేటా ఎంట్రీలో ఆమెని కలవర పరుస్తున్న విషయం, బిడ్డ బరువు అనుకున్నంతగా పెరగలేదు అంది నాతో.

"బిడ్డ అండర్ గ్రోత్ వల్ల మొత్తం, డేటా బేస్డ్ భవిష్యవాణి తప్పు అవచ్చు. ఏ ఇతరమైన ఆలోచనలూ పెట్టుకోకు" అంటూ ధైర్యం చెప్పింది.

నేను నవ్వి 'నాకే ఇతర ఆలోచనలూ లేవు' అన్నా. కానీ ఆలోచనలని అడ్డుకట్ట వేయలేకపోతున్నా. నా రూము ఎదురుగా ఉన్న ఆమె నొప్పులు మొదలయ్యాక అరచిన అరుపులకి హాస్పటలు దద్దరిల్లిపోయింది. "పురిటిలో ఉన్నంత క్రౌర్యము, ఇంకే ప్రకృతి చర్యలలోనూ లేదు." అది నా విషయంలో జరుగుతుందని తెలిసిన దగ్గర నుండి మనసు చీకటి గుహల లోతుల్లోకి వెళ్ళిపోతోంది. ఇంత క్రౌర్యాన్ని భరించిన తర్వాత తనకు మిగిలే తృప్తి ఏమిటి? అనే ఆలోచనలతో సతమతమైపోతున్నా. సిజేరియన్ గురించి విన్న రోజు రాత్రి, భయంకరమైన కల వచ్చింది. భీకరమైన నరసింహావతార మూర్తి గోళ్ళతో పొట్ట చించి, ప్రహ్లాదుడ్ని బయటికి తీసినట్టు కల మేల్కొని చూసుకుంటే, జాకెట్టు తడిసిపోయి ఉంది. గదిలో ఫేను తిరుగుతున్నా చెమటపట్టేసింది.

పిరుదల క్రింద బాగా తడిగా అనిపించి, చెయ్యిపెట్టి చూసా, నిద్రలో భయంకొద్దీ 'యూరిన్ పాస్' చేసానా అనుకున్నా.

అప్పటికి కడుపులో కదలిక తెలిసింది. ఆ కదలిక నొప్పి, అనే అనుమానం వచ్చి పక్కకి తిరిగి, ఎమర్జెన్సీ స్విచ్ నొక్కా. లైటు వేసా. ఎమర్జెన్సీ బెల్లు మ్రోగిన రెండు నిముషాలకి నర్సు పరిగెత్తుకు వచ్చి పరీక్ష చేసి, క్రిందకి వెళ్ళి స్నేహలతకి ఫోను చేసి విషయం చెప్పింది. స్నేహలత వచ్చేలోగా, మళ్ళీ రెండు సార్లు నొప్పి వచ్చింది. ఈసారి నొప్పులు వెనుక వీపు దగ్గర్నించి మొదలై కడుపులోకి వచ్చాయి.

స్నేహలత వచ్చి, పరీక్ష చేసి నర్సుని పిలిచి ప్యూబిక్ హైర్ షేవ్ చెయ్యమని చెప్పి, ఇంకో నర్సుని పిలిచి ఎనీమా ఇవ్వమని చెప్పింది. తన గదిలోకి వెళ్ళి ఒక డేటా షీటు తీసుకుని, జాహ్నవి దగ్గరకి వచ్చి, మొత్తం శరీరాన్ని చెక్ చెయ్యడం మొదలు పెట్టింది. స్నేహలత నార్మల్ చెక్ అప్ పూర్తయి డేటా షీటు మీద ఎక్కించే సరికి, నర్సులిద్దరూ తమపని చేసారు.

పూర్తయిందా అని అడిగింది. ఇద్దరూ 'ఎస్' అని తప్పుకున్నాక, రెక్టల్లీ చెక్ అప్ చేసింది. అప్పటికి పురుడు పోసే మిడ్ వైఫ్ వచ్చి తనుకూడా రెక్టల్లీ చెక్ అప్ చేసింది.

"డ్రై లేబర్" అంది మిడ్ వైఫ్ స్నేహలత వేపు చూస్తూ.

అప్పటికి పురిటి నొప్పులకి, తట్టుకోలేక, పెద్దగా మూలిగా. నొప్పులు మొదట్లో అరగంట, పావుగంటకి రావడంలేదు. ప్రతి అయిదునిముషాలకి, వస్తున్నాయి. ఎంత కంట్రోలు చేసుకుందామనుకున్నా 'అమ్మా' అని అరవక తప్పని పరిస్థితి వస్తోంది. లోపలి బిడ్డ తన క్రూరత్వాన్ని, చూపిస్తూ సెర్విక్స్ తెరవడానికి ప్రయత్నిస్తున్నాడు. ***పుట్టుకలో ఎంత హింస ఉందో జీవితమంతా అంత హింస ఉంటుంది.***

ఆ సమయంలో స్నేహలత పరిగెత్తుకుంటూ, తన గదికి వెళ్ళి డా.రాజరత్నంకి ఫోను చేసి, పరిస్థితి చెప్పింది. డా.రాజరత్నం "కంగారు లేదు. నేను వస్తాను" అంది.

మిడ్ వైఫ్ టైము చూసుకుంది. ఉదయం ఆరుగంటలయింది. బయట తెలతెలవారుతోంది. స్నేహలత నా రూముకి వచ్చేసరికి, నాలో భయం భరించలేని అపనమ్మకం. ఈ హింసకి తట్టుకోగలనా? అనే అధైర్యం.

నేను అరుస్తూ, "వాట్ ఫర్ యూ ఆర్ వెయిటింగ్" అంటూ అరిచా. ఈ డాక్టర్లు నర్సులు అందరూ ఏం జరిగితే అది జరగనీ, అని తనని మృత్యుముఖంలో వదిలేసారేమో, అనే ఆలోచన. "ఏదో ఒకటి చెయ్యండి" అన్నా. అది మూలుగ్గా బైటకి వచ్చింది. స్నేహలత నా దగ్గరగా వచ్చి, నా చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కి, పక్కనే ఉన్న టవల్ తీసుకుని, నా నోటి నుండి వచ్చిన, చొంగని, ముక్కుని తుడిచింది. తర్వాత మొత్తం మొహం అంతా తుడిచింది.

స్నేహలత చేతుల్ని గట్టిగా పట్టుకుని, అరవకుండా బాధని కంట్రోలు చేసుకోడానికి ప్రయత్నిస్తున్నా. కానీ నాకు తెలియకుండానే అప్పుడప్పుడు మూలుగులు నా నోటమ్మట వినిపిస్తున్నాయి.

మిడ్ వైఫ్, పక్క నర్సుకి సైగ చేసింది. బయట సిద్ధంగా ఉన్న చక్రాల టేబుల్ని లోపలికి తీసుకొచ్చారు. అందరూ సాయం చేసి నన్ను వీల్ టేబులు మీదకి మార్చారు. కాళ్ళు రెండూ ఎత్తుగా ఉన్న లెగ్ రెస్ట్ మీద పెట్టి, నా మీద తెల్లటి బట్ట కప్పారు. సరిగ్గా అదే సమయానికి డా.రాజరత్నం డెలివరీ గదిలోకి వచ్చింది. డా.రాజరత్నం వచ్చీ రావడంతోనే సెర్విక్స్ ఓపెనింగ్ చూసింది. అప్పటికి సెర్విక్స్ మూడున్నర అంగుళాలు తెరుచుకుంది. కానీ ఎక్కడో ఏదో మిస్సింగ్ అనిపించి "నొప్పిని భరించడానికి ప్రయత్నించకు. కమ్ ఆన్ జాహ్నవీ స్క్రీమ్ ఇట్ అవుట్" అంది నా వేపు చూసి, పళ్ళ మధ్య ఇరుక్కున్న పెదవి విడి నోరు తెరిచింది. హింస భరించలేక 'అమ్మా' అన్న అరుపు వచ్చింది.

"నో.. స్టిల్ లౌడర్" అంది రాజరత్నం.

నే సర్వం మరచి బాధని, క్రూరత్వాన్ని భరించలేక పెద్దగా కేకలు వేయడం మొదలు పెట్టా.

నే పెట్టిన మూడో కేకకి సెర్విక్స్ ద్వారం దగ్గర నల్లగా, క్రూరాతిక్రూడైన పసివాడి తల కనిపించింది. మళ్ళీ లోపలికి మాయం అయింది. అంతలోనే మళ్ళీ కనిపించింది.. ఈ దోబూచులాట ఎక్కువసేపు సాగలేదు. తల క్రమ క్రమంగా బైటకి వస్తూనే ఉంది. ప్రతి క్షణం మృత్యుగుహలోకి జారుతోంది. సర్వం మరచి అరుస్తోంది. మొరపెడుతోంది. చంపేయమంటోంది. ఏవేవో అంటోంది.

మిడ్ వైఫ్ ముందుకి వెళ్ళి బిడ్డ తలని జాగ్రత్తగా గెడ్డం దగ్గర పట్టుకుని, మెల్లిగా పక్కలకి తిప్పుతూ, శిశువు భుజాలు, బైటకి వచ్చేటట్లుగా చేసింది. భుజాలు బైటకి రాగనే మొత్తం శిశువు అతి తేలికగా బైటకి వచ్చాడు. మగత కమ్మేసింది.

ఎక్కడో దూరంగా శిశువు ఏడుపు. ఆ మగతలో లీలగా అంబాలికల్ కార్డ్ కట్ చేసి ముడి వేసిన నర్సు, శిశువుతో ఉన్న కార్డు (బొడ్డుచేరు)ని స్టెరైల్ డ్రెస్సింగ్ చేసింది. కళ్ళల్లో సిల్వర్ నైట్రేటు డ్రాప్స్ వేసి, శిశువుని, తీసుకొచ్చి, నా కడుపుమీద ఉంచారు చూసిందా? లేదా? అన్నట్టుగా. కళ్ళు తెరచి చూసా. మళ్ళీ మగత కమ్మేసింది.

●●●

మగత నుండి నిద్రలోకి జారుకున్న నాకు తెలివి వచ్చేసరికి పగలు పదిన్నర అయింది. నోరు ఆర్చుకుపోతోంది. పక్కనే ఉన్న ఫ్లాస్కులో చూసా. హాటు వాటరు ఉంది. కొంచెం గ్లాసులో పోసుకు తాగి, అప్పుడు చూసా, మంచం పక్కనే ఉయ్యాల. కష్టంగా ఉన్నా కొంచెం ముందుకి జరిగి, ఉయ్యాలలోకి తొంగి చూసా. బిడ్డని కప్పిన బట్టలు తప్పించా, ఉయ్యాలలో ఉన్నది బాబు. బాబు కనపడగానే పురిటిలో హింస, ఇన్నాళ్ళ మానసిక వేదన మరుపున పడి కొంత స్వాంతన చేకూరింది. బాబు త్రిల్లింగ్‌గా లేడు. అతి పల్చని బటర్ పేపరుతో రక్తనాళాలని, మాంసాన్ని పొట్లాం కట్టినట్టుగా ఉన్నాడు. మొహం మీద, బుగ్గలమీద, శరీరం మీద అతి పల్చని వెంట్రుకలు, ఒరిసిపోయినట్టున్న బాబు మొఖం సంతోషం కలిగించలేదు. బాబు చిన్న కళ్ళు మూతలుపడి, పసితనం అందాలు అందులో దాక్కున్నాయి. బాబుని మెల్లగా మృదువుగా స్పృశించా. రాజేంద్రకి ఉత్తరం రాయాలి, అనుకున్నా.

●●●

అలికిడికి నిద్రచెదరింది. ఉయ్యల చుట్టూ ముగ్గురు నర్సులు, డా.రాజరత్నం, డా.స్నేహలత ఉన్నారు. ఆతృతగా ఉయ్యాలలోకి చూస్తున్నారు.

"ఏమయింది?" అని అడిగా.

"గుడ్. తెలివి వచ్చిందన్నమాట" అంటూ డా.రాజరత్నం జాహ్నవి దగ్గరకి వచ్చి చెక్ అప్ చేసింది.

"బాబుకి ఆక్సిజన్ మాస్క్ అవసరం అయింది పెట్టాం" అంది డా.రాజరత్నం.

ముందుకి జరిగి ఉయ్యాల్లోకి చూసింది. బాబు నీలంగా ఉన్నాడు.

"ప్రిమెచూర్ డెలివరీ. అందులోనూ బాబు బరువు తక్కువ. నో నీడ్ టు వర్రీ" అంది డా.రాజరత్నం.

ఆలోచనలు మళ్ళీ కట్టలు తెంచుకుని ప్రవహిస్తున్నాయి. 'సమస్యలు' మళ్ళీ సమస్యలు. అన్నీ నాకే! బాబుని కన్నప్పుడు ఎంత హింస పడింది.

పురిటి వేదన తలుపుకి రాగానే కడుపు మీదకి చెయ్యివెళ్ళింది. లోతుకి వెళ్ళిపోయి ఏదో శూన్యంగా ఉంది. ఇంత హాస్పటల్, డాక్టర్లు తన పురిటి వేదనని తప్పించలేకపోయారు. నన్ను చూసి నవ్వుకున్నారేమో?

నా ఆలోచనని గమనించిన స్నేహలత దగ్గరకి వచ్చి "డోంట్ వర్రీ" అంది మృదువుగా. చిరునవ్వు నవ్వి సాయంకాలం రోజా వచ్చే నర్సు క్లీన్ చేసి, పక్క మార్చింది. బట్టలు మార్చుకుని, లైటుగా డైటు తీసుకుని పడుకున్నా. ఉయ్యాల మంచానికి దూరంగా జరపడం గమనించా. ఏవో ఆలోచనలు, ముసురుకురాగా, మెల్లగా నిద్రలోకి జారుకున్నా.

●●●

మర్నాడు ఉదయం ఏడు గంటలకి తెలివొచ్చింది. దూరంగా ఉయ్యాలవేపు చూసా. నిన్నటి ఆక్సిజన్ సిలెండర్ దాని నుండి ఉయ్యాలలోకి రబ్బరు ట్యూబు, ఏవీలేవు.

బాబు ఆరోగ్యం మెరుగైనట్టుంది. అన్నీ తొలగించారు. అనుకున్నా. మెల్లగా లేచి ఉయ్యాల దగ్గరకి వెళ్ళింది. ఉయ్యాలలో బాబు లేడు. నిన్న సాయంత్రం నల్లటి మబ్బులా, తెల్లటి పొత్తిళ్ళలో ఒదిగిన బాబు కనుమరుగయ్యాడా? ఇన్నాళ్ళ వేదనకి తెరపడిపోయింది. ఆ వేదనకి విలువలేదు. అన్నట్టుగా బాబు 'బైబై' చెప్పాడా?

వెనక్కి మంచం దగ్గరకి వచ్చి, బెల్ మోగించా, నర్సు వచ్చిది. "బాబుకి ఏమయింది?" అని అడిగా. ఏ వార్తవినవలసి వస్తుందో అన్న ఆత్రంతో గొంతు గద్గద స్వరంతో.

"పరిస్థితి మెరుగుపడకపోతే, ఇంక్యుబేటరులోకి మార్చారు బాబుని" అంది నర్సు,

నిట్టూర్చింది. మళ్ళీ ఆశ నిరాశ మధ్య ఘర్షణ "ఏక్ ఫల్ హై హస్‌నా.. ఏక్ ఫల్ హై రోనా జీవన్ హై ఏక్ మేలా?" అన్న ముఖేష్ గొంతుకలో విషాదం. నిన్నటి నీరసం ఈ రోజు లేదు. రొమ్ము మొనల్లో దురదగా అనిపించి, జాకెట్టుపై నుండి, రొమ్ము మొనల్ని రబ్ చేసింది. జాకెట్టు ముందు భాగం అంతా తడిసిపోయింది. పాలు బైటికి రావడంతో ఆలోచనలు బాబు మీదకి పోయాయి. బాబు గులాబీ రేకుల్లాంటి కనురెప్పలు, సిల్కులా మృదువుగా పెదాలు.. పాలు తాగడం వాడికి ఎప్పుడు అబ్బుతుందో?

మెల్లగా లేచి వెళ్ళి బాల్కనీ తలుపు తెరిచేసరికి చల్లని గాలి మొహాన్ని కొట్టింది. అప్పుడే గదిలోకి వచ్చిన స్నేహలత 'నో జాహ్నవీ, ఓ రెండు రోజులు చల్లగాలికి ఎక్స్‌పోజ్ అవకు' అంటూ వచ్చి తలుపేసింది.

తర్వాత బాబు గురించి కబుర్లు చెప్పి కాసేపు కూర్చుని వెళ్ళిపోయింది.

●●●

చిరునవ్వుని పెదిమలకై అలంకరించుకుని, బాబు జాహ్నవి రొమ్ముని చిన్న చిన్న కాళ్ళతో, పిడికళ్ళతో గుద్దుతున్నాడు. కానీ జాహ్నవి రొమ్ములకి ఆ పిడికిళ్ళు బాధ కలిగిస్తున్నాయి.

రొమ్ములు.. ఆచ్ఛాదన లేని రొమ్ములు. బాబు కనపడలేదు. తపిస్తున్న రొమ్ములు. బాబు ఏడి? ఎక్కడికి వెళ్ళిపోయాడు. అకస్మాత్తుగా తెలివి వచ్చింది. గదిలో చిన్నగా బెడ్ లైట్ వెలుగుతోంది. పెద్ద లైటు వెయ్యడం ఇష్టంలేక, టేబులు మీద ఉన్న టాకింగ్ బటన్ నొక్కా 'టు తర్టీ ఫైవ్ ఎ.ఎమ్" అంటూ టైము చెప్పింది వాచి. అప్పుడు గమనించింది. జాకెట్టు అంతా తడిసిపోయి ఉంది. రొమ్ముల్లో నొప్పిగా ఉంది. నిద్రవచ్చే సూచనలు ఎక్కడా కనబడలేదు.

ఆడదానికి సృష్టిలో ఎటాచ్ మెంట్స్ ఎక్కువ. బాబుని కనడంతో తను మళ్ళీ స్వతంత్రురాలిని అవుతుంది అనుకుంది. కానీ కాదు. అనుక్షణం బాబు జ్ఞాపకం వస్తున్నాడు. తన రొమ్ములకి వాడు కావాలి. తన పొట్టమీద ముడతలు వాడు పెట్టిన హింసకు గుర్తులుగా మిగిలిపోయాయి. ఇవేమీ పట్టనట్టు కళ్ళు తెరవని మూడు రోజుల పసికందు మృత్యువుతో పోరాడుతున్నాడు. ఈ సాంకేతిక పరిజ్ఞానం, ఈ పోరాటం, ఇవన్నీ మనిషి మనుగడకు సాయం చెయ్యగలవు కాని, అతి క్రూరమైన మృత్యువు ముందు వెలవెలబోయి, అపహాస్యానికి గురి అయిన సందర్భాలూ, సంఘటనలూ, ఎన్నిలేవు.

బాబు ఇంక్యుబేటర్లో ఏర్పరచిన కృత్రిమ శ్వాసతో ఊగిసలాడుతున్నాడు. ఎవరు గెలుస్తారు? నిర్ణయించవలసింది బాబే. డెలివరీ అయేంత వరకూ సలహాలు ఇచ్చిన, స్నేహలత ఇప్పుడేం మాట్లాడడంలేదు. తన రూముకి రావడం తగ్గించేసింది. ఎంతో బలవంతం చేస్తే ఏమంది?

"ఏం జరుగుతుంది అన్నది చెప్పలేం? బాబు తన రెసిస్టెన్స్ తనే అభివృద్ధి చేసుకోవాలి? బరువు పెరగాలి? హి షుడ్ రెస్పాండ్" అంది.

ఇన్ని నెలల శారీరిక, మానసిక వేదనని, ఒక్క నిముషంలో బూడిదపాలు చేసి, తనని వేరుచేసి, తన ఊహాప్రపంచం తనకు వదిలి, తన దారి తను చూసుకుంటాడా? బాబు.

కళ్ళనుండి వెచ్చగా కన్నీరు బుగ్గల గుండా జారి తలగడలో ఇమిడిపోయింది.

●●●

బాబు పుట్టిన ఐదోరోజున వచ్చాడు రాజేంద్ర. చాలా ఉత్సాహంగా ఉన్నాడు. వస్తూనే ఒక రోజ్ కవరు జేబులోంచి తీసి చూపించాడు. ఆ కవరు అందుకుని అందులో లెటరు, తీసి చదివా.

రాజేంద్ర గైడ్ జాహ్నవిని తన ప్రాజెక్టులో తీసుకోవడానికి ఒప్పుకున్నాడు. సెపరేట్‌గా ఎపాయింట్ మెంటు లెటరు పంపాడు. నిర్ణయం తెలుపమన్నాడు. పెదవుల మీద చిన్నగా నవ్వు వెలిసి మాయమయ్యింది.

''బాబు'' అన్నా.

''ఇద్దరూ వెళ్ళవచ్చు ముందు పాస్ పోర్టు తయారు చెయ్యాలి'' అంటూ పాస్ పోర్టుకి కావలసిన పేపర్లు తీసాడు.

''ఏం దూరంగా పంపేయాలనుకుంటున్నావా?'' అన్నా. రాజేంద్రని చూస్తూ,

క్షణం సేపు నిరుత్తరుడైపోయాడు రాజేంద్ర. ఎందుకలా అన్నానా అనిపించింది. ఎదుటి వారిని బాధ పెట్టడం తనకేవచ్చు. 'సారీ' అన్నా.

అతను చూపించిన ప్రతిచోటా సంతకం చేసా. ఆ కాగితాలన్నీ భద్రంగా పెట్టి, నాతో ఏవేవో చెబుదామనుకున్నాడు. ఎంతో మాట్లాడదామనుకున్నాడు రాజేంద్ర. అవన్నీ అతని కళ్ళల్లో కనిపిస్తున్నాయి. ఆ కళ్ళల్లో నీరు కూడా కనిపించింది.

●●●

రాజేంద్ర వెళ్ళిపోయిన రెండో రోజు, స్నేహలత గదికి వెళ్ళా.

''ఏమయింది లతా.. ఈ మధ్య నాగదిలోకి రావడం మానేసావేం'' అని అడిగా.

''పని ఎక్కువగా ఉంది.''

''పని ఎక్కువగా ఉందా? తప్పించుకు తిరుగుతున్నావా?''

''తప్పించుకు తిరగడం ఎందుకు?''

''బాబుని రక్షించలేకపోయినందుకు?''

''బాబుకి ఏమయింది బాగానే ఉన్నాడే''

''నాకు అనుమానం, ఎన్నాళ్ళు అబద్ధం చెప్పగలవు!? బావుంటే నా దగ్గరకి తీసుకురాలేదేం.''

''బాబు ఇంకా ఇంక్యుబేటర్లో ఉండడం అవసరం ఎంతేనా ఉంది. అందుకు తీసుకురాలేదు.''

''నాకు అబద్ధం చెప్పుతున్నావ్'' అంది జాహ్నవి ఆవేశంగా.

''ఇందులో అబద్ధం ఏముంది. నువ్వే చూడు అంటూ కంప్యూటర్ వేపు తిరిగి, స్క్రీన్ మీద ఇన్ ఫో ఇంక్ బేటర్'' అని టైప్ చేసింది.

వెంటనే స్క్రీన్ మీద ఇంక్యుబేటరులో పిల్లలు వివరాలు రాసాగాయి మొదటి ఇన్‌ఫర్‌మేషన్ ఎవరివో వివరాలు ఉన్నాయి. రిటర్న్‌కి కొట్టింది. ఈసారి మూడో నెంబరు ఇన్‌ఫర్ మేషన్ వచ్చింది. దానిపైన 'మదర్' జాహ్నవి అని రాసుంది. మొదటి రోజు నుండి ఆ రోజు వరకూ, బిడ్డ తాలుకా వివరాలు రాసున్నాయి.

''నువ్వే చదువు'' అంటూ మోనిటర్‌ని జాహ్నవి వేపు తిప్పింది. అంతా చదివా.

''ఇంకా ఎన్నాళ్ళు ఉంచాలి?'' అన్నా నీరసంగా.

''బాబు బరువు పెరిగే వరకూ ఉంచాలి'' అంది స్నేహలత.

నీరసంగా టేబులు మీద బుర్ర పెట్టుకుని పడుకున్నా. నేను ఏడుస్తున్నానేమో అనే అనుమానం వచ్చి .. ''ప్లీజ్ జాహ్నవీ'' అంది స్నేహలత భుజం మీద చెయ్యివేసి తడుతూ.

''నేనేం ఏడవడంలేదు'' అని గదిలోంచి విసురుగా బయటికి వచ్చేసా!

●●●

వారం రోజుల్లో వస్తానన్న రాజేంద్ర, నాలుగు రోజుల్లో వచ్చేసాడు.

"జాహ్నవికి పాస్ పోర్ట్ వచ్చేస్తుంది. మిగతా ఎంక్వైరీలన్నీ తర్వాత చేసుకుంటారట, దానికి అనువుగా నా అడ్రసు ఇచ్చాను" అన్నాడు రాజేంద్ర

"నీ అడ్రసా?" అని ఆశ్చర్యపోయా.

"ఏం ఇవ్వకూడదా?" అన్నాడు.

నే మాట్లాడలేదు. మౌనంగా ఊరుకున్నా.

బాబుకి ఎలా ఉంది. అని అడిగాడు. 'తెలీదు' అన్నా విసురుగా, బాబు విషయంలో కలత పడుతున్నానని అనుకున్నాడు రాజేంద్ర.

"ఈ సాంకేతిక జ్ఞానం చాలా అసంపూర్ణం జాహ్నవీ. వీటన్నింటిలోనూ, ఆశ అనేవాడి తప్ప, ఇంకొకటి లేదు. ఏది ఆఖరి శ్వాసో, ఏది జీవిత శ్వాసో తెలియక పోరాడుతున్నాడు. ఎన్నాళ్ళీ కలత? ఎన్నాళ్ళీ అనిశ్చితత. ఈ బుద్బుదం పగిలి, నీరుగా జారిపోతుందా? ఇందులో నీ పాత్ర ఎంత? నువ్వేం చెయ్యగలవు? ఏం చెయ్యలేం? నిమిత్తమాత్రులం. ఈ నిమిత్తమాత్రులం అన్నది మనకి చేతకాక, ఏమీ చెయ్యలేక, కనుక్కున్న పదం కాదు మన చేతుల్లో లేని దాని గురించి, ఆలోచించి, బాధపడేకంటే, మనం చేయగలిగింది చేసి, కాలాన్ని నెట్టుకురావడం ముఖ్యమేమో?

కాలం మనల్ని నెట్టుకుంటూ వెళితే, జీవితం దుర్భరమైపోతుంది. మనం కాలాన్ని నెట్టుకుంటూ వెళ్ళడమే సమాధానం అని నేననుగాని, మనకి కొంత ఊరట కలగవచ్చు" అన్నాడు రాజేంద్ర.

రాజేంద్ర ఇంత దీర్ఘంగా ఎప్పుడూ మాట్లాడలేదు. అతని ఉద్దేశంలో తను బాబును ఇంక్యుబేటరుకి అప్పగించి, నా దారిన నేను, అమెరికా వెళ్ళిపోతే, బాబు బతికితే, అనాథాశ్రమంలో చేర్పిస్తాడు కాబోలు, బతక్కపోతే మూడుపౌండ్ల మాంసాన్ని చెత్తకుప్పమీద వేస్తారా? అనుకున్నా... ఎంత కాదనుకున్నా పనిమనిషి ప్రభావం వదిలి పోవడంలేదు. పిచ్చి కసిగా ఉంది ఆలోచన.

●●●

రాజేంద్ర వెళ్ళిన పదిరోజుల్లో వెనక్కి వచ్చేసాడు. కానీ బాబు పరిస్థితిలో మార్పులేదని తెలిసి ఏం మాట్లాడకుండా కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు. రాజేంద్ర వెళ్ళిపోయిన కాసేపటికి స్నేహలత వచ్చింది.

"రాజేంద్రతో నువ్వు వెళ్ళడం లేదా?" అని అడిగింది.

"ఎక్కడికి?"

"మద్రాసు అమెరికన్ కాన్సలేటుకి వెళ్ళి వీసా పేపర్ మీద స్టాంప్ వేయించుకోవాలి అన్నాడు రాజేంద్ర. ఈ విషయం మరి నీతో చెప్పలేదా?"

"లేదు"

"తను చెప్పలేదా? నువ్వు చెప్పనివ్వలేదా?" స్నేహలత అనుమానం

"....."

"బాబుకేం అవదు గాని, వెళ్ళిరా జాహ్నవి! అతనికి నువ్వంటే ఎంత అభిమానమో? మొత్తం హాస్పటలు మూడు నెలల ఖర్చులు అతనే భరించాడు. నీ కోసం, నీ మానసిక తృప్తికోసం ఇదంతా చేస్తున్నాడు. తనకేం బాధ్యత ఉందని తనకేం ఒరుగుతుందని? ప్లీజ్ జాహ్నవీ నా మాట విను" అంది స్నేహలత అనునయంగా.

నర్సింగ్ హోమ్ రూముకయే ఖర్చు విషయం నాకు తెలియకుండా జాగ్రత్తపడ్డాడు రాజేంద్ర. పదివేలు ఎడ్వాన్స్‌గా కట్టాడు. మిగతా ఇరవైవేలూ, విశాఖపట్నం నుండి పంపుతానన్నాడు. విషయాలన్నీ తర్వాత తెలిసాయి. ఎందుకింతలా చేస్తున్నాడు? ఎందుకీ అభిమానం? ఏమిటీ అనుబంధం?

కళ్ళు చెమర్చాయి. కన్నీటి బొట్లు రాలాయి. "రాజేంద్రకి ఫోను చెయ్యి. సాయంకాలం బస్సులో మద్రాసు వెళతాం" అన్నా స్నేహలతతో.

నేను ఇంత తొందరగా అంగీకరిస్తానని అనుకోలేదు. స్నేహలత నవ్వుతూ తన రూములోకి వెళ్ళిపోయింది.

●●●

ఇద్దరం మద్రాసు వచ్చి రెండురోజులైంది. చేయవలసిన పనులన్నీ పూర్తిచేసి చివరి రోజున ఇంటర్వ్యూకి, మద్రాసు అమెరికన్ కాన్సలేట్ వరండాలో కూర్చున్నాం.

"నువ్వు హాస్పటల్‌కి డబ్బు ఎందుకు పే చేసావ్? నేను ఏదోలా గడిపేద్దును కదా. అయినా ఆ హాస్పటల అంత కాస్లీగా ఉంటుందనుకోలేదు" అన్నా.

"ఎవరు చెప్పారు. స్నేహలతా?"

"ఆ"

"తను చేసిన పని గురించి చెప్పలేదా?" అని అడిగాడు రాజేంద్ర.

"ఏమిటి?"

"నిన్ను తన సిష్టరుగా నీ అప్లికేషన్‌లో సర్టిఫై చేసింది. దాని వల్ల నీ హాస్పటల్‌కి అయిన ఖర్చులో ఫార్టీ పర్సెంట్ తగ్గింది." కాసేపు మౌనంగా ఉన్నా. తర్వాత "మీరంతా మంచి వాళ్ళే! నేనే." అన్నా. ఆమె గొంతు జీరపోయింది. ఇంటర్వ్యూలో అన్ని ప్రశ్నలకీ సమాధానం చెప్పా. నాతోపాటు రాజేంద్ర కూడా ఉన్నాడు. అమెరికా వెళ్ళే వాళ్ళలో బాబు కూడా చేరాడు. ఆశ్చర్యం వేసింది. చిన్నపిల్లవాడిని తీసుకువెళ్ళే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ చెప్పారు, వీసా వచ్చేసింది. ఆ సాయంత్రమే ఊటీకి వెళ్ళే బస్సు ఎక్కాం.

●●●

తెల్లవారుఝామునే ఊటీ చేరుకున్నాం. తిన్నగా హాస్పటలుకి లిఫ్టు ఎక్కి, రెండో అంతస్తుకి చేరుకున్నాం. అప్పటికి ఏడు గంటలయింది. హాస్పటలు ప్రశాంతంగా ఉంది. గది చేరుకుని, తలుపు తెరిచిన నేను సంతోషం పట్టలేకపోయాను ఎదురుగా తెల్లటి ఇనుప ఉయ్యాల, అందులో పొత్తిళ్ళలో బాబు ప్రశాంతంగా పడుకుని, నా రాకకై, ఎదురు చూస్తున్నాడు. ఉయ్యాల పక్కగా రాత్రంతా డ్యూటీ చేసిన నర్సు కుర్చీలో కునికి పాట్లు పడుతోంది. అలికిడికి కుర్చీలోంచి లేచింది నర్సు

"ఎప్పుడు తీసుకొచ్చారు?"

"నిన్ననే తీసుకొచ్చాం మేడం" అంది నర్సు వినయంగా.

"ఇప్పుడు ఎలా ఉంది?"

"బావుంది"

ఇద్దరం ఉయ్యాల దగ్గరకి వెళ్ళాం. బ్లాంకెట్ మధ్య బాబు సర్వం మరచి నిద్రిస్తున్నాడు.

మొదట మొహం మీద ఉన్న వెంట్రుకలు ఇప్పుడు లేవు. ఇప్పుడు చర్మం రంగు కొంచెం ముదురుగా మారి, లోపలి రక్తం నాకు బైటకి కనిపించడంలేదు. పిడికిళ్ళు ముడుచుకుని పసితనపు అందంతో ముద్దొస్తున్నాడు బాబు.

"నీ జ్యోసం ఫలించిందే" అన్నా.

రాజేంద్ర కూడా నవ్వుతూ, ఉయ్యాల దగ్గరకి చేరాడు. ఉయ్యాల దగ్గరకి చేరి బాబు పిడికిళ్ళు పట్టుకుని వేళ్ళు విప్పింది. నా స్పర్శకి బాబు ఉలిక్కిపడ్డాడు. కానీ కళ్ళు తెరవలేదు. గులాబీ రేకుల్లాంటి బాబు పిడికిళ్ళు నా వేలిని పట్టుకున్నాయి.

"ఇంక.. అలాగే ఇద్దరూ అమెరికా చేరుకోండి" అన్నాడు రాజేంద్ర నవ్వుతూ.

నే కూడా నవ్వుతూ రాజేంద్రని చూసా.

రాజేంద్ర "ప్రయాణం నాడు వస్తాను." అంటూ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయాక నర్సు వచ్చి, గది తలుపు వేసి లోపలినుండి గడియపెట్టి

"బాబుకి పాలు ఇవ్వండి" అంది.

నే మంచం మీద కూర్చుని నర్సు బాబుని ఒడిలో పడుకోబెట్టి రొమ్ము మొన బాబు నోట్లో పెట్టింది. బాబులో ఏ విధమైన కదలిక లేదు. నర్సు రొమ్ముని నొక్కుతూ, బాబు దవడలని చిన్నగా నొక్కింది.

బాబు రెండు సార్లు పెదిమలు చప్పరించి ఊరుకున్నాడు.

●●●

రొమ్ముల్లో నొప్పికి అకస్మాత్తుగా తెలివి వచ్చింది. డీలక్స్ బస్సు ఘాట్ మలుపులు తిరుగుతూ ఊటీ వేపు సాగుతోంది. పక్క సీట్లో రాజేంద్ర సీటు వెనక్కి వాలి నిద్రపోతున్నాడు. బస్సులో అందరూ ప్రశాంతంగా నిద్రపోతున్నారు. నేను మెల్లగా రొమ్ముని నొక్కాను. పాలు బైటకి వచ్చాయి. నొప్పి తగ్గింది. జాకెట్టు తడిసిపోయింది. మళ్ళీ నిద్రపోడానికి ప్రయత్నించా. మరి నిద్రపట్టలేదు. బస్సు ఘాట్ మలుపుల్ని అధిగమిస్తూ ముందుకు సాగిపోతూ ఉంటే, నే తలపుల్లో లోతుల్లోకి జారుకున్నా.

రాజేంద్ర చెప్పినట్టయితే మరో పదిరోజుల్లో తను, తన ప్రాజెక్ట్ గైడుకి రిపోర్టు చెయ్యాలి. ఈ లోగా బాబు, తేరుకుంటాడా. లేకపోతే తను బాబుని వదలి వెళ్ళిపోవాలా? కల నిజమైతే బావుండును. బాబుని వదిలివెళ్ళాలంటే, మనస్కరించడంలేదు. బాబు కోసం ఎన్ని కష్టాలకి ఓర్చింది. అలాంటిది బాబుని వదిలి వెళ్ళాలా? బాబు తేరుకోగానే, తను తీసుకొచ్చి అప్పచెప్తానన్నాడు. రాజేంద్ర.

రాజేంద్రలో బాబు పట్లగాని, తనపట్లగాని స్పందన లేదు. బాబుతో తనకి గల బంధాన్ని, అర్థం చేసుకోలేకపోతున్నాడు. పదిరోజుల్లో బాబు తేరుకోకపోతే తను అమెరికా వెళ్ళదు. ఏదో యాంత్రికంగా తను వెళ్ళి తన పని చేసుకుంటే, వెనకాల కొన్నాళ్ళకి రాజేంద్ర సామాను పట్టుకొచ్చినట్టు, బాబుని పట్టుకొస్తాడు కాబోలు. రాజేంద్ర భావుకత, ప్రకృతిని చూసి, స్పదించే మృదుమధురమైన మనస్సు, లౌకిక విషయాల్లో కనపడదేం!? ఫారిన్ ఛాన్సు కోసం పెళ్ళి చేసుకోడానికి వెనుదీయలేదు. తనతో సంబంధం పెట్టుకోడానికి నైతికత అడ్డురాలేదు. అలాగే ఆమె వదిలి వెళ్ళిపోతే బాధపడలేదు?

అలాగని, తనని తన తలరాతకి వదిలెయ్యలేదు. మళ్ళీ ఇప్పుడు తన ఫారిన్ ట్రిప్, బాబు ఆరోగ్యం అడ్డొస్తే, బాబుని ఒదిలెయ్యమని ఖచ్చితమైన సలహా ఇస్తున్నాడు. "ఇప్పుడు వెళ్ళకపోతే, మళ్ళీ ఆరునెలలవరకూ వెళ్ళలేవు. ఆరునెలల తరువాత పరిస్థితి ఎలా ఉంటుందో? ఏమిటో? ఆలోచించుకో? ఇక్కడ ఉండి, బాబు పరిస్థితి బాగుపడాలని ప్రార్థించడం తప్ప ఇంకేం చెయ్యలేవు. బాబు ఆరోగ్యం మెరుగైన రెండోరోజు బాబు నీ దగ్గర ఉంటాడు. ఆలోచించుకో" అంటాడు. ఎంత ప్రాక్టికల్లో.

రాజేంద్ర చెపుతున్నంతసేపూ అదే నిజం అనిపిస్తోంది. మగవాడి ఆలోచనలకి, ఆచరణకి ఎంత బేధం కనిపిస్తోంది!?

రాజేంద్రకి తొమ్మిది నెలల మోత, పురిటి హింస తెలియవు. అందుకే అంత డిటాచ్డ్‌గా మాట్లాడుతున్నాడు. కానీ అతను చెప్పిందాంట్లో నిజం లేకపోలేదు. ఇక్కడ ఉండి, తను చేసేదేమిటి? బాబు అలా ఇంక్యుబేటర్లో పడి ఉండడం, తను రోజులు వెళ్ళదీస్తుండడం. అంతకు మించి ఏమీ ఆలోచించలేకపోతోంది. 'ఐ' ఎక్కడికి వెళ్ళిపోయిందో?

బస్సు మెల్లగా వెళుతోంది. పొగమంచుకి రోడ్డు కనబడటంలేదు. తూర్పు తెలతెలవారుతోంది. ఊటీ వచ్చేసింది. రాజేంద్రని నిద్రలేపా.

"నువ్వు నిద్రపోలేదా?" రాజేంద్ర ప్రశ్న.

"నిద్రరాలేదు"

ఇద్దరం ఊటీలో దిగి, ఆటోలో నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాం.

ఆతృతగా నా గదికి వెళ్ళి తలుపు తెరిచా. ఎదురుగా ఉయ్యాలలేదు. పక్క ఛైర్‌లో కునికిపాట్లు పడుతున్న నర్సులేదు, కల నిజం కాదు.

●●●

నన్ను ఊటీలో దిగబెట్టి స్నేహలతతో నా ప్రయాణం విషయం గురించి వివరించి నాకు ప్రయాణానికి మానసికంగా ధైర్యం చెప్పమని చెప్పి, విశాఖపట్నం వెళ్ళిపోయాడు రాజేంద్ర.

రాజేంద్ర వెళ్ళిపోయిన తర్వాత, తను తిరిగి వంటరిదైపోయింది.

స్నేహలత కలిసిన కాసేపూ "బాబు పరిస్థితి ఇలాగే ఉంటే, నువ్వు వెళ్ళిపోవడమే మంచిది. మేమంతా లేమా బాబుని చూడటానికి!? " అంటూ రాజేంద్ర తరపున వకాల్తా పుచ్చుకున్నట్టు, బోధ పరిచేది.

నా ఆలోచనల్లో, బాబు పట్ల, నిరాశా, ఈ అనిశ్చిత పరిస్థితికి విసుగూ కలుగుతున్నాయి. అన్ని బంధాలని అన్ని పరిచయాలని వదిలి మళ్ళీ దూరంగా వెళ్ళిపోవాలి. మొదటి ప్రయాణంలో కొంత మానసిక తృప్తిని పొందింది. మలి ప్రయాణం స్త్రీకి ప్రకృతి ఇచ్చిన హక్కు, మాతృత్వం కోసం చేసింది. కానీ ఇప్పుడు చేసే ప్రయాణంలో మళ్ళీ బంధాన్ని తెంచుకుని ప్రయాణం చేయవలసి వస్తోంది.

ఇంతకు ముందు రెండు ప్రయాణాలూ, తన స్వార్థం కోసం చేసింది. ఆ ప్రయాణాల్లో తన మీద తనకి విశ్వాసం, తన స్వేచ్ఛమీద గర్వం ఉన్నాయి. కానీ ఈ ప్రయాణంలో, పూర్వపు విశ్వాసం లేదు. తన నెవరో బలవంతంగా నెట్టుకు వెళుతున్నట్టు ఉంది. అందుకే వివేకానందుడు అలా చెప్పాడు. నిజమైన స్వేచ్ఛకి సరిహద్దులు ఇరుగ్గా ఉంటాయని.

జీవితం ఎప్పుడూ నిర్దిష్టంగా, హాయిగా లేదు. కొన్ని తను స్వీకరించిన సమస్యలు కొన్ని తనమీద బలంగా రుద్దబడిన సమస్యలు, జీవితాన్ని సమస్యగా తీసుకోడం కన్నా, సమయానుగుణంగా సమస్యల్ని పరిష్కరించుకుంటూ, జీవితంలో ముందుకు సాగడమే మంచిది. ఇక్కడ ఉండీ తను చేసేదేముంది? నిరీక్షణ, నిస్సహాయంగా నిరీక్షణ. ఈ వాతావరణం నుండి వెళ్ళిపోతే ఈ నిరీక్షణని తప్పించుకోగలుగుతుంది. ఉద్యోగం చేసే స్త్రీలు పిల్లల్ని వదిలి వెళ్ళిపోవడం లేదా?

బాబు ఇంక్యుబేటర్లో ఉన్నాడని, సురక్షితంగా ఉన్నాడనడానికి, కంప్యూటరు డేటా నిదర్శనం. ధైర్యం చేకూరడానికి స్నేహలత డేటా ప్రింట్ ఇస్తుందేమో? ఆలోచనలు తెగలేదు. రోజులు దొర్లిపోయాయి.

రాజేంద్ర వారం రోజుల తర్వాత వచ్చేసాడు. వస్తూ వస్తూ ఎయిర్ టికెట్ తెచ్చాడు. ఊటీ నుండి బయలుదేరేముందు ఇంక్యుబేటరులో బాబుని చూసా. ఏవిధమైన ఉద్వేగమూ కలగలేదు. ఇద్దరి మధ్యా అనుబంధం ఏమిటి? మొదట్లో రొమ్ముల్లో పాలు చేసే గోలకి, మనసంతా బాబు చుట్టూ తిరిగేది. కాలం గడిచిన కొద్దీ, రొమ్ముల పీడింపు కూడా తగ్గింది. అన్నీ సమాధానపడ్డం నేర్చుకుంటున్నాయన్నమాట. అన్ని సామాన్లూ తీసుకుని స్టేషన్‌కి వెళ్ళా. నన్ను దిగబెట్టడానికి స్నేహలత స్టేషన్‌కి వచ్చింది.

రైలు బయలుదేరింది. ప్లాట్ ఫారం మీద నిలుచుని స్నేహలత నన్ను చూస్తూ చెయ్యి ఊపుతోంది.

అన్ని పరిచయాలని, వదిలి అన్ని బంధాలని వదిలి ఏదో తపోభూముల్లోకి బయలుదేరుతున్న వ్యక్తిలా, నిశ్చలంగా కూర్చున్నా. కనుల ముందు క్రమంగా ప్లాట్ ఫారం, జనసందోహం, సిగ్నల్ పోస్ట్ దాటిపోయాయి.

స్నేహలతకి సమాధానంగా చెయ్యి ఊపలేదు.

రాజేంద్ర చెయ్యి భుజం మీద పడ్డంతో ఈ లోకంలోకి వచ్చా.

"నేను బాబుని చూసుకుంటా జాహ్నవీ" అన్నాడు.

నా మౌనం నా ముభావం అతన్ని బాధపెట్టాయి.

"బాబు నాకు మాత్రం పైవాడా!? నే చూసుకుంటా. ఆరోగ్యం కుదురుపడగానే అక్కడకి తీసుకొస్తా" అన్నాడు. అలా అంటున్నప్పుడు అతని గొంతు ఒణికింది. కళ్ళల్లో నీరు, అదే నమ్మకానికి తొలిమెట్టు.

***ఒకరి కోసం కన్ను చమర్చే మనిషి, ఒకరి కోసం తపనపడే స్నేహితుడు, ఒకరికోసం విలవిల్లాడే బాంధవ్యం, అందరూ కావాలనుకునే ఆరాటం. మనిషికి అరుదుగా లభిస్తాయి.***

ఒంటరి మనసుకి స్నేహితులు, కుటుంబ సభ్యులు, అనుబంధాలూ కొంత ఊరట. ఇదో జీవనపద్ధతి. ఈ ఎటాచ్‌మెంట్స్ మిస్ అయిపోతున్నా, మిస్ అయిన వన్నీ ఉన్నతంగా కనిపించాయి.

ఎంతగా అభిమానించాడు. ఎంతగా ఆరాధించాడు. అలాంటి స్నేహం అవసరమా? తన పరిధుల్ని దాటి, సాంఘిక నియమాల్ని దాటి స్త్రీని ఆరాధించగల పురుషుడు అవసరం. ఆరాధనలో అభిమానంలో రాజకీయం ఉండదు. నియమంలో, నీతిలో పరిధుల నియంత్రణలో ఉన్న రాజకీయం ఇక్కడ ఉండదు. రాజేంద్ర తనకందించిన చేయూత అదే! ఎందుకో రాజేంద్రని నమ్మబుద్దేస్తోంది. రాజేంద్ర స్వాంతన చేకూర్చాడు. ఈ స్వాంతన చాలా అవసరం. మనసు తేలికై, కనుకొలకుల్లో నీరు చిలికింది. కిటికీ వైపు తల తిప్పేశాను. కిటికీ నుండి చూసిన నాకు అనంతమైన ప్రకృతి ఒడిలో రైలు ఎత్తులోంచి, పల్లాల్లోకి దిగుతున్న కొండచిలువలా గతి తెలిసిన రైలు బండి గమ్యం వేపు సాగిపోయింది.!!

●●●